ఈనాడు

విజయవాడ 14-1-2026 బుధవారం సిటీ సంపుటి 52 . సంచిక 155

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 22

www.eenadu.net


Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

చాంపియన్



మధ్యాహ్నం 1.30 నుంచి

జోరుమీదున్న టీమ్‌ఇండియా ఇంకో సమరానికి సై అంటోంది. మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్‌ను చేజిక్కించుకోవాలని అనుకుంటున్న ఆతిథ్య జట్టు.. రెండో వన్డేలో నేడు న్యూజిలాండ్‌ను ఢీకొట్టనుంది. గాయాలు వేధిస్తున్నప్పటికీ ఆటగాళ్ల ఫామ్ భారత్‌కు ఉత్సాహాన్నిస్తోంది. మరి ఆ జట్టు రాజ్‌కోట్‌లోనే సిరీస్ ఫలితాన్ని తేల్చేస్తుందా లేదా కివీస్ పుంజుకుంటుందా? ఆసక్తికర పోరు ఖాయం.



గిల్

రాజ్‌కోట్‌లోనే కొట్టేయాలని..

న్యూజిలాండ్‌తో భారత్ రెండో వన్డే నేడు

రాజ్‌కోట్

సిరీస్‌పై కన్నేసిన టీమ్‌ఇండియా.. బుధవారం జరిగే రెండో వన్డేలో న్యూజిలాండ్‌ను ఢీకొట్టనుంది. వడోదరలో జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ నాలుగు వికెట్ల తేడాతో గెలిచిన సంగతి తెలిసిందే. అయితే వాషింగ్టన్ సుందర్ గాయం కారణంగా సిరీస్‌కు దూరమయ్యాడు. సెలక్టర్లు అతడి స్థానంలో ఆయుష్ బదోనిని జట్టుకు ఎంపిక చేశారు. వికెట్‌కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ తొలి మ్యాచ్‌కు ముందే గాయం వల్ల సిరీస్ నుంచి వైదొలగిన సంగతి తెలిసిందే. టీ20 ప్రపంచకప్‌నకు నెల కన్నా తక్కువ రోజులే ఉన్న నేపథ్యంలో మరిన్ని గాయాలు కావొద్దని టీమ్ ఇండియా కోరుకుంటోంది

రెట్టించిన ఉత్సాహంతో..: ఆటగాళ్ల గాయాలు ప్రతికూలాంశమే అయినప్పటికీ రాజ్‌కోట్‌లో టీమ్‌ఇండియా ఉత్సాహంగా బరిలోకి దిగుతోంది. ముఖ్యంగా విరాట్ కోహ్లి సూపర్ ఫామ్ జట్టుకు గొప్ప సానుకూలాంశం. జోరుమీదున్న కోహ్లి తొలి వన్డేలో 91 బంతుల్లోనే 93 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. ఎలాంటి ఒత్తిడి లేకుండా సాధికారికంగా బ్యాటింగ్ చేస్తోన్న అతడు.. ఒకప్పటి కోహ్లిని తలపిస్తున్నాడు. అతడు మరోసారి సత్తా చాటాలని జట్టు ఆశిస్తోంది. కోహ్లితో పాటు కెరీర్ చరమాంకంలో ఉన్న రోహిత్ శర్మ కూడా ఆటను ఆస్వాదిస్తున్నాడు. వడోదరలో ఎక్కువసేపు నిలవకున్నా అతడు మంచి లయతో కనిపించాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్, రాహుల్ కూడా గత మ్యాచ్‌లో రాణించారు. ఈ బ్యాటర్ల ఫామ్‌తో భారత జట్టు బ్యాటింగ్ బలంగా కనిపిస్తోంది.



గ్లెన్ ఫిలిప్స్

పిచ్ ఎలా ఉందంటే..


రాజ్‌కోట్‌లో పిచ్ పూర్తిగా బ్యాటింగ్‌కు అనుకూలించనుంది. సాధారణంగా ఇక్కడ భారీ స్కోర్లు నమోదవుతుంటాయి. రెండో వన్డేలో తొలి మ్యాచ్‌లో కన్నా ఎక్కువ పరుగులు వచ్చినా ఆశ్చర్యపోనక్కర్లేదు. ఇక్కడ జరిగిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ మొదట బ్యాటింగ్ చేసిన జట్టే గెలిచింది. అందులో మూడుసార్లు మొదట బరిలోకి దిగిన జట్టు 300పై స్కోరు చేసింది. చివరగా ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 352 పరుగులు చేసింది. భారత్‌ను 66 పరుగుల తేడాతో ఓడించింది. రెండో ఇన్నింగ్స్ సమయంలో మంచు ప్రభావం ఉంటుంది.

అయితే గాయపడ్డ సుందర్ స్థానంలో ఎవరిని తుది జట్టులోకి తీసుకుంటారన్నది ఆసక్తికరం. ఆ స్థానం కోసం బదోని, నితీశ్‌ల మధ్య పోటీ ఉంది. నితీశ్‌కే అవకాశాలు మెండు. ఇక బౌలింగ్‌లో భారత్ మెరుగుపడాల్సివుంది. ముఖ్యంగా పేసర్లు హర్షిత్ రాణా, ప్రసిద్ధ్‌కృష్ణ పొదుపుగా బౌలింగ్ చేయాల్సిన అవసరం ఉంది. తొలి మ్యాచ్‌లో వీళ్లు ఆరుకు పైగా ఎకానమీ రేట్‌తో పరుగులిచ్చారు. స్పిన్నర్లు కుల్‌దీప్, జడేజా మరింత ప్రభావవంతంగా బౌలింగ్ చేయడం జట్టుకు అవసరం.

న్యూజిలాండ్ పుంజుకునేనా..!: ఓడినప్పటికీ తొలి మ్యాచ్‌ను ఆఖరి వరకు తీసుకెళ్లడం న్యూజిలాండ్‌కు ఆత్మవిశ్వాసాన్నిచ్చే విషయమే. మిచెల్, కాన్వే, నికోల్స్‌ల ఫామ్ ఆ జట్టుకు సానుకూలాంశం. తొలి మ్యాచ్‌లో వీళ్లు అర్ధశతకాలతో సత్తా చాటారు. యంగ్, ఫిలిప్స్, కెప్టెన్ బ్రాస్‌వెల్ కూడా పరుగుల బాట పట్టాలని కివీస్ కోరుకుంటోంది. మరోవైపు జేమీసన్ బంతితో సూపర్‌గా రాణించాడు. అతడిపై ఆ జట్టు మరోసారి ఆశలు పెట్టుకుంది. అయితే గత మ్యాచ్‌లో తేలిపోయిన మిగతా బౌలర్ల నుంచి అతడికి ఎంత మేర సహకారం అందుతుందన్నదానిపైనే రెండో వన్డేలో న్యూజిలాండ్ అవకాశాలు ఆధారపడి ఉన్నాయి.

తుది జట్లు (అంచనా)... భారత్: గిల్, రోహిత్, కోహ్లి, శ్రేయస్, రాహుల్, నితీశ్ కుమార్ రెడ్డి/ ఆయుష్ బదోని, జడేజా, హర్షిత్ రాణా, కుల్‌దీప్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, సిరాజ్; **న్యూజిలాండ్:** కాన్వే, నికోల్స్, విల్ యంగ్, డరెల్ మిచెల్, మిచెల్ హే, గ్లెన్ ఫిలిప్స్, బ్రాస్‌వెల్, క్రిస్టియన్ క్లార్క్, జేమీసన్, ఫౌక్స్, జేడెన్ లెనాక్స్.

లక్ష్యసేన్ శుభారంభం



లక్ష్యసేన్

దిల్లీ: ఇండియా ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 750 టోర్నీలో భారత స్టార్ ఆటగాడు లక్ష్యసేన్ శుభారంభం చేశాడు. మంగళవారం పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో లక్ష్యసేన్ 21-12, 21-15తో ఆయుష్ శెట్టిపై నెగ్గి ప్రిక్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టాడు. మహిళల డబుల్స్‌లో గాయత్రి గోపీచంద్, ట్రీసా జాలీ జోడీ ముందంజ వేసింది. తొలి రౌండ్లో గాయత్రి ద్వయం 21-15, 21-11తో ఆర్నిచా, సుకిత (థాయ్‌లాండ్) జంటపై గెలుపొందింది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో ఇంతానన్ రచనోక్ (థాయ్‌లాండ్) 21-19, 21-15తో నైకో గుంజి (జపాన్)ని ఓడించింది. పురుషుల డబుల్స్‌లో హరిహరన్, అర్జున్ జోడీ 21-15, 21-18తో ఆంగ్ సిన్, తియో యి (మలేసియా) జంటపై గెలిచి ప్రిక్వార్టర్స్ చేరుకుంది.

అపరిశుభ్రం.. బ్లిక్‌ఫెల్ట్: ఇండియా ఓపెన్‌కు ఆతిథ్యమిస్తున్న ఇందిర గాంధీ ఇండోర్ స్టేడియంపై డెన్మార్క్ క్రీడాకారిణి మియా బ్లిక్‌ఫెల్ట్ తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేసింది. ఇండోర్ స్టేడియంలోని పరిస్థితులు అపరిశుభ్రంగా ఉన్నాయని విమర్శించింది. వార్మప్ కోర్టుల్లో పక్షుల రెట్టలు ఉండటం.. తీవ్ర చలితో క్రీడాకారులు వింటర్ జాకెట్లు, గ్లోవ్స్ ధరించాల్సి రావడంపై ఆవేదన వ్యక్తంచేసింది. ఈ పరిస్థితులు గాయాలు, అనారోగ్యానికి దారితీసే ప్రమాదం ఉన్నందున బీడబ్ల్యూఎఫ్ జోక్యం చేసుకోవాలని కోరింది. ఆగస్టులో ఇక్కడ జరిగే ప్రపంచ ఛాంపియన్‌షిప్ వరకైనా సౌకర్యాలు మెరుగుపడాలని మిషెల్ లీ (కెనడా), ఇంతానన్ రచనోక్ (థాయ్‌లాండ్) ఆకాంక్షించారు.

డబ్ల్యూపీఎల్‌లో ఈనాడు
యూపీ × దిల్లీ
వేదిక: ముంబయి, రా॥ 7.30

కెప్టెన్ ధనాధన్

ముంబయి మురిసింది. భారీ స్కోర్ల మ్యాచ్‌లో అదరగొట్టింది. హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడిన వేళ.. ఆసక్తికర పోరులో గుజరాత్ టైటాన్స్‌ను ముంబయి ఓడించింది. 192 పరుగులు చేసినా టైటాన్స్‌కు ఓటమి తప్పలేదు. 2026 డబ్ల్యూపీఎల్‌లో ఆ జట్టుకిదే తొలి ఓటమి.



హర్మన్ ప్రీత్

- అదరగొట్టిన హర్మన్‌ప్రీత్
- గుజరాత్‌పై ముంబయి విజయం

నవీ ముంబయి

ముంబయి ఇండియన్స్ సత్తా చాటింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (71 నాటౌట్; 43 బంతుల్లో 7×4, 2×6) మెరవడంతో మంగళవారం 7 వికెట్ల తేడాతో గుజరాత్ టైటాన్స్‌పై విజయం సాధించింది. జార్జియా వేర్‌హామ్ (43 నాటౌట్; 33 బంతుల్లో 4×4, 1×6), భార్తీ ఫుల్మాలి (36 నాటౌట్; 15 బంతుల్లో 3×4, 3×6) చెలరేగడంతో మొదట గుజరాత్ 5 వికెట్ల నష్టానికి 192 పరుగులు చేసింది. కనిక ఆహూజా (35; 18 బంతుల్లో 4×4, 2×6), బెత్ మూనీ (33; 26 బంతుల్లో 3×4, 1×6) రాణించారు. హర్మన్‌ప్రీత్‌తో పాటు అమన్‌జ్యోత్ కౌర్ (40; 26 బంతుల్లో 7×4), నికోలా కేరీ (38 నాటౌట్; 23 బంతుల్లో 6×4) కీలక ఇన్నింగ్స్ ఆడడంతో లక్ష్యాన్ని ముంబయి 19.2 ఓవర్లలో కేవలం మూడు వికెట్లు కోల్పోయి ఛేదించింది. డబ్ల్యూపీఎల్‌లో ముంబయికి ఇదే అత్యధిక లక్ష్య ఛేదన. ఆ జట్టు ఈ సీజన్‌లో రెండో విజయాన్ని ఖాతాలో వేసుకుంది.

మెరిసిన హర్మన్: భారీ ఛేదనలో ముంబయికి గొప్ప ఆరంభమేమీ లభించలేదు. ఓపెనర్ కమలిని (12 బంతుల్లో 13)ని మూడో ఓవర్లోనే రేణుక వెనక్కి పంపింది. మరో ఓపెనర్ హేలీ మాథ్యూస్ (22; 12 బంతుల్లో 3×4, 1×6) ధాటిగానే ఆడినా ఎక్కువసేపు నిలవలేపోయింది. 5 ఓవర్లకు ముంబయి స్కోరు 37/2. అయితే అమన్‌జ్యోత్ కౌర్, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ అదిరే భాగస్వామ్యంతో ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. 12 ఓవర్లలో 109/2తో ముంబయి మెరుగైన స్థితిలో నిలిచింది. ఛేదన జోరుగా సాగుతున్న దశలో అమన్‌జ్యోత్‌ను ఔట్ చేయడం ద్వారా 72 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యాన్ని డివైన్ విడదీసింది. అయినా టైటాన్స్‌కు పెద్దగా ఉపశమనం లేదు. నికోలా కేరీ తోడుగా నిలవగా.. హర్మన్‌ప్రీత్ ధాటైన బ్యాటింగ్‌ను కొనసాగించింది. ఆఖరి మూడు ఓవర్లలో ఆ జట్టు 30 పరుగులు చేయాల్సిన పరిస్థితి. తర్వాతి ఓవర్లో హర్మన్‌ప్రీత్ రెండు ఫోర్లు బాదడం, బైస్ రూపంలో నాలుగు పరుగులు రావడంతో సమీకరణం తేలికైపోయింది. ఆఖరి ఓవర్లో రెండో బంతిని హర్మన్‌ప్రీత్ బౌండరీ దాటించడంతో విజయం ముంబయి సొంతమైంది.


మెరిసిన వేర్‌హామ్, ఫుల్మాలి: ఆఖర్లో జార్జియా వేర్‌హామ్, భార్తీ ఫుల్మాలి విరుచుకుపడడంతో అంతకుముందు గుజరాత్ టైటాన్స్ గట్టి లక్ష్యాన్ని నిర్దేశించగలిగింది. చెలరేగి ఆడిన ఈ జంట అభేద్యమైన ఆరో వికెట్‌కు 24 బంతుల్లోనే 56 పరుగులు జోడించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టైటాన్స్‌కు మంచి ఆరంభమే లభించింది. సోఫీ డివైన్ (8) ఈసారి త్వరగానే నిష్క్రమించినా.. మూనీ, కనిక ఆహూజా బ్యాట్ ఝళిపించడంతో 6 ఓవర్లు ముగిసే సరికి ఆ జట్టు 62/1తో నిలిచింది. అయితే తర్వాతి ఓవర్లోనే మూనీని అమేలియా ఔట్ చేసింది. అయినా కనిక, గార్డ్‌నర్ ధనాధన్ షాట్లు ఆడడంతో స్కోరు బోర్డు వేగంగా కదిలింది. కానీ వరుస ఓవర్లలో గార్డ్‌నర్, కనిక నిష్క్రమించడంతో పరుగుల వేగానికి కళ్లెం పడ్డట్లయింది. 16వ ఓవర్ ముగిశాక, జట్టు స్కోరు 136 వద్ద సోనిని రిటైర్డ్ ఔట్‌గా వెనక్కి పిలిచారు. ఆ తర్వాత ఫుల్మాలితో పాటు వేర్‌హామ్ కూడా రెచ్చిపోయి ఆడడంతో ఆఖరి మూడు ఓవర్లలో టైటాన్స్ ఏకంగా 49 పరుగులు రాబట్టింది.

గుజరాత్ ఇన్నింగ్స్: బెత్ మూనీ (సి) అండ్ (బి) అమేలియా 33; సోఫీ డివైన్ (సి) కమలిని (బి) ఇస్మాయిల్ 8; కనిక (సి) నికోలా (బి) హేలీ 35; గార్డ్‌నర్ ఎల్బీ (బి) నికోలా 20; జార్జియా వేర్‌హామ్ నాటౌట్ 43; ఆయుషి సోని రిటైర్డ్ ఔట్ 11; భార్తీ ఫుల్మాలి నాటౌట్ 36; ఎక్స్‌ట్రాలు 6 **మొత్తం:** (20 ఓవర్లలో 5 వికెట్లకు 192); **వికెట్ల పతనం:** 1-22, 2-64, 3-97, 4-99, 5-136; **బౌలింగ్:** షబ్నిమ్ 4-0-25-1; హేలీ మాథ్యూస్ 3-0-34-1; నికోలా కేరీ 4-0-36-1; అమేలియా కెర్ 4-0-40-1; అమన్‌జ్యోత్ కౌర్ 4-0-48-0; సంస్కృతి 1-0-5-0

ముంబయి ఇండియన్స్ ఇన్నింగ్స్: కమలిని (స్టంప్డ్) మూనీ (బి) రేణుక సింగ్ 13; హేలీ మ్యాథ్యూస్ (సి) డివైన్ (బి) గౌతమ్ 22; అమన్‌జ్యోత్ కౌర్ (సి) గార్డ్‌నర్ (బి) డివైన్ 40; హర్మన్‌ప్రీత్ కౌర్ నాటౌట్ 71; నికోలా కేరీ నాటౌట్ 38; ఎక్స్‌ట్రాలు 9 **మొత్తం** (19.2 ఓవర్లలో 3 వికెట్లకు) **193; వికెట్ల పతనం:** 1-20, 2-37, 3-109; **బౌలింగ్:** రేణుక సింగ్ 4-0-39-1, కశ్వీ గౌతమ్ 4-0-33-1, రాజేశ్వరి గైక్వాడ్ 2-0-22-0, సోఫీ డివైన్ 3.2-0-29-1, జార్జియా వేర్‌హామ్ 2-0-23-0, తనూజ కన్వర్ 3-0-29-0, ఆష్లీ గార్డ్‌నర్ 1-0-10-0

కోచ్‌లకూ టాప్స్

గోపీచంద్ కమిటీ సిఫార్సు




గోపీచంద్

దిల్లీ: భారత క్రీడారంగంలో శిక్షకుల ప్రమాణాలను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు జాతీయ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ నేతృత్వంలోని టాస్క్ ఫోర్స్ కీలక ప్రతిపాదనలు చేసింది. ప్రతిభావంతులైన క్రీడాకారుల కోసం అమలు చేస్తున్న 'టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్' (టాప్స్) తరహాలోనే.. శిక్షకులకు కూడా 'కోచ్ టాప్స్' పథకాన్ని ప్రవేశపెట్టాలని సిఫార్సు చేసింది. ఈమేరకు 43 పేజీల సమగ్ర నివేదికను కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖకు సమర్పించగా.. ఈ సూచనల్ని అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. దేశంలో కోచ్‌ల పురోగతి క్రమబద్ధంగా, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చూడటానికి జాతీయ కోచ్ అక్రిడిటేషన్ బోర్డు (ఎన్‌సీఏబీ) ఏర్పాటు అవసరమని గోపీచంద్ కమిటీ అభిప్రాయపడింది. ఈ బోర్డు భారత శిక్షణ వ్యవస్థకు కేంద్ర నాడీ వ్యవస్థలా పని చేస్తూ.. జవాబుదారీతనాన్ని పర్యవేక్షిస్తుందని పేర్కొంది. ఈ బోర్డులో భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధ్యక్షుడు, క్రీడా శాఖ కార్యదర్శి, జాతీయ స్థాయి ప్రముఖులు, విద్యావేత్తలు సభ్యులుగా ఉంటారు. ప్రస్తుతం పటియాలాలోని ఎన్‌ఐఎస్‌లో అందుబాటులో ఉన్న డిప్లొమా కోర్సుల స్థానంలో కొత్త విధానాన్ని ప్రతిపాదించారు. క్షేత్రస్థాయి, మధ్య, ఎలైట్, జాతీయ జట్టు కోచ్‌లుగా వివిధ దశల్ని సూచించింది. మాజీ క్రీడాకారులు, పీఈటీలు, స్పోర్ట్స్ సైన్స్ గ్రాడ్యుయేట్లు శిక్షణ రంగంలోకి వచ్చేలా వెసులుబాటు కల్పించింది. ప్రతి క్రీడలో ఏడాదికి అయిదుగురు అత్యుత్తమ శిక్షకులను గుర్తించి 'కోచ్ టాప్స్' పథకం కింద వారికి అభివృద్ధి నిధులు కేటాయించాలని పేర్కొంది. క్రీడాకారుల మాదిరిగానే కోచ్‌లకు కూడా నిర్ణీత మైలురాళ్ల ఆధారంగా నిధులు విడుదల చేయాలని గోపీచంద్ కమిటీ ప్రతిపాదించింది.

సెమీస్‌లో పంజాబ్, విదర్భ

విజయ్ హజారే ట్రోఫీ



ప్రభ్‌సిమ్రన్

బెంగళూరు: విజయ్ హజారే ట్రోఫీలో విదర్భ జోరు కొనసాగుతోంది. నిరుడు రన్నరప్‌గా నిలిచిన ఈ జట్టు సెమీఫైనల్లో అడుగుపెట్టింది. క్వార్టర్స్‌లో 76 పరుగుల తేడాతో దిల్లీని ఓడించింది. మరో క్వార్టర్స్‌లో పంజాబ్ 183 పరుగుల తేడాతో మధ్యప్రదేశ్‌ను చిత్తు చేసింది. మొదట బ్యాటింగ్ చేసిన పంజాబ్ 50 ఓవర్లలో 6 వికెట్లకు 345 పరుగుల భారీ స్కోరు సాధించింది. కెప్టెన్ ప్రభ్‌సిమ్రన్ సింగ్ (88), హర్నూర్ సింగ్ (51) జంట తొలి వికెట్‌కు 116 పరుగులు జోడించింది. అన్మోల్‌ప్రీత్ సింగ్ (70), నేహాల్ వధేరా (56) అర్ధసెంచరీలు చేశారు. త్రిపురేశ్ సింగ్, వెంకటేశ్ అయ్యర్ చెరో రెండు వికెట్లు తీశారు. లక్ష్యఛేదనలో మధ్యప్రదేశ్ 31.2 ఓవర్లలో 162 పరుగులకే ఆలౌటైంది. రజత్ పాటీదార్ (38), త్రిపురేశ్ (31) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోరు చేశారు. సన్వీర్ సింగ్ మూడు వికెట్లు పడగొట్టగా.. గుర్నూర్, క్రిష్ భగత్, రమణ్‌దీప్ తలో రెండు వికెట్లు తీశారు. ప్రభ్‌సిమ్రన్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. మరో మ్యాచ్‌లో మొదట విదర్భ 9 వికెట్లకు 300 పరుగులు చేసింది. యశ్ రాథోడ్ (86), అథర్వ తైడే (62) రాణించారు. ఇషాంత్ శర్మ, నవ్‌దీప్ సైనీ, ప్రిన్స్ యాదవ్, నితీశ్ రాణా తలో రెండు వికెట్లు ఖాతాలో వేసుకున్నారు. ఛేదనలో దిల్లీ తడబడింది. 45.1 ఓవర్లలో 224 పరుగులకు ఆలౌటైంది. అనుజ్ రావత్ (66) ఒంటరి పోరాటం చేశాడు. నచికేత్ భూటె 4, హర్ష్ దూబె 3 వికెట్లతో ప్రత్యర్థిని కట్టడి చేశారు. యశ్ రాథోడ్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కించుకున్నాడు. సెమీఫైనల్లో గురువారం విదర్భతో కర్ణాటక, శుక్రవారం పంజాబ్‌తో సౌరాష్ట్ర తలపడనున్నాయి.

పట్టువీడని బంగ్లా

ఢాకా: టీ20 ప్రపంచకప్‌లో తమ మ్యాచ్‌ల్ని భారత్ నుంచి తరలించాలన్న డిమాండ్‌పై బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) వెనక్కి తగ్గట్లేదు. భారత్‌లో ఆటగాళ్ల భద్రతకు ఎలాంటి ఢోకా లేదంటూ ఐసీసీ హామీ ఇస్తున్నా బీసీబీ పట్టువీడట్లేదు. ఫిబ్రవరి 7న ప్రారంభంకానున్న పొట్టి కప్పు షెడ్యూల్ ఇప్పటికే ఖరారైనందున.. మ్యాచ్‌లను తరలించడం సాధ్యంకాదంటూ మంగళవారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో బీసీబీకి ఐసీసీ స్పష్టంచేసింది. ఐసీసీ నిర్వహించిన ముప్పు అంచనా నివేదికలో బంగ్లాదేశ్ జట్టుకు ఎలాంటి ప్రత్యక్ష హాని లేదని తేలినప్పటికీ.. బీసీబీ మాత్రం భారత్‌కు రావడానికి విముఖత చూపుతోంది. "టోర్నీ షెడ్యూల్ ఇప్పటికే ప్రకటించినందున.. డిమాండ్‌ను సమీక్షించుకోవాలంటూ ఐసీసీ విజ్ఞప్తి చేసినా బీసీబీ వైఖరి మారలేదు. అయితే సాధ్యమయ్యే పరిష్కారాలను కనుగొనేలా చర్చలు కొనసాగించేందుకు ఇరు వర్గాలు అంగీకరించాయి. ఐసీసీతో నిర్మాణాత్మక సంప్రదింపులు కొనసాగిస్తూనే ఆటగాళ్లు, అధికారులు, సిబ్బంది భద్రతకు బీసీబీ కట్టుబడి ఉంటుంది" అని బీసీబీ ఒక ప్రకటనలో పేర్కొంది. ఐసీసీతో వీడియో కాన్ఫరెన్స్‌లో బీసీబీ అధ్యక్షుడు అమినుల్ ఇస్లాం, సీఈఓ నిజాముద్దీన్ చౌదరి పాల్గొన్నారు.

ఆమె మనిషి కాదు..రోబో



అన్ సియంగ్

దిల్లీ: బ్యాడ్మింటన్‌లో ఆమె 35 బీడబ్ల్యూఎఫ్ టైటిళ్లు నెగ్గింది. పది సార్లు రన్నరప్‌గా నిలిచింది. ప్రతి పెద్ద టోర్నీలో ఛాంపియన్‌షిప్ సొంతం చేసుకుంది. ప్రపంచ బ్యాడ్మింటన్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి చేరుకుని క్రీడా ప్రపంచం చూపు తన వైపు తిప్పుకొంది. ఆమె కేవలం 23 ఏళ్లకే ఇదంతా సాధించింది. మహిళల సింగిల్స్‌లో సంపూర్ణ ఆధిపత్యం కొనసాగిస్తోంది దక్షిణ కొరియాకు చెందిన యువ షట్లర్ అన్ సియంగ్. స్కాట్లాండ్ షట్లర్ క్రిస్టీ గిల్మోర్ మాటల్లో చెప్పాలంటే సియంగ్ మనిషి కాదు రోబో. "ఆమె ఒక రోబో. చిన్న వయసు నుంచే ఆమె కష్టపడిన తీరు అద్భుతం. ఎన్ని విధాలుగా ప్రయత్నించినా ఆమెపై గెలవడం కష్టం. కనీసం ఒక్క పాయింట్ సాధించాలన్నా శ్రమించాల్సి ఉంటుంది. తరానికి ఒక ప్లేయర్ ఆమె. రాబోయే కొన్ని తరాలకు సియంగ్ ఆదర్శం. ఆమె కోర్టులో చురుకుగా కదులుతూ, గాయాలబారిన పడకుండా ఫిట్‌నెస్‌ను గొప్పగా కాపాడుకుంటోంది" అని గిల్మోర్ కొనియాడింది. 2017లో పదిహేనేళ్ల వయసులో ఆసియా జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో తన జట్టును గెలిపించడం ద్వారా సియంగ్ వెలుగులోకి వచ్చింది. అదే ఏడాది సీనియర్ జట్టులో చోటు సంపాదించింది. 2019లో తొలి బీడబ్ల్యూఎఫ్ టైటిల్‌ను ఖాతాలో వేసుకుంది. కరోనా కారణంగా రెండేళ్లు ఆమె ఆట ఒడిదొడుకులకు గురైంది. కానీ 2023లో అత్యుత్తమ స్థాయికి చేరుకుంది. ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ గెలిచిన దక్షిణ కొరియా తొలి షట్లర్‌గా ఆ ఏడాది ఘనత సాధించిన సియంగ్.. తొలిసారి ప్రపంచ ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్ ర్యాంకును కైవసం చేసుకుంది. ఆ తర్వాత ఆసియా క్రీడల్లోనూ స్వర్ణం నెగ్గింది. మహిళల బ్యాడ్మింటన్‌లో ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ 2024 పారిస్ ఒలింపిక్స్ స్వర్ణం కైవసం చేసుకుంది. ఇప్పటివరకు 128 వారాలు అగ్రస్థానంలో ఉన్న అన్ సియంగ్‌ను ఓడించడం దాదాపుగా అసాధ్యమనే చెప్పొచ్చు. ప్రస్తుతం ఆమె ఫామ్ ఆ స్థాయిలో ఉంది. "ఆమె కఠిన ప్రత్యర్థి. మానసికంగా, శారీరకంగా దృఢంగా లేకపోతే ఓడించలేం. ఆమెతో పోరులో ఆధిక్యంలో ఉన్నప్పటికీ ఏమరపాటుగా ఉండకూడదు. చిన్న అవకాశమొచ్చినా పుంజుకుంటుంది. సియంగ్ ఆడుతున్నంతసేపు ప్రేక్షకులు ఉత్సాహంగా ఆమె ఆట చూస్తూనే ఉంటారు. ఆమె ప్రస్థానం ఎంతో స్ఫూర్తిదాయకం" అని మిషెలీ లీ (కెనడా) చెప్పింది. ఇటీవల ముగిసిన మలేసియా ఓపెన్‌లో గట్టి పోటీ ఇచ్చినప్పటికీ సియంగ్ చేతిలో మూడు మ్యాచ్‌లు ఓడింది మిషెలీ. ఇండియా ఓపెన్‌లో అన్ సియంగ్ టాప్‌సీడ్‌గా బరిలో ఉంది.

ప్రణాళికల్లో వాళ్లిద్దరూ..



సితాన్షు కోటక్

రాజ్‌కోట్: భారత స్టార్ క్రికెటర్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ వచ్చే ఏడాది జరగబోయే వన్డే ప్రపంచకప్ ప్రణాళికల్లో చురుగ్గా పాల్గొంటున్నారని భారత జట్టు బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ పేర్కొన్నాడు. "కోహ్లి, రోహిత్ ప్రతి మ్యాచ్ గెలవాలని కోరుకుంటున్నారు. వారికి ఉన్న అపార అనుభవంతో జట్టులోని ఇతర ఆటగాళ్లకు సూచనలివ్వగలరు. ఇస్తుంటారు కూడా. వన్డే ఫార్మాట్, దక్షిణాఫ్రికాలో జరిగే ప్రపంచకప్‌పై గంభీర్‌తో తమ ఆలోచనలు పంచుకుంటారు. సామాజిక మాధ్యమాల్లో ప్రతికూలంగా చాలా చర్చ జరుగుతుంటుంది. కానీ మేం భిన్నమైన వాతావరణం చూస్తాం. ఇక్కడ అన్ని సానుకూలాంశాలే ఉంటాయి. టీ20 ప్రపంచకప్ అనంతరం ఎక్కువ వన్డేలు ఉంటాయి. 34 ఓవర్ల అనంతరం మ్యాచ్‌లో ఒక్క బంతినే కొనసాగించాలన్న నిబంధన అమల్లోకి వచ్చింది. అందుకు తగ్గట్టుగా బ్యాటింగ్ లైనప్‌ను నిర్మించడంపై కసరత్తు చేస్తాం'' అని సితాన్షు అన్నాడు.

ఆ సిరీస్ తర్వాత అలీసా రిటైర్మెంట్



అలీసా హీలీ

సిడ్నీ: ఆస్ట్రేలియా మహిళల కెప్టెన్ అలీసా హీలీ ఆటకు వీడ్కోలు పలకనుంది. మార్చిలో సొంతగడ్డపై భారత్‌తో జరిగే సిరీస్ ఆడి కెరీర్ ముగించాలని ఆమె నిర్ణయించుకుంది. భారత్‌తో మూడు వన్డేలు.. పెర్త్‌లో ఏకైక టెస్టులో చివరిసారిగా ఆస్ట్రేలియా జట్టుకు అలీసా సారథ్యం వహించనుంది. ఈ ఏడాది చివర్లో ఇంగ్లాండ్‌లో జరిగే టీ20 ప్రపంచకప్‌లో ఆడే అవకాశం లేనందున.. టీమ్‌ఇండియాతో టీ20 సిరీస్‌లో ఆమె పాల్గొనట్లేదు. "భారత్‌తో జరిగే సిరీసే ఆసీస్ తరఫున చివరిది కావడం మిశ్రమ భావోద్వేగాల్ని కలిగిస్తోంది. ఇప్పటికీ ఆసీస్‌కు ఆడటం నాకెంతో ఇష్టం. కానీ మొదట్నుంచీ నన్ను ముందుకు నడిపించిన పోటీతత్వం కొంతవరకు కోల్పోయాను. వీడ్కోలు పలికేందుకు ఇదే సరైన సమయమని అనిపిస్తోంది" అని అలీసా తెలిపింది. 35 ఏళ్ల అలీసా ఇప్పటి వరకు ఆసీస్ తరఫున 10 టెస్టులు (489 పరుగులు), 123 వన్డేలు (3563), 162 టీ20 (3054)ల్లో బరిలో దిగింది. మూడు ఫార్మాట్లలో కలిపి 8 శతకాలు, 38 అర్ధ సెంచరీలు సాధించింది.

ఈనాడు

విజయవాడ 14-1-2026 బుధవారం సిటీ సంపుటి 52 . సంచిక 155

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 22

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



ఈనాడు



విజయవాడ 14-1-2026 బుధవారం సిటీ సంపుటి 52 . సంచిక 155

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 22 www.eenadu.net


Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ట్రోల్స్ తాత్కాలికం... పరుగులు, వికెట్లే శాశ్వతం





- వచ్చే దశాబ్దం కూడా భారత్‌దే
- యువ ఆటగాళ్లు ఐపీఎల్ కంటే ముందు రెండేళ్లు దేశవాళీకి ఆడాలి
- అతి ప్రచారంతో ఆటగాళ్లపై మానసిక ఒత్తిడి
- 'ఈనాడు'కు సౌరభ్ గంగూలీ ప్రత్యేక ఇంటర్వ్యూ

లోపలి పేజీలో











తప్పులున్నా.. తూచ్!

- పట్టాదారు పాసుపుస్తకాల్లో కనిపిస్తున్న లోపాలు
- ఇప్పటికే 85%పైగా పంపిణీ
- తప్పుల్లేని పుస్తకాలిచ్చేందుకు ప్రభుత్వ నిర్ణయం
- ఫిబ్రవరిలో అందజేత
- నమూనా పుస్తకంపై.. రైతుల సంతకాలు తీసుకున్నాకే ముద్రణ

లోపలి పేజీలో

ఇరాన్ రక్తసిక్తం

ఆందోళనల్లో ఇప్పటిదాకా **2,003** మంది మృతి..

- టెహ్రాన్‌లో భారీ విధ్వంసం
- ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, ఏటీఎంలు నాశనం
- వీధుల నిండా భద్రతా సిబ్బందే

ఆందోళనకారులకు సాయం అందబోతోందని ట్రంప్ వ్యాఖ్య


ఆందోళనకారులు నిప్పుపెట్టడంతో టెహ్రాన్‌లో మంటల్లో కాలిపోతున్న వాహనాలు

దుబాయ్: ఇరాన్‌లో ఏం జరుగుతోందో ఇప్పుడిప్పుడే బయటి ప్రపంచానికి తెలుస్తోంది. మంగళవారం ఆంక్షలను కొంత సడలించడంతో టెహ్రాన్ నుంచి కొంత మంది స్థానికులు విదేశాల్లోని మీడియా ప్రతినిధులకు ఫోన్ కాల్స్ చేశారు. అక్కడి పరిస్థితిని వివరించారు. దీంతో పాటు అమెరికా కేంద్రంగా పని చేసే మానవ హక్కుల ఉద్యమకారుల వార్తా సంస్థ కూడా వివరాలను అందించింది. ఇరాన్‌లో ఆందోళనల సందర్భంగా 2,003 మంది మరణించారు. మరణించిన వారిలో 1,850 మంది ఆందోళనకారులు కాగా.. 135 మంది భద్రతా సిబ్బంది, ప్రభుత్వానికి చెందినవారు. ఆందోళనలతో సంబంధం లేని 9 మంది చిన్నారులు, 9 మంది పౌరులూ చనిపోయారు. 16,700 మందిని భద్రతా సిబ్బంది అరెస్టు చేశారు. మరణాలు మరింత ఎక్కువ ఉండొచ్చని ఆందోళన వ్యక్తమవుతోంది.

దేశంలో ఎస్ఎంఎస్‌లు, ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయాయి. కేవలం ప్రభుత్వ వెబ్‌సైట్లే పని చేస్తున్నాయి. టెహ్రాన్ మధ్య ప్రాంతంలో భారీ భద్రత ఉంది. అల్లర్లను అణచివేసే పోలీసులు.. హెల్మెట్లు పెట్టుకుని బ్యాటన్లు, రక్షణ షీల్డ్‌లను ధరించి ఆయుధాలతో ఉన్నారు. వారివద్ద బాష్పవాయు గోళాలున్నాయి. వారికి మద్దతుగా రివల్యూషనరీ గార్డ్స్ వాలంటీర్లు బసీజ్ ఫోర్స్ ఉంది. వారి చేతిలో పలు రకాల ఆయుధాలున్నాయి. ఆందోళనల సందర్భంగా పలు ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, ఏటీఎంలు మంటల్లో కాలి ధ్వంసమయ్యాయి. ఇంటర్నెట్ లేకపోవడంవల్ల బ్యాంకుల్లో లావాదేవీలు జరగడం లేదు. (మిగతా 2లో)

ట్రంప్ 'ఇరాన్' సుంకం

- ఆ దేశంతో వ్యాపారం చేస్తే 25% మోత
- భారత్ సహా పలు దేశాలపై ప్రభావం
- తీవ్రంగా స్పందించిన ఖమేనీ
- మన వ్యాపారం తక్కువే: భారత్

2లో

కృష్ణమ్మ జలాలు వెంకన్న చెంతకు చేరేలా..!

- రూ.126 కోట్ల ప్రాజెక్టుకు సీఎం చంద్రబాబు శంకుస్థాపన
- కుటుంబసభ్యులతో కలిసి సంక్రాంతి సంబరాలు

ఈనాడు, తిరుపతి: శ్రీశైలం నుంచి వస్తున్న కృష్ణా జలాలతో తిరుమల, తిరుపతి తాగునీటి ఎద్దడి తీర్చేందుకు రూ.126 కోట్లతో చేపట్టిన పనులకు చంద్రగిరి మండలం మూలపల్లె వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం శంకుస్థాపన చేశారు. నీవా బ్రాంచి కాలువ నుంచి కల్యాణి జలాశయం, మూలపల్లె, కంటిమడుగు, వెంకట్రాయుని, నాగపట్ల చెరువులకు నీరు మళ్లించి 1,150 ఎకరాల ఆయకట్టు స్థిరీకరించడంతో పాటు 5లక్షల మంది ప్రజల తాగునీటి ఇక్కట్లు తీర్చే ఈ ప్రాజెక్టు శిలాఫలకాన్ని సీఎం ఆవిష్కరించారు. ఎ.రంగంపేట-భీమవరం రోడ్డు నుంచి శేషాచల లింగేశ్వరస్వామి ఆలయం వరకు నిర్మించిన (మిగతా 2లో)


నారావారిపల్లెలో ముగ్గుల పోటీని తిలకిస్తున్న చంద్రబాబు



92 ఏళ్లనాటి
గాంధీతాత చెట్టుకు హ్యాపీ బర్త్‌డే



కేరళలోని కన్నూర్ జిల్లా పయ్యనూరుకు భారత స్వాతంత్ర్య ఉద్యమంతో అవినాభావ సంబంధముంది. ఈ ఉద్యమాన్ని ముందుండి నడిపించిన మహాత్ముడి జ్ఞాపకాలకు పచ్చని గుర్తుగా ఒక అపురూపమైన సజీవ స్మారకం ఇప్పటికీ ఇక్కడ కళకళలాడుతోంది. 1934 జనవరిలో కేరళను సందర్శించిన గాంధీ 13 రోజులపాటు ఇక్కడే బస చేశారు. ఆ సమయంలో పయ్యనూరులోని ఆనంద తీర్థ ఆశ్రమానికి వచ్చారు. హరిజన విద్యార్థుల కోసం ఈ ఆశ్రమం నడుపుతున్న శ్రీ నారాయణ విద్యాలయం ఆవరణలో మాల్గోవా మామిడిమొక్కను గాంధీ నాటారు. మహాత్ముడి గుర్తుగా ఈ చెట్టును సంరక్షించిన ఆశ్రమం ఆ తర్వాతి కాలంలో దాని కిందే బోసినవ్వుల బాపు విగ్రహాన్ని ప్రతిష్ఠించింది. నేడు పెద్ద వృక్షంగా అది ఎదగగా.. మంగళవారం చెట్టు చుట్టూ చేరిన నారాయణ విద్యాలయ విద్యార్థులు గాంధీతాత చెట్టుకు పుట్టినరోజు వేడుకలు జరిపారు. కాలం గడిచేకొద్దీ జాతిపిత ఆశయాలైన ప్రేమ, సమానత్వాలకు ప్రతీకగా ఈ చెట్టు నిలిచిపోయిందని ఆశ్రమ అధికారి కె.కృష్ణన్ తెలిపారు.

బుద్ధగయా స్పెషల్
నీరా చాయ్

బిహార్‌లోని బుద్ధగయాలో విక్రయించే 'నీరా చాయ్' దేశ, విదేశాల పర్యాటకులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. సుప్రసిద్ధ మహాబోధి ఆలయ సమీపంలో రజనీశ్ పటేల్ అనే వ్యక్తి ఈ టీ స్టాల్ నడుపుతున్నాడు. సూర్యోదయానికి ముందే ఈతచెట్టు నుంచి తీసే నీరాతో టీ తయారుచేసే దుకాణం బుద్ధగయాలో ఇదొక్కటే. కొత్త ఏడాది మొదలయ్యాక రోజుకు దాదాపు 40 వేల మంది పర్యాటకులు ఇక్కడికి వస్తున్నారు. "ప్రతిరోజూ కనీసం వంద లీటర్ల తాజా నీరాను తీసుకువచ్చి ఫ్రిజ్‌లో పెడతాం. టీ కోసం ఉపయోగించగా మిగిలిన దానిని రాత్రికి బెల్లం తయారీకి వాడుతాం. ఈ బెల్లంతో మిఠాయిలు చేస్తాం. శీతాకాలంలో మా టీ స్టాల్ రోజువారీ వ్యాపారం రూ.30 వేలు ఉంటుంది. ఈ మూడు నెలల్లో నీరా టీ, ఈత బెల్లం మిఠాయిలతో దాదాపు రూ.10 లక్షల వ్యాపారం చేస్తాం. 15 మందికి మేం ఉపాధి కల్పిస్తున్నాం" అని రజనీశ్ తెలిపారు. పాలతో చేసే చాయ్‌కు ఈత బెల్లం, ఇతర సుగంధ ద్రవ్యాలు వాడుతారు. బ్లాక్ టీ అంటే తేయాకును నేరుగా నీరాలో మరిగించి ఆహ్లాదకరమైన సువాసనతో అందిస్తారు. నీరాలో సహజంగా ఉండే తీపి దీనికి సరిపోతుంది. పలురకాల విటమిన్లు, ఖనిజాలతో 25 రకాల పోషకాలు నీరాలో ఉంటాయని గయా జనరల్ ఫిజీషియన్ డాక్టర్ రాజ్‌కుమార్ తెలిపారు. తక్కువ గ్లైసెమిక్ సూచిక కలిగి ఉన్నందున మధుమేహ వ్యాధిగ్రస్థులకూ సురక్షితమే కాగా, నీరా సేకరణలో శుభ్రత చాలా ముఖ్యమన్నారు.



గ్రీన్‌లాండ్ విలీనం కోరుతూ ప్రైవేటు బిల్లు!

ఇంటర్నెట్ డెస్క్: అమెరికాలో గ్రీన్‌లాండ్‌ను విలీనం చేయాలని కోరుతూ కాంగ్రెస్‌లో ర్యాండీ ఫైన్ అనే సభ్యుడు ప్రైవేటు బిల్లును ప్రవేశపెట్టారు. దానిని రాష్ట్రంగా చేర్చుకోవాలని ప్రతిపాదించారు. గ్రీన్‌లాండ్ స్వాధీనం, రాష్ట్ర హోదా బిల్లును సభలో ప్రవేశ పెడుతున్నట్లు ఎక్స్‌లో ర్యాండీ వెల్లడించారు. అధ్యక్షుడు ట్రంప్ తన వాదనతో ఏకీభవించినట్లు తెలిపారు.

ఈ వారంలోనే గ్రీన్‌లాండ్‌పై సమావేశం!

కోపెన్‌హేగెన్: అమెరికా రాజధాని వాషింగ్టన్‌లో ఈ వారంలోనే గ్రీన్‌లాండ్‌పై సమావేశం జరగనుంది. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నేతృత్వంలో జరిగే ఈ సమావేశానికి డెన్మార్క్, గ్రీన్‌లాండ్ విదేశాంగ మంత్రులు లార్స్ లోకీ రాస్‌మ్యూసెన్, వివియన్ మోట్జ్‌ఫెల్డ్ హాజరు కానున్నారు. అంతకుముందుగా బుధవారం అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియోతో వారు సమావేశమయ్యే అవకాశముంది. అయితే అది ఇంకా ధ్రువీకరణ కాలేదు. వాన్స్, రుబియో కార్యాలయాలూ సమావేశాన్ని ధ్రువీకరించలేదు.

కుక్కకాట్లకు భారీ పరిహారం

- బాధితులకు చెల్లించాలని ఆదేశిస్తాం: సుప్రీంకోర్టు
- ఐదేళ్లలో రాష్ట్రాల చర్యలు నామమాత్రమని వ్యాఖ్య



దిల్లీ: కుక్కకాటు బాధితులకు భారీ పరిహారం చెల్లించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశిస్తామని సుప్రీంకోర్టు తెలిపింది. కుక్కకాటు ఘటనల్లో వాటి ప్రేమికుల్ని, వాటికి ఆహారం పెట్టేవారిని కూడా జవాబుదారీగా చేస్తామని జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి. అంజారియాల ధర్మాసనం హెచ్చరించింది. సంస్థల ప్రాంగణాలు, రహదారులపై వీధికుక్కల్ని తొలగించాలంటూ 2025 నవంబరు 7న ఇచ్చిన ఉత్తర్వులపై అనుకూల, ప్రతికూల వాదనల్ని వింటున్న ధర్మాసనం మంగళవారం తీర్పు వెలువరించింది. "కుక్క కరవడం వల్ల ఏ ఒక్కరు గాయపడినా, ప్రాణాలు కోల్పోయినా.. వారు పిల్లలైనా, పెద్దలైనా మేం మాత్రం ఆయా రాష్ట్ర ప్రభుత్వాల నుంచి భారీ పరిహారం అడుగుతాం. ఎందుకంటే- వీధి కుక్కలను నియంత్రించడానికి నిబంధనలు పాటించాల్సిందిగా గత ఐదేళ్లుగా మేం చెబుతున్నా దానిని అమలు చేయడంలో రాష్ట్రాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయి. వీధికుక్కలకు ఆహారం పెట్టేవారూ ఈ ఘటనలకు బాధ్యత వహించాల్సి ఉంటుంది. మీకు ఈ జంతువులపై అంత ప్రేమ పొంగిపోతుంటే వాటిని మీ ఇళ్లకే ఎందుకు తీసుకువెళ్లకూడదు? వీధి కుక్కల సమస్య భావోద్వేగపూరిత అంశమని అంటున్నారు. మీ భావోద్వేగం కుక్కలపై మాత్రమేనా? మేం మనుషుల గురించి కూడా ఆందోళన చెందుతున్నాం. కుక్కలు మనచుట్టూ తిరుగుతూ, కరుస్తూ, భయపెట్టడమేమిటి?" అని జస్టిస్ నాథ్ ప్రశ్నించారు. దానితో జస్టిస్ మెహతా ఏకీభవించారు. 'ఒక తొమ్మిదేళ్ల పిల్లాడిపై కుక్కలు దాడి చేస్తే ఎవరిని జవాబుదారీని చేయాలి? దానికి తిండిపెట్టిన సంస్థనా? ఈ సమస్యపై మేం కళ్లు మూసుకుని కూర్చోవాలని మీరు కోరుకుంటున్నారా?' అని ఆయన ప్రశ్నించారు.

చిరుతలకూ గుండెపోటు ముప్పు!

ఈటీవీ భారత్: ప్రకృతి ఒడిలో బతికే చిరుతల్లాంటి జంతువులకూ గుండెపోటు ముప్పు తప్పడం లేదంటూ తాజాగా మధ్యప్రదేశ్‌లోని ఛింద్వాడా అటవీ డివిజనులో వెలుగుచూసిన ఘటన వన్యప్రాణి ప్రేమికులను కలవరపెడుతోంది. అటవీశాఖ సిబ్బంది పెట్రోలింగు విధుల్లో ఉండగా.. అడవిలో ఓచోట నీటి కాలువలో భారీ చిరుతపులి మృతదేహం తేలుతూ కనిపించింది. శరీరంపై ఒక్క గాయం కూడా లేదు. వెటర్నరీ వైద్యుల బృందం అడవిలోనే పోస్టుమార్టం చేసి, గుండెపోటు కారణం కావచ్చని ప్రాథమికంగా తేల్చింది. ఎనిమిదేళ్ల ఈ చిరుత అంతర్గత అవయవాలను ప్రయోగశాలకు పంపామని, నివేదిక వచ్చాక పూర్తి స్పష్టత వస్తుందని అటవీ అధికారులు వెల్లడించారు.



ఇరాన్‌కు అమెరికా హెచ్చరికలు సమ్మతం కాదు
రష్యా స్పష్టీకరణ

మాస్కో: ఇరాన్‌పై సైనిక చర్య తప్పదని అమెరికా హెచ్చరించడం తగదని రష్యా స్పష్టంచేసింది. సైనిక చర్యల వల్ల పశ్చిమాసియాలో విధ్వంసకర పరిస్థితులు తలెత్తుతాయని, అంతర్జాతీయంగా అనిశ్చితి నెలకొంటుందని రష్యా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి మరియా జఖరోవా మంగళవారం స్పష్టంచేశారు. ఇరాన్‌పై పశ్చిమ దేశాల ఆంక్షలవల్లే సామాజిక, ఆర్థిక సమస్యలు తలెత్తాయని, అక్కడి అల్లర్లకు విదేశీ శక్తులే కారణమని అభిప్రాయపడ్డారు. ప్రత్యేక శిక్షణ పొందిన సాయుధ ముఠాలు.. విదేశాల నుంచి వచ్చే ఆదేశాల ఆధారంగా అల్లర్లు సృష్టించారని ఆరోపించారు. ఇరాన్ వాణిజ్య భాగస్వాములను అమెరికా బ్లాక్ మెయిల్ చేయడాన్ని సహించబోమని తేల్చి చెప్పారు.

ఉక్రెయిన్‌పై విరుచుకుపడిన రష్యా

- 300 డ్రోన్లు, 25 క్షిపణులతో దాడి
- ఖండించిన అమెరికా



రష్యా క్షిపణి దాడితో ఉక్రెయిన్‌లోని ఖార్కివ్‌లో ధ్వంసమైన ఓ వ్యాపార సంస్థ డెలివరీ హబ్

కీవ్: ఉక్రెయిన్‌పై మంగళవారం 300 డ్రోన్లను, 18 బాలిస్టిక్, 7 క్రూజ్ క్షిపణులను రష్యా ప్రయోగించింది. తమ దేశంలోని 8 ప్రాంతాలపై ఏకకాలంలో ఈ దాడులు జరిగాయని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వెల్లడించారు. విద్యుత్ సదుపాయాలే లక్ష్యంగా జరిగిన ఈ దాడిలో నలుగురు మృతి చెందారని తెలిపారు. ఉష్ణోగ్రత మైనస్ 12 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకున్న అతి శీతల పరిస్థితుల్లో జరిగిన ఈ దాడి కారణంగా విద్యుత్తు అందక రక్తం గడ్డకట్టే చలిలో వందల కుటుంబాలు గజగజలాడాయని ఆయన వివరించారు. ఉక్రెయిన్‌పై రష్యా దాడులను అమెరికా ఖండించింది. ట్రంప్ యంత్రాంగం చర్చల ద్వారా శాంతి స్థాపనకు ప్రయత్నాలు ముమ్మరం చేసిన సమయంలో ఇలా దాడులు చేయడం దారుణమని ఐక్యరాజ్య సమితిలో అమెరికా ఉప రాయబారి టామీ బ్రూస్ పేర్కొన్నారు. అణ్వాయుధ ప్రయోగ సామర్థ్యం కలిగిన ఓరెష్నిక్ బాలిస్టిక్ క్షిపణుల్ని రష్యా గత వారం నాటో కూటమి సభ్య దేశమైన పోలండ్ సరిహద్దుకు అతి సమీపంలో ఉన్న ఉక్రెయిన్ భూభాగంపై ప్రయోగించడాన్ని ఆమె తీవ్రంగా తప్పుబట్టారు. రష్యా, ఉక్రెయిన్ యుద్ధంలో మృతుల సంఖ్య భారీగా పెరగడాన్ని అమెరికా ఖండిస్తోందని భద్రతా మండలి అత్యవసర సమావేశంలో టామీ బ్రూస్ వెల్లడించారు.



పాక్-చైనా ఒప్పందం చెల్లదు..

- షక్సాగామ్ వ్యాలీపై భారత్ పునరుద్ఘాటన



దిల్లీ: వివాదాస్పద షక్సాగామ్ లోయలోని ప్రాంతం తమ దేశంలో భాగమేనని చైనా చేసిన వాదనను భారత్ మరోసారి తిప్పికొట్టింది. ఆ వ్యాలీ అప్పగింతకు సంబంధించి 1963లో పాకిస్థాన్-చైనా మధ్య జరిగిన ఒప్పందం చట్టవిరుద్ధమని భారత ఆర్మీ చీఫ్, జనరల్ ఉపేంద్ర ద్వివేది చెప్పారు. దిల్లీలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "షక్సాగామ్ వ్యాలీని చైనాకు అప్పగిస్తూ బీజింగ్‌తో పాకిస్థాన్ చేసుకున్న ఒప్పందం (1963) చెల్లదు. ఆ ప్రాంతంలో జరిగే ఏ కార్యకలాపాలను మేం గుర్తించబోం. చైనా-పాక్ ఆర్థిక నడవా ను ఆ రెండు దేశాలు సంయుక్తంగా చేస్తున్న చట్టవిరుద్ధమైన చర్యగానే మేం పరిగణిస్తాం" అని ద్వివేది స్పష్టంచేశారు. షక్సాగామ్ వ్యాలీ ప్రాంతంలో చైనా చేపట్టిన అభివృద్ధి పనులపై ఈ నెల 9న భారత్ తీవ్ర అభ్యంతరం తెలిపింది. దీనిపై చైనా స్పందిస్తూ.. భారత్‌పై అక్కసు వెళ్లగక్కింది. ఆ ప్రాంతం తమ దేశంలో భాగమేనని పేర్కొంది.

చిచ్చురేపిన చైనా కామ్రేడ్లు

- భాజపా, కాంగ్రెస్ నేతలతో సీపీసీ భేటీలు
- రెండు పార్టీల మధ్య మాటల యుద్ధం

దిల్లీ: కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ చైనా (సీపీసీ) ప్రతినిధి బృందం జరిపిన భేటీలు భాజపా, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధానికి దారితీశాయి. చైనా నుంచి వచ్చిన బృందం దిల్లీలో భాజపా ప్రధాన కార్యాలయాన్ని సందర్శించడంతో పాటు ఆరెస్సెస్ అధినేత మోహన్ భాగవత్‌తో భేటీ అయింది. కాంగ్రెస్ నేతలతోనూ సమావేశమైంది. సీపీసీ అంతర్జాతీయ విభాగం ఉపమంత్రి సన్ హైయాన్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం మంగళవారం కాంగ్రెస్ విదేశాంగ వ్యవహారాల విభాగం అధినేత సల్మాన్ ఖుర్షీద్‌తో భేటీ అయింది. భారత సందర్శనకు వచ్చిన ప్రతినిధి బృందం కోరిక మేరకు ప్రభుత్వ అనుమతితో భేటీ జరిగిందని కాంగ్రెస్ స్పష్టంచేసింది. బృందం భాజపా కేంద్ర కార్యాలయాన్ని సందర్శించిన ఒకరోజు అనంతరం ప్రతిపక్ష నేతలను కలిసింది. చైనా ప్రతినిధి బృందంతో సమావేశంలో జాతీయ ప్రయోజనాలకు దోహదపడే అంశాలేవైనా భాజపా, ఆరెస్సెస్‌లు లేవనెత్తాయా అని కాంగ్రెస్ నేత పవన్ ఖేడా ప్రశ్నించారు.

భారత్‌తో చైనా సంబంధాలు మెరుగుపడిన నేపథ్యంలో ఆ దేశ ప్రతినిధి బృందంతో తాము బహిరంగంగా సమావేశమయ్యామని, కాంగ్రెస్ మాత్రం సీపీసీతో రహస్య ఒప్పందం కుదుర్చుకుందని భాజపా ఆరోపించింది.

అప్పుడు భూతల దాడులకూ సిద్ధమయ్యాం

- ఆపరేషన్ సిందూర్‌పై ఆర్మీ చీఫ్

దిల్లీ: ఆపరేషన్ సిందూర్ కొనసాగుతోందని, త్రివిధ దళాల సమన్వయానికి ఇది నిదర్శనమని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది అన్నారు. భద్రతా సవాళ్లను ఎదుర్కోవడంలో భారత్ సైనిక సంసిద్ధత దీని ద్వారా స్పష్టమైందని పేర్కొన్నారు. మంగళవారం ఆయన దిల్లీలో మీడియా సమావేశంలో వివిధ అంశాలపై మాట్లాడారు. 'ఆపరేషన్ సిందూర్'ను చాలా కచ్చితత్వంతో అమలుచేశాం. 88 గంటల పాటు సాగిన ఆ ఆపరేషన్‌లో మన సైనిక దళాలు అత్యంత సమర్థంగా పనిచేశాయి. ఉగ్ర శిబిరాలను నేలమట్టం చేయగలిగాం. దాదాపు 100 మంది ఉగ్రవాదులను హతమార్చాం. ఆ సమయంలో పెద్దఎత్తున బలగాలను సరిహద్దులకు తరలించాం. పాకిస్థాన్ చిన్న తప్పు చేసినా.. భూతల దాడులను ప్రారంభించేందుకు కూడా నాడు మేం పూర్తి సన్నద్ధంగా ఉన్నాం' అని ఆర్మీ చీఫ్ నాటి పరిస్థితులను వివరించారు. అలాగే ఈశాన్య సరిహద్దులో పరిస్థితులు స్థిరంగానే ఉన్నాయని, అయితే అప్రమత్తంగా ఉండటం కీలకమని వెల్లడించారు. చైనా సరిహద్దులోని భద్రత గురించి మాట్లాడుతూ.. భారత మోహరింపులు బలంగా ఉన్నాయని చెప్పారు.



సరైన మార్గదర్శకత్వం, వేగంతో వికసిత్ భారత్ సాధ్యం: సీడీఎస్

దిల్లీ: సరైన మార్గదర్శకత్వం, వేగంతో 'వికసిత్ భారత్' సాధ్యమవుతుందని సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ అభిప్రాయపడ్డారు. ఈ విలువలు దేశానికే కాకుండా, ప్రతీ వ్యక్తికి ఉపయోగపడతాయన్నారు. దిల్లీ కంటోన్మెంట్‌లో నిర్వహించిన ఎన్‌సీసీ రిపబ్లిక్ డే శిబిరంలో భాగంగా కేడెట్‌లను ఉద్దేశిస్తూ ఆయన ప్రసంగించారు. 2047 నాటికి వికసిత్ భారత్ కల సాకారం అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు.



టైగర్ సఫారీలో పర్యాటకుల ఉత్కంఠ..

ఈటీవీ భారత్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని లఖీంపుర్ ఖేరి జిల్లాలో గల దుధ్వా పులుల అభయారణ్యంలో ఆదివారం సఫారీ యాత్రలో ఉన్న పర్యాటకులు కొండచిలువను నోటకరుచుకొని పోతున్న పులిని దగ్గరగా చూసి ఉత్కంఠకు గురయ్యారు. ఏడు అడుగుల కొండచిలువ పులి కోరల నుంచి తప్పించుకునేందుకు విలవిలలాడింది. పర్యాటకులు తమ మొబైల్ కెమెరాలతో ఈ దృశ్యాన్ని చిత్రీకరించారు. పులి సాధారణంగా జింకలు, అడవి పందుల వంటి జంతువులను వేటాడుతుందని.. కొండచిలువను వేటాడటం అరుదని దుధ్వా పులుల అభయారణ్యం డిప్యూటీ డైరెక్టర్ ఆర్.జగదీశ్ తెలిపారు.

కశ్మీర్లో ఉగ్రవాదులకు సహకారం.. ప్రభుత్వోద్యోగుల తొలగింపు

శ్రీనగర్: ఉగ్రవాదులతో సంబంధాలున్నట్లు అనుమానం ఉన్న ఐదుగురు ప్రభుత్వోద్యోగులను జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా మంగళవారం తొలగించారు. లెఫ్టినెంట్ గవర్నర్ పాలనలో 2020 నుంచి ఇంతవరకు ఇలా 85 మంది ప్రభుత్వ ఉద్యోగులపై వేటు పడింది.


ఇరాన్ ఆందోళనకారులకు ఐరోపా నేతల మద్దతు

ఇంటర్నెట్ డెస్క్: ఇరాన్‌లోని ఆందోళనకారులకు ఐరోపా దేశాల నేతలు మద్దతుగా నిలిచారు. ఈ భారీ నిరసనలు తిరుగుబాటు స్థాయికి చేరుకున్నాయని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అభిప్రాయపడ్డారు. ఈ పరిణామాలు ఇరాన్‌కు వ్యూహాత్మక మిత్ర దేశమైన రష్యాపై ఒత్తిడిని పెంచుతున్నాయని పేర్కొన్నారు. ఇరాన్‌లో నిరసనకారులపై ప్రభుత్వ బల ప్రయోగాన్ని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ ఖండించారు. 'హక్కుల కోసం ధైర్యంగా పోరాడుతున్న ఇరాన్ మహిళలు, పురుషులపై జరుగుతున్న ప్రభుత్వ హింసను నేను ఖండిస్తున్నా. మౌలిక స్వేచ్ఛలపట్ల గౌరవం చూపడం ప్రపంచ వ్యాప్తంగా అనుసరించాల్సిన విలువ. ఆ స్వేచ్ఛల కోసం పోరాడుతున్న వారితోనే మేం నిలుస్తాం' అని మెక్రాన్ తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు.


■ ఇరాన్‌పై ఐరోపా కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా స్పందించారు. ఇరాన్ ప్రభుత్వం తమ ప్రజలపై కొనసాగిస్తున్న దమన నీతిని వెంటనే ఆపాలని కోరారు.

మానవాళికి పెద్ద ముప్పు ఏఎంఆర్

- కేంద్ర హోంమంత్రి అమిత్‌షా



అహ్మదాబాద్: యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్(ఏఎంఆర్) మానవాళికి అతిపెద్ద ముప్పు అని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వ్యాఖ్యానించారు. రోజురోజుకు అధికమవుతున్న ఈ సవాలును ఎదుర్కొనేందుకు అనుగుణంగా నిర్దిష్ట ప్రణాళికను తయారుచేయాలని నిపుణులను ఆయన కోరారు. గుజరాత్‌లోని గాంధీనగర్‌లో ఉన్న బయోటెక్నాలజీ పరిశోధనా కేంద్రానికి చెందిన బయోకంటైన్మెంట్ ఫెసిలిటీ-బీఎస్‌ఎల్ 4కు మంగళవారం శంకుస్థాపన చేసిన ఆయన ఈ మేరకు మాట్లాడారు. ఔషధాలపై ప్రజల్లో అవగాహన అవసరమని అమిత్‌షా నొక్కిచెప్పారు. "ఏఎంఆర్ అనేది యాంటీబయోటిక్స్‌కు వ్యతిరేకంగా అభివృద్ధి చెందిన నిరోధకత. ఈ విజ్ఞానశాస్త్రాన్ని మరింత కచ్చితం, దృఢంగా చేసేందుకు పరిశోధనలు అవసరం. గర్భిణుల్లో ఏఎంఆర్ తల్లి నుంచి బిడ్డకు వ్యాపిస్తుంది. దీనిని అరికట్టేందుకు నిర్దిష్ట ప్రణాళిక అవసరం. అంటువ్యాధులను నివారించడం, భవిష్యత్తు తరాలను ఏఎంఆర్ నుంచి రక్షించడం మన లక్ష్యం. యాంటీ బయోటిక్స్‌పై కోర్సును పూర్తి చేయకపోవడం, వీటిపై అవగాహన లేకుండా వైద్యులు మందులు సిఫార్సు చేయడం. డాక్టర్ సూచనలు లేకుండా విపరీతంగా యాంటీ బయోటిక్స్‌ను వాడటం వంటివి ఈ పెనుముప్పుకు ప్రధాన కారణాలు. వీటిపై ఏఎంఆర్ అనేది వ్యక్తులకే కాదు, మొత్తం సమాజానికి తీవ్ర ముప్పు. ఇది పుణెలోని వైరాలజీ ల్యాబ్ తర్వాత రెండో అతిపెద్ద, రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేస్తున్న మొట్టమొదటి ల్యాబొరేటరీ" అని అమిత్ షా వ్యాఖ్యానించారు.



ఫ్రాన్స్ ప్రభుత్వ వ్యవసాయరంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మంగళవారం పారిస్‌లో ట్రాక్టర్లతో ఆందోళన చేస్తున్న రైతులు

ఏడాదంతా సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్

- కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెల్లడి

అహ్మదాబాద్: భారతీయుల సనాతన ధర్మాన్ని, సంస్కృతిని, ప్రజల నమ్మకాలను ఎవరూ నాశనం చేయలేరని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. వరుస దాడులు జరిగినా సోమనాథ్ ఆలయం ఎప్పటికప్పుడు పునర్ నిర్మితమైందని గుర్తుచేశారు. భారతీయ ఆత్మను ఉజ్వలింపజేసేలా ఈ ఏడాదంతా సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ కొనసాగుతుందని షా తెలిపారు. దేశమంతటా వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. దాడులు చేసిన వారంతా కాల గమనంలో గతించిపోయారని. . ఆలయం మాత్రం దేదీప్యమానంగా వెలుగుతోందన్నారు. గుజరాత్‌లోని తన స్వస్థలం మానసా పట్టణంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన అనంతరం అమిత్ షా మాట్లాడారు. "స్వాతంత్ర్యం తర్వాత సోమనాథ్ ఆలయ పునర్ నిర్మాణంలో సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్, కేఎం మున్షీ, జాంనగర్ మహారాజు, తొలి రాష్ట్రపతి డా.రాజేంద్ర ప్రసాద్‌లది కీలక పాత్ర. ప్రధాని మోదీ సోమనాథ్ కారిడార్‌ను ఏర్పాటు చేసి భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించారు. సోమనాథ్‌పై జరిగిన దాడులు మన నమ్మకం మీద, ధర్మం మీద, ఆత్మగౌరవం మీద జరిగిన దాడులు. వాటికి సమాధానం ప్రతి దాడి కాదు. మన ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడమే సరైన జవాబు" అని అమిత్ షా పేర్కొన్నారు.

మధుమేహానికి హెర్బల్ పానీయం

ఈటీవీ భారత్: మధుమేహం నేడు ప్రపంచ సమస్యగా మారింది. భారత్‌లో 10 కోట్లమందికి పైగా ఈ వ్యాధితో బాధపడుతున్నట్లు అంచనా. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో గల జీవాజీ విశ్వవిద్యాలయ మైక్రోబయాలజీ విభాగం గెస్ట్ ఫ్యాకల్టీ సభ్యురాలు డాక్టర్ రూపాలీదత్ ఈ సమస్యకు సహజ పరిష్కారంగా హెర్బల్ పానీయాన్ని రూపొందించినట్లు వెల్లడించారు. తన ఏడేళ్ల పరిశోధన రక్తంలో చక్కెర స్థాయుల నియంత్రణకు ఉపయోగపడుతుందని తెలిపారు. "బొప్పాయి ఆకులను పులియబెట్టడం ద్వారా ఈ పానీయాన్ని తయారుచేశాం. పేర్లు నమోదు చేసుకొన్న 500 మంది మధుమేహ రోగుల నుంచి 90 మందిని ఎంపిక చేసుకొని మూడు నెలల పాటు ఈ పానీయం ఉదయం పరగడుపున, సాయంత్రం ఇచ్చాం. వారి రక్తంలో చక్కెర స్థాయులు గణనీయంగా తగ్గాయి. కాలేయం, కిడ్నీలు, ఆక్సీకరణ ఒత్తిడి సమస్యలకు కూడా ఇది చక్కటి పరిష్కారంగా తేలింది" అని రూపాలీదత్ వివరించారు. ఈ పానీయంపై జాతీయస్థాయి మేధోసంపత్తి హక్కుల (పేటెంట్) కోసం దరఖాస్తు చేసి, ఆన్‌లైను ద్వారా ఆమోదం పొందిన ఆమె ధ్రువపత్రం కోసం ఎదురుచూస్తున్నారు.



పోలీస్ స్టేషన్‌లోనే భార్యపై భర్త కాల్పులు




లఖ్‌నవూ: ప్రియుడితో వెళ్లిపోయిందన్న కోపంతో రగిలిపోయిన ఓ భర్త ఏకంగా పోలీస్ స్టేషన్‌లోనే భార్యపై కాల్పులు జరిపాడు. రహస్యంగా తెచ్చుకున్న నాటు తుపాకీ తీసి పోలీసుల సమక్షంలోనే భార్యను కాల్చి చంపాడు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని హర్దోయ్ జిల్లాలో సోమవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం. . రామాపుర్ గ్రామానికి చెందిన అనూప్, సోనీ (30)లకు 17 ఏళ్ల క్రితం వివాహమైంది. షాజహాన్‌పుర్‌కు చెందిన సుర్జీత్ అనే వ్యక్తితో సోనీకి పరిచయం ఏర్పడింది. ప్రియుడితో కలిసి ఆమె ఈ నెల 7న ఇంటినుంచి వెళ్లిపోయింది. అనూప్ ఫిర్యాదు మేరకు పోలీసులు రంగంలో దిగి సోనీని ఆదివారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మరుసటిరోజు ఆమెను వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి తీసుకువెళ్లేందుకు సిద్ధమవుతుండగా... పలువురు బంధువులతో కలిసి అనూప్ అక్కడకు వచ్చారు. ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. తుపాకీతో అనూప్ కాల్పులు జరిపాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు ఆమెను ఆసుపత్రికి తరలించగా... చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయింది. అనూప్‌ను పోలీసులు అరెస్టు చేసి, తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. ఘటనకు సంబంధించి ఇద్దరు కానిస్టేబుళ్లు సస్పెండయ్యారు.

వాంగ్చుక్‌పై సుప్రీం విచారణ 29కి వాయిదా



దిల్లీ: లద్దాఖ్ అల్లర్ల నేపథ్యంలో పర్యావరణ కార్యకర్త, బహుముఖ ప్రజ్ఞాశాలి సోనం వాంగ్చుక్‌ను జాతీయ భద్రతా చట్టం కింద అరెస్టుచేయడాన్ని సవాలు చేస్తూ ఆయన భార్య గీతాంజలి దాఖలు చేసిన వ్యాజ్యంపై విచారణను సుప్రీంకోర్టు ఈనెల 29కి వాయిదా వేసింది. జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ పి.బి.వరాలేల ధర్మాసనం మంగళవారం ఈ నిర్ణయం తీసుకుంది. తన భర్తను నిర్బంధించే విషయంలో సంబంధిత అధికారులు అనాలోచితంగా వ్యవహరించారని కోర్టుకు గీతాంజలి తెలియజేశారు. ఏమాత్రం సంబంధంలేని అంశాల ప్రాతిపదికన తన భర్తను నిర్బంధించారని ఆరోపించారు. లేహ్‌లో ఆయన చేసిన ప్రసంగం తీరుతెన్నులు హింసను ప్రేరేపించేలా కాక దాన్ని నిరోధించేలా ఉన్నాయని తెలియజేశారు. వాస్తవాలను వక్రీకరించి వాంగ్చుక్‌ను నేరగాడిలా చూపే ప్రయత్నం జరుగుతోందన్నారు. లద్దాఖ్ అల్లర్ల నేపథ్యంలో వాంగ్చుక్‌ను గత అక్టోబరులో అరెస్టు చేశారు. జాతీయ భద్రతా చట్టం కింద ఒక వ్యక్తిని అత్యధికంగా 12 నెలల పాటు నిర్బంధించే వీలుంది.



మకరవిళక్కు పూజల సందర్భంగా కేరళలోని శబరిమలలో మంగళవారం అయ్యప్పస్వామి దర్శనానికి భారీసంఖ్యలో తరలివచ్చిన భక్తులు



ఈనాడు



విజయవాడ 14-1-2026 బుధవారం సిటీ సంపుటి 52 . సంచిక 155

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 22 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

సహోద్యోగిగా మారుతున్న ఏఐ

40% పని అదే చేస్తోంది

- మానవ పర్యవేక్షణ తప్పనిసరి
- టెక్ రంగంపై నాస్కామ్-ఇండీడ్ నివేదిక

ఈనాడు, బిజినెస్‌బ్యూరో: సాంకేతిక రంగంలో కృత్రిమ మేధ (ఏఐ) విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోంది. ప్రస్తుతం టెక్ సంస్థల్లో దాదాపు 40% పనులు ఏఐ నిర్వహిస్తున్నట్లు పరిశ్రమ సంఘం నాస్కామ్, ఇండీడ్ సంయుక్తంగా నిర్వహించిన 'వర్క్ రీ-ఇమాజిన్డ్- ది రైజ్ ఆఫ్ హ్యూమన్-ఏఐ కొలాబరేషన్' సర్వే తెలిపింది. 2027 నాటికి నిపుణులు, ఏఐ కలిసి పనిచేసే వాతావరణాన్ని 97% మంది మానవ వనరుల విభాగాధిపతులు ఊహిస్తున్నారు. ఆటోమేషన్ పెరుగుతున్నా, నాణ్యత కాపాడేందుకు మానవ పర్యవేక్షణ తప్పనిసరి అని ఈ నివేదిక స్పష్టం చేసింది.

■ ఏఐ ఒకప్పుడు బ్యాక్-ఆఫీస్ కార్యకలాపాలకే పరిమితం అయ్యేది. ఇప్పుడు టెక్ సంస్థల్లో ఒక సహోద్యోగిగా మారిపోయింది అని నివేదిక పేర్కొంది. వివిధ విభాగాల్లో 20-40% పనులను ఏఐ నిర్వహిస్తోంది. ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ అభివృద్ధిలో దీని ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. ఏఐని కేవలం సహాయం చేసేదిగా కాకుండా, రోజువారీ నిర్ణయాల్లో భాగంగా మార్చే దిశగా అడుగులు పడుతున్నాయి. ఈ క్రమంలో ఏఐతో కలిసి పనిచేసేలా ఉద్యోగులను సిద్ధం చేయడమే ప్రత్యామ్నాయమని నాస్కామ్ పరిశోధనా విభాగం అధిపతి కేతకీ కర్ణిక్ పేర్కొన్నారు.



నాణ్యతపై ఆందోళన

యాంత్రికీకరణ వేగంగా విస్తరిస్తున్నప్పటికీ, ఏఐ ఇచ్చే ఫలితాల నాణ్యతపై పలు సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. సర్వేలో పాల్గొన్న వారిలో, సగంకంటే ఎక్కువ మంది ఏఐ రూపొందించిన పనుల్లో అసంపూర్ణత లేదా తక్కువ నాణ్యత ఉన్నట్లు గుర్తించారు. ఏఐ చేసే పనుల్లో కచ్చితత్వం, సమగ్రత కాపాడేందుకు మానవ పర్యవేక్షణ తప్పనిసరి అని నివేదిక తేల్చింది. ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌లో 45 శాతం పనులు ఏఐ ద్వారా జరుగుతుండగా, ఇంటెలిజెంట్ ఆటోమేషన్, బిజినెస్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్ వంటివి తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

నైపుణ్యాల తీరు మారుతోంది

'కృత్రిమ మేధ వల్ల ఉద్యోగాల సంఖ్య తగ్గుతోంది' అనే కంటే.. ఉద్యోగుల నుంచి సంస్థలు ఆశిస్తున్న పనితీరు మారుతోంది అని చెప్పొచ్చని ఇండీడ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ శశి కుమార్ అభిప్రాయం వ్యక్తం చేశారు. సంస్థలు, ఉద్యోగాల్లోకి వస్తున్నవారూ ఏఐతో కలిసి పనిచేసే వాతావరణానికి అలవాటు పడాల్సి ఉంటుందన్నారు. నియామక ప్రక్రియలోనూ మార్పులు వస్తున్నాయి. హైరింగ్ మేనేజర్లలో 85% మంది నైపుణ్యం ఆధారిత నియామకాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. బహుళ నైపుణ్యాలున్న అభ్యర్థుల కోసం చూస్తున్నారు.

ఏజెంట్లతో సవాళ్లు: *టెక్ రంగంలో ఏఐ ఏజెంట్లను విరివిగా వాడుతున్నారు. దాదాపు 95% సంస్థలు ఇప్పుడు వీటిని ఏదో ఒక రకంగా వినియోగిస్తున్నాయని, ఉపయోగించాలనే ఆలోచనలో ఉన్నాయని నివేదిక పేర్కొంది. డేటా ఆధారిత పనుల్లో ఇవి మనుషుల కంటే మెరుగ్గా పనిచేస్తాయని 65% మంది నమ్ముతున్నారు. అయితే కొన్ని చిక్కు సమస్యలూ ఉన్నాయి. 77% మంది భద్రత, గోప్యత అంశాలపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాత సాఫ్ట్‌వేర్ వ్యవస్థలతో ఏఐని అనుసంధానించడం, నైతిక విలువలు, మార్పు వల్ల ఉద్యోగుల ప్రతిఘటనల వంటి సవాళ్లు వస్తున్నాయని నివేదిక తెలిపింది. ఏఐతో కలిసి పనిచేసేందుకు ఉద్యోగుల సంసిద్ధతపై 40% పైగా హెచ్ఆర్ అధిపతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని నివేదిక పేర్కొంది.*



ప్రభుత్వ అధికారులపై దర్యాప్తునకు ముందస్తు అనుమతి తీసుకోవాలా?

- అవినీతి నిరోధక చట్టంలో చేర్చిన '17ఏ'పై సుప్రీం ద్విసభ్య ధర్మాసనం భిన్నాభిప్రాయం

దిల్లీ: అవినీతి నిరోధక చట్టం-1988లో చేర్చిన సెక్షన్ '17ఎ' నిబంధన రాజ్యాంగ చెల్లుబాటుపై సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం పరస్పర భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేసింది. 2018లో చట్ట సవరణ ద్వారా ఈ నిబంధనను ప్రభుత్వం చేర్చింది. దీని ప్రకారం...అవినీతి ఆరోపణలు వచ్చిన ప్రభుత్వ అధికారిపై దర్యాప్తు లేదా విచారణ జరపాలంటే సంబంధిత విభాగం నుంచి ముందస్తు అనుమతి తీసుకోవడం తప్పనిసరి. ఈ నిబంధనను సవాల్ చేస్తూ స్వచ్ఛంద సంస్థ 'సెంటర్ ఫర్ పబ్లిక్ ఇంట్రెస్ట్ లిటిగేషన్' (సీపీఐఎల్) దాఖలు చేసిన పిటిషన్‌పై ద్విసభ్య ధర్మాసనంలోని న్యాయమూర్తులు జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ కె.వి.విశ్వనాథన్ మంగళవారం భిన్నాభిప్రాయాలతో విడివిడిగా తీర్పులు వెలువరించారు.

ఆ నిబంధన రాజ్యాంగ వ్యతిరేకం: జస్టిస్ నాగరత్న

అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ '17ఎ'..రాజ్యాంగ వ్యతిరేకం, దానిని రద్దు చేయాలని జస్టిస్ నాగరత్న అభిప్రాయపడ్డారు. అవినీతి ఆరోపణలు వచ్చిన అధికారిపై దర్యాప్తు/విచారణకు ముందే అనుమతి తీసుకోవాలనే నిబంధన..ఆ చట్ట లక్ష్యానికే విరుద్ధమైనదని, దర్యాప్తును అడ్డుకోవడమేనని పేర్కొన్నారు. దర్యాప్తు అనుమతి ఇవ్వాలా వద్దా అని నిర్ణయించడానికి ప్రభుత్వ నియంత్రణలేని స్వతంత్ర సంస్థను ఏర్పాటు చేసి ఉండాల్సిందని తన తీర్పులో తెలిపారు.

అధికారుల రక్షణకు అవసరమే: జస్టిస్ విశ్వనాథన్


సెక్షన్ '17ఎ' నిబంధన రాజ్యాంగ సమ్మతమేనని, నిజాయతీపరులైన అధికారుల రక్షణకు అవసరమేనని జస్టిస్ విశ్వనాథన్ పేర్కొన్నారు. దర్యాప్తునకు అనుమతి ఇవ్వాలా వద్దా అన్నది లోకాయుక్త/లోక్‌పాల్ నిర్ణయించాలని తెలిపారు. పాలనా వ్యవహారాల్లో అధికారులు ధైర్యంగా నిర్ణయాలు తీసుకోవడానికి, ప్రతిభావంతులు ప్రభుత్వ సర్వీసుల్లోకి రావడానికి ఇది దోహదపడుతుందన్నారు.



సీజేఐ ముందుకు వ్యాజ్యం

ద్విసభ్య ధర్మాసనం ఏకాభిప్రాయానికి రాలేకపోయినందున ఈ కేసు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ ముందుకు వెళ్లనుంది. దీనిపై విచారణకు త్రిసభ్య ధర్మాసనం లేదా విస్తృత ధర్మాసనం ఏర్పాటు సీజేఐ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది.





పతంగి.. దీన్ని ఎగరేయలేమండి..



సంక్రాంతి పండగకు గాలిపటాలతో యువత చేసే సందడి అంతా ఇంతా కాదు.. ఈ సందడిని రెట్టింపు చేయాలని.. కల కాలం గుర్తుండిపోయే జ్ఞాపకంలా మార్చాలని భావించిన సూక్ష్మకళాకారుడు ఓ వినూత్న పతంగి తయారు చేశారు. హైదరాబాద్‌లోని హస్తినాపురం సంతోషిమాత కాలనీకి చెందిన డా. ముంజంపల్లి విద్యాధర్ పసిడితో అతిచిన్న గాలిపటం, చరఖా రూపొందించారు. సుమారు 13 గంటలపాటు శ్రమించి 140 మిల్లీ గ్రాముల బంగారంతో వీటిని చేశారు. ఆయన ఇప్పటికే అనేక సూక్ష్మ కళాఖండాలను తయారుచేసి ప్రశంసలు అందుకున్నారు. –న్యూస్‌టుడే, కాచిగూడ



కడియంలో 'బావ్‌బాబ్'

రంగురంగుల పూలమొక్కలకు నెలవైన తూర్పుగోదావరి జిల్లాలోని కడియం నర్సరీలు విదేశీ వృక్షాలతోనూ ఆకట్టుకుంటున్నాయి. తాజాగా యూరప్ దేశాల నుంచి ఓడలపై ఆలివ్, బావ్‌బాబ్ వృక్షాలను ప్రత్యేకంగా తెప్పించారు. సంక్రాంతి సెలవుల్లో కుటుంబాలతో కలిసి వచ్చే సందర్శకుల వీక్షణకు వీటిని ప్రత్యేకంగా సిద్ధం చేసినట్లు వ్యాపారులు తెలిపారు. – న్యూస్‌టుడే, కడియం



అక్కర్లేనివి మంటల్లో ఆనందాల భాగ్యాల్లో!

పాతవి.. పనికిరానివి.. భోగి మంటల్లో వేసేస్తాం... అలాంటివి మన ఇంట్లోనే కాదు.. మనలోనూ చాలా ఉంటాయి! ఆడంబరాల నుంచి.. అబద్ధాల వరకు.. ప్రతికూల ఆలోచనల నుంచి.. పట్టరాని కోపం వరకు.. మనలో చెడు భావాల్ని ప్రోది చేస్తుంటాయి. అందుకే ఈసారి వీటిని భోగి మంటల్లో కాల్చేయండి. ఆనందాల సందడి చేయండి.

నిజమైన మార్పు కోసం కొన్ని అలవాట్లను వదిలేయడం అత్యంత కీలకం. అలాంటివాటితో కూడిన ఈ కింది జాబితాలో మనకెన్ని వర్తిస్తాయో... వాటిలో ఏవి వదలాలో చూద్దామా?

పోలికలు



చాలామందికి ఇతరుల జీవితాలతో తమ జీవితాన్ని తూకం వేసే అలవాటుంటుంది. అన్ని విషయాల్లో వారికంటే ఉన్నత స్థానంలో ఉండాలని ఆరాటపడుతుంటారు. దీనికి ఏమాత్రం భిన్నంగా జరిగినా ఓర్చుకోలేరు. దీంతో మనశ్శాంతి దూరమవుతుంది. ఆత్మవిశ్వాసం సన్నగిల్లుతుంది. అందుకే ఇతరులతో పోల్చుకోవడాన్ని మానేద్దాం. శాంతిని చంపే ఈ అలవాటును వదిలేద్దాం!

మనల్ని మనమే తక్కువ చేసుకోవడం

మనలోని శక్తిని మనమే చిన్న చూపు చూస్తాం. 'నేను చేయలేను' అంటూ ప్రయత్నానికి ముందే ఓటమిని అంగీకరిస్తాం. మనవల్ల కాదంటూ చేతులెత్తేస్తాం. అయితే మన మాటలే మన భవిష్యత్తును నిర్ణయిస్తాయి. ప్రతి మనిషిలోనూ ఏదో ఒక ప్రత్యేకత ఉంటుంది. ఇలా మనల్ని మనం తక్కువ చేసుకోవడం వల్ల ఎన్నో అవకాశాల్ని కోల్పోయి ఉంటాం. ఇక నుంచి అవకాశాలకు మాటలతో అడ్డుకట్ట వేయడం మానేద్దాం.

ఆలస్యం..విషం

చిన్న చిన్న పనులను సైతం వాయిదా వేసేవారెందరో. ఈ అలవాటు అవకాశాలను మింగేస్తుంది. వాయిదా వేసే చిన్న పని కూడా తర్వాత భారంగా మారుతుంది. ఒత్తిడిని పెంచుతుంది. అందుకే ఈ ధోరణికి స్వస్తి పలుకుదాం.



అంత భయమెందుకు..?

రేపు ఏం జరుగుతుందో, అనుకున్న పని అవుతుందో లేదో.. ఇలా మనల్ని వేధించే ప్రశ్నలెన్నో. కలిగించే భయం ఎంతో. రాని సమస్యలకు పరిష్కారాలు వెతికే క్రమంలో మనసు అలసిపోతుంది. శక్తీ వృథా అవుతుంది. ప్రతికూల ఆలోచనలతో గందరగోళానికి గురై ప్రస్తుతాన్ని ఆస్వాదించలేం. అందుకే రేపు మరింత బాగుంటుందన్న ధైర్యంతో ముందడుగు వేద్దాం!

శక్తికి మించి సర్దుకుపోవడం




మన శక్తిని పీల్చేసే బంధాలుంటాయి. మన ప్రేమను అభిమానాన్ని వారి అవసరాలకోసం ఉపయోగించుకునే మనుషులుంటారు. బంధం పేరుతో భరించలేని బాధనిచ్చేవారుంటారు. మనల్ని ఎప్పుడూ తక్కువ చేసి మాట్లాడతారు. ఇలాంటి బంధాలను వదిలేద్దాం. ఇది స్వార్థం ఏమాత్రం కాదు. బంధంలో శాంతి, ప్రేమ, నమ్మకం, పరస్పర గౌరవం లేకుంటే వాటి నుంచి వీలైనంత త్వరగా బయటపడండి.

గతంలో జీవించడం

చాలామంది గతాన్ని తలుచుకుంటూ కుమిలిపోతుంటారు. ఆ బాధను మనతోనే మోసుకుంటూ వెళ్తే ఎలాంటి ప్రయోజనం ఉండదు. పైగా అది మన సామర్థ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. గతం ఒక పాఠం. అది మంచిదైనా.. చెడ్డదైనా.. అంగీకరిద్దాం. దాన్ని వదిలేసి ముందుకెళదాం.

నమ్రత ముఖ్యం...



అహంకారం మనల్ని ఒంటరిని చేస్తుంది. నేర్చుకునే తలుపుల్ని మూసేస్తుంది. . అన్నీ నాకే తెలుసు అనే అహంకారం ఏమాత్రం మంచిది కాదు. అందుకే ఎదుటివాళ్లు చెప్పింది వినడం అలవర్చుకుందాం. ఎదుటివారి తెలియనితనాన్ని అవహేళన చేయకుండా గౌరవంగా అంగీకరించే నమ్రత అవసరం.

సమయాన్ని వృథా చేయడం



మన సమయం బ్యాంకులో డబ్బులాంటిదే..! డబ్బు పోతే తిరిగి సంపాదించవచ్చు. కానీ గడిచిన కాలం వెనక్కిరాదు. సమయం విలువైంది. అది తెలిసిన వారు విజేతలవుతారు. గతంలో ఎంతో సమయాన్ని వృథా చేసి ఉంటాం. ఇకపై ఈ తప్పును పునరావృతం చేయొద్దు. ప్రతి నిమిషాన్నీ మన అభివృద్ధికి ఉపయోగపడేలా చూసుకుందాం. ప్రతి క్షణాన్ని అందివచ్చిన అవకాశంగా చూద్దాం!

ఆ నిర్ణయాలు...



జీవితంలో చాలా నిర్ణయాలు ఆలోచన లేకుండా, ఆ క్షణంలో వచ్చిన భావోద్వేగాల ఆధారంగా తీసుకుంటుంటాం. తాత్కాలిక సమస్యలకు శాశ్వత పరిష్కారాలు మంచిది కాదు. ఆవేశంలో తీసుకునే ఆ నిర్ణయాలు.. జీవితాన్ని అతలాకుతలం చేయొచ్చు. ఇది పశ్చాత్తాపాన్ని మిగుల్చుతుంది. కాస్త సమయం తీసుకుని నిర్ణయం తీసుకోవడం చాలా మేలు చేస్తుంది. మౌనంలో ఆలోచించి చేసిన నిర్ణయాలు సత్ఫలితాలనిస్తాయి.

సాకులు చెప్పడం

సాకులు చెప్పడం అంటే మనల్ని మనం మోసం చేసుకోవడమే. ఇవి మన కాలాన్ని వృథా చేస్తాయి. ఒకపనిని చేయలేనని చెప్పే బదులు.. ఎందుకు చేయలేను, ప్రయత్నిస్తాను అంటూ మనల్ని మనం మోటివేట్ చేసుకుందాం. పనుల నుంచి తప్పించుకోవడం మానేద్దాం. బాధ్యతలు తీసుకుందాం. ఈ లక్షణం మనకు ఎన్నో అవకాశాలను తెచ్చిపెడుతుంది. చిన్న ప్రయత్నమైనా.. పెద్ద మార్పును తెచ్చి పెడుతుంది. - ఈనాడు ప్రత్యేక విభాగం

సైకిల్ పెడల్ నేర్పుతోంది పాఠం



కరోనా సమయంలో వ్యాయామం కోసం సైక్లింగ్ అలవాటు చేసుకున్న ఓ ఉపాధ్యాయుడు మూడేళ్లుగా రోజు మార్చి రోజు సైకిల్‌పైనే పాఠశాలకు వెళ్లొస్తున్నారు. ఇందులో ప్రత్యేకత ఏంటంటే.. తన ఇంటి నుంచి ఆ బడి ఏకంగా 55 కి.మీ దూరంలో ఉంది. అయినా సైకిల్‌పైనే రాకపోకలు సాగిస్తూ.. విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. తమిళనాడులోని మదురై జిల్లా కూడల్‌కరైకి చెందిన రాబిన్ సుందర్‌సింగ్(47) మానామదురై ఎయిడెడ్ పాఠశాలలో పీఈటీగా పనిచేస్తున్నారు. కరోనాతో పాఠశాలలు మూసివేసినప్పుడు సైక్లింగ్‌తో కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి తెలుసుకున్నారు. దీంతో తన స్నేహితులతో కలసి నిత్యం కూడల్‌కరై నుంచి అలంగానల్లూర్ వరకు సైకిల్ తొక్కేవారు. కొంతకాలానికి బడులు తెరుచుకోవడంతో విధులకు సైకిల్‌పైనే వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఇంటి నుంచి ఉదయం 5.30 గంటలకు బయలుదేరి 8.30 గంటలకు పాఠశాలకు చేరుకుంటున్నారు. తిరుగు ప్రయాణంలోనూ ఆయన ఇలాగే వెళ్తున్నారు. తనని చూసి స్ఫూర్తి పొందిన 50 మంది విద్యార్థులు సైకిల్‌పైనే బడికి వస్తుండటం విశేషం. 'ఉదయం, సాయంత్రం కలిపి 110 కి.మీ దూరం సైకిల్ తొక్కుతున్నందున రోజు మార్చి రోజు వెళ్తున్నాను. సలహాలివ్వడం కన్నా ఆచరిస్తేనే విద్యార్థులు కూడా అనుసరిస్తారు' అని సుందర్‌సింగ్ చెబుతున్నారు. – న్యూస్‌టుడే, చెన్నై (విల్లివాక్కం)



దారం లేని గాలిపటం

సంక్రాంతి వేళ దేశవ్యాప్తంగా పతంగులు ఆకాశంలో విహారం చేస్తున్నాయి. 'ఎగిరే గాలిపటానికి దారం ఆధారం' అని పాడుకునే పాత రోజులు కాలగతిలో కలిసిపోయే రోజులు వచ్చాయి. గుజరాత్‌లోని సూరత్‌కు చెందిన యువ ఇంజినీరు విక్కీ వఖారియా తన మిత్రబృందంతో కలిసి దారంతో, గాలివాటంతో పని లేని గాలిపటాన్ని తయారు చేశారు. ఇది రిమోట్ కంట్రోల్‌తో ఎగిరే రోబోటిక్ పతంగి. దీన్ని గాల్లో గింగిరాలు కూడా తిప్పవచ్చు. రాత్రి సమయాల్లో రంగురంగుల ఎల్ఈడీ దీపాల వెలుగులను విరజిమ్ముతుంది. దీనిని భారత్‌లోని అంతర్జాతీయ పతంగుల వేడుకతోపాటు ఇండోనేసియా, సింగపూర్, చైనాల్లోనూ విక్కీ బృందం ప్రదర్శించి బహుమతులు గెలుచుకుంది. నాలుగు డిజైన్లలో మొత్తం 15 గాలిపటాలు తయారు చేశామని, ఒక్కోదానికి రూ. 40 వేల నుంచి రూ. 45 వేల వరకు ఖర్చయినట్లు విక్కీ తెలిపారు. –ఈటీవీ భారత్



గురివింద.. బాగుందా..!



ఎర్రగా అందంగా కనిపిస్తున్న ఇవి గురివింద గింజలు. నల్లమల అటవీ ప్రాంతంలో మొత్తం 9 రకాల గురివింద గింజలు లభ్యమవుతాయి. గిరిజనులు వీటిని సేకరించి దోర్నాల, ఒంగోలు, శ్రీశైలం తదితర ప్రాంతాల్లో అమ్ముతారు. గురివింద గింజలను పేస్టు చేసి కీళ్లనొప్పులకు వాడతారని వీరు చెబుతున్నారు. – ఈనాడు, ఒంగోలు



పుట్ట 'గొడుగు'

గొడుగులా కనిపిస్తున్న ఈ పుట్టగొడుగు ప్రకాశం జిల్లా ఉలవపాడు మండలం కరేడు గ్రామంలోని శ్రీకృష్ణ ఆలయం వద్ద పెరిగింది. 15 సెం.మీ. వెడల్పు, కిలోకి పైగా బరువు ఉంది. ఇంత పెద్ద పుట్ట గొడుగును తాము ఎప్పుడూ చూడలేదని స్థానికులు చెబుతున్నారు. – ఈనాడు, ఒంగోలు; న్యూస్‌టుడే, ఉలవపాడు

వైఎస్ వివేకా హత్య కేసు పిటిషన్ల విచారణ 20కి వాయిదా

ఈనాడు, దిల్లీ: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో దాఖలైన వివిధ పిటిషన్ల విచారణను సుప్రీంకోర్టు ఈనెల 20వ తేదీకి వాయిదా వేసింది. మంగళవారం ఈ పిటిషన్లు జస్టిస్ ఎంఎం సుందరేష్, జస్టిస్ ఎన్‌కే సింగ్‌ల ధర్మాసనం ముందుకు విచారణకు వచ్చినప్పుడు సునీత నర్రెడ్డి తరఫున హాజరుకావాల్సిన సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వ్యక్తిగత కారణాలవల్ల హాజరుకాలేకపోతున్నందున మధ్యాహ్నం 2 గంటలకు వాటిని తీసుకోవాలని ఆయన తరఫు న్యాయవాదులు ధర్మాసనానికి విజ్ఞప్తిచేశారు. అయితే మధ్యాహ్నం నుంచి ప్రత్యేక ధర్మాసనం ఉన్నందున ఈ విచారణ సాధ్యంకాదని చెప్పి ధర్మాసనం వాటిని వచ్చే మంగళవారానికి వాయిదా వేసింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న డి.శివశంకర్‌రెడ్డి, వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్ భాస్కరరెడ్డి, గజ్జల ఉదయ్‌కుమార్‌రెడ్డి, యాదాటి సునీల్ యాదవ్, టి.గంగిరెడ్డిలకు కింది కోర్టులు ఇచ్చిన బెయిళ్లను రద్దు చేయాలని సునీతారెడ్డి, సీబీఐ దాఖలు చేసిన వేర్వేరు పిటిషన్లు ధర్మాసనం ముందుకొచ్చాయి. అలాగే ఈ కేసులో విస్తృత కుట్రను వెలికితీసేంతవరకూ సీబీఐ దర్యాప్తు జరిపేలా ఉత్తర్వులు జారీచేయాలని సునీత నర్రెడ్డి కోరినప్పటికీ హైదరాబాద్‌లోని సీబీఐ ప్రత్యేక కోర్టు కేవలం ఇద్దరి పాత్రను వెలికితీసేంతవరకే దర్యాప్తు జరపాలని సీబీఐని ఆదేశించడాన్ని సవాలు చేస్తూ ఆమె వేసిన అప్లికేషన్ కూడా ఈసారి కోర్టు ముందుకు రానుంది.

దక్షిణ భారత సైన్స్ ఫెయిర్‌కు 35 ప్రాజెక్టులు

ఈనాడు, అమరావతి: తెలంగాణలో ఈనెల 19 నుంచి 23 వరకు నిర్వహించే దక్షిణ భారత సైన్స్ ఫెయిర్‌లో ప్రదర్శించేందుకు రాష్ట్రం నుంచి 35 ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. డిసెంబరు 23, 24 తేదీల్లో విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఈ ప్రాజెక్టులను ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులు, మార్గదర్శక టీచర్లు హైదరాబాద్‌కు వెళ్లడానికి ఏర్పాట్లు చేసుకోవాలని పాఠశాల విద్యాశాఖ సూచించింది.

అధిక ఛార్జీలు వసూలు చేస్తున్న 209 ప్రైవేట్ బస్సులపై కేసులు

- రూ.19 లక్షల జరిమానా విధింపు

ఈనాడు, అమరావతి: సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు వెళ్లే వారి నుంచి అధిక ఛార్జీలు వసూలు చేస్తున్న ప్రైవేట్ బస్సులపై రవాణా శాఖ చర్యలు తీసుకుంది. 209 బస్సుల్లో ఎక్కువ ఛార్జీలు వసూలు చేసినట్లు తనిఖీల్లో గుర్తించి కేసులు నమోదు చేయడంతో పాటు రూ.19 లక్షల మేర జరిమానా విధించింది. ఇందులో అత్యధికంగా పశ్చిమగోదావరి జిల్లాలో 54 కేసులు, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 39 కేసులు, చిత్తూరు జిల్లాలో 30 కేసులు, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో 22 కేసులు నమోదు చేసింది. అలాగే ఆయా బస్సులు త్రైమాసిక పన్నులు చెల్లించాయా? వాటికి పర్మిట్లు ఉన్నాయా? వంటి వాటినీ రవాణా శాఖ అధికారులు తనిఖీలు చేయగా.. పన్నులు చెల్లించకుండా, నిబంధనలు ఉల్లంఘిస్తూ 678 బస్సులు నడుపుతున్నట్లు గుర్తించారు. వీటిపై కూడా కేసులు నమోదు చేసి, రూ.38 లక్షల మేర జరిమానా విధించారు. వీటిలో అత్యధికంగా ఎన్టీఆర్ జిల్లాలో 92 కేసులు, విజయనగరం జిల్లాలో 62 కేసులు, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో 61 కేసులు, గుంటూరు జిల్లాలో 54 కేసులు, ఏలూరు జిల్లాలో 43 కేసులు నమోదు చేశారు.

18 వరకూ తనిఖీలు: పండుగ తర్వాత ఈ నెల 17, 18 తేదీల్లో ఎక్కువ మంది తిరుగు ప్రయాణమవుతారు. దీంతో అప్పటి వరకూ ప్రైవేట్ బస్సుల్లో అధిక ఛార్జీలు వసూలు చేయకుండా తనిఖీలు కొనసాగించనున్నట్లు రవాణా శాఖ కమిషనర్ మనీష్‌కుమార్ సిన్హా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ యాప్‌లలో కూడా ఆయా బస్సులకు ఎంత ఛార్జీలు వసూలు చేస్తున్నారనేది పరిశీలిస్తున్నామని, ఆర్టీసీ నిర్దేశించిన ఛార్జీ కంటే అదనంగా 50 శాతానికి మించి ఎక్కువ ఛార్జీ ఉంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ధాన్యం సేకరణలో సరికొత్త రికార్డు

- రైతుల ఖాతాల్లో రూ.10 వేల కోట్లు జమ
- ఖరీఫ్ సీజన్‌లో 41.27 లక్షల మె.ట కొనుగోళ్లు
- మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని రైతుల మోముల్లో సంతోషాన్ని నింపి, వారు కుటుంబ సభ్యులతో సంక్రాంతి వేడుకలు వైభవంగా నిర్వహించుకునేలా కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుందని.. ఈ మేరకు ధాన్యం కొనుగోళ్ల ద్వారా ఈ ఖరీఫ్ సీజన్‌లో రూ.10 వేల కోట్లు వారి ఖాతాల్లో జమ చేసి రికార్డు సృష్టించిందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. గుంటూరు జిల్లా తెనాలిలో మంగళవారం ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా



3,572 కేంద్రాల ద్వారా 6,76,848 మంది రైతుల వద్ద నుంచి 41.27 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసిందని వివరించారు. 48 గంటల్లోగా నగదు చెల్లిస్తామన్న మాటకు అనుగుణంగా మంగళవారం నాటికి రూ.10 వేల కోట్లు జమ చేశామని, మరో వారం రోజుల పాటు ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. 78 శాతం మంది రైతులకు కేవలం నాలుగు గంటల్లోనే నగదు చెల్లింపులు చేశామని పేర్కొన్నారు. వాతావరణంలో మార్పులు, క్షేత్రస్థాయిలో గుర్తించిన సమస్యల పరిష్కారం కోసం తొలిసారిగా ధాన్యం తరలింపునకు రైళ్లను సైతం వినియోగించామన్నారు. వాస్తవాలు ఇంత పక్కాగా ఉంటే మాజీ ముఖ్యమంత్రి జగన్‌తో పాటు వైకాపా నాయకులు ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ఏదేదో మాట్లాడారని విమర్శించారు.

నకిలీ మద్యానికి చెక్ పెట్టేలా 'లిన్'

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో నకిలీ మద్యానికి, ఇతర అవకతవకలకు ఆస్కారం లేకుండా ప్రభుత్వం కొత్తగా లిక్కర్ ఐడెంటిఫికేషన్ నంబర్ (లిన్)ను ప్రవేశపెట్టింది. దీని ప్రకారం ఇకపై ప్రతి మద్యం సీసాపై బ్రాండ్, బ్యాచ్, లైన్, తయారైన తేదీ, నెల, సంవత్సరం, ఎన్ని గంటల ఎన్ని నిమిషాల ఎన్ని సెకన్లకు అది తయారైంది అన్న వివరాలతో లిన్ నంబర్ కనిపిస్తుంది. సామాన్యులు సైతం గుర్తించగలిగేలా ఈ వివరాలు ఉంటాయి. డిస్టిలరీల్లో బాటిలింగ్ చేసేటప్పుడే బ్రాండ్ లేబుల్‌పై ఈ వివరాలన్నీ తయారీదారులు తప్పనిసరిగా ముద్రించాలి. ఈ మేరకు ఎక్సైజ్ నిబంధనలు సవరిస్తూ ఆ శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్‌కుమార్ మీనా మంగళవారం వేర్వేరు ఉత్తర్వులు జారీ చేశారు. గత నెల 21న ఎక్సైజ్ అధికారులతో జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు లిన్ ప్రవేశపెట్టాలని ఆదేశించారు. తదనుగుణంగా దీన్ని తీసుకొచ్చారు.

20న వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం

ఈనాడు, అమరావతి: పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండలోని నాగేశ్వర స్వామి, మహిషాసురమర్దని, వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఉన్న.. వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి సీఎం చంద్రబాబు ఈనెల 20న పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. అమ్మవారి ఆత్మార్పణ దినం సందర్భంగా సీఎం పట్టువస్త్రాలు సమర్పిస్తారు. ఇందుకు పట్టువస్త్రాల కొనుగోలుకు రూ.20 వేలు మంజూరు చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వు జారీచేసింది.

ప్రేమతో నిండిన దేశంగా మార్చేందుకు పోరాటం

ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ

చెన్నై (విల్లివాక్కం), న్యూస్‌టుడే: భారత్‌ను ప్రేమతో నిండిన దేశంగా మార్చడానికి పోరాడుతున్నట్లు ఏఐసీసీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ పేర్కొన్నారు. తమిళనాడులోని నీలగిరి జిల్లా గూడలూర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాల స్వర్ణోత్సవాల్లో మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ సాంకేతిక యుగంలో అందరికీ అన్ని విషయాలు తెలుసుకోవాలన్న ఆసక్తి ఉంటుందని, పోటీ ప్రపంచంలో పిల్లలు సామాజిక స్పృహ, జ్ఞానం, వివేకం పెంపొందించుకోవాలని సూచించారు. దేశాన్ని ప్రేమపూరితంగా మార్చడమే తన లక్ష్యమన్నారు. విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలు సమాధానాలు ఇస్తూ.. 'తన చిన్నప్పుడు నాన్నమ్మ ఇంటి పెద్దగా వ్యవహరించారు. పురుషుల కన్నా స్త్రీలు గొప్పవారని నాన్నమ్మ చెప్పేవారు' అని రాహుల్ గాంధీ గుర్తుచేసుకున్నారు. ఇతరులపై అపవాదులు మోపేవారు తమకు తాము హాని చేసుకున్నట్టేనని విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన పొంగల్ వేడుకల్లో పొంగలి గరిటె తిప్పారు.



పొంగలి కలియబెడుతున్న రాహుల్ గాంధీ

అర్థం చేసుకుంటే... హ్యాపీడేస్!

టీనేజీ... ఉరకలు వేసే మనసు... అయితే అటు ఇటు కాని వయసు... ఈ సమయంలో కొన్ని ఉద్రిక్తతలు... ఇంకొన్ని ఉద్వేగాలు మనసును అతలాకుతలం చేస్తుంటే...వాటిని ఎదుర్కోవడం ఎలా? ఈ సమయంలో తల్లిదండ్రుల అనుభవసారాన్ని పిల్లలు.. పిల్లల మనసు చేసే గొడవను తల్లిదండ్రులు అర్థం చేసుకుంటే... అన్నీ హ్యాపీడేసే!



చదువు, సామాజిక అంచనాలు, డిజిటల్ ఉద్వేగాలతో కుర్రాళ్లలో ఆందోళన (బర్న్‌అవుట్), ఒత్తిడి పెరుగుతోంది. ఏషియన్ జర్నల్ ఆఫ్ సైకియాట్రీలో ఇటీవల ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం 70 శాతం మంది టీనేజర్లలో మధ్యస్థం నుంచి తీవ్రస్థాయి ఆందోళనలు ఉంటున్నాయి. వీరిలో కొందరు ఆత్మహత్య వంటి తీవ్రమైన నిర్ణయాలు తీసుకుంటున్నారు.

ఎందుకిలా...

- కౌమారదశలో శరీరంలో వచ్చే మార్పులను అర్థం చేసుకోలేకపోవడం... సామాజిక గుర్తింపు కోసం చేసే ప్రయత్నాలు.. డిజిటల్ ప్రభావం వారికి తెలియకుండానే మానసిక ఆందోళనలోకి నెట్టేస్తున్నాయి.
- తక్కువ నిద్ర, సామాజిక మాధ్యమాలు ఎక్కువగా చూడడం, శారీరక శ్రమ లేకపోవడం, విద్యా సంబంధ డిమాండ్ టీనేజర్లలో బర్న్‌అవుట్‌కు కారణంగా నిలుస్తున్నాయి.
- తల్లిదండ్రుల పర్యవేక్షణ లేకుండా స్క్రీన్‌లు లేదా సామాజిక మాధ్యమాలను అధికంగా వినియోగించడం వల్ల టీనేజర్లు సైబర్ బెదిరింపులకూ గురవుతున్నారు.
- ఇతరులతో మంచి సంబంధాలు లేకపోవడం, బుల్లీయింగ్ కూడా ఆందోళనకు కారణమవుతున్నాయి.
- యుక్త వయసులో హార్మోన్ల మార్పు జరుగుతుంది.. ఇవి కూడా భావోద్వేగాలను ప్రభావితం చేస్తాయి.

ఇలాఉంటే జాగ్రత్త...

- నిరంతర అలసట
- తక్కువ ఏకాగ్రత
- మూడ్ స్వింగ్స్
- ఆకలి లేకపోవడం
- తరచుగా ఒళ్లు నొప్పులు
- స్వీయ వ్యక్తీకరణ లేకపోవడంలాంటి వాటి లక్షణాలను గుర్తిస్తే తల్లిదండ్రులు, పాఠశాలలు జాగ్రత్త తీసుకోవాలి.

ఏం చేయాలి?

- టీనేజీ పిల్లల్లో ఆందోళన నివారించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఉమ్మడి కృషి అవసరం.
- భావోద్వేగాలను ఎలా నియంత్రించుకోవాలో పిల్లలకు చెప్పాలి.
- టీనేజర్ల ఒత్తిడి, ఆందోళన, బాధను గుర్తించేందుకు ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి
- సృజనాత్మక కార్యకలాపాలను ప్రోత్సహించాలి
- వ్యాయామం చేయించాలి లేదా ఆటలు ఆడించాలి.
- రోజుకు కనీసం 8గంటల నుంచి 9గంటల నిద్ర ఉండాలి.

బంధాలు... బందిఖానాలు కాకుండా!

విజయవాడకు చెందిన ఎనిమిదో తరగతి అబ్బాయి, తొమ్మిదో తరగతి అమ్మాయి ఆకర్షణకు లోనయ్యారు. రెండేళ్ల పరిచయం తర్వాత.. స్వతంత్రంగా బతుకుదామని నిర్ణయానికి వచ్చారు. ఆలోచన వచ్చిందే తడవుగా ఇంట్లో నుంచి డబ్బు తీసుకుని బస్సు ఎక్కి హైదరాబాద్ వెళ్లారు. పోలీసులు వారిని గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు.

కౌమారంలోకి అడుగుపెట్టే వయసులో.. భావోద్వేగాలను అర్థం చేసుకుని, సరైన దారిలో నడిపించే వారు లేక పిల్లలు దారితప్పుతున్నారు. ఏది మంచి? ఏది చెడు? అన్న విచక్షణ తెలీని పరిస్థితుల్లో.. వాళ్లు మంచి అనుకున్న దారిలో పయనిస్తున్నారు. అపరిపక్వ ప్రేమబంధాల్లో చిక్కుకుంటున్నారు.

కారణాలు చాలా...



- భార్యభర్తలు ఇద్దరూ ఉద్యోగాలు చేస్తున్నప్పుడు పిల్లలపై శ్రద్ధ, పర్యవేక్షణ కొరవడుతున్నాయి. ఎలా పెరుగుతున్నారు? ఎలాంటి వారితో స్నేహం చేస్తున్నారు? అన్న విషయాలు తెలుసుకోవడం లేదు. మరికొన్ని కుటుంబాల్లో తల్లిదండ్రులు నిత్యం గొడవలు పడుతుంటారు. ఈ ప్రభావం కూడా చిన్నారుల మనసులపై తీవ్రంగా ఉంటోంది.
- పిల్లలు ఫోన్లు, ట్యాబ్‌లకు బానిసలవుతున్నారు. సామాజిక మాధ్యమాలకు అతుక్కుపోతున్నారు. ఇన్‌స్టా, రీల్స్, షార్ట్స్‌తో కాలం గడిపేస్తున్నారు. ఇదే సమయంలో డిజిటల్ స్నేహాలతో దారితప్పుతున్నారు.
- ఇంట్లో పెద్దల నుంచి పొందలేని ప్రేమ, ఆప్యాయత వేరేవాళ్ల నుంచి పొందాలని ప్రయత్నిస్తున్నారు. ఇంకొందరు భావోద్వేగాలను తట్టుకునేందుకు మద్యం, గంజాయి, డ్రగ్స్‌లకు అలవాటుపడుతున్నారు.

తల్లిదండ్రులు ఏంచేయాలి..?



- పిల్లలకు భావోద్వేగ భద్రతనివ్వాలి. వారు ఏదైనా చెప్పగలిగే వాతావరణం ఇంట్లో ఉండేలా చూడాలి. ముందే తీర్పు ఇవ్వకుండా వారు చెప్పింది వినాలి.
- ఇళ్లలో అనుబంధాలు కొరవడితే... పిల్లలు ఆ లోటును బయట భర్తీ చేసుకునేందుకు ప్రయత్నిస్తారు. అందుకే పిల్లలకు సమయాన్ని కేటాయించాలి.
- అమ్మాయిలతో/అబ్బాయిలతో మాట్లాడవద్దు అని చెప్పడం కాకుండా.. భావోద్వేగ హద్దులు, పరస్పర గౌరవం, సంస్కారం, చదువు, కెరీర్ ప్రాధాన్యతను వివరించాలి.
- స్వేచ్ఛను ఇవ్వడంతో పాటు పర్యవేక్షణ కూడా ఉండాలి. సరైన నిర్ణయాలు తీసుకునేలా మార్గంచూపాలి..
- పిల్లలకు ఫోన్, ట్యాబ్ ఇవ్వాల్సి వస్తే.. వాటిపై తప్పనిసరిగా పర్యవేక్షణ, అదుపు ఉండాలి. పేరెంటల్ కంట్రోల్ టూల్స్ వాడడం మేలు.

- ఈనాడు, అమరావతి

ఈనాడు

విజయవాడ 14-1-2026 బుధవారం సిటీ సంపుటి 52 . సంచిక 155

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 22 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

పర్యాటకం పరుగులు

సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ సంక్రాంతి సంబరాల్లో మంత్రులు

ఆత్రేయపురంలో ముగిసిన జాతీయస్థాయి పడవ పోటీలు



వెయ్యి మీటర్ల డ్రాగన్ పడవ పోటీలో తలపడుతున్న జట్లు

ఈనాడు, రాజమహేంద్రవరం; న్యూస్‌టుడే, రావులపాలెం పట్టణం: రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధికి కూటమి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని, సంక్రాంతి నేపథ్యంలో ప్రత్యేక ఉత్సవాలు నిర్వహిస్తూ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు పాటుపడుతోందని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అభినందించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురంలో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ సంక్రాంతి సంబరాల ముగింపు వేడుకకు మంగళవారం ఆయన హాజరయ్యారు. ఆత్రేయపురం అంటే పూతరేకులే కాకుండా గత రెండేళ్లుగా సంక్రాంతి పడవ పోటీలూ గుర్తుకు వస్తున్నాయన్నారు. రాష్ట్ర హోంమంత్రి అనిత మాట్లాడుతూ గోదావరి తీరాన జాతీయ స్థాయి పడవ పోటీలు నిర్వహించి మన సత్తా చాటామని చెప్పారు. శాప్ ఆధ్వర్యంలో మెరికలైన క్రీడాకారులను గుర్తించి, సరైన శిక్షణతో ఒలింపిక్స్ స్థాయికి తీసుకెళ్లాలని సూచించారు. 'రెండేళ్లలో ప్రపంచస్థాయి పర్యాటక గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్‌ను మార్చుతామ'ని పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. తమ ప్రభుత్వంలో ప్రతి చోటా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహిస్తూ, కొత్త సంప్రదాయాన్ని ప్రవేశపెట్టామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. లొల్ల లాకుల వద్ద ఏర్పాటుచేసిన ఫుడ్ ఫెస్టివల్‌ను మంత్రులు పరిశీలించారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో యువతకు పతంగుల పోటీలు ప్రారంభించారు. ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం తదితరులు పాల్గొన్నారు.

పడవ పోటీల విజేత 'బండారు బలగం'

డ్రాగన్ పడవ పోటీలకు కేరళ, తమిళనాడు, తెలంగాణ, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ నుంచి 22 జట్లు హాజరుకాగా, ఆరు జట్లు సెమీ ఫైనల్స్‌కు చేరాయి. మంగళవారం తుది పోరు హోరాహోరీగా సాగింది.

- 1,000 మీటర్ల పోటీలో ప్రథమ స్థానంలో నిలిచిన బండారు బలగం జట్టు (ఏలూరు)కు రూ.2 లక్షలు, రెండో స్థానం సాధించిన పల్నాడు జట్టుకు రూ.లక్ష, మూడో స్థానంలో నిలిచిన కోనసీమ జట్టుకు రూ.50 వేల నగదుతో పాటు ట్రోఫీలను కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ చేతులమీదుగా అందించారు.
- 500 మీటర్ల పోటీలో ఎర్రకాలువ జట్టు (జంగారెడ్డిగూడెం) విజేతగా నిలవగా రూ.70 వేలు, రెండో స్థానంలో నిలిచిన కర్నూలు బృందానికి రూ.50 వేలు, మూడో స్థానం సాధించిన పల్నాడు-2కు రూ.30 వేల చొప్పున పారితోషికాన్ని, ట్రోఫీలను అందించారు.





1,000 మీటర్ల విభాగంలో మొదటి స్థానం పొందిన బండారు బలగం, 500 మీటర్లలో విజేత ఎర్రకాలువ జట్లకు ట్రోఫీ అందిస్తున్న కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఎంపీ హరీష్‌మాథుర్, ఎమ్మెల్సీ రాజశేఖరం, చిత్రంలో ఎమ్మెల్యే సత్యానందరావు తదితరులు

హరిత ఇంధన ఉత్పత్తికి పచ్చజెండా

కాకినాడ వాకలపూడిలో రూ.10వేల కోట్లతో ప్లాంటు • 17న సీఎం చేతులమీదుగా శంకుస్థాపన

ఈనాడు, కాకినాడ: కాకినాడలో మరో భారీ పరిశ్రమ రాబోతోంది. గ్రీన్‌కో గ్రూప్‌నకు చెందిన ఏఎం గ్రీన్ అమ్మోనియా సంస్థ హరిత ఇంధన ఉత్పత్తికి ఏర్పాట్లు చేస్తోంది. వాకలపూడి సమీపంలో మూతపడిన నాగార్జున ఫెర్టిలైజర్స్ కంపెనీ (ఎన్ఎఫ్‌సీఎల్) ప్లాంట్ భూములను 2024లో కొనుగోలు చేసింది. ఇక్కడ గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి చేయనుంది. జర్మనీకి చెందిన యూనిపర్ గ్లోబల్ కమోడిటీస్‌తో ఒప్పందం చేసుకుంది. ఈ నెల 17న సీఎం చంద్రబాబు చేతుల మీదుగా శంకుస్థాపన జరిగే అవకాశముందని అధికారవర్గాలు తెలిపాయి.

ఏడాదికి టన్ను ఉత్పత్తి సామర్థ్యం

ఏఎం గ్రీన్ రూ.10,760 కోట్ల పెట్టుబడితో కాకినాడలో హరిత అమ్మోనియా ప్లాంట్ ఏర్పాటుకు ముందుకొచ్చింది. గ్రీన్ అమ్మోనియాను ఎరువుల తయారీతో పాటు షిప్పింగ్ ఇంధనంగానూ వినియోగిస్తారు. తొలిదశలో ఏడాదికి టన్ను ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్‌ను ప్రారంభిస్తారు. 2030 నాటికి ఏడాదికి 5 టన్నులకు విస్తరించనున్నారు. ఏడాదికి టన్ను గ్రీన్ హైడ్రోజన్ కూడా ఉత్పత్తి చేయనున్నారు. ఈ ఏడాది నుంచే ఉత్పత్తి ప్రారంభించాల్సి మార్కెట్ అన్వేషణకు జాప్యం జరిగింది. తాజాగా జర్మనీ కంపెనీతో ఒప్పందం చేసుకుంది. సంస్థ ద్వారా 1,100 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.



ఏపీకి వెళ్లేందుకు ఊహూ..

క్యాంపు కార్యాలయాల పేరుతో హైదరాబాద్‌లోనే ఉండేలా ఏర్పాట్లు చేసుకుంటున్న ఉన్నతాధికారులు

కృష్ణాబోర్డు, పోలవరం అథారిటీ రాష్ట్రానికి వచ్చేది ఎప్పుడో?

ఈనాడు, అమరావతి: రాష్ట్ర విభజన జరిగి దశాబ్దం దాటినా రెండు ప్రధాన కార్యాలయాలు ఇప్పటికీ రాష్ట్రానికి తరలిరావడం లేదు. కృష్ణానదీ యాజమాన్య బోర్డు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ ఇప్పటికీ హైదరాబాద్ కేంద్రంగానే పని చేస్తున్నాయి. ఇప్పుడు తరలింపునకు కొన్ని ఏర్పాట్లు జరిగినా ఆ సంస్థల 'పెద్దలు' కొన్ని తూట్లు పొడిచేలా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. కృష్ణాబోర్డు ఛైర్మన్‌తోపాటు ఒక డివిజన్‌ను హైదరాబాద్‌లోనే ఉండేలా చూసుకొని మిగిలిన కార్యాలయాన్ని అమరావతికి తరలించాలనే కొత్త ప్రతిపాదన రూపొందించారు. అదే విధంగా పోలవరం ప్రాజెక్టు అథారిటీ సీఈవో హైదరాబాద్‌లోనే ఉంటూ మిగిలిన కార్యాలయాన్ని రాజమహేంద్రవరం తరలించాలని యోచిస్తున్నారు. ఈ మేరకు కేంద్ర జల శక్తికి ప్రతిపాదనలు పంపుతున్నట్లు తెలిసింది.

పోలవరం అథారిటీలోనూ అదే శైలి...

పోలవరం ప్రాజెక్టు అథారిటీ సీఈవో కార్యాలయం సైతం ఇప్పటికీ హైదరాబాద్‌లోనే ఉంది. ఒక చీఫ్ ఇంజినీరు ఆయనతో పాటు కొందరు సిబ్బందిని మాత్రమే రాజమహేంద్రవరం కార్యాలయానికి తరలించారు. పోలవరం అథారిటీని రాజమహేంద్రవరం తరలిస్తామని కేంద్ర అధికారులు చాలా కాలంగా చెబుతూనే ఉన్నారు. పోలవరం అథారిటీ సమావేశాల్లో కూడా ఈ అంశం చర్చకు వస్తోంది. అక్కడ దాదాపు రూ.3 లక్షల అద్దె చెల్లిస్తూ ఒక భవనం కూడా తీసుకున్నారు. అందులో ప్రస్తుతం డిజైన్లకు సంబంధించిన చీఫ్ ఇంజినీరు కార్యాలయం మాత్రమే ఏర్పాటైంది. కేంద్ర జలశక్తి కార్యదర్శి ఇప్పటికే పోలవరం అథారిటీని రాజమహేంద్రవరం తరలించాలని మౌఖికంగా ఆదేశాలు కూడా జారీ చేశారు. పోలవరం ప్రాజెక్టుకు హైదరాబాద్‌కు ఎలాంటి సంబంధమూ లేదు. ఏప్రిల్ నుంచి పూర్తిస్థాయిలో పోలవరం అథారిటీని రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేయాలని ఉన్నతస్థాయి అధికారుల నుంచి ఆదేశాలు ఉన్నాయి. అయితే అథారిటీ కార్యాలయాన్ని రాజమహేంద్రవరం తరలించాల్సి వచ్చినా సీఈవో క్యాంపు కార్యాలయం పేరుతో హైదరాబాద్‌లో ఉండేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

కృష్ణాబోర్డు ఛైర్మన్ రారట!

రాష్ట్ర విభజన తరవాత రెండు తెలుగు రాష్ట్రాల నదీ జలాల అంశాలు పర్యవేక్షించేందుకు కృష్ణా, గోదావరి నదీ యాజమాన్య బోర్డులు ఏర్పాటయ్యాయి. కృష్ణా బోర్డు ఆంధ్రప్రదేశ్‌కు, గోదావరి బోర్డును తెలంగాణకు కేటాయించారు. రాష్ట్ర విభజన జరిగి 11 ఏళ్లు దాటినా ఇప్పటికీ కృష్ణా బోర్డు తరలింపు ప్రక్రియ పూర్తి కాలేదు. జగన్ ప్రభుత్వం విశాఖకు తరలించాలని ప్రతిపాదించినా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ కార్యాలయాన్ని అమరావతికి తరలించాలని అధికారులు కేంద్ర జలశక్తిశాఖను కోరారు. విజయవాడ లేదా చుట్టుపక్కల ప్రాంతాల్లో కృష్ణా బోర్డు కార్యాలయం ఏర్పాటుకు ప్రయత్నాలు జరిగాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లోని జలసౌధలో ఉచిత వసతి కృష్ణా బోర్డుకు ఉంది. విజయవాడలో కూడా ఉచిత వసతి అవసరమని బోర్డు ప్రతిపాదిస్తోంది. కృష్ణా బోర్డు అధికారులు, స్థానిక అధికారులు కలిసి మూడు చోట్ల కార్యాలయ భవనాలు పరిశీలించారు. గన్నవరం సమీపంలో ఉన్న మేధా టవర్స్, మంగళగిరిలో ఉన్న ఒక ప్రైవేటు భవనం, దుర్గగుడి ఎదురుగా ఉన్న జలవనరులశాఖ మోడల్ హౌస్‌లు పరిశీలించారు.. విజయవాడ (గవర్నర్‌పేట)లో ఉన్న జలసౌధ సొంత భవనంలోనే ఒక ఫ్లోర్ ఏర్పాటు చేస్తే బాగుంటుందనే అభిప్రాయమూ ఉంది. జలసౌధ ఇతర కార్యాలయాలు వేరే చోట సర్దుబాటు చేసి కృష్ణాబోర్డు ప్రధాన కార్యాలయాన్ని విజయవాడకు తరలించవచ్చు. అయితే కృష్ణా బోర్డును విజయవాడకు తరలించినా బోర్డు ఛైర్మన్ మాత్రం హైదరాబాద్‌లో ఉండేలా ఒక కొత్త ప్రతిపాదనను తీసుకువచ్చారు. క్యాంపు కార్యాలయం ఒకటి హైదరాబాద్‌లో ఉంచుతూ ఒక డివిజన్ అక్కడే ఉంచాలన్నది ప్రతిపాదన. క్యాంపు కార్యాలయం హైదరాబాద్‌లో ఉంటున్నందున ఛైర్మన్ ఎక్కువ రోజులు అక్కడే ఉండేందుకు వెసులుబాటు ఉంటుంది. ఇలా అక్కడి నుంచే విధులు నిర్వహించే ఏర్పాట్లు చేసుకుంటున్నారు. హైదరాబాద్‌లో చాలా కాలంగా నివాసం ఉంటూ అక్కడ డిప్యుటేషన్‌పై పని చేస్తున్న ఏపీ అధికారులు కొందరు కూడా బోర్డు తరలింపునకు(విజయవాడకు) ఇష్టపడటం లేదు. వారు సైతం ఛైర్మన్, ఒక డివిజన్ అక్కడే ఉండేలా చూసుకునేందుకు మద్దతు పలుకుతున్నారు.

కృష్ణమ్మ జలాలు వెంకన్న చెంతకు చేరేలా..!

(మొదటి పేజీ తరువాయి)

రహదారిని ప్రారంభించారు. రూ.4.27 కోట్లతో నిర్మించిన విద్యుత్తు ఉపకేంద్రం, నారావారిపల్లె సీహెచ్‌సీలో సంజీవని ప్రాజెక్టు, నైపుణ్య శిక్షణ భవనాన్ని ప్రారంభించారు. తిరుపతిలోని రుయా ఆసుపత్రి ఆవరణలో రోగుల సహాయకుల వసతిభవనం, ఎస్వీయూలో బాలుర, బాలికల వసతిగృహాలను వర్చువల్‌గా ప్రారంభించారు. ఎస్వీయూలో ప్రయోగశాల, అకడమిక్ భవనం రెండో అంతస్తు, ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 'సంజీవని' ప్రాజెక్టును చిత్తూరు జిల్లాకు విస్తరిస్తున్నట్లు సీఎం ప్రకటించారు. సోమవారం రాత్రి కుమారుడు, మంత్రి నారా లోకేశ్‌తో కలిసి స్వగ్రామం నారావారిపల్లెకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం గ్రామంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో కుటుంబసభ్యులతో కలిసి పాల్గొన్నారు.

దేవాంశ్, ఆర్యవీర్ ఆటలు చూసి మురిసి

నారావారిపల్లెలోని మైదానంలో 'శాప్' ఆధ్వర్యంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు 14 రకాల క్రీడాపోటీలు నిర్వహించారు. సమీప గ్రామాల నుంచి 74మంది విద్యార్థులు పాల్గొన్నారు. మంత్రి లోకేశ్, బ్రాహ్మణిల కుమారుడు దేవాంశ్, విశాఖ ఎంపీ శ్రీభరత్, తేజస్వినిల కుమారుడు ఆర్యవీర్ వారితో కలిసిపోయారు. కుర్చీలాట, లెమన్ అండ్ స్పూన్, గోనెసంచితో నడక తదితర పోటీల్లో దేవాంశ్, ఆర్యవీర్ పాల్గొన్నారు. పోటీలు జరిగినంత సేపు చంద్రబాబు, భువనేశ్వరి, లోకేశ్, బ్రాహ్మణి, నందమూరి వసుంధర ఉల్లాసంగా కనిపించారు. విజేతలకు చంద్రబాబు, భువనేశ్వరి బహుమతులు పంపిణీ చేశారు. శ్రీభరత్, తేజస్విని పోటీలు, బహుమతుల ప్రదానోత్సవాన్ని వీడియో తీశారు. అంతకుముందు తితిదే కల్యాణ మండపం ప్రాంగణంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించగా ముఖ్యమంత్రి దంపతులు, బ్రాహ్మణి పరిశీలించారు.



నందమూరి వసుంధర, నారా లోకేశ్, బ్రాహ్మణి, ఎమ్మెల్యే పులివర్తి నానిలతో కలిసి పిల్లల ఆటలపోటీలు చూస్తున్న చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు

అర్జీలు స్వీకరించి

సీఎం చంద్రబాబు తొలుత ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. నారావారిపల్లె, కందులవారిపల్లె గ్రామస్థులను ఆప్యాయంగా పలకరించారు. భువనేశ్వరి మహిళలతో ముచ్చటించారు.

'కేర్ అండ్ గ్రో'కు ప్రశంసలు: నారావారిపల్లెలో ప్రకృతి వ్యవసాయ, చిరుధాన్యాల స్టాళ్లను సీఎం చంద్రబాబు పరిశీలించారు. అంగన్వాడీ చిన్నారుల్లో శారీరక, మానసిక లోపాలను గుర్తించి సరిదిద్దే 'కేర్ అండ్ గ్రో' కార్యక్రమాన్ని ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా పిల్లలను ఆప్యాయంగా పలకరించారు. గతంలో పశువులు 30 శాతమే చూలు కడుతుండగా 'ఎద క్రమబద్ధీకరణ' ప్రాజెక్టుతో అది 63 శాతానికి పెరిగిందని ముఖ్యమంత్రికి కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. కార్యక్రమాల్లో చంద్రబాబు సోదరి హైమావతి, ఎస్పీ సుబ్బరాయుడు, చంద్రగిరి, శ్రీకాళహస్తి, తిరుపతి ఎమ్మెల్యేలు పులివర్తి నాని, బొజ్జల సుధీర్‌రెడ్డి, ఆరణి శ్రీనివాసులు, శాప్ ఛైర్మన్ రవినాయుడు, తుడా ఛైర్మన్ దివాకర్‌రెడ్డి, మీడియా సమన్వయకర్త శ్రీధర్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.



లెమన్ అండ్ స్పూన్ ఆటలో నారా దేవాంశ్, ఆర్యవీర్



క్రీడల్లో పాల్గొన్న చిన్నారులతో చంద్రబాబు, భువనేశ్వరి

గ్రహం అనుగ్రహం


14-1-2026 బుధవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; హేమంత రుతువు, పుష్యమాసం, బహుళపక్షం
ఏకాదశి: సా. 6-03 తదుపరి ద్వాదశి
అనూరాధ: తె. 3-38 తదుపరి జ్యేష్ఠ
వర్జ్యం: ఉ. 7-14 వరకు
అమృత ఘడియలు: సా. 4-07 నుంచి 5-53 వరకు
దుర్ముహూర్తం: ఉ. 11-46 నుంచి 12-31 వరకు
రాహుకాలం: మ. 12-00 నుంచి 1-30 వరకు
సూర్యోదయం: ఉ.6.38; సూర్యాస్తమయం: సా.5.40
భోగి పండగ, మకర సంక్రమణం రాత్రి 9-11

చలి పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
విజయనగరం	14.0	27.0
శ్రీకాకుళం	16.0	27.0
రాజమహేంద్రవరం	17.0	34.0
నిజామాబాద్	17.7	31.1
కడప	19.0	29.0
తాడేపల్లిగూడెం	19.0	31.0
అనంతపురం	19.1	32.3
విశాఖపట్నం	19.4	29.0
ఖమ్మం	19.4	32.8
సూర్యాపేట	20.0	30.0
గుంటూరు	20.0	31.0
మహబూబ్‌నగర్	20.5	33.2
హైదరాబాద్	20.6	30.3
విజయవాడ	21.4	30.7
కర్నూలు	21.4	33.0
నరసాపురం	21.7	32.0
తిరుపతి	21.8	30.3
నెల్లూరు	22.4	30.7
ఒంగోలు	23.0	31.5

ఇదీ సంగతి!



మీరెప్పుడు శక్తిమంతులుగా మారతారంటే..



మీరు నిజంగా ఎప్పుడు శక్తిమంతులుగా మారతారో తెలుసా..? మీ జీవితానికి మీరే జవాబుదారులని, మిమ్మల్ని కాపాడేందుకు ఇతరులెవరూ రారని స్పష్టంగా అర్థం చేసుకున్నప్పుడు! ఎవరిపైనా ఆధారపడకుండా మీ పనులు మీరే చేసుకోవడం మొదలుపెట్టినప్పుడు!!
– కఖోజా, ఇన్‌ఫ్లుయెన్సర్

భోగి మంటలు కొత్త వెలుగులు తేవాలి

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్ష

ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు భోగి శుభాకాంక్షలు తెలిపారు. 'దేదీప్యమానంగా వెలిగే భోగి మంటలు మీకు, మీ కుటుంబానికి కొత్త వెలుగులు తేవాలి. ఆశావహ దృక్పథంతో సాగే మీ ఆలోచనలు సాకారం కావాలి. అందుకు అండగా ఉంటా. మీ జీవితం భోగభాగ్యాలతో తులతూగాలని ఆకాంక్షిస్తున్నా. సంక్రాంతి ముగ్గులతో అలరారుతున్న తెలుగు లోగిళ్లలో భోగి పండగ జరుపుకొంటున్న ప్రతి ఒక్కరికీ శుభాకాంక్షలు' అని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో మంగళవారం పోస్ట్ చేశారు.

నీట్ పీజీ కటాఫ్ మార్కుల తగ్గింపు

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: నీట్ పీజీ-2025 ప్రవేశ పరీక్ష కటాఫ్ మార్కులను నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ తగ్గించింది. జనరల్/ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో 7 పర్సంటైల్‌కు తగ్గించింది. అంటే... 800 మార్కులకు గాను 103 మార్కులు, జనరల్ పీడబ్ల్యూబీడీ విభాగంలో 5 పర్సంటైల్.. అనగా 90 మార్కులు, ఎస్సీ/ఎస్టీ/ఓబీసీ కేటగిరీలో 0 పర్సంటైల్‌కు అంటే... మైనస్ 40 మార్కులు వచ్చిన వారిని అర్హులుగా ప్రకటించింది.

సై అంటే సై.. బరిలోకి దూకండోయ్!

ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల్లో కోడి పందాలకు ముమ్మర ఏర్పాట్లు



కృష్ణా జిల్లా గన్నవరం మండలం కేసరపల్లిలో బరి..



సందర్శకులు వీక్షించడానికి కుర్చీలు

ఈనాడు- ఏలూరు, అమరావతి; న్యూస్‌టుడే-తాళ్లరేవు: సంక్రాంతి సందర్భంగా కోడి పందేలు వేయడానికి, వీక్షించడానికి వచ్చే వారి కోసం బరులు ముస్తాబయ్యాయి. తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, కృష్ణా జిల్లాల్లో ఫైవ్ స్టార్ హోటళ్ల తరహాలో ఏర్పాట్లు చేశారు. బరుల స్థాయికి అనుగుణంగా డ్రోన్లతో పర్యవేక్షణ, వీఐపీ, వీవీఐపీ లాంజ్‌లు, డిజిటల్ తెరలు, ఫ్లడ్‌లైట్ల వంటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. ఏలూరు సమీపాన దుగ్గిరాల, మీర్జాపురం, భీమవరం, ఉండి, సీసలి ప్రాంతాల్లో అతిపెద్ద బరులు ఆహ్వానం పలుకుతున్నాయి, ఇక్కడకు వచ్చే ప్రముఖులకు చికెన్, మటన్, రొయ్యలతో పాటు గోదావరి ప్రత్యేక వంటకాలు రుచి చూపించటానికి ఆయా ప్రాంతాల్లో ప్రసిద్ధికెక్కిన వంట మాస్టర్లను రప్పించారు. సేద తీరడానికి కారవాన్లు, కంటెయినర్లు సిద్ధం చేశారు. బరుల్లో కోడి పందేలు, గుండాట, కోతాట, ఇతర జూద ఆటలకు వేర్వేరుగా ఏర్పాట్లు ఉన్నాయి. చాలా బరుల్లో జనాలను నియంత్రించడానికి ప్రత్యేక పాస్‌లు, బౌన్సర్ల వ్యవస్థను ఏర్పాటు చేశారు. కోనసీమ జిల్లా అమలాపురం మండలం కామనగరువులో పండగకు ముందే పందెం కోళ్లు కత్తులు దూశాయి. మంగళవారం ఐదు కోళ్లకు కత్తులు కట్టి రింగ్ పందెం నిర్వహించగా సందర్శకులు తరలివచ్చారు.



పశ్చిమగోదావరి జిల్లా పెద అమిరంలో ఇలా..



కొడితే బుల్లెట్ తగలాల్సిందే!

కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం ఇంజరం పంచాయతీ గోపులంకలో రెండు జట్లు మధ్య పది పందేలు నిర్వహిస్తారు. ఆరు పందేలు గెలిచిన వారికి బుల్లెట్ బండి బహుమతిగా ఇవ్వనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు.



ఇరాన్ ప్రభుత్వానికి అనుకూలంగా టెహ్రాన్‌లో నిర్వహించిన ర్యాలీకి భారీ సంఖ్యలో హాజరైన ప్రజలు



ప్రభుత్వానికి వ్యతిరేకంగా టెహ్రాన్‌లో ఆందోళన చేస్తున్న నిరసనకారులు

ఇరాన్ రక్తసిక్తం

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ ఒత్తిడితో టెహ్రాన్ గ్రాండ్ బజార్‌లోని దుకాణాలు మంగళవారం తెరుచుకున్నాయి. అయితే కస్టమర్లు పెద్దగా కనిపించలేదు.

- అమెరికా సైనిక చర్యకు దిగుతుందనే ఆందోళన చాలా మందిలో కనిపిస్తోంది. మరోవైపు ఆందోళనలు కొనసాగుతున్నాయి.
- స్టార్‌లింక్ డిష్‌ల కోసం ఉత్తర టెహ్రాన్‌లో భద్రతా బలగాలు ఇళ్లను జల్లెడ పడుతున్నాయి.
- ప్రభుత్వ అనుకూలురు సోమవారం వీధుల్లో భారీ ప్రదర్శనలు నిర్వహించారు.
- ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడంపై తమ దేశంలోని ఇరాన్ రాయబారికి ఫిన్లాండ్ సమన్లు జారీ చేసింది.
- తమ దౌత్యవేత్తలు, రాయబారులను బ్యాన్ చేస్తామని ఐరోపా పార్లమెంటు ప్రకటించడంపై ఇరాన్ విదేశాంగశాఖ మంత్రి అబ్బాస్ అరాగ్చీ మండిపడ్డారు. ప్రతిచర్య తప్పదని హెచ్చరించారు. ఈయూతో శత్రుత్వాన్ని కోరుకోవడం లేదని స్పష్టం చేశారు.

ఇరాన్ అధికారులతో ట్రంప్ సమావేశాల రద్దు

అర్థరహిత హత్యలను ఆపేవరకూ ఇరాన్ అధికారులతో తాను సమావేశం కాబోనని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఇరాన్ అధికారులతో తాను అన్ని సమావేశాలను రద్దు చేసుకుంటున్నానని మంగళవారం వెల్లడించారు. ఇరాన్‌లో మరణాలపై అధికారిక వివరాలు అందిన వెంటనే ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారు. 'ఇరాన్ పోరాటయోధులారా.. పోరాటాన్ని కొనసాగించండి. సంస్థలను ఆధీనంలోకి తీసుకోండి. మీకు అందనున్న సాయం దారిలో ఉంది' అని పేర్కొన్నారు. అది ఏ సాయమనే వివరాలను ఆయన వెల్లడించలేదు. ఇరాన్‌పై దాడులు చేస్తామని గతంలో ఆయన చెప్పిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

అమెరికాకు సమాచారం ఇస్తున్నాం: ఇరాన్

ఇరాన్‌లో ఆందోళనలకు సంబంధించి ఎప్పటికప్పుడు అమెరికా ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ విట్‌కాఫ్‌కు సమాచారం ఇస్తున్నామని విదేశాంగశాఖ మంత్రి అరాగ్చీ తెలిపారు. 'ఆందోళనలకు ముందు.. తర్వాత, ప్రస్తుత పరిస్థితులపై వివరాలను అందిస్తున్నాం. అయితే అమెరికా ఆలోచనలు, ప్రతిపాదనలు, హెచ్చరికలు మా దేశానికి సరైనవి కావు' అని పేర్కొన్నారు.

ట్రంప్ 'ఇరాన్' సుంకం

దుబాయ్: ఇరాన్‌తో వ్యాపారం చేసే దేశాలపై 25శాతం అదనంగా సుంకాలను విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అది వెంటనే అమల్లోకి వస్తుందని సోమవారం ఆయన స్పష్టం చేశారు. భారత్‌తోపాటు బ్రెజిల్, చైనా, రష్యా, తుర్కియే, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) దేశాలు ఇరాన్‌తో వ్యాపారం చేస్తున్నాయి. ఇరాన్‌తో చర్చలకు రంగం సిద్ధమవుతోందని, అయినా అక్కడి ఆందోళనల్లో వందల మంది మరణించడంతో ఆంక్షలను అమల్లోకి తేవాల్సి వస్తోందని ట్రంప్ తెలిపారు.

- ఇరాన్‌తో వ్యాపారం చేసే అన్ని దేశాలపై 25 శాతం సుంకాలు విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించడంపై ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ స్పందించారు. 'మా దేశం శత్రువుల ముందు తలొగ్గదని పలుమార్లు చెప్పాం. ఇప్పటికైనా అమెరికా రాజకీయ నాయకులు తమ మోసపూరిత చర్యలు ఆపాలి. మా దేశానికి ద్రోహం చేస్తున్న కిరాయి వ్యక్తులపై ఆధారపడటం మానేయాలి. ఇరాన్ బలమైన, శక్తిమంతమైన దేశం. మాకు శత్రువు గురించి తెలుసు. వారిని ఎదుర్కోవడానికి మేం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాం' ఎక్స్ వేదికగా ఆయన స్పష్టం చేశారు.
- అమెరికా సుంకాల హెచ్చరికలపై చైనా మండిపడింది. ప్రతీకార చర్యలు చేపడతామని హెచ్చరించింది. 'సుంకాల యుద్ధంలో విజేతలెవరూ ఉండరు. చైనా తన చట్టబద్ధ హక్కులను. ప్రయోజనాలను కాపాడుకుంటుంది' అని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ స్పష్టం చేశారు.
- ఇరాన్‌తో భారత్‌కు వాణిజ్య, ఆర్థిక సంబంధాలు పరిమితంగానే ఉన్నాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అమెరికా తాజాగా ప్రకటించిన సుంకాలవల్ల ప్రభావం తక్కువగానే ఉంటుందని స్పష్టం చేశాయి. భారత్‌కు ఇరాన్ కీలక వాణిజ్య భాగస్వామి కాదని తెలిపాయి.





టగ్ ఆఫ్ వార్ పోటీల్లో డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా, సీపీ ఎస్.వి.రాజశేఖరబాబు, డీసీపీ కృష్ణకాంత్ పటేల్ ఇతర అధికారులు
● రెండోవైపు తాడు లాగుతున్న పోలీసు అధికారుల సతీమణులు

ఆనందాలు కురిసె.. అధికారులు మురిసె!

● పోలీసు కుటుంబాల సంక్రాంతి వేడుక

విజయవాడ (గవర్నర్‌పేట), న్యూస్‌టుడే: ముత్యాల ముగ్గులు, భోగి మంటలు, హరిదాసుల కీర్తనలు, చిన్నారుల నృత్యాలు, గంగిరెద్దుల విన్యాసాలు... వెరసి విజయవాడ నగర సాయుధ విభాగ మైదానం సంక్రాంతి శోభను సంతరించుకుంది. పోలీసు అధికారులు ఈ సంబరాల్లో పాల్గొన్నారు. నగరంలోని కానిస్టేబుల్ మొదలు డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా వరకు కుటుంబసభ్యులతో కలిసి వేడుకలో పాలుపంచుకున్నారు. పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ఎడ్లబండిపై సంబరాలకు వచ్చారు. ఇందులో భాగంగా నిర్వహించిన టగ్ ఆఫ్ వార్ పోటీలు ఆసక్తికరంగా సాగాయి. డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా, సీపీ ఎస్.వి.రాజశేఖరబాబు, డీసీపీ కృష్ణకాంత్ పటేల్ ఇతర అధికారులు ఒక వైపు.. రెండో వైపు వారి సతీమణులు పాల్గొని తాడు లాగారు. అధికారులందరూ చప్పట్లు కొడుతూ వారిని ఉత్సాహపరిచారు. పోలీసు అధికారుల చిరునవ్వుల మధ్య వారి సతీమణులు విజయం సాధించారు. అనంతరం భోగిమంటలు వెలిగించారు. గంగిరెద్దుల విన్యాసాలను తిలకించారు. హరిదాసుల కీర్తనలకు మంత్రముగ్ధులయ్యారు.

ఎన్టీఆర్ ఆరోగ్య వర్సిటీ రిజిస్ట్రార్‌గా సాయిసుధీర్



ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా కర్నూలు ప్రభుత్వ వైద్య కళాశాలకు చెందిన ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ సాయిసుధీర్‌ను నియమిస్తూ వైద్య ఆరోగ్యశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మూడేళ్ల పాటు రిజిస్ట్రార్‌గా డిప్యుటేషన్‌పై ఆయన పని చేస్తారు. ప్రస్తుత రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికా రెడ్డిని ఆమె మాతృ శాఖ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌కు తిరిగి వెళ్లాలని సూచించారు.

- సాయి సుధీర్ కర్నూలు వైద్య కళాశాలలో ఎంబీబీఎస్, ఉస్మానియాలో ఎండీ పూర్తి చేశారు. 2007 నుంచి కర్నూలు వైద్య కళాశాలలో ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగంలో అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్‌గా, 2017 నుంచి 2022 వరకు అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రొఫెసర్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2022 నుంచి కర్నూలు మెడికల్ కళాశాల ఫోరెన్సిక్ విభాగాధిపతిగా, అకడమిక్ వైస్ ప్రిన్సిపల్‌గా పని చేస్తున్నారు.


బజాజ్ ఎలక్ట్రానిక్స్
సంక్రాంతి ఆఫర్స్
IDFC FIRST Bank Always You First. CASHBACK upto ₹30,000/-*
HDB FINANCIAL SERVICES CASHBACK upto ₹21,000/-*
CASHBACK upto ₹15,000/-* BAJAJ FINSERV
HDFC BANK INSTANT DISCOUNT upto ₹8,000/-*
TVS CREDIT CASHBACK upto ₹3,000/-*
SAMSUNG
Super big Republic. Super big TV.
19 Years Global No.1 TV
Awesome India Offers* | Limited Period Only
Free* Soundbar worth up to ₹92990 (1 unit)
0 Down payment
EMI up to 30 months*
Up to 20% cashback*
Samsung Care+ starting at ₹599* only
Image simulated for representational purposes only. *T&C apply.
SONY
BRAVIA
CINEMA IS COMING HOME
Happy Makar Sankranti
SPECIAL FESTIVE OFFERS!
3 YEARS WARRANTY
INSTANT CASHBACK RS.25,000/-
UPTO 30% OFF
TV + SOUNDBAR COMBO OFFER
SAVE UPTO Rs.69,990/-
BUY NOW AT Rs.2,995/-
LG
LG OLED evo AI
LG QNED evo AI
Life's Good.
CELEBRATION OFFERS*
3 YEAR WARRANTY
26% CASHBACK Up to ₹26000
FIXED EMI Starting from ₹2999
30% OFF ON LG SOUNDBAR
LG BEST Care ₹18 per day
Haier
QLED
BIG.BOLD.BEYOND
S90 Series
100" (254cm) New
Google TV
SOUND BY KEF
CENTER MAX
25% CASHBACK
0 Down Payment
3 YEARS WARRANTY
AKAI Tokyo Japan
Every frame, vivid. Every moment, celebrated! Let's Akai
MRP ₹5,49,990/-
Special Offer Price ₹2,75,000*
QLED Model: AL100GQU-SFL
Flat Cashback upto ₹25,000*
Google TV QLED 4K
Hey Google
MEMC
Dolby VISION·ATMOS
Chromecast built-in
REFRIGERATORS
RANGE STARTS FROM ₹12,490/-*
LG SAMSUNG Haier Whirlpool IFB
WASHING MACHINES
RANGE STARTS FROM ₹14,990/-*
LG SAMSUNG Haier Whirlpool IFB BOSCH
AIR CONDITIONERS
WIDEST RANGE OF SPLIT Ac's
RANGE STARTS FROM ₹26,990/-*
ATTRACTIVE CASHBACK* | NO COST EMI* | INSTALLATION FREE*
LG SAMSUNG Haier LLOYD BLUE STAR GENERAL DAIKIN
SAMSUNG
Galaxy A56 | A36 5G
Celebrations made awesome with triple zero deal
oppo
Reno15 Series 5G
AI Portrait Camera
New Arrival
Range Starts ₹45,999/-
ColorOS
10% CASHBACK | zero DOWN PAYMENT | 6 Months No Cost EMI
Apple Days
BEST PRICE
LIMITED PERIOD OFFER
iPhone 17 Pro Max MRP ₹1,49,900 EFFECTIVE PRICE ₹96,900* Monthly EMI ₹8,408/12Months
iPhone 17 Pro MRP ₹1,34,900 EFFECTIVE PRICE ₹81,400* Monthly EMI ₹7,117/12Months
iPhone Air MRP ₹1,19,900 BEST PRICE ₹97,000 EFFECTIVE PRICE ₹53,000* Monthly EMI ₹4,750/18Months
iPhone 17 MRP ₹82,900 BEST PRICE ₹82,900 EFFECTIVE PRICE ₹38,900* Monthly EMI ₹1,788/24Months
iPhone 16 MRP ₹69,900 BEST PRICE ₹60,990 EFFECTIVE PRICE ₹23,990* Monthly EMI ₹1,499/18Months
iPhone 15 MRP ₹59,900 BEST PRICE ₹51,990 EFFECTIVE PRICE ₹15,990* Monthly EMI ₹999/18Months
Now available on Zero Down Payment | Zero Interest | Zero Processing Fee
Apple Adapter FREE
Upto ₹4,000* Instant cashback on credit cards of ICICI Bank, AXIS BANK + Exchange bonus up to ₹6,000*
Effective prices include store discount, exchange value of old device, exchange bonus and brand cashback available with 6 months No-Cost EMI offer.
vivo V60
Co-engineered with ZEISS
Starts from ₹36,999*
Own Easily with Exclusive Offers
10% upto ₹3,500 Cashback*
0 Down Payment*
EMI upto 15/0* Monthly EMI ₹2,467*
upto 6months No Cost EMI
Xiaomi Care Device Protection Plans
REDMI Note 15 5G
Available Now
₹19,999* 8GB+128GB | ₹21,999* 8GB+256GB
₹3,000* Instant Bank Discount AXIS BANK SBI card
OR
0% Down payment* Up to 8 Months
10% cashback up to ₹2,000*
MacBook Air M4
Monthly EMI ₹2,746
MRP ₹99,900 EFFECTIVE PRICE ₹55,900*
PRICE ALERT, BUY NOW LAPTOP PRICES RISE SOON.
DELL INSPIRON Core 3 8 GB | 512 GB MRP ₹48,868 OFFER PRICE ₹39,490* EMI Starts at ₹4,388*
hp 3 YEARS WARRANTY FREE Core 5 | 16 GB | 512 GB MRP ₹67,311 OFFER PRICE ₹59,990* EMI Starts at ₹4,999*
ASUS TUF GAMING Core 5 | 16 GB | 512 GB RTX 3050A | 4 GB GRAPHICS CARD MRP ₹96,990 OFFER PRICE ₹68,990* EMI Starts at ₹5,749*
Lenovo YOGA Slim 7 Core Ultra 5 16 GB RAM | 1 TB | AI ENABLED MRP ₹1,18,890 OFFER PRICE ₹82,990* EMI Starts at ₹6,916*
Free Bag* | 10% cashback upto 15,000* | *0% Interest | No Cost EMI upto 24 Months* | Exchange Bonus upto 10000*
విజయవాడ: వినాయక థియేటర్ దగ్గర, బందరు రోడ్, గుణదల | మీనాక్షి టవర్స్, ఏలూరు రోడ్, సూర్యారావు పేట | F101, F102, F115, & F116, బొమ్మరిల్లు అపార్ట్‌మెంట్ నందమూరి నగర్ | 71-2-9, మోహన్ దాస్ థియేటర్ ప్రక్కన, వెంకటేశ్వరపురం, పటమట | D.No 76-8-8/5, క్రాంబ్వే రోడ్డు, శివాలయం, భవానిపురం |
గుడివాడ: గ్రౌండ్, 1 & 2 ఫ్లోర్స్, Sy.No. 122/1, వార్డ్ నం.15, ఆంజనేయపేట, | మచిలీపట్నం: ఓల్డ్ D. No. 11/313, సిరి ఎస్టేట్, చెమ్మన్నగిరి పేట
Bajaj Electronics - A Trademark of Electronics Mart India Ltd. CIN No: L52605TG2018PLC126593. Regd. Office: 6-1-91/10, Ground Floor, Next to Telephone Bhavan, Secretariat Road, Saifabad, Hyderabad - 500004. Corporate Office: M. No. 6-3-666/A1 to 7, 3rd Floor, Opp. NIMS Hospital, Punjagutta Main Road, Hyderabad - 500082. Email: communications@bajajelectronics.in
*T&C Apply: *Offer valid on select products only. EMI and approval of EMI is at the sole discretion of the finance company and the decision of the finance company management is final. 0% finance is available on selected models and brands only. Finance offer is not valid for products below Rs.10,000/-. No two offers can be clubbed together. Product images shown here are only for demonstration purpose. Please check the products before purchase. Offer valid till stock last. Bajaj Electronics reserves the right to withdraw or change the offers, prices, terms and conditions at any time without prior intimation. *A minimum transaction value is required for getting cashback which will vary from bank to bank. For instant approvals please walk-in with your id proof, address proof & cheque leaf.

ఈనాడు

ప్రజాస్వామ్యానికి స్థానిక భాషాలంబన

అధికారిక రాతకోతలు, చట్టాలు, ఉత్తర్వులను అర్థం చేసుకోవడానికి ఇతరుల మీద ఆధారపడాల్సిన దుస్థితిని ప్రజలకు కల్పిస్తున్నాయంటే- ప్రజాతంత్ర రాజ్యంలో వ్యవస్థలు తప్పనిసరిగా నిలబెట్టుకోవాల్సిన ప్రజాస్వామిక లక్షణాలు లుప్తమైనట్లే. సర్కారీ సమాచారాన్ని తమకు అర్థమయ్యే భాషలో పొందడానికి పౌరులకు ఉన్న హక్కును నిరాకరించడమంటే- పాలనలో ప్రజాభాగస్వామ్యాన్ని కాలదన్నినట్లే. అంతిమంగా అది పరిపాలనలో పారదర్శకతను, యంత్రాంగంలో జవాబుదారీతనాన్ని తగ్గించేస్తుంది. దాంతో అవినీతి వ్యవస్థీకృతమై దేశాభివృద్ధిని హరించివేస్తుంది. దశాబ్దాలుగా జనభారతాన్ని పట్టిపీడిస్తున్న ఆ దౌర్భాగ్యాన్ని తప్పించాలంటే- పార్లమెంటు నుంచి గ్రామపంచాయతీ వరకు అన్నింటా స్థానిక భాషల వినియోగం పెరగాలి. వెంకయ్యనాయుడు రాజ్యసభ ఛైర్మన్‌గా ఉన్నప్పుడు ఇందుకోసం ప్రత్యేక చొరవ తీసుకున్నారు. రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో ఉన్న 22 భాషల్లో ఎందులోనైనా ప్రసంగించేందుకు ఎగువసభ ఎంపీలకు వీలు కల్పించారు. లోక్‌సభాపతి ఓంబిర్లా కృషితో దిగువసభలోనూ ఆ అవకాశం అందుబాటులోకి వచ్చింది. ఎంపీలందరూ రాబోయే బడ్జెట్ భేటీల్లో తమ సొంత భాషల్లోనే మాట్లాడే విధంగా మరింత ప్రోత్సహిస్తామన్న ఓంబిర్లా తాజా ప్రకటన సహర్షంగా స్వాగతించదగినది. వివిధ ప్రాంతాలకు చెందిన సభ్యులు శాసననిర్మాణ క్రతువులో చురుగ్గా పాల్గొనడానికే కాదు- భారతావని తలరాతను నిర్దేశించే చట్టాలను రూపొందించే పార్లమెంట్ పనితీరుపై ప్రజావగాహన పెంపునకూ ఇది దోహదపడుతుంది!

చర్చల్లో భాగంగా ఎంపీలు ఎనిమిదో షెడ్యూల్‌లోని ఏ భాషలో ఉపన్యసించినా మిగిలిన అధికారిక భాషల్లోకి వెంటనే అనువదించేందుకు తగిన ఏర్పాట్లు పార్లమెంట్‌లో కొలువుతీరాయి. వాటిని సద్వినియోగం చేసుకుంటూ ఇటీవలి శీతాకాల సమావేశాల్లో 37మంది లోక్‌సభ సభ్యులు ఆంగ్లం, హిందీయేతర భాషల్లో మాట్లాడారు. తమిళ, మరాఠీ, బెంగాలీ సభ్యులు ఎక్కువగా తమ అమ్మభాషల్లో ప్రసంగించారు. పార్లమెంటరీ ప్రొసీడింగులు, సంబంధిత దస్త్రాలు ప్రస్తుతం పది భాషల్లో అందుబాటులో ఉంటున్నాయి. ఏఐ ఉపకరణాల సాయంతో రాబోయే రోజుల్లో వాటిని 22 అధికారిక భాషల్లో అందించేందుకు యంత్రాంగం చర్యలు తీసుకుంటుండటం శుభసూచికం. సర్కారీ వ్యవహారాల్లో ఆంగ్లాధిపత్యానికి అడ్డుకట్ట వేయకపోతే- పాలనా ప్రక్రియ నుంచి పౌరులను వెలివేసినట్లు అవుతుందని పార్లమెంటరీ కమిటీ ఏనాడో హెచ్చరించింది. రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో అన్ని కార్యకలాపాలు స్థానిక భాషల్లో కొనసాగితేనే పౌరసేవల్లో నాణ్యత ఇనుమడిస్తుంది. సామాన్య జనానికి కొరుకుడు పడని భాషలో నియమ నిబంధనలను జారీచేస్తూ, దస్త్రాలను రూపొందిస్తూ అక్రమాలకు ఎర్రతివాచీ పరిచే అవ్యవస్థ అణగిపోతుంది!

పౌరసేవల బట్వాడాకు ఉద్దేశించిన ఈ-గవర్నెన్స్ వేదికలను ప్రాథమికంగా స్థానిక భాషల్లోనే రూపొందించాలని, నామ్‌కేవాస్తే అనువాదాలతో చేతులు దులుపుకోకూడదని రెండో పరిపాలనా సంస్కరణల సంఘం గతంలోనే హితవుపలికింది. ఆ మేరకు ఆధునిక సాంకేతిక వనరులకు జనం భాషలను జతచేసినప్పుడు మాత్రమే పాలన ప్రజల చెంతకు పూర్తిగా చేరుతుందన్న సంగతిని ప్రభుత్వాలు గుర్తించాలి. న్యాయవ్యవస్థలో ప్రాంతీయ భాషల వినియోగం పెరగాలన్న ప్రధాని మోదీ గత సందేశమూ అవశ్యం ఆచరణీయమైనది. కనీసం జిల్లాస్థాయి వరకు కోర్టుల కార్యకలాపాలు స్థానిక భాషల్లోనే సాగితే- న్యాయం పొందడంలో సామాన్యులకు ఎదురవుతున్న ఇబ్బందులెన్నో తొలగిపోతాయి. అందుకోసం తెలుగుతో పాటు అన్ని భారతీయ భాషల్లో న్యాయవిద్యా బోధన, సమగ్ర పారిభాషిక పదకోశాల నిర్మాణానికి ప్రభుత్వాలు కట్టుబాటు చాటాలి!



అంధకారం తిష్టవేసుకుని కూర్చున్న చోట రచయితలు మరింత జాగరూకులై వ్యవహరించాలి. వెలుగు ప్రసరించే రచనలు చేస్తేనే చీకటి మాటున జరిగే అన్యాయాల నుంచి అమాయకులను కాపాడగలరు.

– మహాశ్వేతాదేవి

భాగ్యసిరుల భోగి

నేల భోగభాగ్యాలను ప్రసాదించే భోగిపర్వం మకర సంక్రమణానికి తొలి వేదిక. ఇష్టదేవుళ్లను అనుకూలించాలని, ఇంద్రుడి అనుగ్రహం కోసం ఇంద్రపర్వంగా భోగిని నిర్వహిస్తారని 'కాలతత్వం' ప్రకటించింది. పంటలు సమృద్ధిగా పండి, సంపదలు చేకూరి, ఇంటింటా ఐశ్వర్యం వర్ధిల్లే భోగి సంతోష సంబంధమై మురిపిస్తుంది. భోగ్యం అంటే ధనం, ధాన్యం, సిరిసంపదలు. భూమి ద్వారా లభించిన భాగ్యాలను ఆస్వాదించేవారే భోగులు. ప్రకృతి అనుగ్రహంతో భోగులుగా వర్ధిల్లే వారందరూ, పుడమిపట్ల కృతజ్ఞతాభావంతో భోగిని నిర్వహించాలన్నది శాస్త్రం. భోగి అంటే పాము అనే అర్థమూ ఉంది. కాలాన్ని సర్పంతో సమన్వయం చేస్తారు. కాలంలో జరిగే మార్పులను భోగిపర్వం ప్రతిబింబిస్తుంది. కాలం అనుకూలించాలని, అందరికీ మేలు జరగాలని ఆకాంక్షించే ప్రక్రియల సమాహారమే భోగి సంప్రదాయం.


మధురభక్తితో తనను మెప్పించిన గోదాదేవిని శ్రీరంగనాథుడు భోగి నాడే పరిణయమాడాడని ప్రతీతి. భోగేంద్రశాయిగా పిలిచే రంగనాయకుడు అంగరంగ వైభోగంతో ఆండాళ్‌కు భాగ్యసిద్ధిని అనుగ్రహించిన సందర్భమే భోగి. గోదాదేవి ఆత్మకు, రంగనాయకుడు పరమాత్మకు సంకేతం. ఆత్మస్వరూపం పరమాత్మానుభూతిని పొందడమే భోగం. ధనుర్మాసమంతా కొనసాగిన ఆధ్యాత్మిక సాధన భోగితో సుసంపన్నమవుతుంది. జడత్వం నుంచి చేతనత్వాన్ని సంతరించుకోవడం, పాత వ్యవస్థలోని చెడును వదిలి నవ్యత్వం వైపు పురోగమించడం సంక్రమణం. వేద కాలంలో మకర సంక్రమణం, ఉత్తరాయణ పుణ్యకాల ఆరంభంలో అగ్నిహోత్రులు వేదిక హోమాన్ని నిర్వహించేవారు. దానికి ప్రతీక భోగి మంటల వేడుక!



అంతర్యామి

సంక్రాంతి నుంచి సూర్యగమనం పరివర్తన చెందుతుంది. సూర్యకిరణాలు మరింత తేజోవంతంగా ఉంటాయని, అవి జీవులకు నవచైతన్యాన్ని కలిగిస్తాయని తైత్తిరీయోపనిషత్తు చెప్పింది. అందుకే భోగి రోజు సూర్యుణ్ని, భూమిని, అగ్నిని ఆరాధించాలని చెబుతారు. భోగినాడు పాతాళం నుంచి బలి చక్రవర్తి భూమిపైకి వస్తాడని ప్రతీతి. దానగుణశీలి అయిన బలికి స్వాగతం పలకడానికే ప్రత్యేకమైన రంగవల్లులను తీర్చిదిద్దే సంప్రదాయం ఏర్పడిందంటారు. భోగిపళ్ల వేడుకకు ఎంతో ప్రశస్తి ఉంది. సూర్యుడి రంగు, రూపం ఉన్న రేగుపళ్లను పిల్లల తలపై పోసి సూర్యశక్తి సంపూర్ణంగా ప్రసరించాలని, వారికి ఆరోగ్యం చేకూరుతుందని భావిస్తారు. భోగి నుంచి నెలరోజులపాటు నువ్వులు, బెల్లం మిశ్రమంతో చేసిన మిఠాయిని స్వీకరిస్తే కఫ సంబంధిత వ్యాధులు దూరమై, రాబోయే వేసవిని తట్టుకునే శక్తి లభిస్తుందని ఆయుర్వేదం వివరిస్తోంది. భోగినాడు ఏర్పాటు చేసే బొమ్మల కొలువు జీవపరిణామ క్రమ విశేషాలతో పాటు, వైరాగ్య తాత్విక దృక్పథాన్నీ వెల్లడిస్తుంది. భోగాన్ని వదిలి త్యాగానికి సిద్ధం కావాలని, ప్రతికూలతలను వదిలి సానుకూల దృక్పథంతో మసలుకోవాలని ఈ పండుగ దిశానిర్దేశం చేస్తుంది. అందరి అభ్యుదయాన్ని ఆకాంక్షిస్తూ, సమష్టి జీవనతత్వంతో, నూతన క్రాంతిపథం వైపు ప్రగతిశీల భావనతో పురోగమించాలన్న ఆత్మీయ సందేశాన్ని భోగి అందిస్తుంది.

– డాక్టర్ కప్పూరి రాజేష్ పటేల్



సున్నాలో సృష్టి రహస్యం!

శ్రీనివాస రామానుజన్ వందేళ్ల క్రితం రాసిన 'పై' సూత్రాల్లో విశ్వరహస్యాలు దాగి ఉన్నాయని భారతీయ విజ్ఞాన సంస్థ(ఐఐఎస్‌సీ) శాస్త్రవేత్తలు గుర్తించారు. స్ట్రింగ్ థియరీపై పరిశోధన చేస్తుండగా, అనుకోకుండా రామానుజన్ గణిత సూత్రీకరణలు వారి కంటబడ్డాయి. అవి నేటి ఆధునిక భౌతికశాస్త్ర సిద్ధాంతాలతో సరిగ్గా సరిపోలుతుండటం విశేషం. ప్రయోగశాలలు లేని కాలంలోనే భవిష్యత్తు సైన్స్‌ను దర్శించిన రామానుజన్ మేధస్సుకు ఇది నిదర్శనం.

తమిళనాడులోని కుంభకోణంలో 1887లో పేద కుటుంబంలో జన్మించారు శ్రీనివాస రామానుజన్. గొప్ప విశ్వవిద్యాలయాల్లో పెద్దపెద్ద డిగ్రీలేవీ చదవకపోయినా, అంకెలంటే ఆయనకు ప్రాణం. కేవలం 32 ఏళ్ల జీవితంలోనే దాదాపు 3,900 గణిత సూత్రాలను రాసి ఈ లోకాన్ని వీడిపోయారు. వాటిలో చాలావాటికి అప్పుడు నిరూపణలు లేవు. కానీ, కాలక్రమంలో గణిత పరిశోధకులు ఆ సూత్రాలను రుజువుచేస్తూ, రామానుజన్ ఊహించిన ఫలితాలు నిజమేనని నిర్ధారిస్తున్నారు. అందుకే ఆయన్ను 'అనంతాన్ని చూసిన వ్యక్తి'గా శాస్త్ర పరిశోధకులు కొనియాడుతున్నారు.

ఈ 'పై' కథేంటి?

వృత్తాకారంలో ఉండే సున్నాను నిర్వచించేదే 'పై'. గ్రీకు గణిత శాస్త్రవేత్త ఆర్కిమెడిస్ 1,500 సంవత్సరాల క్రితం కనుగొన్న ఈ కరణీయ సంఖ్యను సుమారు 22/7గా అంచనా వేయవచ్చు. సరళంగా చెప్పాలంటే, ఓ బండి చక్రం చుట్టుకొలత(పరిధి)ని చక్రం మధ్యగా వెళ్లే అడ్డ కొలత(వ్యాసం)తో భాగిస్తే వచ్చే సంఖ్యే 'పై'. చిన్న చక్రమైనా, పెద్ద చక్రమైనా, బావి అయినా, రూపాయి నాణెమైనా... గుండ్రంగా ఉండే ఏ వస్తువుకైనా ఈ నిష్పత్తి మారదు. దాని విలువ 3.14తో ఆరంభమై, ఆ తరవాతా అంకెలు వస్తూనే ఉంటాయి. అంత కచ్చితమైన లెక్కతో యంత్రాలు, రాకెట్లు వంటివాటిని రూపొందించాల్సి ఉంటుంది. ఈ విలువను చాలా వేగంగా లెక్కించడానికి రామానుజన్ 1914లో పదిహేడు రకాల 'రెసిపీలు(సూత్రాలు)' రాశారు. వంటలో దినుసులను ఒక్కొక్కటిగా వేస్తుంటే రుచి ఎలా పెరుగుతుందో... ఈ సూత్రాల్లో ఒక్కో పరామితి(పారామీటర్)ను కలుపుతుంటే 'పై' విలువ అంత కచ్చితంగా వస్తూ ఉంటుంది. ఇలాంటి సూత్రీకరణల ఆధారంగానే నేడు సూపర్ కంప్యూటర్లు ట్రిలియన్ల అంకెల వరకూ లెక్కలు కడుతున్నాయి.



అనుకోని మలుపు!

'ఐఐఎస్‌సీ'లో డాక్టర్ అనింద సిన్హా బృందం భౌతికశాస్త్రానికి సంబంధించిన స్ట్రింగ్ థియరీపై శోధన సాగిస్తున్నప్పుడు... అనుకోకుండా రామానుజన్ ఆలోచనల వెనకనున్న గణితాన్ని అర్థం చేసుకోవడంపై దృష్టి సారించారు. స్ట్రింగ్ థియరీ భౌతికశాస్త్రంలో ఒక గొప్ప సిద్ధాంతం. ఒక వీణ తీగను మీటినప్పుడు అది కదిలే వేగాన్ని బట్టి స, రి, గ, మ... వంటి వేర్వేరు స్వరాలు వినిపిస్తాయి. సరిగ్గా అలాగే, ఈ సృష్టికి మూలమైన రేణువులు కూడా కంపిస్తున్న చిన్నపాటి శక్తి తీగలు(స్ట్రింగ్స్)గా ఉంటాయని పరిశోధకులు చెబుతారు. ఒక తీగ కంపించే తీరును బట్టి అది కరెంటునిచ్చే ఎలక్ట్రాన్‌గా, అణువులోని క్వార్క్‌గా, లేదంటే గోడల గుండా దూసుకెళ్లే న్యూట్రాన్‌గా మారుతుంది. ఇవన్నీ ఆ 'శక్తి తీగ' పలికే వేర్వేరు రాగాలే! సిన్హా బృందం ఈ స్ట్రింగ్ థియరీకి సంబంధించిన గణాంకాలను పరిశీలిస్తున్నప్పుడు- 'పై' విలువను కనుగొనే కొత్త సిరీస్‌ను కనుగొన్నారు. దీన్ని అర్థం చేసుకోవాలంటే... ఒక రబ్బర్ బ్యాండ్ (స్ట్రింగ్)ను ఊహించుకోవాలి. దాన్ని అనేక రకాలుగా సాగదీయవచ్చు. ఇలా సాగే క్రమంలో అది అనేక విలువలను తీసుకుంటుంది. ఆ లెక్కల్లో గనక 'పై' విలువ దాగి ఉంటే, దాన్ని గుర్తించడానికి కూడా అనేక మార్గాలు ఉంటాయని డాక్టర్ సిన్హా బృందం ఆలోచించింది. ఈ ఆవిష్కరణే వారిని రామానుజన్ పాత సూత్రాలను మళ్లీ నిశితంగా పరిశీలించేలా చేసింది. రామానుజన్ గణిత సూత్ర నిర్మాణాలన్నీ 'కాన్ఫార్మల్ ఫీల్డ్ థియరీ(సీఎఫ్‌టీ)'లో మాదిరిగా ఉన్నట్లు గుర్తించారు. పదార్థాల్లో జరిగే వింత మార్పులను వివరించే ఒక గణిత భాషే సీఎఫ్‌టీ. ఉదాహరణకు, నీటిని వంద డిగ్రీల దగ్గర మరిగిస్తే నీరూ ఆవిరీ వేరువేరుగా కనిపిస్తాయి. అదే వేడిని 374 డిగ్రీలకు, పీడనాన్ని 221 అట్మాస్ఫియర్లకు పెంచితే, నీరూ ఆవిరి అనే తేడా మాయమైపోతుంది. అప్పుడది ద్రవమూ వాయువూ కాని 'క్రిటికల్ పాయింట్'కు చేరుతుంది. ఇలాంటి స్థితిలో ఏం జరుగుతుందన్నది వివరించడానికి సీఎఫ్‌టీ ఉపయోగపడుతుంది. 'పై' కోసం రామానుజన్ వాడిన మాడ్యులర్ సమీకరణాలు, ఇతర గణిత పద్ధతులు కూడా నేడు ఆధునిక భౌతికశాస్త్రంలో వాడుతున్న కోరిలేషన్ ఫంక్షన్ల నిర్మాణంతో సరిగ్గా సరిపోలుతున్నాయని పరిశోధకులు కనుగొన్నారు. ప్రఖ్యాత జర్నల్ 'ఫిజికల్ రివ్యూ లెటర్స్' ఈ వివరాలను ప్రముఖంగా ప్రచురించింది.

వెలుగులోకి మరెన్నో రహస్యాలు

'ఐఐఎస్‌సీ' తాజా పరిశోధన రామానుజన్ పాత గణితానికీ, నేటి ఆధునిక సీఎఫ్‌టీ సిద్ధాంతానికీ నడుమ వారధిలా నిలుస్తోంది. సిన్హా బృందం కనుగొన్న కొత్త 'పై సిరీస్' విశ్వం ఎలా విస్తరిస్తోందనేది తెలుసుకోవడానికి కూడా ఉపకరిస్తుందంటున్నారు. 'పై' వంటి ఇతర గణిత సంబంధ సంఖ్యలకూ భౌతికశాస్త్రంలో మూలాలు, వాటిని సులభంగా లెక్కించే మార్గాలు ఉండొచ్చని అర్థమవుతోంది. రామానుజన్ నోటు పుస్తకాల్లో మనం అర్థం చేసుకోలేని సూత్రాలెన్నో ఉన్నాయి. రాబోయే రోజుల్లో ఆయన పుస్తకాలను మరింత లోతుగా పరిశోధిస్తే, టైమ్ ట్రావెల్, గురుత్వాకర్షణ(గ్రావిటీ) వంటి విషయాలకు సంబంధించిన రహస్యాలు కూడా వెలుగులోకి రావచ్చు. అత్యంత సామాన్య కుటుంబంలో పుట్టి, పెద్ద సౌకర్యాలేమీ లేకుండా, కేవలం తన మేధస్సుతో శాస్త్ర వికాసానికి బాటలు వేసిన రామానుజన్ జీవితం... మనకెంతో స్ఫూర్తిదాయకం. అంకెల రూపంలోని ఆయన ఆలోచనలు సృష్టిని అర్థం చేసుకోవడానికి నేటికీ వెలుగుదారిని చూపుతుండటం- భారతీయ వైజ్ఞానిక పటిమకు నిదర్శనం!



డాక్టర్ మంగళంపల్లి కిరణ్
అసోసియేట్ ప్రొఫెసర్, నానో శాస్త్ర పరిశోధకులు
ఎస్.ఆర్.ఎం. యూనివర్సిటీ, అమరావతి

మీ కలను గాలిపటంలా అంతరిక్షంలోకి విసిరేయండి. అది తిరిగి ఏం తెస్తుందో మీకు తెలియదు- ఒక కొత్త జీవితమో, కొత్త స్నేహితుణ్నో, కొత్త ప్రేమనో... ఏమైనా తేవచ్చు అంటారు రచయిత్రి అనైస్ నిన్. ఊహ అనేది ఒకరు ఎగరవేయగల అత్యున్నత గాలిపటం... అన్నది లారెన్ బేకాల్ మాట. గాలిపటాన్ని ఇలా జీవితానికి అన్వయిస్తూ సాహిత్యంలో, సినిమాల్లో, పాటల్లో ఎన్నో ప్రస్తావనలు ఉన్నాయి.

గాలిపటాలు ఎందుకు స్ఫూర్తినిస్తాయంటే అవి ప్రతిఘటనకు చిహ్నాలు. ప్రతికూల పరిస్థితుల్లో బలాన్ని ఎలా సమకూర్చుకోవాలో పతంగులను చూసి నేర్చుకోవచ్చు. బాల్యం గుర్తొచ్చినప్పుడల్లా ఆడిన ఆటలు మదిలో మెదులుతాయి. ముఖ్యంగా గాలిపటం ఎగరవేయడంలోని అనుభూతి వర్ణనాతీతం. ఒకప్పుడు రంగు కాగితాలు, వెదురు పుల్లలు తెచ్చుకుని స్వయంగా గాలిపటాలు తయారు చేసుకునేవాళ్లు. ఇప్పుడు అన్నీ రెడీమేడ్‌గా దొరుకుతున్నాయి. సంక్రాంతి పండుగ అనగానే ముగ్గులు, హరిదాసులు, గంగిరెద్దులతో పాటు పతంగులూ గుర్తొస్తాయి.



పద పదవె వయ్యారి గాలిపటమా!

గాలి పటాలను క్రీ.పూ. అయిదో శతాబ్దంలోనే చైనాలో ఎగరేసినట్లు చరిత్ర చెబుతోంది. దీనికి సంబంధించి ఓ కథ ప్రాచుర్యంలో ఉంది. ఒక రైతు తన టోపీ గాలికి ఎగిరిపోకుండా ఉండటానికి దారంతో కట్టి ఉంచాడట. గాలికి అది పైకి లేచి దారం కారణంగా ఎటూ పోలేక అతడి తల మీదే ఎగురుతూ ఉండిపోయిందట. అది చూసిన కొందరు సరదా ఆటగా గాలిలో ఎగరేసే పటాలను తయారుచేశారని చెబుతారు. మొదట్లో ఆకులు, వస్త్రాలు వాడి గాలిపటాలను తయారు చేసేవారట. కాగితం వాడుకలోకి వచ్చాక దాంతో గాలిపటాలను తయారు చేయడం మొదలెట్టారు. మన దేశంలో పతంగులు ఎగరేసే సంప్రదాయం ఎప్పుడు మొదలైందో తెలియదు కానీ అది మన సంస్కృతిలో భాగంగా మారిపోయింది. స్వాతంత్ర్యోద్యమంలోనూ గాలిపటాల పాత్ర ఉందంటే నమ్ముతారా? 1928లో సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా నడిచిన ఉద్యమంలో నల్లజెండాలతో పాటు పతంగులపైనా 'సైమన్ గో బ్యాక్' అనే నినాదాలు రాసి ఎగరేశారట ప్రజలు. శరద్రుతువు ఆగమనానికి సంతోషంగా స్వాగతం పలుకుతూ పతంగులను ఎగరవేసే సంప్రదాయం మన దేశంలో ఉన్నట్లే, తమ తమ సంస్కృతులకు అనుగుణంగా ఏటా కైట్ ఫెస్టివల్స్‌ని అన్ని దేశాలూ నిర్వహిస్తుంటాయి. హైదరాబాద్ నగరం పతంగులకు పెట్టింది పేరు. ఇక్కడ తయారైన గాలిపటాలను ఇతర రాష్ట్రాలకూ సరఫరా చేస్తారు.

జీవితంలో ఎంత ఎదిగినా మూలాలను మర్చిపోకూడదని పెద్దలు చెబుతారు. గాలిపటం ఆ మాటను గుర్తుచేస్తుంటుంది. ఆకాశంలో అది ఎంత ఎత్తున ఎగురుతున్నా దాని దారం మన చేతిలోనే ఉంటుంది. గాలి ఎటు వీస్తున్నా, అసలు వీయకపోయినా... గాలిపటాన్ని తెగిపోకుండా ఎత్తుగా ఎగరవేయడం గొప్ప నైపుణ్యం. ఆ స్కిల్ తెలిసిన వాళ్లకు జీవితంలోని ఒడుదొడుకులనూ ఒత్తిళ్లనూ తట్టుకుని నిలబడటం చేతనవుతుంది. అందుకే పిల్లల్ని పతంగులు ఎగరవేయనియ్యాలి. అయితే తగిన జాగ్రత్తలు తీసుకోవడం మాత్రం పెద్దల బాధ్యతే.

– గాత్ర

సంక్రాంతి సంబరాల్లో తంపులమారి!

'నమస్కారం బామ్మగారూ, నావేరు రోల్డ్‌గోల్డ్ కంప్. నేనెవరో ఇంతకన్నా ఎక్కువ పరిచయం లేదనుకుంటా!'

'నీ కంపు పనులే చాలు నీ పరిచయానికి, ఇక్కడేం తగలేద్దామని వచ్చావో!'

'తెలుగునాట సంక్రాంతి సంబరాలు పీక్స్‌లో ఉంటాయని తెలుసుకుని వచ్చాను. గెస్ట్‌లా ట్రీట్ ఇస్తారా?'

'అదేం భాగ్యం నాయనా, ప్రపంచానికే అధ్యక్షుణ్ని అన్న భ్రమలో బతుకుతున్నవాడివి, మాతో కలిసి పండుగ చేసుకోవడానికి వస్తే వద్దంటామా!'

'నామీద మీకందరికీ కోపం ఉందేమోనని నా డౌట్!'

'కోపం ఎందుకు నాయనా, ఎన్నెన్నో తుపాన్లు, విపత్తుల్ని దాటేసిన మొండి ఘటాలం! కుర్చీలో కూర్చున్నంతసేపేగా నీ వైత్యం! భరిస్తామంతే!'

'ఎస్, మీరు బాగా పేషంట్ పీపుల్, ఐ నో దట్!'

'ఏంటి, మేమంతా పేషంట్లా.. ఆ మాటనడానికి నీకేం మాయరోగం. అయినా, అందరికీ పెద్దన్న లాంటి వాడివి నువ్వే అందరితో తగవు పెట్టుకుంటూ, శక్తిలేని అర్భకుల మీద ప్రతాపం చూపిస్తావేం! నీ బండబడ!'

'ప్రతాపం చూపిస్తానంటూ పొగిడినందుకు థ్యాంక్స్ బామ్మగారూ!'

'నీకలా అర్థమైందా! అదే మా తెలుగు భాష గొప్పతనం నాయనా, ఆ ఎక్స్‌ప్రెషన్లు నీకు అర్థంకావులే!'

'ఇవేమిటి బామ్మగారూ గట్టిగా ఉన్నాయి?'

'వాటిని పిడకలు అంటారు'

'యూ మీన్ కౌ డంగ్ కేక్స్..!?'

'కేకులు కాకపోతే, పేడ బర్గర్లు అని పిలుచుకో నాకేం!'

'ఓ గాడ్ వీటిని కాలిస్తే పొగ వస్తోంది, పొల్యూషన్ కదా!'

'అబ్బా.. పొల్యూషన్ గురించి నువ్వే మాట్లాడాలి మరి! వాతావరణ ఒప్పందంతో నాకేం సంబంధం లేదంటూ బాధ్యత మరిచి పారిపోయిన వాడివి, పొయ్యిలో పొగతో కాలుష్యం అంటావా, నువ్వూ నీ పిండాకూడు కాకపోతే!'

'ఓ ఎస్ బామ్మగారూ, పిండాకూడు నాకూ పెట్టండి తింటాను'

'కూడన్న ప్రతిదీ తినేది కాదు నాయనా! అవునులే, ప్రపంచంలో అందరి సొమ్ముల్నీ ఆబగా ఆరగించాలని అర్రులు చాచేవాడివి, గడ్డిగాదం, తౌడూ తైలం.. పెడితే ఏదైనా తినేస్తావు!'

'పిడక కేకులు ఎక్స్‌పోర్ట్ చేయిస్తాను, మా దేశంలో నట్టింట్లో మంట పెట్టి చలి కాచుకోవడానికి పనికొస్తాయి'

'నువ్వేసే టారిఫ్ దెబ్బకి వందరూపాయల పిడకల్ని అయిదొందలు పెట్టి కొనాల్సి వస్తుంది మీ దేశంలో, చూసుకోమరి!'

'మైగాడ్, నా టారిఫ్‌లతో మా పీపుల్‌కే నష్టమా!'

'అంతేమరి, టారిఫ్‌ల దెబ్బకి మీ దేశంలో ధరలు పేలిపోతాయి. మాకేం, మా సరకుల్ని మరెక్కడైనా అమ్ముకుంటాం. నోరు మంచిదైతే ఊరు మంచిదటారు, ఎక్కడికైనా పోతాం, నీ పొయ్యిలో పప్పులు ఉడకనంత మాత్రాన, మా కడుపులేమీ పస్తులుండవులే!'

★ ★ ★

'హూ ఈస్ దిస్ లేడీ బామ్మగారూ, నేలమీద వైట్ డిజైన్లు వేసుకుంటూ వస్తున్నారు?'

'అవునమ్మాయి ఎవరి తాలూకా నేనూ చూడలేదే!'

'మా ఇంటి దగ్గర రథం ముగ్గు మొదలు పెట్టానండీ, ఇదిగో మీ దగ్గర తేలాను'

'పర్లేదులే, ఎలాగూ వచ్చావు కదా, పండుగ చేసుకుని వెళ్దువులే! చూశావా నాయనా, వీటినే ముగ్గులు అంటారు. ఒక్కో చుక్కా కలుస్తూ, అందమైన బంధంలా ముడివేసుకునేదే రంగవల్లి. పొద్దున్నే లేచి ఎవడితో కయ్యం పెట్టుకుందామా, ముక్కలవుదామా అని మెదడు చించుకునే నీకది అర్థంకాదులే!'

'మరి, మధ్యలో గ్రనేడ్లలా ఏవో పెట్టారు?'

'నీ ఆలోచన సంతకెళ్ల... అవి గొబ్బెమ్మలు, పచ్చి పేడతో తయారు చేస్తారు'



'ఓ షిట్...!?'

'షిట్టని కొట్టెయ్యకు, దాని పేటెంట్లకూ బోలెడు పోటీ ఉందక్కడ!'

★ ★ ★

'ఇదేమిటి బామ్మగారూ, పొద్దున్నే ఇంత చలిలో చన్నీళ్ల స్నానం చేయించారు, ఒకటే తుమ్ములు వస్తున్నాయి. గీజర్లు అడిగితే, మా దేశం ఇస్తుంది కదా!'

'ఆ గీరే వద్దంటా! ఆ మాత్రం వేడినీళ్లు పోసుకోలేకకాదు, ఇది భోగి స్నానం, ఆరోగ్యానికి మంచిది!'

'తుమ్ములతో చచ్చిపోతున్నా బామ్మగారూ..'

'తుమ్ములకే చచ్చేవాడివి... అందరిమీదా బాంబులేస్తానంటూ రంకెలేస్తావేమిట్రా బడుద్ధాయ్! మరీ గట్టిగా తుమ్మకు. ముక్కు ఊడిపోయేను. ముక్కులేని ముఖాన్ని చూడటం కష్టం. ముక్కులేని కంపుమామ అని పిల్లలంతా పాట కట్టి మరీ ఏడిపిస్తారు.'

'ఈయనెవరు బామ్మా, ఇల్లిల్లూ తిరిగి అడుగుతున్నారు, అందరి డబ్బులూ నేనే ఇచ్చెయ్యనా?'

'ఆయనే హరిదాసు. శ్రీమన్నారాయణుడే ఇంటి ముందుకొచ్చి చేయిచాచి అడుగుతున్నాడన్న మాట, కాదనకుండా, గుప్పెడు గింజలైనా వేసి పంపాలన్న మాట. నీ దగ్గర డబ్బులు ఎక్కువున్నాయని అందరివీ ఇస్తానంటున్నావు చూడూ, దాన్నే మా దగ్గర డబ్బు మదం అంటారు'

'ఈయనెవరూ.. బుల్‌కు మేకప్ వేసుకుని, మ్యూజిక్ వాయిస్తూ తిరుగుతున్నాడు'

'దేవుడే నందిని వెంటబెట్టుకుని, భూమిపై దుష్టశిక్షణకు బయల్దేరాడని అర్థం'

'అంటే, నేను మా మాట వినని వాళ్లను శిక్షించినట్లుగానా...?'

'నీ లెక్కలు వేరులే. ప్రపంచ శాంతికి పట్టిన దయ్యానివని మీ వాళ్లే తిడుతున్నారు చూసుకో!'

★ ★ ★

'బామ్మగారూ, మీ సంక్రాంతి ఫీస్ట్ అద్దిరిపోయింది. ఇంకా తినడం నావల్ల కాదు, వదిలేద్దురూ!'

'నీ పొట్ట గంగాళం అప్పుడే నిండిపోయిందంటే ఎలా నాయనా, ఇంకా స్వీట్లు తిననే లేదు. అయినా మీకు ఎంత ఉన్నా, ఎంత తిన్నా ఆశ చావదే!?'

'బామ్మగారూ, నేను మీకేం చేశానని, ఇన్నేసి ఐటమ్స్‌తో భోజనం పెడుతున్నారు. నేనేమైనా పే చేయాలా?'

'అదే నాయనా మీకూ మాకూ తేడా! ఏదో చేస్తేనో, మరేదో ఇస్తేనో పెడతామా! ఒకరికి పెట్టడమే మా సంస్కృతి. మీలా ఇంకొకరిది లాక్కోవడమనేది ఉండదు. అందరూ బాగుండాలి, అందులో మనమూ ఉండాలి. చాలా సింపుల్ ఫిలాసఫీ! అర్థం చేసుకో, అందరితో కలిసి హాయిగా బతికేస్తావ్!'

– శ్రీనివాస్ దరెగోని

రాజు మాయమయ్యాడా?

ప్రవణ్యపుర రాజ్యాన్ని యోగవిదుడు పాలించేవాడు. ఒకసారి ఆ రాజ్యంలోకి వీరబాహు అనే యువకుడు వచ్చాడు. 'నాకు మంత్ర విద్యలు తెలుసు. మీ మహారాజును మాయం చేయగలను' అని ప్రచారం చేశాడు. అది మెల్లగా రాజు వరకు వెళ్లింది. వెంటనే అతణ్ని పిలిపించి.. 'నువ్వు నిజంగా నన్ను మాయం చేయగలవా? ఒకవేళ అలా చేయకపోతే కఠిన శిక్ష అనుభవించాల్సి వస్తుంది' అన్నాడు రాజు. 'కచ్చితంగా చేస్తాను. రాజ్యంలోని ప్రముఖులందరినీ పిలిపించి సభ ఏర్పాటు చేయండి' అన్నాడు వీరబాహు. మరుసటిరోజు ఉదయాన్నే సభ ఏర్పాటు చేయించాడు రాజు. 'నేను ఇప్పుడు మీ రాజుని మాయం చేయబోతున్నాను. ఆయన లేకపోతే మీకేం నష్టం లేదా?' అని అడిగాడు వీరబాహు. దానికి ఏ ఒక్కరూ స్పందించలేదు. దాంతో.. 'అయితే అందరూ కళ్లు మూసుకోండి. ఏ ఒక్కరు చూసినా నా



ఇంద్రజాలం పని చేయదు' అన్నాడు. అందరూ కళ్లు మూసుకున్నారు. రాజుకు ఎదురుగా కూర్చుని ఏవేవో మంత్రాలు చదివాడు. కాసేపటికి వీరబాహు చెప్పగానే అందరూ కళ్లు తెరిచి చూశారు. అప్పుడు.. 'అంతా మోసం! రాజు మాయమవ్వలేదు' అన్నారు. 'మీరంతా వెళ్లండి. ఇతనికి తగిన శిక్ష వేస్తాను' అన్నాడు రాజు. దాంతో అందరూ వెళ్లిపోయారు. 'ఇతణ్ని వెంటనే కారాగారంలో బంధించండి' అన్నాడు రాజు. 'ఒక్క క్షణం మహారాజా! మిమ్మల్ని మాయం చేస్తానంటే ఏ ఒక్కరూ అడ్డు చెప్పలేదు. అంటే మీరు ప్రజల సమస్యలు, పాలన మీద అస్సలు దృష్టి పెట్టడం లేదనే కదా! నిజంగా మీరు రాజ్యం కోసం ఏదైనా కృషి చేసి ఉంటే.. మీకేమీ జరగొద్దని కోరుకునేవారు. ఇది మీకు తెలియజేయాలనే ఈ నాటకం ఆడాను' అన్నాడు వీరబాహు. అదంతా విన్న రాజు.. 'ఇతను చెప్పింది నిజమేననిపిస్తోంది. ఏ ఒక్కరూ అతణ్ని ఆపడానికి ప్రయత్నించలేదు. ఇక నుంచి నా పాలనా పద్ధతిని మార్చుకుంటేనే, మంచి పేరు తెచ్చుకోగలను' అనుకున్నాడు. విషయం తెలియజేసిన వీరబాహుని అభినందించాడు.

– కె.కె.రఘునందన

హాయ్! బుజ్జీ!!

దాగున్న పదమేది?

ఇక్కడ ఇచ్చిన ప్రతి పదంలో ఒక వాహనం పేరు దాగుంది. అదేంటో కనిపెట్టండి.

1. CARPENTER
2. AUTOMATIC
3. VANISH
4. FRIENDSHIP
5. TRAINING

జవాబు: 1.CAR 2.AUTO 3.VAN 4.SHIP 5.TRAIN

ట్రోల్స్ తాత్కాలికం... పరుగులు, వికెట్లే శాశ్వతం

- వచ్చే దశాబ్దం కూడా భారత్‌దే
- 'ఈనాడు'కు సౌరభ్ గంగూలీ ప్రత్యేక ఇంటర్వ్యూ



వరికుప్పల రమేశ్
ఈనాడు - హైదరాబాద్

భారత క్రికెట్లో సౌరభ్ గంగూలీది ఓ చిరస్మరణీయ ఇన్నింగ్స్. ఆటగాడిగా ఎంత బలమైన ముద్ర వేశాడో.. సారథిగా అంతకన్నా రెట్టింపు ప్రభావం చూపించాడు. పాలకుడిగానూ విలక్షణతను చాటుకున్నాడు. కానీ, తనను విజయవంతమైన బ్యాటర్‌గా కన్నా, ఎన్నో విజయాలను అందించిన కెప్టెన్‌గా కన్నా.. భారత క్రికెట్ ఆలోచనా విధానాన్ని మార్చిన వ్యక్తిగానే గుర్తుండి పోవాలని కోరుకుంటున్నాడు గంగూలీ. అతిగా పెరిగిన సోషల్ మీడియా ఒత్తిడిని, నెగెటివిటీని యువ ఆటగాళ్లు ఎలా అధిగమించాలి.. టెస్టు క్రికెట్ మనుగడ, ఆటగాళ్లపై సోషల్ మీడియా ప్రభావం, దేశవాళీ క్రికెట్లో రావాల్సిన మార్పులు.. ఇలా ఎన్నో అంశాలపై 'ఈనాడు'తో తన ఆలోచనలను పంచుకున్నాడు దాదా. క్రికెట్లో వచ్చే దశాబ్దం కూడా భారత్‌దే అంటున్న గంగూలీతో ప్రత్యేక ఇంటర్వ్యూ మీకోసం...

■ భారత్‌లో క్రికెట్‌ను సమర్థంగా నిర్వహించడానికి క్రికెట్ పాలకులకు కావాల్సిన లక్షణాలేంటి?

ఆటగాళ్లపై సానుభూతి, విజన్ ఉండటం మొదటిది. క్రికెటర్ల అవసరాలను అర్థం చేసుకోవాలి. వారి సంక్షేమం, దేశవాళీ కాంట్రాక్టులు, ఫిట్‌నెస్ ప్రమాణాలు, మహిళా క్రికెట్ అభివృద్ధిపై దృష్టి సారించాలి. నిర్ణయాత్మక నాయకత్వం రెండోది. ఒత్తిడిలోనూ, వివాదాల మధ్యలో కూడా కఠిన నిర్ణయాలు తీసుకోగలగాలి. డే-నైట్ టెస్టులు, కోచ్‌ల నియామకం వంటి విషయాల్లో వెనకడుగు వేయకూడదు. క్రీడా పరిజ్ఞానం, క్షేత్రస్థాయి నిబద్ధత ఉండటం మూడోది. ఆటపై పట్టు ఉండాలి. స్వల్పకాలిక ప్రయోజనాల కంటే ప్రతిభ గుర్తింపు, దేశవాళీ వ్యవస్థకు ప్రాధాన్యమివ్వాలి.

? బ్యాటర్‌గా, కెప్టెన్‌గా, ఆపై అడ్మినిస్ట్రేటర్‌గా మీ ప్రయాణం ఎలా సాగింది? విమర్శలను, ఒత్తిడిని మీరెలా అధిగమించారు?

ప్రతి ప్రయాణంలో నిలకడ చాలా ముఖ్యం. కెరీర్ ఆరంభంలో వైఫల్యం... ఫిక్సింగ్ వివాదం సమయంలో సారథ్యం... కొవిడ్-19 కాలంలో బీసీసీఐ అధ్యక్షుడిగా ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నా. బ్యాటర్‌గా ఆఫ్‌సైడ్ ఆటను మెరుగుపరుచుకున్నా. కెప్టెన్‌గా జట్టులో దూకుడు నింపా. విమర్శల గురించి నేను పెద్దగా పట్టించుకోను. ఆటపైనే నా దృష్టి ఉండేది. ఒత్తిడి ఉన్నప్పుడు కుటుంబంతో సమయం గడుపుతా.

? భారత క్రికెట్లో మీరెలా గుర్తుండాలని కోరుకుంటున్నారు?

18,000 పైచిలుకు పరుగులు.. విజయాల కంటే భారత క్రికెట్ ఆలోచనా విధానాన్ని, దృక్పథాన్ని, భారత ముఖచిత్రాన్ని మార్చిన వ్యక్తిగా ఎప్పటికీ గుర్తుండిపోవాలని ఉంది. 2000 సంవత్సరం కంటే ముందు భారత ఆటగాళ్లపై మరీ నెమ్మదస్థులనే ముద్ర ఉండేది. దాన్ని మార్చి దూకుడు తీసుకొచ్చా. భయంలేని పోరాటతత్వాన్ని నేర్పించా. లార్డ్స్‌లో చొక్కా విప్పి చేసిన సంబరాలు ఆ ఆత్మవిశ్వాసానికి ప్రతీక. హర్భజన్, జహీర్, సెహ్వాగ్, యువరాజ్, మహ్మద్ కైఫ్ వంటి ప్రతిభావంతులను ప్రోత్సహించా. బీసీసీఐ అధ్యక్షుడిగా మహిళా క్రికెట్ అభివృద్ధి, ఆటగాళ్ల సంక్షేమం కోసం చేసిన కృషి నాకు సంతృప్తినిచ్చాయి.

? వచ్చే దశాబ్ద కాలంలో ప్రపంచ క్రికెట్లో భారత్ పాత్రను.. వివిధ ఫార్మాట్లలో మన ఆధిపత్యాన్ని మీరెలా చూస్తారు?

ఆర్థికంగా, ఆటపరంగా ప్రపంచ క్రికెట్‌లో భారత్ ఎప్పుడూ అగ్రగామిగానే ఉంటుంది. మన దేశవాళీ వ్యవస్థ, ప్రతిభావంతులైన ఆటగాళ్ల లభ్యతతోనే సచిన్ తెందూల్కర్, రాహుల్ ద్రవిడ్ వంటి దిగ్గజాల నుంచి విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ వరకు.. ఇప్పుడు శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్ లాంటి యువ కెరటాల దాకా మార్పు చాలా సాఫీగా సాగింది. ద్వైపాక్షిక సిరీస్‌లలో.. ముఖ్యంగా ఆస్ట్రేలియా(2018-19) వంటి విదేశీ గడ్డపై మన విజయాల పరంపర కొనసాగుతోంది. ఐపీఎల్ ద్వారా టీ20లో కొత్త ఆవిష్కరణలు వస్తున్నా.. టెస్టు క్రికెట్ మనుగడను కాపాడటం అందరి బాధ్యత. భారత్‌లో ప్రతిభకు కొదవలేదు. అది ఏ ఫార్మాట్‌లోనైనా కనిపిస్తుంది. క్రికెట్లో వచ్చే దశాబ్దం కూడా భారత్‌దే.

? అంతర్జాతీయ క్రికెట్ కోసం ఆటగాళ్లను సిద్ధం చేయడానికి దేశవాళీ వ్యవస్థలో ఎలాంటి మార్పులు సూచిస్తారు?

ఫిట్‌నెస్‌ను తప్పనిసరి చేయాలి. ఆధునిక విశ్లేషణల ద్వారా సాంకేతికతను మెరుగుపరచాలి. విజువలైజేషన్ ద్వారా మానసిక దృఢత్వాన్ని పెంపొందించాలి. యువ ఆటగాళ్లు రంజీ ట్రోఫీకి ప్రాధాన్యతనివ్వాలి. బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో మెరుగైన శిక్షణ ఇప్పించాలి. చిన్న వయసులోనే విదేశీ పర్యటనలు చేస్తే వారు అంతర్జాతీయ స్థాయికి సిద్ధమవుతారు. జిల్లాస్థాయిలో బలమైన అకాడమీలు, వయో పరిమితి టోర్నీల ద్వారా ప్రతిభను గుర్తించాలి. రాష్ట్రస్థాయిలో ప్రతిభకే పట్టం కట్టాలి. రంజీ ట్రోఫీ అనుభవాన్ని తప్పనిసరి చేయాలి. జాతీయ స్థాయిలో డేటా, ఫిట్‌నెస్, మానసిక దృఢత్వ పరీక్షల ఆధారంగా పారదర్శకమైన ఎంపిక ప్రక్రియ ఉండాలి.

? ఐపీఎల్ ప్రభావం సుదీర్ఘ ఫార్మాట్లైన టెస్టులు, రంజీ ట్రోఫీ మ్యాచ్‌లపై పడకుండా ఉండాలంటే ఏం చేయాలి?

ఐపీఎల్‌తో ఆటగాళ్లలో ఆత్మవిశ్వాసం పెరుగుతందనడంలో సందేహం లేదు. కానీ అది అన్ని ఫార్మాట్లకు ఊతమిచ్చేలా ఉండాలి. యువ ఆటగాళ్లు ఐపీఎల్‌లోకి రావడానికి ముందు తప్పనిసరిగా కనీసం రెండేళ్లు రంజీ క్రికెట్ ఆడాలనే నిబంధన తేవాలి. ఐపీఎల్ ఆదాయాన్ని దేశవాళీ క్రికెట్‌కు, మౌలిక సదుపాయాలకు మళ్లించాలి. టెస్టు మ్యాచ్‌లకు ఐపీఎల్ షెడ్యూల్‌తో ఇబ్బంది లేకుండా చూడాలి.

? కెరీర్ ఆరంభంలోనే పెద్ద విజయం సాధించినప్పుడు ఆటగాళ్లు ఎదుర్కొనే సవాళ్లు ఏమిటి? వాటిని ఎలా అధిగమించాలి?

తొందరగా వచ్చే విజయంతో అహంకారం పెరిగి, అలసత్వం వచ్చే ప్రమాదముంది. భారీ ఒప్పందాలు, ప్రకటనలతో ఫిట్‌నెస్, ప్రాథమిక అంశాలను నిర్లక్ష్యం చేసే అవకాశం లేకపోలేదు. అతిగా ప్రచారం లభిస్తే మానసిక ఒత్తిడికి లోనవుతారు. నేను కూడా తొలి పర్యటన తర్వాత జట్టులో స్థానం కోల్పోయా. 1996లో తిరిగి జట్టులోకి రావడానికి ఎంతో కష్టపడ్డా.

? మీరు ఆడినప్పటితో పోలిస్తే నేటి సోషల్ మీడియా యుగంలో ఆటగాళ్లపై నిఘా ఎలా ఉంది?

మా కాలంలో పత్రికలు, టీవీ ఛానెళ్లు మాత్రమే ఉండేవి. నా అరంగేట్రం వైఫల్యం సమయంలో తీవ్ర విమర్శలు వచ్చాయి. టీవీ కట్టేస్తే, పత్రిక చదవడం మానేస్తే ఆ ఒత్తిడి తెలిసేది కాదు. కానీ నేటి ఆటగాళ్లపై 24 గంటల నిఘా ఉంది. సోషల్ మీడియాలో నోటిఫికేషన్లు, వైరల్ వీడియోలు ప్రతి వైఫల్యాన్ని ఎత్తి చూపుతాయి. ఇది ఆటగాళ్లనే కాకుండా వారి కుటుంబ సభ్యులనూ లక్ష్యం చేసుకుంటుంది. మరోవైపు సోషల్ మీడియా హైప్ కారణంగా ఆటగాళ్లలో అసహనమూ పెరుగుతోంది. ఐపీఎల్ వైరల్ వీడియోలతో అనవసర పోలికలు వస్తున్నాయి. భారత జట్టుకు ఆడాలన్న లక్ష్యం ఉండాల్సిందే. కానీ దేశవాళీ క్రికెట్లో కష్టపడి మెరుగవ్వాలన్న సహనం కూడా అవసరం.

? సోషల్ మీడియా ఒత్తిడిని, నెగెటివిటీని యువ ఆటగాళ్లు ఎలా అధిగమించాలి?

సోషల్ మీడియాలోని గోలను పట్టించుకోవద్దు. సోషల్ మీడియాకు దూరంగా ఉండి ఆటపైనే దృష్టి సారించాలి. భారతీయులు మానసిక దృఢత్వం కలిగిన వాళ్లని నిరూపించుకోవాలి. కనీసం రెండేళ్లు దేశవాళీ క్రికెట్లో కష్టపడాలి. కుటుంబం, మార్గనిర్దేశకుల సలహాలు తీసుకోవాలి. ట్రోల్స్ తాత్కాలికం.. సాధించే పరుగులు, తీసే వికెట్లే శాశ్వతం.


తప్పులున్నా.. తూచ్!

- అలాగే పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ

ఈనాడు, అమరావతి: తప్పుల్లేని పట్టాదారు పాసుపుస్తకాల్నే రైతులకు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించినా.. ఫొటోలు, పేర్లు, ఆధార్ ఇతరత్రా తప్పులుంటే గ్రామ సభలోనే సరిదిద్ది.. అక్కడికక్కడే గ్రామ సచివాలయం/మీసేవలో అధికారులే దరఖాస్తు చేయించాలని స్పష్టీకరించినా... జనవరి 2 నుంచి 9 వరకు జరిగిన పంపిణీలో అధికశాతం మండలాల్లో అలాంటి పరిస్థితి కనిపించలేదు. ఉన్నతస్థాయి అధికారుల ఆదేశాల్ని సిబ్బంది తూచ్ అని పక్కన పెట్టేశారు. తప్పులున్న వాటినే రైతులకు ఇచ్చేసి సంతకాలు తీసుకున్నారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి రావడంతో మిగిలిన వాటిని పంపిణీ చేయొద్దని ఆదేశించింది. ఒక్కో నియోజకవర్గంలో రెండు గ్రామాల్ని ఎంపిక చేసి ఫిబ్రవరిలో తప్పుల్లేని పాసుపుస్తకాల పంపిణీకి చర్యలు చేపట్టింది. మూడు దశల వడపోత తర్వాతే రైతుకు పాసు పుస్తకం అందేలా ప్రణాళిక రూపొందించింది. వచ్చే నెలలో నిర్వహించే ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు ఒక రోజు పాల్గొననున్నారు.

ఆ సంగతి అప్పుడే తెలుసు

తొలివిడత రీసర్వే చేసిన 4,783 గ్రామాలకు సంబంధించి 22.33 లక్షల పట్టాదారు పాసుపుస్తకాలు ముద్రించారు. వాటన్నిటినీ సమగ్రంగా పరిశీలించి తప్పుల్లేకుండా చూడాలని, లోపాలున్న వాటిని సరిచేసి ముద్రించాలని ప్రభుత్వం ఆదేశించింది. మండలస్థాయి అధికారులు మొక్కుబడిగా పరిశీలించి.. 1.18 లక్షల పుస్తకాల్లోనే తప్పులున్నాయని ప్రభుత్వానికి నివేదించారు. వాస్తవానికి 40% నుంచి 50% పుస్తకాల్లో తప్పులున్నాయి. ఈ విషయం అప్పుడే అధికశాతం మంది మండల రెవెన్యూ అధికారులు, సిబ్బందికి తెలుసు. కొందరు ప్రజాప్రతినిధులూ దీనిపై ఆందోళన వ్యక్తం చేశారు. అయినా వాటిని సరిచేయకుండా.. ఐదారు నెలలు తమ వద్దే అట్టిపెట్టుకున్నారు. వాస్తవ పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చే ప్రయత్నం చేయలేదు. తప్పులు సరిచేయాలంటే పుస్తకాలను జేసీ దాకా పంపాలని.. ఆయన అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేమనే అభిప్రాయం కొందరిలో వ్యక్తమైంది. జనవరి 2 నుంచి 9 వరకు 85%పైగా పుస్తకాల పంపిణీ పూర్తిచేశారు. తప్పులుంటే మీసేవకు వెళ్లి దరఖాస్తు చేసుకుంటే సరిదిద్దుతామని చెప్పారు.



అన్ని వివరాలూ సక్రమంగా నమోదయ్యాయా అని అడిగితే 42% మంది రైతులు లేదని బదులిచ్చారని రెవెన్యూశాఖ కార్యదర్శి సాయిప్రసాద్ కూడా సోమవారం నాటి శాఖాధిపతుల సమావేశంలో చెప్పారు.

ఆ పేయాలని మార్గదర్శకాలిచ్చినా...

తప్పులున్న పుస్తకాల్ని భూ యజమానులకు ఇవ్వొద్దని ప్రభుత్వం ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేసింది. అయినా ఎవరికి వారే 90%పైగా లక్ష్యం సాధించామని చెప్పే పనిలో పడ్డారు. సోమవారం నాటికి నంద్యాల జిల్లాలో 96% మందికి పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేశారు. డా.బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా 95%, మార్కాపురం 94%, పార్వతీపురం మన్యం 94%, ప్రకాశం జిల్లాలో 94% పంపిణీ చేశారు. అన్నమయ్య, శ్రీకాకుళం, పల్నాడు, శ్రీసత్యసాయి, అల్లూరి సీతారామరాజు, విజయనగరం, ఏలూరు జిల్లాల్లోనూ 90% పైనే పంపిణీ పూర్తయింది. తప్పులున్న పట్టాదారు పుస్తకాల్ని పంపిణీ చేయొద్దని ప్రభుత్వం స్పష్టంగాచెప్పింది. ఈ లెక్కన రాష్ట్రంలో పంపిణీకి సిద్ధం చేసిన 22.33 లక్షల పుస్తకాల్లో 40%పైనే నిలిపేయాలి. ఒక్కో మండలంలో ఎన్ని తప్పులు వచ్చాయో లెక్కలు చెప్పాలి. ఈ గొడవంతా ఎందుకని తప్పులున్నాయని తెలిసీ ఇచ్చేశారు. కొన్నిచోట్ల వసూళ్లూ చేశారు. పాసు పుస్తకాలు ఉచితంగా ఇవ్వలేదని డబ్బు తీసుకున్నారని విజయనగరం జిల్లాలో 34.8%, శ్రీసత్యసాయి జిల్లాలో 24.9%, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 24.4%, మన్యం జిల్లాలో 24.3%, చిత్తూరు జిల్లాలో 22.9%, శ్రీకాకుళం జిల్లాలో 21.6% మంది చెప్పారు. మడకశిర, ప్రత్తిపాడు, రాజాం, రంపచోడవరం, శృంగవరపుకోట నియోజకవర్గాల్లో 40% నుంచి 48% శాతం మంది పంపిణీపై అసంతృప్తి వెలిబుచ్చారు.

తప్పులెందుకు వచ్చాయి?

వైకాపా ప్రభుత్వ హయాంలో రీసర్వే అంతా తప్పుల తడకే. రైతుల ఫొటోలు సేకరించి ఆన్‌లైన్ చేసే సమయంలో ఒకరి బదులు మరొకరి ఫొటో పెట్టేశారు. ఆధార్ నంబర్లూ మార్చేశారు. గతంలో ఉన్న వెబ్‌ల్యాండ్ వివరాల్ని అసలే పట్టించుకోలేదు. కొన్నిచోట్ల చనిపోయిన పట్టాదారుల పేర్లతోనే ముద్రించారు.

ప్రత్యేక విధానంలో...

పట్టాదారు పాసుపుస్తకాల్లో తప్పులున్నాయనే ఫిర్యాదుల నేపథ్యంలో.. రెవెన్యూశాఖ ప్రత్యేక విధానం అమలు చేస్తోంది. సంక్రాంతి తర్వాత నుంచే అధికార యంత్రాంగం దీనిపై కసరత్తు చేసి.. ఫిబ్రవరిలో పట్టాదారు పాసుపుస్తకాలు అందించనుంది.

ప్రధానాంశాలు..

- ప్రతి నియోజకవర్గంలో రీసర్వే పూర్తయిన రెండు గ్రామాల్ని ఎంపిక చేసుకోవాలి.
- అక్కడ అన్ని ఖాతాల్నీ సమగ్రంగా పరిశీలించాలి.
- వాటిలో తప్పుల్ని తహసీల్దారు(జేసీ నుంచి తహసీల్దారుకు అధికారాలిచ్చారు) సరిచేయాలి.
- వ్యక్తిగత, భూవివరాలతో నమూనా పాసుపుస్తకం ప్రింట్ తీసి.. రైతులకు చూపాలి.
- వివరాలన్నీ సరిగా ఉన్నాయని అంగీకరిస్తే.. వారి ఈకేవైసీ, సంతకాలు తీసుకోవాలి.
- తప్పులున్నాయని ఫిర్యాదు చేస్తే వాటిని సరిచేయాలి. తర్వాతే ముద్రణకు పంపాలి.
- తహసీల్దారు, ఆర్డీవో 100%, జేసీ 5% చొప్పున వాటిని పరిశీలించాలి.
- పాసుపుస్తకం ముద్రణ పూర్తయ్యాక.. మరోసారి పరిశీలించాలి.
- ఫిబ్రవరిలో గ్రామసభలు నిర్వహించి పంపిణీ చేయాలి.
- జనవరిలో పంపిణీ చేయని వాటికీ ఇదే విధానాన్ని అనుసరించాలి.



స్కాన్ చేస్తే పొలం వివరాలు!

రైతులకు ప్రభుత్వం ఇస్తున్న పట్టాదారు పాసు పుస్తకాల్లో ప్రతి పేజీలోనూ క్యూఆర్ కోడ్ ముద్రించారు. దాన్ని స్కాన్ చేస్తే చాలు వివరాలన్నీ ఇట్టే ప్రత్యక్షమవుతున్నాయి. పుస్తకాల్లో భూముల వివరాలు రైతులకు అర్థమయ్యేలా తెలుగు, ఆంగ్లంలోనూ పొందుపరిచారు. భూమి స్వరూపం (స్కెచ్) కూడా ఇందులో చూసుకోవచ్చు. చిత్తూరు జిల్లా మొగరాలపల్లె గ్రామానికి చెందిన రైతు బాలకృష్ణమనాయుడు తన కుమారుడు ప్రదీప్ పేరిట వచ్చిన పట్టాదారు పాసుపుస్తకాన్ని తీసుకుని వివరాలన్నీ ఫోన్‌లో చూసుకున్నారు. - ఈనాడు, చిత్తూరు



నిన్నటి రోజు మీది కాకపోయినా..

ఓపిక, పట్టుదల ఉంటేనే గొప్ప విజయాలు సాధించగలం. నిన్న మీరు చేసిన కష్టం ఫలితమివ్వలేదని.. ఈరోజు శ్రమించడం మానకండి. నిన్నటి రోజు మీది కాకపోయినా.. ఈరోజు మీ జీవితంలో గొప్పదిగా మారొచ్చు. నిరంతరం సానుకూల దృక్పథంతో ముందుకెళ్లండి.
- గ్రెగ్స్, రియల్ ఎస్టేట్ ఏజెంట్

ముక్కంటి.. ముక్కోపి.. తీపి శంకరుడు!



గుంటూరు జిల్లా తెనాలిలోని శశి డెలీషియస్ దుకాణంలో బూందీ లడ్డూతో ప్రత్యేకంగా తయారు చేసిన శివలింగం, నందీశ్వరుడి ఆకృతులు ఆకట్టుకున్నాయి. సంక్రాంతి సందర్భంగా తాడేపల్లిగూడెంలో నిర్వహించే అమ్మవారి తిరునాళ్ల కోసం వీటిని 108 కిలోల బూందీతో తయారు చేసినట్లు నిర్వాహకులు వరదరాజులు, అనిల్‌కుమార్ తెలిపారు. కమిటీ ప్రతినిధులు మంగళవారం ప్రత్యేక వాహనంలో వాటిని తీసుకెళ్లారు. - న్యూస్‌టుడే, తెనాలి టౌన్

సార్లంక తండా అగ్నిప్రమాద బాధితులకు తక్షణ సాయంగా రూ.25 వేలు

- ఇల్లు కోల్పోయిన ప్రతి కుటుంబానికీ గృహం మంజూరు
- అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం

ఈనాడు, అమరావతి; కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా సార్లంక తండా అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా సాయం అందించాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. వారు ఎలాంటి ఇబ్బందులు పడకుండా తాత్కాలిక వసతితో పాటు అన్ని సౌకర్యాలు కల్పించి, అండగా నిలవాలన్నారు. తక్షణ సాయంగా ఒక్కో కుటుంబానికి రూ.25 వేల చొప్పున పరిహారం ఇవ్వాలని చెప్పారు. ఇల్లు కోల్పోయిన ప్రతి కుటుంబానికి గృహం మంజూరు చేయాలని పేర్కొన్నారు. అగ్ని ప్రమాద ఘటనపై మంత్రులు, అధికారులతో సీఎం చంద్రబాబు మంగళవారం సమీక్ష నిర్వహించారు. సార్లంక తండాలో జరిగిన అగ్ని ప్రమాదం తీవ్ర విషాదాన్ని మిగిల్చిందని సీఎం పేర్కొన్నారు. గ్రామంలోని మొత్తం 26 పూరిళ్లు అగ్నికి ఆహుతి అయ్యాయని, అవి 33 కుటుంబాలకు చెందినవని అధికారులు వివరించారు. ప్రమాదంలో కాలిపోయిన ఆధార్‌కార్డులు, ఇతర కీలక డాక్యుమెంట్లను బాధితులకు తిరిగి జారీ చేయడానికి గ్రామంలో ప్రత్యేక క్యాంప్‌లు నిర్వహించాలని చంద్రబాబు ఆదేశించారు. బాధిత కుటుంబాలకు అందుతున్న సహాయ కార్యక్రమాలను జిల్లా ఉన్నతాధికారులు, మంత్రులు నిరంతరం పర్యవేక్షించాలని సీఎం ఆదేశించారు. మరోవైపు ఒక్కో కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.10 లక్షలు మంజూరు చేసేలా సీఎంఆర్ఎఫ్‌కు కాకినాడ కలెక్టరేట్ నుంచి మంగళవారం ప్రతిపాదనలు పంపారు.



ఏలూరులో జాతర

ముందు జాతర తర్వాతే పండగ!

గంగానమ్మ ఉత్సవాల వల్ల ఏలూరులో కనిపించని సంక్రాంతి సందడి

ఈనాడు, ఏలూరు: రాష్ట్రం మొత్తం సంక్రాంతి సంబరాల్లో మునిగి తేలుతుంటే.. ఏలూరులో మాత్రం ఆ సందడే కనిపించడం లేదు. ఎందుకంటే.. దశాబ్దాలుగా నిర్వహిస్తూ వస్తున్న గ్రామదేవత ఉత్సవాలు సరిగ్గా ఇదే సమయంలో రావడమే ఇందుకు కారణం. ఏలూరువాసులు 12 ఏళ్లకోసారి గ్రామదేవత గంగానమ్మ జాతర నిర్వహించుకుంటారు. కొన్నేళ్ల నుంచి ఏడేళ్లకోసారి చేసుకోవాలని నిర్ణయించారు. ఈ మేరకు గతేడాది అక్టోబరు 26న జాతర మొదలైంది. మొత్తం 96 రోజులు జరిగే ఈ ఉత్సవం ఫిబ్రవరి 9తో ముగియనుంది. ఈ రోజుల్లో నగరం కోలాహలంగా ఉంటుంది. రోజుకో గ్రామదేవత గుడిలో పూజలు చేస్తారు. జాతర జరుగుతున్న రోజుల్లో స్థానికులు ఏ పండగలూ చేసుకోరు. కొత్త దుస్తులు ధరించరు. నిర్మాణాలు చేపట్టరు.. శుభకార్యాలూ చేసుకోరు. ఈ ఆనవాయితీ వల్ల ప్రస్తుతం ఏలూరులో సంక్రాంతి సంబరాలు కనిపించడం లేదు. జాతర ముగింపు రోజు మాత్రం పెద్దఎత్తున పండగ చేసుకుంటారు.

కోనసీమ సంక్రాంతి ఉత్సవ్ ఘనంగా ప్రారంభం

రామచంద్రపురం, న్యూస్‌టుడే: డా.బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం పట్టణంలోని వి.ఎస్.ఎం. కళాశాల ప్రాంగణంలో 'కోనసీమ సంక్రాంతి ఉత్సవ్-2026'ను కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, అమలాపురం ఎంపీ హరీష్ మాథుర్‌తో కలిసి మంగళవారం ఘనంగా ప్రారంభించారు. సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వేడుకల ప్రారంభోత్సవంలో మంత్రి మాట్లాడుతూ... కోనసీమ జిల్లా అంటేనే పచ్చని పైర్లు, కొబ్బరి తోటలు, నిండుగా ఉన్న నదులు, విశిష్ట సంస్కృతి అని... ఈ సంక్రాంతి ఉత్సవాలు వాటికి మరింత శోభను తెస్తాయన్నారు. నేటి నుంచి ఎస్.యానాం బీచ్‌లో మొదలయ్యే సంక్రాంతి ఉత్సవాల్లో గోవా తరహాలో వివిధ రకాల పోటీలు నిర్వహిస్తామన్నారు. 16న జగ్గన్నతోట ప్రభల తీర్థాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లూ చేశామన్నారు. అనంతరం రంగవల్లులు, ఎగ్జిబిషన్ స్టాళ్లను తిలకించారు. కలెక్టర్ మహేష్‌కుమార్, ఎమ్మెల్యేలు వేగుళ్ల జోగేశ్వరరావు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం తదితరులు పాల్గొన్నారు.





మండువా లోగిలి సెట్టింగ్ వద్ద మంత్రి సుభాష్, ఎంపీ హరీష్‌మాథుర్ తదితరులు
★ పందెంకోళ్లతో మంత్రి సుభాష్, తెదేపా జిల్లా కార్యదర్శి గంధం పల్లంరాజు, ఎంపీ హరీష్ మాథుర్, జనసేన ఇన్‌ఛార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ తదితరులు

పశ్చిమ బైపాస్‌లో రేపటి నుంచి.. కాజ-గొల్లపూడి మధ్య ఒకవైపు వాహనాల పరుగులు

- గుంటూరువైపు నుంచి వచ్చే వాహనాలు గొల్లపూడి, ఏలూరువైపు వెళ్లేందుకు వీలు
- ట్రయల్ రన్‌గా అన్ని వాహనాలకు అనుమతి

ఈనాడు-అమరావతి: విజయవాడ పశ్చిమ బైపాస్‌లో కాజ నుంచి గొల్లపూడి, ఏలూరు వైపు.. (ఒకవైపు) వెళ్లే వాహనాలను సంక్రాంతి సందర్భంగా ఈ నెల 15 (గురువారం) నుంచి అనుమతించనున్నారు. ట్రయల్ రన్ కింద ద్విచక్ర వాహనాలు, కార్లు, బస్సులు, లారీలు.. ఇలా అన్ని రకాల వాహనాలు బైపాస్‌లో ప్రయాణించేందుకు అవకాశం కల్పించనున్నారు. ఈ మేరకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం బైపాస్‌ను ఒకసారి పరిశీలించి.. గురువారం నుంచి వాహనాలను అనుమతించేందుకు సిద్ధమయ్యారు. దీంతో చెన్నై, గుంటూరు వైపు నుంచి వచ్చే వాహనాలు.. కాజ టోల్‌గేట్ దాటిన తర్వాత పశ్చిమ బైపాస్‌లోకి వచ్చి.. గొల్లపూడి మీదుగా చిన్నఅవుటపల్లి వరకు వెళ్లి, అక్కడ ఏలూరువైపు హైవేలోకి చేరుకొని వెళ్లిపోవచ్చు. ఇప్పటికే గొల్లపూడి నుంచి చిన్నఅవుటపల్లి మీదుగా వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. గురువారం నుంచి కాజ వైపు నుంచి వచ్చే వాహనాలు నేరుగా ఏలూరువైపు వెళ్లొచ్చు.

■ అలాగే గుంటూరు వైపు నుంచి వచ్చే వాహనాలు ఈ బైపాస్‌లో గొల్లపూడి వద్ద విజయవాడ-హైదరాబాద్ హైవేలోకి చేరుకొని హైదరాబాద్ వైపు వెళ్లిపోవచ్చు. దీంతో గుంటూరు వైపు నుంచి వచ్చే వాహనాల్లో ఏలూరు, హైదరాబాద్ వెళ్లే వాహనాలేవీ.. విజయవాడ నగరంలోకి రావాల్సిన అవసరం ఉండదు. అయితే ఈ పశ్చిమ బైపాస్‌లో గొల్లపూడి వైపు నుంచి వచ్చే వాహనాలకు మాత్రం ప్రస్తుతం కాజ వరకు వచ్చేందుకు అవకాశం లేదని ఎన్‌హెచ్ఏఐ అధికారులు తెలిపారు. మధ్యలో కొన్ని చోట్ల పనులు జరుగుతున్నాయని అధికారులు తెలిపారు. ఆ వాహనాలు ప్రస్తుతం అనుమతి ఉన్నట్లే గొల్లపూడి వైపు నుంచి వచ్చేటప్పుడు కృష్ణా నదిపై వంతెన, సీడ్ యాక్సెస్ రోడ్డు దాటిన తర్వాత మంగళగిరి-మందడం రోడ్డులోకి చేరుకొని సచివాలయం, హైకోర్టు వైపు వెళ్లొచ్చని పేర్కొన్నారు.

ఘనంగా ముగిసిన గండికోట ఉత్సవాలు



శివమణి వాయిద్య ప్రదర్శన

ఈనాడు, కడప, జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు మండలంలోని చారిత్రక గండికోటలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. పర్యాటక ప్రాధాన్యాన్ని చాటేలా.. కళా, సాంస్కృతిక ప్రదర్శనలు, క్రీడా పోటీలు ఆకట్టుకున్నాయి. క్రీడల్లో గెలుపొందిన విజేతలకు కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, తెదేపా జిల్లా అధ్యక్షుడు భూపేష్‌రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. ఉత్సవాల చివరి రోజైన మంగళవారం రాత్రి ప్రముఖ డ్రమ్మర్ శివమణి ప్రదర్శన అలరించింది. సినీ నటుడు కిరణ్ అబ్బవరం హాజరై మాట్లాడారు. సందర్శకులకు ప్రత్యేక అనుభూతినిచ్చిన హెలికాప్టర్ రైడ్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. గండికోట ప్రాశస్త్యంపై కృత్రిమ మేధ(ఏఐ)తో రూపొందించిన డోమ్‌ను పర్యాటకులు ఆసక్తిగా తిలకించారు.



మాట్లాడుతున్న నటుడు కిరణ్ అబ్బవరం

గేట్ల నిర్వహణకు నీళ్లొదిలారు!

- పనిచేయని స్థితిలో నాగార్జునసాగర్ కుడికాలువ హెడ్ రెగ్యులేటర్ గేట్లు
- 11 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీటి గండం!



నాగార్జునసాగర్ కుడికాలువ హెడ్ రెగ్యులేటర్

ఈనాడు, అమరావతి: నాగార్జునసాగర్ ప్రాజెక్టు కుడికాలువ హెడ్ రెగ్యులేటర్ గేట్లకు రెండేళ్లుగా నిర్వహణ లేకపోవడంతో అధ్వానంగా మారాయి. మొత్తం 9 గేట్లకుగానూ 2 మినహా, మిగతావి సాంకేతిక, మెకానికల్, విద్యుత్ సరఫరా సమస్యలతో నిర్వహించలేని స్థితికి చేరాయి. 2025 అక్టోబరులో జలవనరుల శాఖ ఇంజినీర్లు అన్ని గేట్లనూ తనిఖీచేసి, చేపట్టాల్సిన మరమ్మతులపై ప్రభుత్వానికి సమగ్ర నివేదిక ఇచ్చారు. దీనిపై ఎలాంటి స్పందనా లేదు. కుడికాలువ హెడ్ రెగ్యులేటర్‌తో పాటు ప్రధాన డ్యామ్‌లో 13 గేట్లను 2023 నవంబరు 30న ఏపీ ప్రభుత్వం తెలంగాణ నుంచి తన ఆధీనంలోకి తీసుకుంది. అప్పటిదాకా వీటి నిర్వహణ, మరమ్మతులను తెలంగాణ ప్రభుత్వమే చేపట్టింది. ఏపీ ఆధీనంలోకి వచ్చినప్పటి నుంచి మరమ్మతులకు నిధులు, నిర్వహణకు సిబ్బంది లేక ఇబ్బందులు మొదలయ్యాయి. ప్రధాన డ్యామ్ మరో 13 గేట్లు ఏపీ ఆధీనంలో ఉన్నప్పటికీ తెలంగాణ ప్రభుత్వమే నిర్వహిస్తోంది. ప్రస్తుతానికి జలవిద్యుత్ కేంద్రం నుంచి కుడి కాలువకు నీటిని వదులుతున్నారు. డ్యామ్‌లో నీటిమట్టం 535 అడుగుల కంటే తగ్గితే రెగ్యులేటర్ గేట్ల ద్వారా వదలాల్సి ఉంటుంది. అప్పుడెలా అని ఇంజినీర్లు మల్లగుల్లాలు పడుతున్నారు. పల్నాడు, బాపట్ల, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో 11.16 లక్షల ఎకరాలకు సాగునీటి గండం పొంచి ఉంది.

ఒక్కో గేటుకు ఒక్కో సమస్య

◆ అన్ని గేట్లలో బ్రేక్ మోటార్లు, బ్రేక్ సిస్టమ్స్, ఎలక్ట్రికల్ ప్యానల్ బోర్డులు, మెకానికల్, డిజిటల్ డయల్ ఇండికేటర్స్ దెబ్బతిని పనిచేయడం లేదు.

◆ గేట్ల ఆపరేషన్‌కు ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్ లేదు. విజయపురిసౌత్ కాలనీలోని ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ తీసుకుంటున్నారు. అక్కడ సరఫరాకు అంతరాయం ఏర్పడితే జనరేటర్ బ్యాకప్ లేదు.

◆ గేట్ నంబర్లు 5 నుంచి 9 వరకు ఆపరేషన్ సమయంలో ఇరుక్కుపోవడంతో జాకింగ్ పద్ధతిలో కిందికి దించారు.

◆ 1, 6వ గేట్లకు ఉన్న ఎమర్జెన్సీ ద్వారాలను తొలగిస్తేనే నీటి విడుదల సాధ్యమవుతుంది.

◆ రెండో గేట్‌ను దించేటప్పుడు సిల్ బీమ్‌పై అమరడం లేదు.

◆ 3, 4, 9వ గేట్లకు విద్యుత్ సరఫరా, ఆపరేషన్ ప్యానల్ బోర్డులో సమస్యలున్నాయి.

◆ జలవిద్యుత్ కేంద్రంలో 1, 2 యూనిట్లు కొన్నాళ్లు పని చేయకపోవడంతో 5, 7వ గేట్ల నుంచి కుడి కాలువకు నీటిని వదిలారు. ఆ పవర్ యూనిట్లను పునరుద్ధరించినప్పటికీ, సాంకేతిక సమస్యలతో ఆ గేట్లను మూసివేయలేదు. ఇప్పటికీ అక్కడ నీరు లీకవుతోంది.

సరిపడా సిబ్బంది లేక..

గేట్లు, స్టాప్‌లాక్ గేట్లు, క్రేన్లను పర్యవేక్షించడానికి సాంకేతిక సిబ్బంది లేనందున డీఈఈలు, ఏఈఈలు చూస్తున్నారు. ఏపీ పరిధిలోని ప్రధాన డ్యామ్ 13 గేట్లు, కుడికాలువ హెడ్ రెగ్యులేటర్ 9 గేట్ల నిర్వహణకు ఒక్కో షిఫ్ట్‌లో 14 మంది చొప్పున మొత్తం 42 మంది ఉద్యోగులు అవసరమని జలవనరులశాఖ ప్రతిపాదించింది. గేట్ ఆపరేటర్లు, హెల్పర్లు, ఎలక్ట్రీషియన్లు, ఫిట్టర్లు, లస్కర్లు ఎంతమంది అవసరమో నివేదించింది. కానీ, ప్రభుత్వం నుంచి స్పందన కొరవడింది.

ఉన్నత విద్య ప్రవేశ పరీక్షలకు కన్వీనర్ల నియామకం

ఈనాడు, అమరావతి: ఉన్నత విద్యలో ప్రవేశాలకు నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్షలకు కన్వీనర్లను ఉన్నత విద్యామండలి మంగళవారం నియమించింది. ఆయా సెట్‌లకు వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన ఆచార్యులను కన్వీనర్లుగా నియమిస్తూ ఉన్నత విద్య మండలి కార్యదర్శి ఆచార్య బి.తిరుపతిరావు ఉత్తర్వులిచ్చారు. ప్రవేశ పరీక్షలు ఏప్రిల్ 23 నుంచి మొదలు కానున్నాయి. ఆ వివరాలు ఇలా..

సెట్	ప్రవేశ పరీక్ష తేదీ	కన్వీనర్ పేరు
ఏపీఈసెట్ (డిప్లొమా విద్యార్థులకు ఇంజినీరింగ్‌లో లాటరల్ ఎంట్రీ)	ఏప్రిల్ 23	ఆచార్య బి.దుర్గాప్రసాద్, జేఎన్‌టీయూ, అనంతపురం
ఐసెట్(ఎంబీఏ, ఎంసీఏ)	ఏప్రిల్ 28	ఆచార్య ఎం.శశి, ఆంధ్ర విశ్వవిద్యాలయం
పీజీఈసెట్(ఎంటెక్, ఎం.ఫార్మసీ)	ఏప్రిల్ 29, 30, మే 2	ఆచార్య పి.మల్లికార్జునరావు, ఆంధ్ర విశ్వవిద్యాలయం
లాసెట్(ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం)	మే 4	ఆచార్య టి.సీతాకుమారి, ఎస్పీఎంవీవీ
ఎడ్‌సెట్ (బీఈడీ)	మే 4	ఆచార్య డి.శ్రీనివాస్‌కుమార్, ద్రవిడ విశ్వవిద్యాలయం
పీజీసెట్(ఎంఏ, ఎంఎస్సీ, ఎంకాం)	మే 5, 8 నుంచి 11	ఆచార్య వి.పద్మావతి, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం
ఈఏపీసెట్(ఇంజినీరింగ్)	మే 12-15, 18న	ఆచార్య ఎన్.మోహన్‌రావు, జేఎన్‌టీయూ, కాకినాడ
ఈఏపీసెట్ (వ్యవసాయం, ఫార్మా)	మే 19, 20	ఆచార్య ఎన్.మోహన్‌రావు, జేఎన్‌టీయూ, కాకినాడ
పీఈసెట్(బీపీఈడీ, యూజీ డీపీఈడీ, ఎంపీఈడీ)	మే/జూన్ (తేదీలు ప్రకటించలేదు)	ఆచార్య పీపీఎస్ పాల్‌కుమార్, నాగార్జున విశ్వవిద్యాలయం

మద్యం దుకాణానికి నిప్పు

ఇది ఎమ్మెల్యే అనుచరుల పనే: బాధితుడు



ఈనాడు, అనంతపురం; అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అనంతపురంలోని సర్వీసు రోడ్డులో ఉన్న నంబూరి వైన్స్ దుకాణానికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. మంగళవారం తెల్లవారుజామున ఇద్దరు వ్యక్తులు పెట్రోలు డబ్బాలతో దుకాణం వద్దకొచ్చి, గోనె సంచులను పెట్రోలుతో తడిపి షటర్ కింది నుంచి లోనికి వేసి నిప్పు పెట్టినట్లు సీసీ కెమెరా ఫుటేజీల్లో రికార్డయింది. ఈ ఘటనలో దుకాణంలోని సరకంతా దహనమైంది. ఫ్రిజ్, అందులోని ఖరీదైన మద్యమూ కాలిపోయింది. రూ.4 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు వెంకటరమణ తెలిపారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అనుచరులే నిప్పుపెట్టారని ఆరోపించారు. మద్యం టెండర్ల సమయంలోనూ షాపు వదిలిపెట్టాలని ఎమ్మెల్యే తన అనుచరుడు గంగారాం ద్వారా బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపించారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ స్పందించి ఎమ్మెల్యేను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలన్నారు. మరోపక్క, ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు.. ఎమ్మెల్యే అనుచరుడు మోహన్‌ను మంగళవారం రాత్రి అరెస్టు చేశారు.

కావాలనే దుష్ప్రచారం: ఎమ్మెల్యే

'ఘటనతో నాకెలాంటి సంబంధం లేదు. నేను సోమవారమే హైదరాబాద్ వెళ్లా. కొందరు కావాలనే నాపై దుష్ప్రచారం చేస్తున్నారు. అన్ని విషయాలను పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తా' అని ఎమ్మెల్యే వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు.

తెలుగు ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకు.. వైకాపా, భారాస కుట్ర

- విద్వేషాలు రెచ్చగొట్టేలా.. సాక్షి, నమస్తే తెలంగాణ పత్రికల్లో కథనాలు
- కొమ్మారెడ్డి పట్టాభిరాం ధ్వజం



ఈనాడు, అమరావతి: రెండు తెలుగు రాష్ట్రాలూ.. రైతులూ బాగుండాలనేది ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచన అయితే తెలుగు ప్రజలు నాశనం కావాలనే దురుద్దేశంతో వైకాపా, భారాసలు వ్యవహరిస్తున్నాయని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరాం మండిపడ్డారు. మంగళగిరిలోని తెదేపా కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. 'రెండు తెలుగు రాష్ట్రాలూ తనకు రెండు కళ్లు అని చెప్పిన స్టేట్స్‌మన్ చంద్రబాబు. స్వార్థ రాజకీయాలే ప్రధానం అనే విధంగా వైకాపా, భారాస నేతల తీరు ఉంది. పోలవరం ఎత్తును ఒక మీటరు తగ్గించుకుంటే ఏమవుతుందని తెలంగాణ అప్పటి సీఎం కేసీఆర్ అసెంబ్లీలో మాట్లాడితే.. ఆ వ్యాఖ్యల్ని నాటి సీఎం జగన్ ఖండించాల్సింది పోయి... అసెంబ్లీలో పొగడ్తలతో ముంచెత్తారు. ఇప్పుడు అదే జగన్ రాయలసీమ ఎత్తిపోతల పేరుతో కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. స్వార్థ రాజకీయాల కోసం జగన్, భారాస నేతలు పనిచేస్తున్నారు' అని పట్టాభిరాం ధ్వజమెత్తారు.

ఏపీలో జగన్.. తెలంగాణలో కేసీఆర్ డ్రామాలు

'రాయలసీమ ఎత్తిపోతల పథకం, ఇతర ప్రాజెక్టులపై నమస్తే తెలంగాణ, సాక్షి పత్రికలు తప్పుడు కథనాలు రాస్తున్నాయి. రెండు రాష్ట్రాల ప్రజల్ని రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నాయి. తెలంగాణ నీటికి చంద్రబాబు అడ్డుపడుతున్నారంటూ నమస్తే తెలంగాణ తప్పుడు కథనం ప్రచురించింది. సీమకు బాబు ద్రోహం తలపెడుతూ తెలంగాణకు న్యాయం చేస్తున్నారంటూ సాక్షిలో తప్పుడు కథనం వచ్చింది. ఆ రెండు పార్టీలు, రెండు పత్రికలు, రెండు కుటుంబాలు కలిసి తెలుగు ప్రజలను మోసగిస్తున్నాయి. రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ఆపింది మేమే అంటూ భారాస నేత హరీశ్‌రావు మాట్లాడిన వార్తను నమస్తే తెలంగాణలో రాస్తారు. సీమ లిఫ్ట్‌ను నేనే ఆపించానంటూ సీఎం రేవంత్ మాట్లాడినట్లు సాక్షిలో రాస్తారు. నీ రాష్ట్రంలో నీ డ్రామా నువ్వు ఆడు.. నా రాష్ట్రంలో నా డ్రామా నేను ఆడతా అంటూ జగన్, కేసీఆర్‌లు వ్యవహరిస్తున్నారు' అని పట్టాభిరాం దుయ్యబట్టారు. 'రాయలసీమకు నీరు ఇచ్చే విషయంలో తెలంగాణ రైతాంగాన్ని కలుపుకొని ముందుకు వెళ్లాలన్నది కూటమి ప్రభుత్వ విధానం. వైకాపా సర్కారు హయాంలో రాయలసీమ ఎత్తిపోతల పథకం పేరుతో వైకాపా నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రూ.1,000 కోట్లు దోచుకున్నారు. అందుకే మిథున్‌రెడ్డి ఆస్తులు పెరిగాయి' అని దుయ్యబట్టారు.

ప్రముఖ కవయిత్రి రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్ కన్నుమూత



హైదరాబాద్, న్యూస్‌టుడే: ప్రముఖ కవయిత్రి రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్(96) మంగళవారం హైదరాబాద్ గోషామహల్ ప్రాంతంలోని జ్ఞాన్‌బాగ్ ప్యాలెస్‌లో కన్నుమూశారు. ఆమె దివంగత కవి గుంటూరు శేషేంద్రశర్మ భార్య. రాజకుమారి ఇందిరాదేవి చిత్రకారిణి, రచయిత్రి, కవయిత్రి. హైదరాబాద్‌కు రెండుసార్లు ప్రధానమంత్రిగా పనిచేసిన కిషన్ పర్షాద్‌తో క్యారమ్స్ కూడా ఆడారు. అల్లా ఇక్బాల్, గాలిబ్, అరబిందో రచనల నుంచి ప్రేరణ పొందిన ఇందిరాదేవి సాహిత్యం వైపు మళ్లారు. యుక్తవయసు నుంచీ ఫొటోగ్రఫీపై ఆసక్తితో ఫొటోల సేకరణ మొదలుపెట్టారు. 1964లో ఆమె మొదటి కవితా సంపుటి 'ది అపోసల్' పేరుతో ప్రచురించారు. 1965, 1966లలోనూ ఆమె పుస్తకాలు ప్రచురితమయ్యాయి. 1970లో గుంటూరు శేషేంద్రశర్మను వివాహం చేసుకున్నారు. ఆమె ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హిందీ అకాడమీకి మొదటి అధ్యక్షురాలిగా, ఉర్దూ అకాడమీ ఛైర్‌పర్సన్‌గా పనిచేశారు. 1973లో వరల్డ్ పోయెట్రీ సొసైటీ ఇంటర్‌కాంటినెంటల్ (డబ్ల్యూపీఎస్ఐ) అధ్యక్షుడు కృష్ణ శ్రీనివాస్ ఆమె పేరును సాహిత్యంలో నోబెల్‌కు నామినేట్ చేశారు. ఈ గౌరవాన్ని పొందిన మొదటి భారతీయ మహిళ ఈమె. రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్ రచించిన 'అలనాటి కథ'ను ఇటీవల ఎమెస్కో ముద్రించింది.

మైక్రో బ్రూవరీల ఏర్పాటుకు... నిబంధనల సడలింపు

- నగరపాలక సంస్థ పరిధి దాటి 5 కి.మీ. వరకూ ఎక్కడైనా పెట్టుకోవచ్చు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో మైక్రో బ్రూవరీల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలు సడలించింది. ఇప్పటివరకూ నగరపాలక సంస్థల పరిధిలోనే వీటి ఏర్పాటుకు అవకాశం ఉండేది. తాజాగా సవరించిన నిబంధనల ప్రకారం.. నగరపాలక సంస్థల పరిధి దాటి 5 కిలోమీటర్ల వరకూ ఎక్కడైనా ఏర్పాటు చేసుకోవచ్చు. ప్రభుత్వం గుర్తించిన(డిజిగ్నేటెడ్) అన్ని పర్యాటక కేంద్రాల్లోనూ ఎలాంటి భౌగోళిక పరిమితులూ లేకుండా మైక్రో బ్రూవరీల ఏర్పాటుకు ప్రభుత్వం అవకాశమిచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడైనా సరే త్రీ స్టార్, అంతకంటే పైబడిన హోటళ్లలో ప్రాంతంతో నిమిత్తం లేకుండా మైక్రో బ్రూవరీల ఏర్పాటుకు పచ్చజెండా ఊపింది. ఇన్‌స్టాల్డ్ కెపాసిటీ రోజుకు వెయ్యి బల్క్ లీటర్ల మించకుండా ఉండాలని పేర్కొంది. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్‌కుమార్ మీనా ఉత్తర్వులిచ్చారు.

పర్యాటక రంగానికి గొప్ప ఊతం

నిబంధనల సడలింపు పర్యాటక రంగానికి గొప్ప ఊతమిస్తుందని ఏపీ స్టార్ హోటల్స్ అసోసియేషన్ పేర్కొంది. ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.వి.స్వామి మంగళవారం ప్రకటన విడుదల చేశారు. రోజుకు 1,000 బల్క్ లీటర్ల వరకూ డ్రాఫ్ట్ బీర్ తయారీకి అనుమతించడం ద్వారా హోటల్ పరిశ్రమకు ఆర్థిక బలం చేకూరుతుందన్నారు. 'దిల్లీ, కోల్‌కతా, ముంబయి వంటి మహా నగరాలకే పరిమితమైన ఈ అవకాశాన్ని ఇప్పుడు ఏపీకి తీసుకురావడం వల్ల పర్యాటక రంగం అంతర్జాతీయ ప్రమాణాలకు చేరువవుతుంది. రాష్ట్రానికి కొత్త పెట్టుబడులు, ఉద్యోగావకాశాలొస్తాయి' అని పేర్కొన్నారు. బార్ల నుంచి వసూలు చేస్తున్న అదనపు రిటైల్ ఎక్సైజ్ సుంకాన్ని తొలగిస్తూ ఉత్తర్వులివ్వడమూ హోటల్ రంగానికి ఎంతో మేలు చేస్తుందన్నారు.

15వ ఆర్థిక సంఘం నిధులు రూ.567 కోట్లు విడుదల

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో వైద్య ఆరోగ్యాభివృద్ధి కోసం 15వ ఆర్థిక సంఘం సిఫార్సు చేసిన రూ.2,600 కోట్లలో ఆఖరి, 5వ విడతకు సంబంధించిన గ్రాంటు రూ.567 కోట్లను కేంద్ర ప్రభుత్వం మంగళవారం విడుదల చేసిందని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. దీంతో 15వ ఆర్థిక సంఘం సిఫార్సు చేసిన మొత్తం గ్రాంటును పొందటంలో రాష్ట్రం సఫలీకృతమైందని పేర్కొన్నారు. వివిధ పథకాల కింద కేంద్రం నుంచి రావాల్సిన గ్రాంట్లు, నిధులను పొందేందుకు అధికారులు కృషిచేయాలని, అందులో విఫలమైతే వారినే బాధ్యులను చేస్తానని సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు.



సాకులు చెబితే సమస్యలు పరిష్కారం కావు!

మీ బరువు, ఆరోగ్యం, మానసిక స్థితి.. ఇవన్నీ రోజువారీ అలవాట్ల ప్రతిఫలాలే! అలవాట్లు బాగుంటే.. జీవితంలో దాదాపు 90% సమస్యలను అధిగమించొచ్చు. సాకులు చెప్పుకొంటూ సదలవాట్లను పక్కన పెడితే.. సమస్యలేవీ పరిష్కారం కావు.

– కెవిన్ జాబో, కంటెంట్ క్రియేటర్

అమ్మ చేతిలోనే పిల్లల భవిత

- తొలిసారిగా ఏఐ సాంకేతికతతో 'కేర్ అండ్ గ్రో' యాప్
- నారావారిపల్లె వేదికగా ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- రాష్ట్రవ్యాప్తంగా అమలుకు శ్రీకారం


ఆంధ్రా మదర్స్ యాప్ పనితీరును ముఖ్యమంత్రికి వివరిస్తున్న డా.మేఘన, చిత్రంలో కలెక్టర్ డా.వెంకటేశ్వర్, ఎమ్మెల్యే నాని ★ బాలికతో ముచ్చటిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు డిజిటల్, తిరుపతి: పిల్లల ఎదుగుదల అంటే పౌష్టికాహారం, ఎత్తు, బరువు మాత్రమే కాదు.. అంతకుమించిన 'మేధోసంపత్తి' అని చాటిచెప్పేలా ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలో ఓ విప్లవాత్మక కార్యక్రమానికి అంకురార్పణ చేశారు. ఆరేళ్లు నిండేలోపే 90% మెదడు ఎదుగుదల పూర్తవుతుందన్న శాస్త్రీయ వాస్తవాన్ని ఆధారంగా చేసుకుని.. చిన్నారుల సమగ్ర వికాసమే లక్ష్యంగా ఏఐ సాంకేతికతతో రూపొందించిన 'కేర్ అండ్ గ్రో' మొబైల్ యాప్‌ను ముఖ్యమంత్రి నారావారిపల్లెలో మంగళవారం ప్రారంభించారు. 'ఆంధ్రా మదర్స్ చైల్డ్ సక్సెస్' పేరుతో ఈ యాప్ అందుబాటులోకి వచ్చింది.

పౌష్టికాహారం ఒక్కటే సరిపోదు

అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల శారీరక ఆరోగ్యంపైనే దృష్టిపెడతారు. కానీ అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఈ యాప్‌తో పిల్లల మెదడు పనితీరు, భాషా నైపుణ్యాలు, సామాజిక ప్రవర్తన, గ్రహణశక్తి లాంటి కీలకాంశాలను పరీక్షిస్తారు. 0-6 ఎర్లీ చైల్డ్‌హుడ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా స్వర్ణనారావారిపల్లెలో పైలట్ ప్రాజెక్టుగా 8 అంగన్‌వాడీ కేంద్రాల్లోని 271 మంది పిల్లలపై జరిపిన పరీక్షల్లో సానుకూల ఫలితాలు వచ్చాయి. స్క్రీనింగ్ తర్వాత 4% పిల్లల్లో తీవ్రమైన ఎదుగుదల లోపాలు ఉన్నట్లు గుర్తించారు. వాటిని సరైన సమయంలో గుర్తించకపోతే వారు భవిష్యత్తులో వెనుకబడిపోయే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఏఐ సాయంతో ఇంటివద్దే శిక్షణ

స్క్రీనింగ్: అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు ఏఐ ఆధారిత స్క్రీనింగ్ ద్వారా 20 నిమిషాల పాటు తెలుగులోనే సులభమైన ప్రశ్నలు వేసి, వారి మెదడు వికాసాన్ని అంచనావేస్తారు. పరీక్ష తర్వాత పచ్చరంగు వస్తే పిల్లల ఎదుగుదల బాగున్నట్లు, ఎరుపు వస్తే వెనకబడి ఉన్నట్లు గుర్తిస్తారు.

వ్యక్తిగత ప్రణాళిక: అందరికీ ఒకే రకమైన పాఠాలు కాకుండా, వెనకబడిన పిల్లలకు ప్రత్యేకమైన 'కస్టమైజ్డ్ బ్రెయిన్ డెవలప్‌మెంట్ ప్లాన్' ఇస్తారు. బుక్‌లెట్లు, ఆడియో, వీడియో కృత్యాలను యాప్ ద్వారా అందిస్తారు.

తల్లులే టీచర్లు

యాప్‌లో సూచించిన కృత్యాలను (ప్రాబ్లమ్ సాల్వింగ్, మోటార్ స్కిల్స్) తల్లులు ఇంట్లోనే చేయించాలి. పిల్లలు ఆ పనులు చేస్తున్నప్పుడు వీడియో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. నిపుణులు వాటిని పరిశీలించి పిల్లల ప్రగతిని ట్రాక్ చేస్తారు. ఆరునెలలకోసారి పరీక్షించి పిల్లల్లో వచ్చిన మార్పును గమనిస్తారు. ఉదాహరణకు ఒక పిల్లాడు సరిగ్గా మాట్లాడలేకపోతే, అతనికి 'స్పీచ్‌థెరపీ' లాంటి చిన్నచిన్న వ్యాయామాలు చేయించి, ఆ వీడియోలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. అందుకే ఈ విధానంలో తల్లుల పాత్ర కీలకం.

ఆ వ్యత్యాసాన్ని చెరిపేయడమే లక్ష్యం

ఒకే గ్రామంలో పుట్టిన ఇద్దరు పిల్లల్లో ఒకరు భవిష్యత్తులో ఇంజినీర్ అవుతున్నారు. మరొకరు వాచ్‌మన్‌గా మిగిలిపోతున్నారు. ఈ తేడాకు ప్రధాన కారణం బాల్యంలో మెదడుకు సరైన శిక్షణ లేకపోవడమే. ఆ తేడాను పూడ్చడమే మా లక్ష్యం. ఇప్పటికే కుప్పం నియోజకవర్గంలో 23 వేలమంది తల్లులు, నారావారిపల్లెలో 271 మందికి పైగా ఈ యాప్‌ను వినియోగిస్తున్నారు.

– డా.మేఘన, 'కేర్ అండ్ గ్రో' వ్యవస్థాపకురాలు

ఫలితాలు అద్భుతం.. గణాంకాలే సాక్ష్యం

పైలట్ ప్రాజెక్టులో భాగంగా తల్లులు 813 రకాల కృత్యాలను ఇంట్లోనే పూర్తిచేయగా.. రెండోసారి నిర్వహించిన స్క్రీనింగ్‌లో 60% పిల్లల్లో గణనీయమైన అభివృద్ధి కనిపించింది.

భాషా నైపుణ్యాలు: 30.6%,
గ్రహణ శక్తి: 42.6%, శారీరక చలనం: 24.7%
సామాజిక భావోద్వేగాలు: 42.2%


భోగాపురం విమానాశ్రయం సమీపంలో నిర్మాణంలో ఉన్న హోటల్


అరకులోయలో రిసార్టుల నిర్మాణం


తిరుపతిలో హోటల్ నిర్మాణ పనులు

పట్టణాల్లోనూ 'స్టార్' మెరుపులు!

- జోరుగా కొత్త హోటళ్లు, రిసార్టుల నిర్మాణం
- ఏడాదిన్నరలో రూ.5,820 కోట్లతో 27 ప్రాజెక్టులకు ప్రభుత్వం అనుమతులు

ఈనాడు, అమరావతి: స్టార్‌హోటళ్లు, రిసార్టులు ఇప్పటివరకు ప్రధాన నగరాల్లోనే కనిపించేవి. ఇప్పుడవి పట్టణాల్లోనూ సాక్షాత్కరించనున్నాయి. రాష్ట్రేతర ప్రాంతాలు, విదేశాల నుంచి వచ్చే పర్యాటకుల నుంచి సరైన వసతుల్లేవన్న మాట వినిపించకుండా కొత్తగా పలు స్టార్‌హోటళ్లు, రిసార్టులు సిద్ధమవుతున్నాయి. పర్యాటక రంగంలో ముందుకొచ్చే సంస్థలకు పీపీపీ విధానంలో ప్రభుత్వం భూములు కేటాయిస్తోంది. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించిన తర్వాత గత ఏడాదిన్నరలో రూ.5,820 కోట్ల పెట్టుబడులొచ్చాయి. వీటిద్వారా 27 స్టార్‌హోటళ్లు, రిసార్టుల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులిచ్చింది. వీటిలో మూడు ఇటీవలే ప్రారంభమయ్యాయి.

భూములు చూపిస్తారు... డీపీఆర్‌లకూ సహకరిస్తారు

పర్యాటకశాఖకు వివిధ జిల్లాల్లో ఉన్న దాదాపు 3,900 ఎకరాల భూముల వివరాలు రాష్ట్ర పర్యాటక సంస్థ (ఏపీటీఏ) పోర్టల్‌లో పెట్టారు. పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టాలనుకునేవారు స్థలం ఎంపిక చేసుకుని ఏపీటీఏకి మెయిల్ పెడితే అధికారులే తీసుకెళ్లి భూములు చూపిస్తారు. ఇందుకోసం రూ.25 వేలు చెల్లించాలి.

◆ భూముల ఎంపిక పూర్తయ్యాక డీపీఆర్ తయారీకీ ఏపీటీఏ సహకరిస్తోంది. ఎంపికచేసిన కొందరు కన్సల్టెంట్లలో ఎవరితోనైనా తయారు చేయించుకోవచ్చు. ఇతరులతో తయారుచేయించి ఇచ్చినా అభ్యంతరం లేదు.

◆ డీపీఆర్‌ను అధికారులు పరిశీలించి అవసరమైతే మార్పులు సూచిస్తారు. పరిశీలన తర్వాత సీఎం అధ్యక్షతన నిర్వహించే రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) సమావేశంలో ఆమోదించాలి. అనంతరం ప్రాజెక్టు ఏర్పాటుకు 66 ఏళ్ల లీజుకు భూమి, ఇతర ప్రోత్సాహకాలు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిస్తుంది.

◆ అన్ని శాఖల నుంచి అనుమతులన్నీ సకాలంలో వచ్చేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. అన్ని దశల్లోనూ నోడల్ అధికారులను నియమించి ఎప్పటికప్పుడు పరిశీలించి జాప్యమైతే చర్యలు తీసుకుంటున్నారు.

పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాల్లోనే ఎక్కువ పెట్టుబడులు

రాష్ట్రంలోని పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాల్లో స్టార్‌హోటళ్లు, రిసార్టులు ఎక్కువగా ఏర్పాటవుతున్నాయి. విశాఖపట్నం, రాజధాని అమరావతి, విజయవాడ, తిరుపతి, బాపట్ల (సూర్యలంక), శ్రీశైలం, మంత్రాలయం, అరకు తదితర ప్రాంతాల్లో పలు సంస్థలు పెట్టుబడులు పెడుతున్నాయి.

రాష్ట్రంలో ఏర్పాటుచేసే హోటళ్లు, రిసార్టులు, వాటి పెట్టుబడుల వివరాలు

పర్యాటక ప్రాంతీయ కార్యాలయం	హోటళ్లు/ రిసార్టులు	గదులు	పెట్టుబడులు (రూ.కోట్లలో)
అమరావతి	8	1,191	1,297.12
విశాఖపట్నం	10	1,474	1,552.89
తిరుపతి	9	1,932	2,970.31
మొత్తం	27	4,597	5,820.32

అనుమతులిచ్చిన మొత్తం హోటళ్లు, రిసార్టులు: 21
ప్రారంభించినవి: 3; నిర్మాణంలో ఉన్నవి: 13
శంకుస్థాపనకు సిద్ధమైనవి: 11

50వేల హోటల్ గదులే లక్ష్యం

రాష్ట్రంలో 2029 నాటికి కొత్తగా 50వేల హోటల్ గదులను పర్యాటకులకు అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా ప్రభుత్వం యత్నిస్తోంది. రాష్ట్రంలో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న, త్వరలో భూమిపూజ చేయనున్న హోటళ్లతో కొత్తగా 31వేల గదులు వస్తాయని అధికారులు చెబుతున్నారు. వీటిద్వారా 22వేల మందికిపైగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించనుంది.

యుద్ధకళలో మీ విజయం స్ఫూర్తిదాయకం

- దశాబ్దాల సాధనతో యువతకు బలమైన సందేశమిచ్చారు
- పవన్‌కల్యాణ్‌ను అభినందించిన ప్రధాని మోదీ





ఈనాడు, అమరావతి: జపనీస్ కత్తి సాము కళ కెంజుట్సులో అధికారిక ప్రవేశం పొందడం ద్వారా అరుదైన ఘనత సాధించిన ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను ప్రధాని నరేంద్రమోదీ ప్రశంసించారు. ఈ మేరకు సందేశాన్ని పంపారు. 'జపనీస్ మార్షల్ ఆర్ట్స్ రంగంలో మీ విజయాల వివరాలు తెలుసుకున్నా. కెంజుట్సులో అధికారిక ప్రవేశంతో ఘనత సాధించినందుకు హృదయపూర్వక అభినందనలు. ప్రజా జీవితం, సినిమా కెరీర్‌లో బిజీగా ఉంటూనే క్రమశిక్షణతో.. నిజాయతీతో మార్షల్ ఆర్ట్స్‌ను అభ్యసించడం ప్రశంసనీయం. మార్షల్ ఆర్ట్స్‌లో దశాబ్దాల పాటు అంకితభావంతో మీరు చేసిన సాధన స్ఫూర్తిదాయకం. కొత్త విషయాలు నేర్చుకునేందుకు వృత్తిపరమైన బాధ్యతలు అడ్డంకి కాదన్న బలమైన సందేశాన్ని మీ విజయం ద్వారా యువతకు ఇచ్చారు. ఆరోగ్యకరమైన, చురుకైన సమాజాన్ని నిర్మించాలన్న లక్ష్యంతో రూపొందించిన ఫిట్ ఇండియా లాంటి కార్యక్రమాలకు ప్రజా జీవితంలో ఉన్న మీలాంటి వ్యక్తులు స్ఫూర్తినివ్వాలి. భవిష్యత్తులో మీరు చేసే ప్రతి ప్రయత్నంలోనూ విజయాలు సాధించాలని కోరుకుంటున్నా' అని మోదీ తన సందేశంలో పేర్కొన్నారు.

ప్రధానికి పవన్‌కల్యాణ్ కృతజ్ఞతలు

అభినందన సందేశం పంపిన ప్రధానికి పవన్‌కల్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు లేఖను పంపారు. 'మోదీజీ.. మీరు పంపిన ఆత్మీయ అభినందన సందేశం నాకు గొప్ప గౌరవం. ప్రేమపూర్వకమైన మీ సందేశం నాకు మరింత ప్రోత్సాహాన్ని ఇస్తుంది. యుద్ధ కళల పట్ల క్రమశిక్షణ, ఏకాగ్రత ఏళ్ల తరబడి నా జీవిత ప్రయాణంలో అంతర్భాగంగా ఉన్నాయి. ప్రజారోగ్య పరిరక్షణ కోసం మీరు తీసుకొచ్చిన ఫిట్ ఇండియా.. మీ దూరదృష్టికి నిదర్శనం. అంకిత భావంతో ప్రజలకు సేవ చేయాలన్న నా సంకల్పానికి మీలాంటి గొప్ప నాయకుడి నుంచి లభించిన ప్రోత్సాహం మరింత బలాన్నిస్తుంది' అని లేఖలో పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు.



అ'పూర్వ' కందనాలు

కొన్ని దశాబ్దాల కిందట పంట ఉత్పత్తులను కందనాల్లో ఉంచేవారు. నెలలు గడిచినా పురుగు పట్టకుండా భేషుగ్గా ఉండేవి. అలాంటి రెండు కందనాలు అనంతపురం జిల్లా యల్లనూరు మండలం వెన్నపూసపల్లెలోని ఓ ఇంట్లో ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయి. వీటిల్లో జొన్న, వరి లాంటి పంట ఉత్పత్తులను 10 క్వింటాళ్ల వరకు నిల్వ చేయొచ్చని యజమాని తెలిపారు.

– ఈనాడు, అనంతపురం



సంద్రం చెక్కిన శిల్పాలు!

సాగర గర్భంలో వివిధ ఆకృతుల్లో ఉండే ఇలాంటి శిలలను చూడాలంటే సముద్రుడు శాంతించాల్సిందే. విశాఖలోని జూపార్కు తీరంలో అలల తీవ్రత కొంత మేర తగ్గడంతో కొన్ని శిలలు ఇలా బయటపడ్డాయి. వీటికి పెద్ద సంఖ్యలో నత్త గుల్లలు అతుక్కొని ఉండటంతో సందర్శకులు ఆసక్తిగా తిలకించారు.

- న్యూస్‌టుడే, విశాఖపట్నం (సాగర్‌నగర్)



ఏలూరు ఎంపీని బెదిరించి.. రూ.10 కోట్లు డిమాండ్

ముంబయికి చెందిన నిందితుడి అరెస్టు

ఈనాడు, కడప: ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌తోపాటు, ఆయన తండ్రి మైదుకూరు ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్‌ను బెదిరించిన కేసులో ముంబయికి చెందిన రుషాంత్ జయకుమార్ వాడ్కే అనే వ్యక్తిని పోలీసులు అరెస్టుచేశారు. ఆర్టీఐ కార్యకర్తనని చెప్పుకొంటూ.. మీ ఆస్తుల చిట్టా విప్పుతానంటూ ఈ-మెయిల్స్ ద్వారా నిందితుడు బెదిరింపులకు దిగాడు. తనకు రూ.10 కోట్లు ఇస్తే మిమ్మల్ని వదిలిపెడతానని, లేదంటే వ్యవహారాన్ని కేంద్ర దర్యాప్తు బృందాలకు పంపి అంతు తేలుస్తానంటూ ఎంపీని పలుమార్లు బెదిరించాడు. తనకు వరుసగా ఫోన్ కాల్స్ వచ్చిన నేపథ్యంలో... ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ పీఏగా పని చేస్తున్న ఆది వద్దకు చర్చల నిమిత్తం నిందితుడిని ఎంపీ మహేష్ పంపారు. మైదుకూరు వచ్చిన నిందితుడు తనను కత్తితో బెదిరించి రూ.70 వేలు దోచుకుని పారిపోయాడని పోలీసులకు ఆది ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దక్షిణ ముంబయిలో ఉన్న నిందితుడిని మహారాష్ట్ర పోలీసుల సహకారంతో జిల్లా పోలీసులు అరెస్టు చేసి కడపకు తీసుకొచ్చారు. అతడిని కోర్టులో ప్రవేశపెట్టగా రిమాండ్ విధించడంతో కడప జైలుకు తరలించారు. ఎన్నికల్లో నామినేషన్ సందర్భంగా సమర్పించిన ఆస్తుల వివరాలను ఆధారంగా చేసుకుని ఎంపీతో పాటు ఎమ్మెల్యేను నిందితుడు బెదిరించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు ఆర్టీఐ కార్యకర్త కాదని దర్యాప్తులో తేలింది. ఇందులో మరో ఇద్దరి హస్తమూ ఉన్నట్లు తేలడంతో వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఇటీవల జరిగిన ఈ వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

రూ.83 కోట్లతో పట్టణాల్లో మరుగుదొడ్ల నిర్మాణం

ఈనాడు, అమరావతి: స్వచ్ఛ భారత్ మిషన్ అర్బన్ (ఎస్‌బీఎం-యు)లో భాగంగా పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో రూ.83.22 కోట్లతో వ్యక్తిగత, సామాజిక మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రభుత్వం పాలన అనుమతులిచ్చింది. మొత్తం వ్యయంలో కేంద్రం రూ.49.93 కోట్లు, రాష్ట్రం రూ.33.29 కోట్లు సమకూర్చనున్నాయి. పనులు, మెటీరియల్‌కు సంబంధించిన బిల్లులను మున్సిపల్ కమిషనర్లు ఆడిట్ చేసి ఈఈ సిఫార్సులతో స్వచ్ఛాంధ్ర సంస్థకు పంపాలని పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ మంగళవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



'మహా' తోక

ఎవరైనా అప్పు అడిగితే 'నా జీతమెంత? గొర్రె తోకలా బెత్తెడంత' అంటాం. కానీ ఈ గొర్రెలను చూస్తే పోలిక మార్చాల్సి వస్తుందేమో! ఎందుకంటే వీటి తోకలు బెత్తెడు కాదు మూరెడు ఉన్నాయి. మహారాష్ట్రలో ఈ బ్రీడ్ గొర్రెలు ఎక్కువగా ఉంటాయని వ్యాపారులు చెప్పారు. అక్కడి నుంచి తీసుకొచ్చిన గొర్రెలను తిరుపతిలో కొందరు మేపుతున్నారు. ఇటీవల ఆ మందను తీసుకెళ్తుండగా అందరూ ఆసక్తిగా చూశారు. – ఈనాడు, తిరుపతి

EENADU Vol: 52, Issue: 155 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్
బుధవారం జనవరి 14, 2026



భోగి మంటలు.. భోగభాగ్యాలు



విజయవాడ నగర సాయుధ విభాగం మైదానం మంగళవారం సంక్రాంతి శోభను సంతరించుకుంది. పోలీస్ కానిస్టేబుల్ మొదలు డీజీపీ హరీష్ కుమార్ గుప్తా వరకు కుటుంబ సమేతంగా కలిసి పండగ చేసుకున్నారు. పోలీస్ అధికారులు, వారి సతీమణులు సంప్రదాయ దుస్తుల్లో సందడి చేశారు. రంగవల్లులు తీర్చిదిద్ది భోగిమంటలు వెలిగించారు.

- విజయవాడ (గవర్నర్‌పేట), న్యూస్‌టుడే

నగరాభివృద్ధికి డీపీఆర్ తయారీ

సిద్ధమైన వెంటనే నిధులు: మంత్రి

ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే, కానూరు: విజయవాడ నగరాభివృద్ధి కోసం సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక(డీపీఆర్) సిద్ధమవుతోందని మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. డీపీఆర్ సిద్ధమైన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయిస్తామన్నారు. సమగ్ర నివేదిక తయారయ్యాకే ఎన్ని నిధులు అవసరమవుతాయనే అంచనా వస్తుందన్నారు. ఆ తర్వాతే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. విజయవాడలోని పెండింగ్ ప్రాజెక్టులపై సమీక్షించేందుకు సుజనాచౌదరి క్యాంపు కార్యాలయంలో పెనమలూరు, నగరానికి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలతో మంత్రి నారాయణ సమావేశమయ్యారు. నగరంలోని ప్రధాన సమస్యలను మంత్రి దృష్టికి ఎమ్మెల్యేలు తీసుకెళ్లారు.

✪ విజయవాడ సమగ్ర అభివృద్ధికి అవసరమైన ప్రణాళిక తయారు చేసే బాధ్యతను చెన్నై ఐఐటీకి చెందిన నిపుణులకు అప్పగించినట్టు సమీక్షలో పాల్గొన్న నగరపాలక సంస్థ అధికారులు వివరించారు. విజయవాడలోని అన్ని అవసరాలు తీర్చేలా డీపీఆర్ తయారవుతోందన్నారు. ప్రధానంగా వంతెనలు ఎక్కడెక్కడ నిర్మించాలి?, రహదారులు ఎక్కడ విస్తరించాలి?, మురుగునీటి కాలువలు, ఆర్‌వోబీలు, పైవంతెనలు, వర్షపు నీటి కాలువల నిర్మాణం.. సహా అన్నీ డీపీఆర్‌లో ఉంటాయన్నారు. డీపీఆర్ పూర్తికావడానికి.. కొంత సమయం పడుతుందని మంత్రి, ఎమ్మెల్యేలకు అధికారులు తెలియజేశారు.



సమీక్షలో మంత్రి నారాయణ, సుజనాచౌదరి, గద్దె రామ్మోహన్, బొండా ఉమా, బోడే ప్రసాద్

దుర్గగుడికి పార్కింగ్ స్థలం.. నగరపాలక సంస్థ కార్యాలయం, హెడ్‌వాటర్ వర్క్స్ వద్ద ఏర్పాటు చేసిన సౌర విద్యుత్తు ప్యానెళ్ల ద్వారా విద్యుత్తు ఉత్పత్తి చేస్తున్నట్టే.. మరికొన్ని ప్రాంతాల్లోనే ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సుజనా చౌదరి మంత్రిని కోరారు. దుర్గగుడికి చెందిన పార్కింగ్ కోసం నగరపాలక సంస్థకు చెందిన ఖాళీ స్థలాన్ని కేటాయించాలంటూ విజ్ఞప్తి చేశారు. ✪ అమరావతికి ముఖద్వారంగా ఉన్న విజయవాడ నగరాభివృద్ధికి ఎన్ని వేల కోట్లరూపాయిలైనా కేటాయించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు సిద్ధంగా ఉన్నారని, దానికి తగ్గట్టుగా ప్రణాళికలు రూపొందించాలంటూ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ కోరారు. ✪ కొండలపై ఉండే వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని ఎమ్మెల్యేలు కోరారు. ✪ సంక్రాంతి తర్వాత పూర్తి స్థాయిలో నగరాభివృద్ధిపై సుదీర్ఘంగా సమీక్ష నిర్వహిస్తామని మంత్రి నారాయణ తెలిపారు.

నందిగామ వద్ద అత్యవసర రాకపోకలకు ఫ్లైఓవర్ సిద్ధం

నందిగామ, న్యూస్‌టుడే: విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై నందిగామ వైజంక్షన్ వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా అత్యవసర పరిస్థితుల్లో తాత్కాలిక రాకపోకలకు అనుగుణంగా ఫ్లైఓవర్ సిద్ధం చేశారు. ఫ్లైఓవర్, అప్రోచ్ రోడ్ల నిర్మాణం పూర్తికాకపోవడంతో వాహనాలు రాకపోకలకు ఇప్పటి వరకు అనుమతించలేదు. దీనివల్ల ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. సంక్రాంతికి హైదరాబాద్ నుంచి వచ్చే వారి వాహనాలతో మూడు రోజుల క్రితం ట్రాఫిక్ ఇబ్బంది ఏర్పడింది. దీనిని దృష్టిలో ఉంచుకుని విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు స్వయంగా పరిశీలించారు. ఆయన ఆదేశాల మేరకు ఫ్లైఓవర్‌పై తాత్కాలిక రాకపోకలకు అనుగుణంగా పనులు చేశారు. దీంతోపాటు ప్రత్యేకంగా దీపాలు ఏర్పాటు చేశారు. మంగళవారం రాత్రి నందిగామ ఏసీపీ తిలక్, సీఐ లచ్చునాయుడు పరిశీలించారు. ఏసీపీ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో ఫ్లైఓవర్ వంతెనపై వాహనాలకు అనుమతిస్తామని తెలిపారు.

కోడీ.. సిద్ధం..!

విస్సన్నపేటలోని తాతకుంట్లలో పది ఎకరాల్లో, కంచికచర్ల పరిధిలోని గుండేపల్లిలో 30 ఎకరాల్లో హైటెక్ బరులు సిద్ధమయ్యాయి. జిల్లాలోని రెడ్డిగూడెం, తిరువూరు, పెనుగంచిప్రోలు, లింగాల, విజయవాడ శివారు రామవరప్పాడు వద్ద హైటెక్ బరులను కోడి పందేలు, జూదానికి సకల హంగులతో సిద్ధం చేశారు.

వీటిని క్రీడా మైదానాల్లా తయారు చేశారు. ఇక్కడ పందెం ఆడేవారికి కల్పిస్తున్న అతిథి మర్యాదలు చూస్తే మతిపోతుంది. మద్యం, ఆహారం, విశ్రాంతి ప్రదేశాలు అన్నీ సిద్ధం చేశారు. ఫ్లడ్‌లైట్లు కూడా బిగించారు. బుధ, గురు, శుక్రవారాలు రాత్రీపగలు తేడాలేకుండా పోటీలు నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. మధ్యలో డేరాలు, కోడిపందేల బరులు, చుట్టూ రాళ్లను పాతి ఇనుప తీగలతో ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు.

హైటెక్ బరుల్లో పందేలు, మందు, విందు ఏర్పాట్లు

❛ రామవరప్పాడు వద్ద పోటాపోటీగా రెండు బరులు రెడీ అయ్యాయి. పైవంతెనకు ముందు వైపు ఒకటి, దాటిన తర్వాత మరొకటి సిద్ధమయ్యాయి. నగరానికి ఆనుకునే ఉన్న వీటిల్లో మంగళవారం రాత్రి నుంచే పందేల సందడి మొదలైంది.❜ - ఈనాడు, అమరావతి






రామవరప్పాడు సమీపంలో ఓ బరి వద్ద ఏర్పాటు చేసిన కోడి కటౌట్.. యనమలకుదురు వద్ద భారీ ఏర్పాట్లు



రామవరప్పాడు: బరి చుట్టూ కుర్చీలు వేసి...

☛ తిరువూరు నియోజకవర్గం విస్సన్నపేట మండలం తాతకుంట్లలోని బరిని ఈసారి చాలా పెద్దఎత్తున ఏర్పాటు చేశారు. డ్రోన్ కెమెరాలతో వీడియోలు తీయించి మరీ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేశారు.

☛ మైలవరం నియోజకవర్గంలోని రెడ్డిగూడెం మండలం రంగాపురంలోని నూజివీడు రోడ్డులో హైటెక్ బరి ఏర్పాటు చేశారు. చుట్టూ గ్యాలరీలతో మూడు ఎకరాల్లో నెలకొల్పారు. మధ్యలో కోడిపందేలు, జూద శిబిరాలు, మందు, విందు సహా సమస్తం దొరుకుతున్నాయి.



రెడ్డిగూడెం మండలం రంగాపురంలో...

☛ జి.కొండూరు పరిధిలోనూ ఒక హైటెక్ బరి ఏర్పాటైంది.
☛ జగ్గయ్యపేట పరిధిలోని పెనుగంచిప్రోలులో ఏసీ ఫంక్షన్ హాలు వద్ద జూదానికి ఏర్పాట్లు భారీగా చేశారు. లింగాల, జగ్గయ్యపేట పట్టణ పరిధిలో కోడిపందేల బరులు సిద్ధమయ్యాయి.
☛ కంచికచర్ల మండలం గండేపల్లిలో మామిడితోటల్లో 30 ఎకరాల్లో హైటెక్ బరి ఏర్పాటు చేశారు. ఇక్కడ క్యాసినో తరహాలో.. సకల సౌకర్యాలతో సన్నాహాలు చేశారు.

చుట్టుపక్కల జిల్లాల నుంచి..

☛ విస్సన్నపేట, నందిగామ సహా చుట్టుపక్కల బరులకు ఖమ్మం, మధిరతో పాటు ఏలూరు, కృష్ణా నుంచి కూడా భారీగా జూదం ఆడేవారు మంగళవారం రాత్రి నుంచే తరలిరావడం ఆరంభించారు. వచ్చినోళ్లు మూడు రోజులూ ఇక్కడే ఉండి ఆడుకుని.. వెళ్లేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు.

అడ్డగోలు దోపిడీ

ఆర్‌డబ్ల్యూఎస్‌లో పనులు చేయకుండానే నిధుల స్వాహా

ఈనాడు, అమరావతి

ఉమ్మడి జిల్లాలో ఆర్‌డబ్ల్యూఎస్ ఓఅండ్ఎం(ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్)లో అడ్డగోలు దోపిడీ జరుగుతోంది. గ్రామీణ నీటి సరఫరాకు ఆయువుపట్టు లాంటి నిర్వహణ పనుల్లో కొందరు గుత్తేదారులు మాయాజాలం చేస్తున్నారు. కూలీల నిర్వహణ నుంచి పరికరాల కొనుగోలు లెక్కల వరకు అన్నింటా అక్రమాలే. అసలు పనులే చేయకుండా చేసినట్లు బిల్లులు చేసుకుని జేబులు నింపుకొంటున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో యథేచ్ఛగా అక్రమాలు జరుగుతున్నాయి.

ఎందెందు వెతికినా..

☛ పైపుల లీకులు బాగు చేయడం, మోటార్ల సర్వీసింగ్, ట్యాంకులు, పంపుహౌస్ శుభ్రం, లీకులు పడినచోట గుంతలు తవ్వేందుకు వేతనదారులను ఏర్పాటు చేయాలి. పరికరాలు కొనుగోలు చేసినందుకు అదనంగా బిల్లులు ఇస్తారు. ☛ విజయవాడకు కూతవేటు దూరంలో ఉన్న ఓ పంచాయతీలో నిర్వహణ పనులు మొత్తం ఇద్దరే చేస్తున్నారు. వేతనాలు మాత్రం 8-14 మంది పేరు చెప్పి సొమ్ము చేసుకుంటున్నారు. గన్నవరం నియోజకవర్గంలో రెండు పంచాయతీల్లోని సీపీడబ్ల్యూఎస్ పథకాల నిర్వహణకు ఒక్కో చోట ఇద్దరు చేస్తున్నారు. సొమ్ములు మాత్రం ఒక్కోచోట 4-6 మందికి తీసుకుంటున్నారు. ఈ వ్యవహారం ఒకటి రెండు ప్రాంతాల్లో కాదు.. ఉమ్మడి జిల్లాల్లో అధిక పంచాయతీల్లో జరుగుతోంది. ఒక్కో పంచాయతీ నుంచి ఏటా రూ.లక్షల్లో మింగేస్తున్నారు.

☛ ఒక పైపు లీక్ అయితే నాలుగైదు చోట్ల అయినట్లు మాయ చేసి దానికి వేతనం చెల్లించినట్లు, పరికరాలు కొనుగోలు చేసినట్లు చూపించి బిల్లులు చేసుకుంటున్నారు. వేతనదారుల వివరాలు, ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలన్నీ ఎంబుక్‌లో నమోదు చేయాలి. ఇచ్చిన బ్యాంకు ఖాతాలోనే నగదు జమ చేయాలి. ఎక్కువ చోట్ల అసలు ఈ రికార్డులే నమోదు చేయడం లేదు.

పట్టించుకుంటే కదా..

☛ 2023లో రాజశేఖర్ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్నప్పుడు ఇబ్రహీంపట్నం హెడ్‌వర్క్స్‌లో జరుగుతున్న నిర్వహణ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గుత్తేదారుడు 90 మంది వేతనదారులు పని చేస్తున్నట్లు చూపించి వేతనాలు తీసుకుంటున్నారు. అక్కడ మాత్రం 54 మంది వేతనదారులే ఉన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకున్నారు. ☛ ఉన్నతాధికారులు ఈ పనులను పట్టించుకున్న దాఖలాలు లేవు. దస్త్రాల నిర్వహణ అధ్వానంగా ఉన్నా.. దానిపై కనీస చర్యల్లేవ్. దీంతో గుత్తేదారులు అడ్డగోలుగా దోచుకుంటున్నారు.

నిఘా పెంచుతాం..

దీనిపై కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ..నిర్వహణ పనులపై నిఘా పెంచుతాం..విచారణ చేపట్టి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రౌడీషీటర్లకు ఖాకీ మార్క్ ట్రీట్‌మెంట్

★ 6 కి.మీ నడిరోడ్డుపై నడిపించిన పోలీసులు
★ 'కారుతో బీభత్సం' కేసులో నలుగురి అరెస్టు



రౌడీషీటర్లను చెప్పులు లేకుండా నడిపిస్తూ..

భవానీపురం, న్యూస్‌టుడే: మద్యం మత్తులో కారును నిర్లక్ష్యంగా నడిపి బీభత్సం సృష్టించిన కేసులో అరెస్టు అయిన రౌడీషీటర్లు సహా నలుగురికి పోలీసులు తమ మార్కు ట్రీట్‌మెంట్ ఇచ్చారు. ఆదివారం రాత్రి అతివేగంగా కారుతో రౌండ్లు వేస్తుండడంతో పాటు అదేమని అడిగిన వారిపైకి కారును నడిపి గాయాలపాలు చేసిన వారిని పోలీసులు అరెస్టు చేశారు. ఆ సమయంలో కారులో ఉన్న ఐదుగురిలో నలుగురిని అరెస్టు చేశారు. మాజీ రౌడీషీటర్ దినేష్ పరారవడంతో అతని కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. అరెస్టు అయిన నలుగురిని మంగళవారం మధ్యాహ్నం నగరంలోని భవానీపురం చర్చిసెంటర్ నుంచి రాఘవయ్య పార్క్ వరకు రోడ్డుపై చెప్పులు లేకుండా 6 కి.మీ మేర నడిపించుకుని తీసుకెళ్లారు.

ఆ ఇద్దరిపై 60 కేసులు: ఈనెల 11న భవానీపురంలోని బబ్బూరి మైదానం వద్ద రౌడీషీటర్లు కొండా యోహోవా అలియాస్ పెద్ద చిచ్చా, కొండా రమేష్ అలియాస్ చిన్న చిచ్చా, అతని స్నేహితులు వెంకట భార్గవ్ రామ్ సింగ్ అలియాస్ భార్గవ్, వీర్ల మహేష్, దినేష్‌లు మద్యం తాగి వేరొకరి కారును నడుపుతూ అరాచకం సృష్టించారు. పెద్ద చిచ్చాపై వివిధ స్టేషన్లలో 18 కేసులు, చిన్న చిచ్చాపై 42 కేసులు ఉన్నాయి. వీరిద్దరిపై రెండో పట్టణ స్టేషన్‌లో రౌడీషీట్లు ఉన్నాయి. దినేష్‌పై రౌడీషీట్ ఉన్నప్పటికీ హైకోర్టు ఆదేశాల మేరకు గతేడాది నవంబరులో పోలీసులు తొలగించారు. పెద్ద చిచ్చా కారును వేగంగా నడుపుతూ చక్కర్లు కొడుతూ రిహాన్ పఠాన్‌ఖాన్(9) అనే బాలుడితో పాటు మరో ముగ్గురిని ఢీకొట్టాడు. ఈ ఘటనలో బాలుడి తలకు తీవ్రగాయమై విజయవాడలోని ఆంధ్రా ఆసుపత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నాడు. భవానీపురం పోలీసులు విచారణ చేసి పెద్ద చిచ్చా, చిన్న చిచ్చా, భార్గవ్, మహేష్‌లను అదుపులోకి తీసుకున్నారు.

పండగ ప్రయాణం.. చూపింది నరకం





ఈ చిత్రాలు చూస్తుంటే ఇదేదో జనరల్ బోగీ అనుకునేరు. ఇది రిజర్వేషన్ బోగీనేనండి. కానీ సంక్రాంతి పండగ రద్దీ కారణంగా రిజర్వేషన్ బోగీలో సైతం ప్రయాణికులు కిక్కిరిసిపోవడంతో లోపలకు వెళ్లడానికీ వీల్లేని పరిస్థితి. రైలు కదిలిపోవడంతో తోటి ప్రయాణికులు ఓ మహిళ పడిపోకుండా చేయి, బ్యాగు పట్టుకుని సహాయం చేశారు. మరోవైపు రైల్వే టీటీలు సైతం లోపలకు వెళ్లలేక ఇలా బయట నిలబడే టికెట్లు తనిఖీలు చేసి జరిమానాలు విధిస్తున్నారు. విజయవాడ రైల్వేస్టేషన్‌లో కోరమండల్ ఎక్స్‌ప్రెస్ రైలులో కనిపించిన దృశ్యాలివి. -ఈనాడు, అమరావతి



స్పందించని ఏజెంట్లు

అద్వీక కేసులో నత్తనడకన రికవరీ

ఈనాడు, అమరావతి

అద్వీక ట్రేడింగ్ మోసం కేసులో ఎక్కువ లబ్ధి పొందిన ఏజెంట్లు తిరిగి చెల్లించడం లేదు. పోలీసుల నోటీసులకు స్పందించడం లేదు. తమకు కొంత సమయం కావాలంటూ సాగదీస్తున్నారు. ఫలితంగా డిపాజిటర్లకు న్యాయం జరగడం లేదు. మొత్తం 62 మంది ఏజెంట్లలో 32 మంది ఎక్కువ ప్రయోజనం పొందారు. వీరందరికీ పోలీసులు నోటీసులిచ్చారు. స్పందించని కొందరిని అరెస్టు చేశారు. వీరి ఆస్తులు అటాచ్ చేయనున్నారు. ఈ కేసులో నిందితులను అక్టోబరు 28న అరెస్టు చేశారు. కోర్టులో ఛార్జిషీట్ దాఖలుకు గడువు సమీపిస్తోంది. ఈ నెలాఖరులో వేసేందుకు పోలీసులు సన్నద్ధం అవుతున్నారు.

★ ఏజెంట్లలో 32 మంది రూ.54 కోట్లు పెట్టుబడి పెట్టి ఏకంగా రూ.105కోట్లు లబ్ధి పొందారు. వారికి దక్కాల్సిన దానికంటే రూ.49 కోట్లు అనుచితంగా పొందారు. కొందరు డిపాజిటర్లకూ ఇలా ప్రయోజనం దక్కింది. 204 డిపాజిటర్లు రూ.35కోట్లు పెట్టుబడి పెట్టగా రూ.56కోట్లు వచ్చింది. ఈ రెండు వర్గాల నుంచి అదనంగా రూ.70కోట్లు వరకు అనుచితంగా ప్రయోజనం పొందారు. ఇప్పటివరకు ప్రధాన నిందితుడు ఆదిత్య, అతని భార్య సుజాత సహా మొత్తం 10 మందిని అరెస్టు చేశారు. అదనపు సొమ్ము తిరిగి చెల్లించాలని, లేనిపక్షంలో నిందితులుగా చేర్చి అరెస్టు చేస్తామని హెచ్చరిస్తున్నారు. చెల్లిస్తే సాక్షులుగా పరిగణిస్తామని చెబుతున్నారు.

రూ.70కోట్లు లబ్ధి

త్వరలో ఆస్తుల అటాచ్‌మెంట్: ఏజెంట్లు, వారి కుటుంబీకుల పేరున ఉన్న ఆస్తులను గుర్తించి అటాచ్ చేసేందుకు రంగం సిద్ధమవుతోంది. రిజిస్ట్రేషన్ల శాఖకు ఆస్తుల కోసం సిట్ అధికారులు లేఖ రాశారు. వారి నుంచి నిందితుల ఆస్తుల చిట్టా వచ్చింది. ఏపీతో పాటు తెలంగాణ రాష్ట్రాల్లోని ఉన్న పలు ఆస్తులను సిట్ అటాచ్ చేయనుంది. దీనికి సంబంధించి పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు ఇటీవల డీజీపీకి లేఖ రాశారు. త్వరలో హోంశాఖ నుంచి ఉత్తర్వులు వెలవడే అవకాశం ఉంది.

ప్రత్యేక ఖాతా: లబ్ధి పొందిన సొమ్ము తిరిగి రాబట్టేందుకు ప్రత్యేక బ్యాంకు ఖాతా తెరవనున్నారు. దర్యాప్తు అధికారి సెంట్రల్ ఏసీపీ దామోదర్ పేరున ప్రారంభిస్తారు. రావాల్సిన దాని కంటే ఎక్కువ దక్కించుకున్న సొమ్ము చెల్లించేందుకు ముందుకొచ్చే ఏజెంట్లు, డిపాజిటర్ల కోసం దీనిని ఉద్దేశించారు. ఈ ఖాతాలో జమ అయిన సొమ్ము డిపాజిటర్లకు చెల్లింపులు చేయనున్నారు.

ప్రైవేటు బస్సులపై కేసులు

నిబంధనల ఉల్లంఘనలపై జరిమానా

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : సంక్రాంతి పండగ రద్దీని అవకాశంగా తీసుకుని అధిక ఛార్జీలు వసూలు చేస్తున్న ట్రావెల్స్ బస్సులపై రవాణాశాఖ అధికారులు చర్యలకు శ్రీకారం చుట్టారు. గత 5 రోజులుగా నిర్వహించిన తనిఖీల్లో.. రెండు బస్సులపై కేసులు నమోదు చేశారు. రూ.20వేలు జరిమానా విధించారు. పన్ను, వర్క్ పర్మిట్ నిబంధనలను ఉల్లంఘించిన మరో 92 బస్సులపై కేసులు నమోదు చేసి.. రూ.3.43 లక్షలు జరిమానా విధించినట్లు జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎ.మోహన్ తెలిపారు.

ఫిర్యాదులకు టోల్‌ఫ్రీ నంబరు: అధిక ఛార్జీలు, సౌకర్యాల లేమి తదితర అంశాలపై ఫిర్యాదు చేసేందుకు రవాణాశాఖ టోల్‌ఫ్రీ నంబరును విడుదల చేసింది. ఆర్టీసీ ఛార్జీలపై గరిష్ఠంగా 50 శాతం మాత్రమే అదనంగా ఛార్జీలు వసూలు చేయాలని అధికారులు ప్రకటించారు. ఈ నిబంధనను ఉల్లంఘించి అధికంగా వసూలు చేస్తే 92816 07001 నంబరుకు ఫిర్యాదు చేయాలని కోరారు. 24×7 ఇది పని చేస్తుందని తెలిపారు. బస్సు ఛార్జీలు, ఇతర సమస్యలపై ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ టోల్ ఫ్రీ నంబరును ప్రతి బస్సులో ప్రదర్శించాలని యజమానులను ఆదేశించారు. పర్యవేక్షణ కమిటీ సభ్యులు ఆన్‌లైన్ బుకింగ్ ప్లాట్‌ఫార్మ్‌లోని బస్సు ఛార్జీలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని.. ఈ నెల 18 వరకు ఈ పర్యవేక్షణ ఉంటుందని జేటీసీ ఎ.మోహన్ తెలిపారు.




రికార్డులు పరిశీలిస్తున్న రవాణా శాఖాధికారులు

సెలవుల్లోనూ విద్యుత్తు బిల్లులు చెల్లించొచ్చు

సూర్యారావుపేట: సంక్రాంతి సెలవుల్లోనూ జిల్లాలోని అన్ని విద్యుత్తు బిల్లుల వసూలు కేంద్రాలు తెరిచి ఉంటాయని ఎస్‌ఈ యు. హనుమయ్య తెలిపారు. వినియోగదారులు బిల్లులు చెల్లించవచ్చని ఆయన తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కేజీ రూ.లలో)



నెక్‌ఈసీ: బ్రాయిలర్ ఫాం లిఫ్టింగ్ ధర -152 రిటైల్ ధర 179 చికెన్ విత్ స్కిన్ - 260, చికెన్ స్కిన్‌లెస్ - 295. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 175, 184, 195 చికెన్ విత్ స్కిన్ - 340 చికెన్ స్కిన్‌లెస్ - 350.

రుసుము సగమే.. సంస్థకు లాభమే..!

విద్యుత్తు శాఖకు రూ.7.11 కోట్ల ఆదాయం

సూర్యారావుపేట, న్యూస్‌టుడే: విద్యుత్తు లోడ్ స్వచ్ఛంద క్రమబద్ధీకరణకు గృహ విద్యుత్తు వినియోగదారుల నుంచి అనూహ్యమైన స్పందన వచ్చింది. విజయవాడ సర్కిల్ పరిధిలో 32,275 మంది తమ సర్వీసుల లోడ్‌ను సగం రుసుముతో క్రమబద్ధీకరించుకున్నారు. ఎన్టీఆర్ జిల్లా పరిధిలో సంస్థకు రూ. 7,11,38,660 ఆదాయం వచ్చింది. విజయవాడ రూరల్ డివిజన్‌లో ఎక్కువ మంది వినియోగదారులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకున్నారు.

అవకాశం సద్వినియోగం..

సగం రుసుము కట్టి విద్యుత్తు లోడ్‌ను క్రమబద్ధీకరించుకునే వెసులుబాటును ప్రభుత్వం గత ఏడాది మార్చి 1 నుంచి కల్పించింది. మొదట్లో జూన్ 30 గడువు విధించారు. వినియోగదారుల నుంచి స్పందన బాగుండటంతో దాన్ని డిసెంబరు 31వ తేదీ వరకు పొడిగించారు. ఒక కిలోవాట్‌కు రూ. 2వేలతో పాటు యూజర్ ఛార్జీలు చెల్లించాలి. వినియోగదారులు స్వచ్ఛందంగా ముందుకు వస్తే.. దాన్ని సగానికి తగ్గిస్తూ రూ. 1000లు కడితే సరిపోతుందని ప్రభుత్వం ప్రకటించింది. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకున్నారు. గత ఏడు నెలల కాలంలో 58,018 కిలోవాట్లకు రుసుము చెల్లించి క్రమబద్ధీకరించుకున్నారు.

డివిజన్	దరఖాస్తులు	కట్టిన రుసుము (రూ)
గుణదల	9,987	2,36,34,100
నూజివీడు	2,832	65,87,610
వి. రూరల్	12,301	2,52,38,100
వి. టౌన్	7,155	1,56,78,850

విజయవాడ రూరల్‌లో అధికం..

జిల్లాలో 4 డివిజన్ల పరిధిలో విజయవాడ రూరల్ డివిజన్‌లో ఎక్కువ మంది వినియోగదారులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకున్నారు. తర్వాతి స్థానంలో గుణదల డివిజన్ ఉంది. ప్రభుత్వం ఇచ్చిన అవకాశంపై వినియోగదారులు సంతృప్తి వ్యక్తం చేశారు.

వయొలిన్‌కు ప్రాచుర్యం కల్పించిన వెంకటస్వామి నాయుడు



వయొలిన్ వాయిస్తున్న శ్రీకృష్ణ   హాజరైన ఇన్‌టాక్ సభ్యులు, విద్యార్థులు

భవానీపురం, న్యూస్‌టుడే: ఆహ్లాదకరమైన వాతావరణంలో.. చల్లని గాలుల మధ్య.. కృష్ణానదిలో బోటు విహారం చేస్తూ.. మధ్యమధ్యలో వయొలిన్ వాయిద్యం వినిపిస్తూ కళాకారులు అలరించారు. కవులు, విద్యార్థులు సంతోషంగా గడిపారు. ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ (ఇన్‌టాక్) విజయవాడ ఆధ్వర్యంలో జల తరంగాల్లో వాయిద్య కార్యక్రమాన్ని బోటులో మంగళవారం సాయంత్రం నిర్వహించారు. భవానీపురంలోని పున్నమిఘాట్ వద్ద బోటులో కళాకారులు, కవులు ప్రయాణం చేశారు. ఈ సందర్భంగా వయొలిన్ ఆచార్యుడు వి.వి.ఎస్.కృష్ణ మాట్లాడుతూ.. దక్షిణ భారతదేశంలో వయొలిన్ వాయిద్యానికి ప్రాచుర్యం కల్పించింది ద్వారం వెంకటస్వామి నాయుడని పేర్కొన్నారు. ఎన్నో కొత్త స్వరాలు ప్రయోగాలు చేసి సంగీతానికి నూతన ఉత్తేజాన్ని తీసుకొచ్చారని తెలిపారు. 19వ శతాబ్దంలో పాశ్చాత్య దేశాల్లో వయొలిన్ వాయిద్యం వాడేవారని, ఆ తర్వాత కర్ణాటక సంగీతంలో ప్రధాన వాయిద్యంగా మారిందని తెలిపారు. విజయనగరానికి చెందిన ద్వారం వెంకటస్వామి నాయుడు వయొలిన్‌కు ఎంతో ప్రాచుర్యం తీసుకొచ్చారని వెల్లడించారు. సాధారణంగా నాలుగు తీగల వయొలిన్‌పై వాయించగా, మైసూరుకు చెందిన టి.చౌడయ్య ఏడు తీగల వయొలిన్‌పై వాయించేవారని తెలిపారు. ద్వారం వెంకటస్వామి నాయుడు, టి. చౌడయ్య, ఎం.ఎస్.గోపాలకృష్ణన్ సంగీత రంగంలో వయొలిన్ వాయిద్యంలో అనేక మార్పులు తీసుకొచ్చారని తెలిపారు. ఏదైనా ఒక పాటను గాయకుడు పాడినట్లే వయొలిన్ ద్వారా పలికించవచ్చని వెల్లడించారు. ఇన్‌టాక్ కన్వీనర్ సాయి పాపినేని మాట్లాడుతూ.. వయొలిన్ కర్ణాటక సంగీతంలోకి ఏవిధంగా వచ్చింది, ద్వారం వెంకటస్వామి నాయుడు గొప్పతనాన్ని తెలియజేయాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. మాజీ ఎపీ ఆడిట్ అధికారి ఎ.బి.వెంకటేశ్వరరావు, ఇన్‌టాక్ సభ్యులు పాల్గొన్నారు.

అటు ఇటైతే.. నీటిలోకే..



కేసరపల్లి నుంచి ఉప్పులూరు వెళ్లే మార్గంలో రెయిలింగ్ కూలిపోయి ప్రమాదకరంగా మారింది. బుడమేరు వరదల సమయంలో రెయిలింగ్ కొట్టుకుపోవడంతో అప్పటి నుంచి వంతెన పై ప్రమాదసూచికగా సిమెంటు మూటలు అడ్డుగా పెట్టి వదిలేశారు. నిత్యం వాహనాల రాకపోకలు సాగే ఈ వంతెనపై ఏమాత్రం అదుపు తప్పినా కాల్వలో పడిపోవడం ఖాయం. రాత్రివేళ ఈ వంతెనపై వెళ్లాలంటేనే భయపడుతున్నారు. **-ఈనాడు, అమరావతి**

జిల్లాలో జనాభా లెక్కల సేకరణకు ఏర్పాట్లు

తొలిసారిగా డిజిటల్ విధానంలో గణన



వీసీలో పాల్గొన్న కలెక్టర్ లక్ష్మీశ, డీఆర్వో లక్ష్మీనరసింహం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో జనాభా లెక్కల సేకరణకు ఏర్పాట్లు చేయనున్నట్లు కలెక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు. ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి (జీఏడీ) ఎస్.ఎస్. రావత్ అమరావతి నుంచి జన గణనపై మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ (వీసీ) నిర్వహించారు. నగరంలోని కలెక్టరేట్ నుంచి కలెక్టర్ పాల్గొని జిల్లాలో తీసుకుంటున్న చర్యలను వివరించారు. [illegible]

ముఖ్య జన గణన అధికారిగా కలెక్టర్

జిల్లాలో ముఖ్య జన గణన అధికారిగా కలెక్టర్ వ్యవహరిస్తారు. అదనపు ముఖ్య జన గణన అధికారిగా జాయింట్ కలెక్టర్ (జేసీ), జిల్లా జన గణన అధికారిగా జిల్లా రెవెన్యూ శాఖ అధికారి (డీఆర్వో) ఉంటారు. [illegible] కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కృషి చేయనున్నట్లు వివరించారు. డీఆర్వో ఎం. లక్ష్మీనరసింహం పాల్గొన్నారు.

భక్తి పేరుతో వ్యాపారం

విభజించి కొబ్బరికాయల విక్రయం..!



దేవస్థానం కౌంటర్‌లో కొబ్బరికాయలు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో రెండో అతిపెద్ద దేవాలయం శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం. నిత్యం 30 వేల నుంచి 40 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు. శుక్ర, ఆదివారాల్లో 70 వేల మంది భక్తులు వస్తుంటారు. అమ్మవారి దర్శనం చేసుకున్న భక్తుల్లో కనీసం 10 వేల మంది దేవస్థానం కొండ కింద కొబ్బరికాయలు కొనుగోలు చేస్తారు. [illegible]

కౌంటర్లలోనే చేతి వాటం: [illegible]

ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉపకరణాలు



శిబిరం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు

ప్రత్యేక అవసరాల పిల్లలు ఎవరి సాయం లేకుండా జీవించేలా [illegible]

ఐదు రోజుల పాటు నిర్వహణ.. [illegible] సహిత విద్య విభాగం ఆధ్వర్యంలో ఇటీవల విజయవాడతో పాటు మైలవరం, తిరువూరు, నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో శిబిరాలు నిర్వహించారు. 600 మంది విద్యార్థులు హాజరయ్యారు. వారికి భోజన సదుపాయం కల్పించి రవాణా భత్యం కూడా ఇచ్చినట్లు జిల్లా సమగ్రశిక్ష సహిత విద్యా సమన్వయకర్త కె.నారాయణ తెలిపారు. విద్యార్థులకు పరీక్షలు నిర్వహించిన అనంతరం రూ.40 లక్షల విలువైన ఉపకరణాలు అవసరం ఉంటుందని నిర్ధారించారు. మూడు నెలల్లో వాటిని అందిస్తామని తెలిపారు.

– విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు: కలెక్టర్

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టర్ జి.లక్ష్మీశ జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. భోగి భాగ్యాలతో భోగి, సిరి సంపదలతో మకర సంక్రాంతి, [illegible] పండుగను కుటుంబ సభ్యులు, బంధు మిత్రులతో ఆనందంగా నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. రైతులకు ఇచ్చే గౌరవానికి సంక్రాంతి ప్రతీక అని, అన్నదాత ఇంట సంతోషాలు వెల్లివిరియాలని ఆయన పేర్కొన్నారు.

మద్యం మత్తులో వైకాపా కార్యకర్త దాడి

ఇరువర్గాలకు చెందిన నలుగురికి గాయాలు



జుజ్జూరులో పరిస్థితులను పర్యవేక్షిస్తున్న ఏసీపీ తిలక్, సీఐ చవాన్

జుజ్జూరు(వీరులపాడు), న్యూస్‌టుడే: వైకాపా కార్యకర్త ఎండీ ఫయాజ్ మద్యం మత్తులో తెదేపా కార్యకర్తలపై దాడి చేసిన ఘటన మండల పరిధి జుజ్జూరు గ్రామంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామంలోని ముత్యాలమ్మ దేవస్థానం సమీపంలోని అరుగు వద్ద తెదేపా కార్యకర్తలు అనుమల రాకేష్, ఓర్సు హుస్సేన్, అనుమల తరుణ్, సిరి తరుణ్, షేక్ నాగులు బాషాలు కూర్చొని ఉన్నారు. అదే సమయానికి అటుగా ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఫయాజ్.. అక్కడ అరుగుపై కూర్చున్న తెదేపా కార్యకర్తలను చూసి తన తమ్ముడు ఇంటి ముందు బైక్ ఆపి పదేపదే హారన్ మోగిస్తూ వారిపై దూషణకు దిగాడు. దీంతో తమను ఎందుకు తిడుతున్నావని అడిగిన తెదేపా కార్యకర్తలపై ఫయాజ్ దాడి చేశాడు. ఈ క్రమంలో విషయం తెలుసుకోవడానికి అక్కడకు వచ్చిన గోపి, కొమ్మూరు శేషులపై కూడా ఫయాజ్ దాడి చేశాడు. ఈ ఘర్షణలో తెదేపాకు చెందిన రాకేష్, హుస్సేన్‌లకు, అలాగే వైకాపాకు చెందిన ఫయాజ్, అతని భార్యకు గాయాలు కాగా.. వారికి చికిత్స నిమిత్తం నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లారు. గ్రామంలో ఘర్షణ వాతావరణం నెలకొనడంతో పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు. ఏసీపీ బాలగంగాధర్ తిలక్, రూరల్ సీఐ చవాన్ గ్రామంలో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఇరువర్గాల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు పలువురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై అభిమన్యు తెలిపారు.

‘చమురు నిక్షేపాలు దోచుకునేందుకే అమెరికా దాడులు’



మాట్లాడుతున్న లక్ష్మణరావు. పక్కన క్రాంతి, జమిందార్, అంజిరెడ్డి

రాఘవయ్యపార్క్ కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే: వెనెజువెలా అధ్యక్షుడి అరెస్ట్.. అమెరికా అహంకారపూరిత ధోరణికి నిదర్శనమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ‘వెనెజువెలా పరిణామాలు- ప్రపంచంపై ప్రభావం’ అనే అంశంపై ఎంబీ విజ్ఞాన కేంద్రంలో మంగళవారం ఆలిండియా ప్రోగ్రెసివ్ ఫోరం, సోషల్ సైన్స్ ట్రస్టులు సంయుక్తంగా సదస్సు నిర్వహించాయి. మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ సార్వభౌమాధికారం కలిగిన దేశంలో అక్రమంగా చొరబడి.. ఆ దేశాధ్యక్షుడిని, ఆయన భార్యను అరెస్ట్ చేయడం అమెరికా దుర్మార్గానికి నిదర్శనమని మండిపడ్డారు. తామే వెనెజువెలాలో ఆయిల్ అమ్మకాలు, తవ్వకాలు చేపడతామని చెప్పడం దారుణమన్నారు. చమురు నిక్షేపాలున్న దేశాలపై అమెరికా దాడులకు పాల్పడుతోందన్నారు. ప్రపంచంలో తన ఆధిపత్యాన్ని కొనసాగించే క్రమంలో.. మాట వినని.. వ్యతిరేకించే దేశాలపై 150 శాతం టారిఫ్‌లను విధించిందన్నారు. వెనెజువెలా అధ్యక్షుడిపై దాడిని ప్రపంచ దేశాలు ఖండిస్తే.. మోదీ ప్రభుత్వం చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని చెప్పడం అమెరికా సామ్రాజ్యవాదానికి లొంగినట్లుగా ఉందన్నారు. ఆలిండియా ప్రోగ్రెసివ్ ఫోరం నాయకుడు ప్రొఫెసర్ బుడ్డిగ జమిందార్ మాట్లాడుతూ.. ప్రపంచ పోలీస్ వేషం వేసుకున్న అమెరికా.. ఆయిల్ నిక్షేపాలు దోచుకునేందుకే దాడులకు పాల్పడుతోందన్నారు. సామ్రాజ్యవాద ధోరణిని ప్రజలందరూ ముక్తకంఠంతో ఖండించాలన్నారు. సోషల్ సైన్స్ ట్రస్టు నాయకుడు ప్రొఫెసర్ అంజిరెడ్డి మాట్లాడుతూ.. క్యూబా, మెక్సికో, కొలంబియాలను లక్ష్యంగా చేసుకున్నట్లు ట్రంప్ చెప్పడం.. దురాక్రమణ తత్వాన్ని తెలియజేస్తోందన్నారు. ఎంబీవీకే బాధ్యుడు యు.వి. రామరాజు, తాజారావు తదితరులు పాల్గొన్నారు.

ధర వరలు



వంకాయలు- 22/26, టమాటా -22, బెండ-42, పచ్చిమిర్చి-30, కాకర-40, బీర-26, క్యాలీ ఫ్లవర్-25/20, క్యాబేజి-22, క్యారెట్-36, దొండ-40, బంగాళదుంప-20, ఉల్లిపాయలు-26, గోరుచిక్కుళ్లు-32, దోస-30/40, సొర-15, పొట్ల-30, అరటికాయ-7/8, చామదుంప-24, అల్లం-74, మునగ-10/8, ఆకు కూరలు (కట్ట)-2.50, కంద-42, బీట్ రూట్-26, కీరదోస-28, బీన్స్-55/60, క్యాప్సికమ్-56, చింతకాయలు-60, నిమ్మ (డజను)-18/24, కొత్తిమీర-5/10, పుదీనా-5/15, ముల్లంగి-8, పచ్చిమామిడి-20/22 (నిన్నటివి). నగరంలోని రైతుబజార్లలో ఈ ధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి.

- ఎన్టీఆర్ కలెక్టరేట్, విజయవాడ

91.9FM Vijayawada

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 8008003297

తిరువూరు
• తిరువూరు • మైలవరం

సత్యమ్మతల్లి సేవలో సినీ దర్శకుడు వినాయక్



నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలో అంబారుపేట సత్యమ్మ తల్లిని సినీ దర్శకుడు వీవీ వినాయక్ మంగళవారం దర్శించుకున్నారు. సంక్రాంతి పండగకు హైదరాబాద్ నుంచి ఆయన స్వగ్రామం తూర్పుగోదావరి జిల్లా చాగల్లుకు వెళుతూ మార్గమధ్యంలో అంబారుపేట వద్ద జాతీయ రహదారి పక్కనే కొలువైన అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు వెంకటసుబ్బారావు వినాయక్‌ను అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించారు.

కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా అత్తలూరి

పరిటాల(కంచికచర్ల), న్యూస్‌టుడే : భారతీయ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా పరిటాల గ్రామానికి చెందిన అత్తలూరి రవి ఎంపికయ్యారు. ఈ మేరకు పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడినట్లు ఆయన మంగళవారం తెలిపారు. రైతు సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. రవి గతంలో అత్తలూరి కమల ఛారిటబుల్ ట్రస్టు ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అత్తలూరిని పలువురు నాయకులు అభినందించారు.

కొండపల్లి కళాకారునికి వివేకానంద ప్రతిభా పురస్కారం

కొండపల్లి, న్యూస్‌టుడే : కొండపల్లి బొమ్మల తయారీలో ప్రత్యేకత చాటుకున్న స్థానిక కళాకారుడు కె.వెంకటాచారికి వివేకానంద జాతీయ ప్రతిభా పురస్కారోత్సవ అవార్డును నిర్వాహకులు అందజేశారు. విజయవాడ ఐలాపురంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్ఆర్ఐ కోమటి జయరాం ఆధ్వర్యంలో ఈ పురస్కారాలను సోమవారం ఇచ్చారు.

దైనందిని ఆవిష్కరణ

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : ఏపీ విద్యుత్తు శక్తి ఎంప్లాయీస్ ట్రేడ్ యూనియన్ హెచ్-155 దైనందిని, కాలమానిని ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ విజయానంద్ మంగళవారం ఆవిష్కరించారు. విజయవాడ విద్యుత్తు సౌధ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్.శ్రీనివాసులు, సిద్దేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెరిగిపోతున్న దోమల బెడద

తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు పట్టణంలో వీధి కుక్కలు, కోతులు, దోమల బెడద రోజురోజుకు పెరిగిపోతోందని సీపీఎం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ కె.మనోజకు ఫిర్యాదు అందజేశారు. నాయకులు నాగేంద్రప్రసాద్, భద్ర, వెంకటేశ్వరరావు, రవి, సురేష్, నాగుల్‌మీరా, శ్రీనివాసరావు, వెంకటరత్నం, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

స్పందన: తిరువూరు పట్టణం 13వ వార్డులోని డ్రెయిన్లలో పూడిక పేరుకుందని స్థానికుడు ప్రభాకర్‌రావు 'ఈనాడు' మేమున్నాం..మీకు తోడుగా ద్వారా సమస్యను మున్సిపల్ అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన శానిటరీ అధికారి సంతోష్ పారిశుద్ధ్య కార్మికులను పంపించి డ్రెయిన్లను శుభ్రం చేయించారు. ★ తిరువూరు పట్టణం 18వ వార్డులోని డ్రెయిన్లలో వ్యర్థాలు పేరుకున్నాయని స్థానికుడు రాజశేఖర్‌రావు 'మేమున్నాం..మీకు తోడుగా' ద్వారా సమస్యను మున్సిపల్ అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన మున్సిపల్ శానిటరీ అధికారి సంతోష్ పారిశుద్ధ్య కార్మికులను పంపించి కాలువలను శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించారు. ★ తిరువూరు 3వ వార్డులోని డ్రెయిన్లలో చెత్త, మురుగు పేరుకుందని స్థానికుడు గిరిధర్‌బాబు సమస్యను 'ఈనాడు' మేమున్నాం..మీకు తోడుగా ద్వారా మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన మున్సిపల్ శానిటరీ అధికారి సంతోష్ పారిశుద్ధ్య సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు. - న్యూస్‌టుడే, తిరువూరు

'ఫార్మా కంపెనీల ఆగడాలను అడ్డుకోవాలి'

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజల ప్రాణాలు లెక్కలేని విధంగా ఫార్మా కంపెనీలు కెమికల్ దాడులు చేస్తున్నాయని జేఏసీ సభ్యులు పేర్కొన్నారు. పట్టణంలోని 26 సంఘాల సభ్యులందరూ కలిసి కమిటీగా ఏర్పడ్డారు. మంగళవారం స్థానిక టీచర్స్ కో-ఆపరేటివ్ భవనంలో వారు మీడియా సమావేశం నిర్వహించారు. జేఏసీ ఛైర్మన్ ధరణికోట వెంకటరమణ మాట్లాడుతూ మనుషులు నివసించలేని ప్రాంతంగా చేస్తున్న ఫార్మా కంపెనీల దుర్మార్గాలను ఆపాలని కోరారు. ఈ సమస్యను ఇప్పటికే ఎమ్మెల్యేకు, కలెక్టర్‌కు వివరించామని తెలిపారు. జేఏసీ సెక్రటరీ మండదపు శ్రీనివాస్, బొజ్జ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నిర్వహణ లోపం.. నీటి సరఫరా ప్రశ్నార్థకం

జి.కొండూరు, న్యూస్‌టుడే

మండలంలోని సున్నంపాడు, పినపాక మైనర్లకు సాగర్ జలాలు సరఫరా కాకపోవడంతో రబీ సాగు ప్రశ్నార్థకంగా మారిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. వైకాపా పాలనలో నాగార్జున సాగర్ ప్రాజెక్టు కాలువలను(ఎన్నెస్పీ) నిర్వహణ చేపట్టకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొందని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్ర- తెలంగాణ సరిహద్దులో రెండేళ్ల కిందటే ఎన్నెస్పీ కాలువకు చెందిన అండర్ టన్నెల్ కుంగిపోవడంతో రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలు నిలిచాయి. దీంతో గ్రావెల్‌తో దాన్ని పూర్తిగా పూడ్చారు. ఈ క్రమంలో ఇబ్రహీంపట్నం, కొండపల్లి, సున్నంపాడు, పినపాక మైనర్లకు సాగర్ జలాలు వచ్చే పరిస్థితి లేదు. దీంతో కాలువ వెంబడి బోర్లు ఉన్న రైతులు మాత్రమే ప్రస్తుతం సాగు చేపట్టారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎన్నెస్పీ కాలువ అండర్ టన్నెల్ నిర్మాణం చేపట్టి సాగర్ జలాలనందిస్తే సాగుకు ఆమోదం యోగ్యంగా ఉంటుందని పలువురు కోరుతున్నారు.

• వరదల కారణంగా..

ఈ ఏడాది వరదల కారణంగా ఖరీఫ్ సీజన్ అంత ఆశాజనకంగా లేకపోవడంతో రైతులు పొలాలను దున్ని నీటి అదను ఉన్న వారు మొక్కజొన్న, మిరప, వాణిజ్య పంటలను సాగు చేపట్టారు. సాగర్ జలాలపై ఆధారపడిన వారు దుగ్గిరాలపాడు నుంచి ప్రారంభమై కట్టుబడిపాలెం వరకు ఉన్న ఎన్నెస్పీ కాలువ వెంబడి దాదాపు 800 సాగు చేపట్టడానికి ఆందోళన చెందుతున్నారు. దుగ్గిరాలపాడు సమీపంలోని ఇబ్రహీంపట్నం, కొండపల్లి మేజర్ గేట్లు నిర్వహణ లేక తుప్పు పట్టి దర్శనమిస్తున్నాయి. సాగర్ జలాలు వచ్చి గేట్లు తెరుచుకోకపోతే నీరు దిగువకు వెళ్లే పరిస్థితి లేకుండా పోతోందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గేట్లకు మరమ్మతులు చేయించాలని రైతులు కోరుతున్నారు.



ఆంధ్ర- తెలంగాణ సరిహద్దులో పూడిపోయిన ఎన్నెస్పీ అండర్ టన్నెల్

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం

కాలువల మొత్తం సమాచారం సేకరించి ఉన్నతాధికారులకు నివేదికలు అందించాం. అండర్ టన్నెల్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. నిధులు మంజూరు కాగానే పనులు చేపట్టి పూర్తి చేస్తాం - శివనాగిరెడ్డి, ఎన్నెస్పీ సహాయక ఇంజినీరు

సమాజానికి సేవలు అభినందనీయం



కార్యక్రమంలో శ్రీదేవి, దాత గిరిబాబు తదితరులు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : సమాజానికి ఎన్నారై వల్లభనేని గిరిబాబు చేస్తున్న సేవలు అభినందనీయమని ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు. మండల విద్యా శాఖ కార్యాలయానికి 100 కుర్చీలు, కంప్యూటర్, నియోజకవర్గంలోని పలు పాఠశాలలు, వసతిగృహాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు, పేద విద్యార్థుల చదువులకు, ప్రతిభ చాటిన వారికి స్కాలర్‌షిప్‌ల కోసం రూ.10,00,000లు గిరిబాబు వితరణ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి ఉండవల్లి శ్రీదేవి హాజరై మాట్లాడారు. గిరిబాబు మాతృభూమి, తెలుగు ప్రజలపై ఉన్న ప్రేమతో సేవా కార్యక్రమాలు చేపట్టడం చాలా సంతోషమన్నారు. ఎంఈవో- 1 శంకరరావు, ప్రముఖ సంఘ సేవకుడు ఎన్టీ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణి, ఎంపీడీవో చిన్న రాట్నాలు తదితరులు పాల్గొన్నారు.

రవాణా సౌకర్యాలు మెరుగుపరచడమే లక్ష్యం



కోకిలంపాడులో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంత అభివృద్ధిని వేగవంతం చేస్తూ స్థానిక ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మండలంలోని కోకిలంపాడు, ఎరుకోపాడు గ్రామాల్లో మంగళవారం సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలను మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యం అని తెలిపారు. కోకిలంపాడులోని రోడ్ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.17 లక్షల నిధులను కేటాయించిదని చెప్పారు. అనంతరం ఎరుకోపాడులోని రహదారుల అభివృద్ధికి రూ.18 లక్షలు కేటాయించినందుకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కూటమి నాయకులు, అధికారులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని పలు వీధుల్లో సీసీ రహదారుల నిర్మాణానికి ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు మంగళవారం భూమిపూజ నిర్వహించినట్లు ఎంపీడీవో టి.సరస్వతి తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్‌లో రూ.40 లక్షలు మంజూరు కాగా ఆ నిధులతో ఎన్టీఆర్ కాలనీ, గంపలగూడెం ఎస్సీ, బీసీ కాలనీల్లోని రోడ్లను అభివృద్ధి చేయనున్నారు.

నెమలి కృష్ణాలయంలో కల్యాణం నేడు



నెమలి: ముస్తాబైన ఉత్సవమూర్తులు

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే : ధనుర్మాసోత్సవంలో భాగంగా మండలంలోని నెమలి వేణుగోపాల స్వామి గుడిలో గోదారంగనాయక స్వామి కల్యాణోత్సవాన్ని బుధవారం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

నగర సంకీర్తన : గంపలగూడెం మండలంలోని వైష్ణవాలయాల్లో మంగళవారం ధనుర్మాస పూజలు వైభవంగా నిర్వహించారు. గంపలగూడెంలో సీతా రామ చంద్రస్వామి ఆలయ భక్త బృందం ఆధ్వర్యంలో నగర సంకీర్తన చేశారు.

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : ఎన్టీటీపీఎస్ ఏ కాలనీ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో గోదాదేవికి వివాహ ముందస్తు పూజలు నిర్వహించారు. అమ్మవారిని పెండ్లి కుమార్తెగా అలంకరించి వివిధ హారతులు ఇచ్చారు.



గంపలగూడెం రామాలయం వద్ద భక్తులు



ఎన్టీటీపీఎస్ ఏ కాలనీలో..

అధిక ధరలకు యూరియా విక్రయిస్తే చర్యలు

తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు మండలంలోని పెద్దవరం, ముష్టికుంట్లలోని రైతు సేవా కేంద్రాలను తిరువూరు ఆర్డీవో కె.మాధురి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యూరియా కొరత లేకుండా ప్రతి రైతుకు ప్రభుత్వ ధరకే అందించాలని అధికారులకు సూచించారు. అక్రమ నిల్వలు, అధిక ధరలకు విక్రయాలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులున్న వెంటనే వ్యవసాయాధికారికి సమాచారం అందించాలని తెలిపారు. తహసీల్దార్ నాగమణి, ఎస్సై శాతకర్ణి, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.



పెద్దవరం రైతు సేవా కేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న మాధురి

జలాలు వినియోగించుకోండి

గంపలగూడెం, న్యూస్‌టుడే : ఎన్నెస్పీ రెండో జోన్ పరిధిలోని మధిర బ్రాంచి కెనాల్‌కు మంగళవారం ఖమ్మం జిల్లా కల్లూరు మండలం కప్పలబంధం నియంత్రిక నుంచి 1200 క్యూసెక్కుల సాగర్ జలాలు విడుదలైనట్లు ఏఈ మహేష్ బాబు తెలిపారు. గంపలగూడెం మండలం సరిహద్దులోని 23వ కి.మీ వద్దకు 497 క్యూసెక్కులు చేరగా దిగువన మేజర్ల వారీగా గంపలగూడెం 30, ఊటుకూరు-1కరి 60, పెదకొమిర 30, మధిర 50, నిడానపురం 60 క్యూసెక్కులు చొప్పున సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. ఆయకట్టు రైతులు మిరప, ఆరుతడి పంటలకు నీటి తడులు అందించేందుకు సాగర్ జలాలు వినియోగించుకోవాలని సూచించారు.

సంక్రాంతి సంప్రదాయ విలువలకు ప్రతీక



కాచవరం: క్రికెట్ విజేతలకు ట్రోఫీ అందిస్తున్న అప్పారావు, ప్రసాద్



తాతకుంట్ల: ముగ్గుల పోటీలో మహిళలు



కొండపల్లి: ఐద్వా ఆధ్వర్యంలో..

విస్సన్నపేట, న్యూస్‌టుడే : విస్సన్నపేట మండలంలో కూటమి పార్టీల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. తాతకుంట్లలో జరిగిన పలు రకాల పోటీలు చూపరులను ఆకట్టుకున్నాయి. విస్సన్నపేట- నూజివీడు రోడ్డులో తెదేపా మండల అధ్యక్షుడు రాయల సుబ్బారావు ఆధ్వర్యంలో జరుగుతున్న సంబరాల్లో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి పాల్గొని ముగ్గుల పోటీలను తిలకించారు. ఎన్నారై గిరిబాబు, తెదేపా సీనియర్ నాయకుడు ఎన్‌టీ వెంకటేశ్వరరావు, డాబా శ్రీను, బుడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : సంక్రాంతి సంప్రదాయ విలువలను పెంపొందిస్తుందని, గ్రామాల్లో ఐక్యత తీసుకువస్తోందని పారిశ్రామిక వేత్త బోడెపూడి అప్పారావు అన్నారు. ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలం కాచవరంలో మంగళవారం నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో కుటుంబ సభ్యులతో కలిసి ఆయన పాల్గొని సందడి చేశారు. గ్రామ యువత కోసం నిర్వహించిన క్రికెట్ పోటీలో అయిదు జట్లు పాల్గొన్నాయి. అనంతరం ప్రథమ స్థానం సాధించిన యంగ్‌స్టర్స్ జట్టుకు రూ.30 వేలు, ద్వితీయ స్థానం పొందిన ఎస్ఎస్ఎస్ జట్టుకు రూ.15 వేలు అందించారు. ముగ్గుల పోటీల్లో గెలిచిన వారికి బహుమతులు ఇచ్చారు. సర్పంచి రాజేంద్ర ప్రసాద్, కూటమి నాయకులు రంగస్వామి, కందుల భాస్కర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కొండపల్లి, న్యూస్‌టుడే : ఐద్వా, సీఐటీయూ ప్రజా సంఘాలు సంయుక్తంగా కొండపల్లి మోహనరావు నగర్‌లో రంగవల్లుల పోటీలను మంగళవారం నిర్వహించాయి. బేబీ, పార్వతి, రాజేశ్వరి, వెంకటరావమ్మ పర్యవేక్షించారు.

● పశ్చిమ ఇబ్రహీంపట్నంలోని రామాలయం వీధిలో ఫణి ఆధ్వర్యంలో రంగవల్లుల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.



విస్సన్నపేట: రోడ్డు శుభ్రం చేస్తున్న కార్మికులు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ సంక్రాంతిలో భాగంగా మండల కేంద్రంలోని రోడ్లు, వీధులు శుభ్రం చేయడంతో పండగ వాతావరణం నెలకొంది. డీఎల్‌డీవో ఏవీ రమణ, తహసీల్దార్ కె. లక్ష్మీకల్యాణి, ఎంపీడీవో చేకు చిన్నరాట్నాలు పర్యవేక్షణలో పంచాయతీ, సచివాలయ అధికారులు, సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు బృందాలుగా ఏర్పడి ఆయా పనులు చేపట్టారు.

కోడి పందేల పోరు.. అదే జోరు



రంగాపురంలో సిద్ధమైన భారీ బరి



ట్రక్ టెర్మినల్ ప్రాంతంలో.

మైలవరం, న్యూస్‌టుడే : సంక్రాంతి సంప్రదాయం పేరిట మంగళవారం రాత్రి వేళలో తొలి కోడి పందేలను నిర్వాహకులు మొదలెట్టారు. నియోజకవర్గ పరిధిలో రెడ్డిగూడెం మండలం రంగాపురంలో, జి.కొండూరులో భారీ ఏర్పాట్లు చేశారు. వీటితో పాటు మండలానికి కనీసం 4 నుంచి 6 గ్రామాల వరకు పందేల నిర్వహణకు అనధికార అనుమతులు తెచ్చుకున్నామని కొందరు ప్రచారం చేస్తున్నారు. అందులో భాగంగా ప్రతి బరిలో రోజుకు పది పందేల చొప్పున ఖరారు చేసుకోగా, ఇతర పందేలు వాటిని ఐదింతలు అదనంగా వేయనున్నారు. రంగాపురం, పొందుగల తదితర గ్రామాల్లో మూడ్రోజుల పందేల్లో విజేతలకు అందజేసేందుకు ఇప్పటికే బుల్లెట్లను కొనుగోలు చేసి సిద్ధంగా ఉంచారు. ఆయా పందేల శిబిరాల వద్ద నిరంతరాయంగా జూదం నిర్వహించేందుకూ సిద్ధమయ్యారు. సోమవారం జూద నిర్వాహకులను పిలిపించుకున్న పలు గ్రామాల్లోని నాయకులు వాటాలను విభజించుకున్నట్లు ప్రచారం సాగుతోంది.

★ బైండోవర్ : ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : కోడి పందేలు, జూద శిబిరాలు నిర్వహించకుండా ఇబ్రహీంపట్నం పోలీసులు 21 మందిని తహసీల్దారు వెంకటేశ్వర్లు ఎదుట బైండోవర్ చేశారు.

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : కోడి పందేల నిర్వహణకు నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేశారు. ఇబ్రహీంపట్నం ట్రక్ టెర్మినల్ ఆవరణలో భారీ ఎత్తున బరులు సిద్ధమయ్యాయి. పందెం రాయుళ్లకు ఇబ్బంది లేకుండా టెంట్లు, కుర్చీలు, ఎల్ఈడీ తెరలను నిర్వాహకులు ఏర్పాటు చేశారు.

విజయవంతంగా కబడ్డీ పోటీలు



ప్రథమ బహుమతి సాధించిన జట్టుతో తెదేపా నాయకులు, నిర్వాహకులు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : మండల కేంద్రంలో ఎంఎన్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు మంగళవారం ముగిశాయి. మొదటి బహుమతి ఎల్ఆర్డీ స్పోర్ట్స్ అకాడమీ నూజివీడు జట్టు, రెండో బహుమతి డాక్టర్.బీఆర్.అంబేడ్కర్ యూత్ సూరంపాలెం, మూడో బహుమతి రెడ్డిగూడెం యూత్, నాలుగో బహుమతి జగ్జీవన్‌రాం, అయిదో బహుమతిని జగ్జీవన్‌రాం జూనియర్స్ జట్లు గెలుపొందినట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు బహుమతుల పంపిణీలో తెదేపా మండల అధ్యక్షుడు జె.వేణుగోపాలరెడ్డి, కృష్ణా మిల్క్ యూనియన్ డైరెక్టర్.వి.అంజిరెడ్డి, తెదేపా నాయకులు ఎం.నాగేశ్వర రెడ్డి, బి.కోటేశ్వరరావు, పి.కిరణ్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గానగర్ పార్కింగ్ వద్ద గొడవ

ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన



భక్తులకు నచ్చజెబుతున్న ఆలయ సెక్యూరిటీ సిబ్బంది

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: విజయవాడ దుర్గగుడిలో పార్కింగ్ నిర్వహించే ప్రైవేటు గుత్తేదారుకు చెందిన ఓ యువకుడు.. భక్తుడిపై దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కనకదుర్గానగర్‌లో వారం కిందట ఓ భక్తుడి వాహనాన్ని నిలిపే విషయంలో.. పార్కింగ్‌కు చెందిన యువకుడితో గొడవ జరిగింది. ఒకరినొకరు నెట్టుకున్నారు. దీంతో యువకుడు ఓ భక్తుడిపై దాడి చేశాడు. ఇదే సమయంలో అక్కడికి వచ్చిన ఇద్దరు దుర్గగుడికి చెందిన సెక్యూరిటీ సిబ్బంది కల్పించుకుని భక్తులు, సెక్యూరిటీ సిబ్బందిని అడ్డుకుని నచ్చజెప్పారు. ఈ వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ★ ఈ ఘటనపై దేవస్థానం ఒక ప్రకటన విడుదల చేసింది. ఇది ఇప్పుడు జరిగింది కాదని, తమ సెక్యూరిటీ సిబ్బంది ఆ ఘటన జరిగినప్పుడే స్పందించి.. ఇద్దరినీ సముదాయించి, సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించారని తెలిపారు. అందుకే ఇరువర్గాల నుంచి దీనిపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఆలయ వర్గాలు స్పష్టం చేశాయి.

మరమ్మతులు కరవు.. సమస్యలకు నెలవు

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే

శిథిలావస్థకు చేరుకుంటున్న వంతెన పునర్నిర్మాణ హామీ అమలు చేయాలని తుమ్మలపాలెం గ్రామస్థులు కోరుతున్నారు. దాదాపు 50 ఏళ్ల కిందట నిర్మించిన వంతెనకు వార్షిక నిర్వహణ మరమ్మతులు చేయకపోవడంతో దాని పునాదులకు, స్తంభాలకు పగుళ్లు వచ్చినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఎన్టీటీపీఎస్ నిర్మాణ సమయంలో విద్యుత్తు ఉత్పాదనకు అవసరమైన నీటి సరఫరా కోసం భవానీపురం కృష్ణా నదీతీరం నుంచి ఎన్టీటీపీఎస్ వరకు కాలువ తవ్వారు.

కొరవడిన పర్యవేక్షణ

జాతీయ రహదారిని గ్రామానికి అనుసంధానిస్తూ తక్కువ సామర్థ్యంతో కాలువపై వంతెన నిర్మాణం చేశారు. దీంతో గ్రామంలో అత్యధికంగా నివాసించే లారీ యజమానులు తమ లారీలను జాతీయ రహదారి పక్కనే నిలుపుతున్నారు. ఇటీవల కాలంలో తరచుగా తమ్మలపాలెం గ్రామం వద్ద జాతీయ రహదారిపై జరిగే ప్రమాదాలకు ఇది ఒక కారణంగా పోలీసులు చెబుతున్నారు.



శిథిలావస్థలో వంతెన

గ్రామంలోకి లారీలు రాకపోకలు సాగించే విధంగా వంతెన పునర్నిర్మాణం చేయాలని ఇటీవల గ్రామస్థులు ఎన్టీటీపీఎస్ ఎదుట నిరసన దీక్షలు చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెనను నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

విద్యుత్తు విజిలెన్సు అధికారుల తనిఖీలు

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే : జగ్గయ్యపేట మండలంలోని విద్యుత్తు వినియోగదారుల గృహాలు, వాణిజ్య సముదాయాలపై విజిలెన్సు అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈఈ పి.విజయకుమారి, విజయవాడ రూరల్ ఈఈ టి.రవిచంద్ర, డిప్యూటీ ఈఈ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో తనిఖీ నిర్వహించారు.

◆ గ్రామాల్లో కోతుల బెడద...



కోతులు దాడి చేయడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గ్రామాల్లో గుంపులుగా ప్రవేశించి ఆహార పదార్థాలు ఎత్తుకెళ్తున్నాయి. ద్విచక్ర వాహన చోదకులపైకి దూకి దాడులు చేస్తున్నాయి. రెడ్డిగూడెం, రంగాపురం, మద్దులపర్వ, కూనపరాజుపర్వ, నాగులూరు, అన్నేరావుపేటలో పెద్దఎత్తున కోతులు గుంపులుగా ఉంటున్నాయని స్థానికులు వాపోతున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, రెడ్డిగూడెం

◆ కాలువ లేదు.. అంతా మురుగే



మండలంలోని కీర్తిరాయుని గూడెం ఎస్సీ ప్రాంతంలో నిర్మించిన సీసీ రహదారులకు అనుబంధంగా మురుగు కాలువల నిర్మాణం చేయకపోవడంతో, మురుగంతా రోడ్డు పక్కనే పేరుకుంటోంది. నివాసాల నుంచి వచ్చి చేరే వ్యర్థాలతో దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, మైలవరం

ప్రోత్సాహం.. అంతర పంటలతో ఆదాయం

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే

మండలం	హెక్టార్లు
మైలవరం	220
రెడ్డిగూడెం	270
జి.కొండూరు	42
రూరల్‌లో..	12
విస్సన్నపేట	400
ఎ.కొండూరు	330
గంపలగూడెం	120



రుద్రవరంలో సాగవుతున్న పామాయిల్ తోట

మైలవరం, తిరువూరు నియోజకవర్గాల్లోని అన్నదాతలు పామాయిల్ సాగుకు ఆసక్తి చూపుతున్నారు. మామిడి, మిర్చి, పత్తి పంటల సాగుకు నష్టాలబారిన పడుతున్న వేళ.. ప్రత్యామ్నాయంగా దీన్ని ఎంచుకుంటున్నారు. మద్దతు ధర రూ.13,650 ఉండడంతో సాగుకు సిద్ధమవుతున్నారు. కూటమి ప్రభుత్వం పంట సాగుకు ప్రోత్సాహం ఇస్తుండడం.. అంతర పంటల సాగుకు రాయితీపై సేద్యం పరికరాలు అందించడంతో సాగు చేస్తున్నామని రైతులు చెబుతున్నారు. పామాయిల్ దిగుబడులు వచ్చే వరకు అంతర పంటలు చిరుధాన్యాలు, మొక్కజొన్న వంటి పంటలతో ఆదాయం పొందవచ్చన్న తలంపుతో దీన్ని వేస్తున్నామని అన్నదాతలు వెల్లడిస్తున్నారు.


రాంగ్‌రూట్‌లో వస్తున్న యువకుడు


ప్రమాదకరంగా రోడ్డు దాటుతున్నాడిలా..

ప్రమాదానికి అడ్డదారి

చుట్టూ తిరిగి రోడ్డు దాటాలంటే దూరం అవుతుందని రాంగ్‌రూటులో వచ్చి రహదారి మధ్యలో ఉన్న డివైడర్ పై నుంచి ద్విచక్ర వాహనాన్ని దాటిస్తున్నాడీ యువకుడు. వాహనం డివైడర్ ఎక్కించే సమయంలో లేదా దించే సమయంలో ఏదైనా వాహనం వచ్చి ఢీకొడితే ప్రాణాలు అంతే సంగతులు. విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారిలో పెనమలూరు వద్ద కనిపించిన దృశ్యమిది. -ఈనాడు, అమరావతి

బోధన ఇంపు.. విద్యా సామర్థ్యాల పెంపు

జాదూయి పిటారా కిట్లతో పాఠాలు ● 1, 2 తరగతి విద్యార్థులకు ప్రయోజనం

విజయవాడ సిటీ, ఉయ్యూరు గ్రామీణం న్యూస్‌టుడే

ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే పిల్లలు ప్రాథమిక స్థాయిలోనే విద్యా సామర్థ్యాలు పెంపొందించే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. విద్యార్థులు పాఠ్యాంశాలు బోర్డు మీద రాసి బోధించడమే కాకుండా.. బొమ్మలు, మాస్కులు, పజిల్స్, తోలు బొమ్మలు వంటి పిల్లలు ఇష్టపడే వస్తువుల వినియోగించి ఉపాధ్యాయులు చెప్పేలా చర్యలు తీసుకుంది. అందులో భాగంగా ఒకటి, రెండు తరగతులు బోధించే ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఒక్కొక్కటి రూ.16 వేల విలువ చేసే జాదూయి పిటారా కిట్లను పాఠశాలలకు అందజేశారు. ఆ విధానంలో బోధన వల్ల పిల్లల్లో జ్ఞాపకశక్తి, భాషాభివృద్ధి, విద్యా నైపుణ్యాలు మెరుగుపడతాయని విద్యావేత్తలు చెబుతున్నారు.


కిట్ వినియోగించి పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయిని

విద్యార్థులు 42,378 మంది ఉన్నారు. అందులో బాలురు 20,425 మంది, బాలికలు 21,953 మంది. జిల్లాలో 284 పాఠశాలలకు చొప్పున కిట్లు పాఠశాలలకు అందించినట్లు సమగ్ర శిక్ష జిల్లా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎ.రజనీకుమారి వెల్లడించారు. ● కృష్ణా జిల్లాలో ఒకటో తరగతిలో 18,865 మంది, రెండో తరగతిలో 19,634 మంది మొత్తం 38,499 మంది విద్యార్థులు చదువుతున్నారు. జిల్లాలోని 219 పాఠశాలలకు కిట్లు పంపిణీ చేసినట్లు డీఈవో యు.వి. సుబ్బారావు తెలిపారు. ● కిట్‌లో 62 రకాల ఆట వస్తువులు

రెండు జిల్లాల్లో..

● ఎన్టీఆర్ జిల్లాలో ఒకటి, రెండు తరగతుల

ఉంటాయి. రంగు రంగుల బొమ్మలు, వివిధ రకాల బోధనోపకరణాలు, తెలుగు ఆంగ్ల భాషలోని అక్షరాలు, గణిత ఆకారాలు, రంగుల పెన్సిళ్లు, తోలుబొమ్మలు, మాస్కులు ఉంటాయి.

పిల్లలు ఆసక్తితో నేర్చుకుంటారు

పిల్లలు ఇష్టంగా, వారు కోరుకునే ఆహ్లాదకర వాతావరణంలో బోధన చేయడం వల్ల ఆసక్తితో నేర్చుకుంటారు. విద్యార్థుల సామర్థ్యాలు మెరుగుపడతాయి. హాజరు శాతం పెరుగుతుంది.
- శ్రీకాకుళపు అశోక్‌కుమార్, ఏఎంవో, సమగ్ర శిక్షా ఎన్టీఆర్ జిల్లా

నైపుణ్యాలు మెరుగుపడతాయి

ప్రాథమిక విద్య నుంచే పిల్లల విద్యాప్రమాణాలు పెంపొందించడానికి కిట్లు దోహదపడతాయి. కథలు చెప్పడం, తోలు బొమ్మలతో మాట్లాడించడం వల్ల ఉత్సాహక్తి, పఠనాసక్తి పెరుగుతుంది. ధారణ సామర్థ్యం వృద్ధి చెందుతుంది.
- యు.వి.సుబ్బారావు, కృష్ణా జిల్లా విద్యాశాఖాధికారి

అన్నప్రసాద పంపిణీ పరిశీలన


భక్తులతో మాట్లాడుతున్న ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్


ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ దర్శనానికి వచ్చే భక్తులకు పంపిణీ చేసే అన్నప్రసాద నాణ్యతను దుర్గగుడి పాలకమండలి ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ మంగళవారం పరిశీలించారు. భక్తులతో మాట్లాడి సదుపాయాలపై ఆరా తీశారు. ... రెండో సారి భోజనం వడ్డించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ట్రస్టుబోర్డు సభ్యులు అవ్వారు శ్రీనివాసరావు, పి.సుబ్రహ్మణ్యకుమార్, సూరిస సతీష్, ప్రత్యేక ఆహ్వానితులు బ్రహ్మం పాల్గొన్నారు.

సంక్రాంతి వేడుకలకు ఇంద్రకీలాద్రి ముస్తాబు

గ్రామీణ వాతావరణం ఉట్టిపడేలా ఏర్పాట్లు


సిద్ధమైన బొమ్మల కొలువు


రాజగోపురం ప్రాంగణంలో రంగవల్లులు వేస్తున్న మహిళలు


గ్రామీణ సంస్కృతికి చిహ్నమైన ఎడ్లబండి

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఈనెల 14 నుంచి 16 వరకు ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న సంక్రాంతి వేడుకలకు సర్వం సిద్ధమైంది. గ్రామీణ వాతావరణం ఉట్టిపడేలా రాజగోపురం ప్రాంగణంలో మహిళలు రంగవల్లులు తీర్చిదిద్దారు. బుధవారం ఉదయం 5 గంటలకు లక్ష్మీ గణపతి ఆలయం వద్ద శాస్త్రోక్తంగా భోగిమంటలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. చిన్నారులు దిష్టి పోయే విధంగా భోగి పండ్లు పోసే, వేడుకలకు ఉత్సవ వాతావరణం నెలకొల్పేందుకు ఏర్పాట్లు చేశారు. బొమ్మల కొలువులో దేవతామూర్తుల విగ్రహాలతో పాటు కొండపల్లి బొమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పల్లెటూళ్లలో పురిపాకలు, గంగిరెద్దుల విన్యాసాలు, ఎడ్లబండ్లు సెట్టింగులు భక్తుల కోసం ఏర్పాటు చేశారు. 15న సంక్రాంతి బొమ్మల కొలువు, హరిదాసుల సంకీర్తన భక్తులు వీక్షించేలా అధికారులు రంగం సిద్ధం చేశారు.

ఏపీ భవన్‌లో ప్రత్యేక పూజలు


కనకదుర్గమ్మ ప్రతిరూప ఆలయంలో అలంకరణ చేస్తున్న సిబ్బంది

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: దిల్లీలోని ఏపీ భవన్‌లో కనకదుర్గమ్మ ప్రతిరూప ఆలయంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజల కోసం మంగళవారం సర్వం సిద్ధం చేశారు. ఆలయ ప్రాంగణాన్ని పూలతో అలంకరించారు. ఈనెల 14, 15, 16 తేదీల్లో ప్రతిరూప ఆలయంలో అమ్మవారి దర్శనానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. దుర్గమ్మ ఆలయంతోపాటు రాష్ట్రంలోని ప్రధాన ఆలయాలు ద్వారకాతిరుమల, అన్నవరం, శ్రీకాళహస్తి, శ్రీశైలం, కాణిపాకం ఆలయాలకు సంబంధించిన స్టాల్స్ కూడా ఏపీ భవన్‌లో ఏర్పాటు చేశారు. వీటిల్లో సంబంధిత ఆలయాల ప్రసాదాలు, క్యాలెండర్లు, చిత్రపటాలను అందుబాటులో ఉంచారు. ప్రతిరూప ఆలయంలో కూడా పూజ చేసేందుకు అర్చకులు, సూపరింటెండెంట్ జగదీష్, మరో ఇద్దరు సహాయకులను మూడు రోజుల పాటు విధులు నిర్వర్తించేందుకు నియమించినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. ఇంద్రకీలాద్రి తరఫున పూజలు చేయనున్నారు. భక్తుల కోసం అందుబాటులో ఉంచాలని ఈవో శీనానాయక్ తెలిపారు. దుర్గమ్మ భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

బ్రదర్ జోసఫ్ తంబి ప్రతి ఒక్కరికీ ఆదర్శం

ఘనంగా పెద్దఅవుటపల్లి తిరునాళ్ల ప్రారంభం

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: క్రీస్తు బాటలో నడిచి తన జీవితాన్ని దేవునికి అంకితం చేసిన దైవసేవకుడు బ్రదర్ జోసఫ్ తంబి ప్రతి ఒక్కరికి ఆదర్శనీయుడని మేరీమాత కపూచియన్ ప్రావిన్స్ ఆంధ్రా, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల ప్రావిన్షియల్ రెవ.ఫాదర్ మరియదాసు ప్రస్తుతించారు. ఉంగుటూరు మండలం పెద్దఅవుటపల్లి బ్రదర్ జోసఫ్ తంబి 81వ వర్ధంతి మహోత్సవాలను ఫా.మరియదాసు జ్యోతి వెలిగించి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీస్తు బోధనలతో జీవితాన్ని సార్థకం చేసుకున్న బ్రదర్ తంబి తనకు విశ్వసించిన మధ్యవర్తి ప్రార్థనలు ద్వారా భక్తుల కోరికలు తీర్చే దైవసేవకుడిగా మంచి పేరు పొందారని చెప్పారు. అనంతరం ఫాదర్లు ప్రేమకుమార్, దాసరి జోసఫ్‌తంబి, ఉదయకిరణ్ వర్గప్రసాద్, మేరీమాత కపూచియన్ ప్రావిన్స్ బృందాలు వివిధ భాషల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జ్ఞానబంధ, భక్తిపాటలు, ఇతర నాటకాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. డీఎస్పీ శ్రీనివాసరావు నేతృత్వంలోని సీఐ రమేష్ బృందం బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏర్పాట్లను పుణ్యక్షేత్ర రెక్టర్ ఫా.పాలడుగు జోసఫ్ పర్యవేక్షించగా సంఘ పెద్దలు, మఠకన్యలు, విశ్వాసులు పాల్గొన్నారు.


బ్రదర్ జోసఫ్ తంబి సమాధి వద్ద నివాళి అర్పిస్తున్న కథోలిక గురువులు

ప్రతిభకు జాతీయ పురస్కారం


తిరుమలైకుమార్‌కు పురస్కారం అందజేస్తున్న డీఆర్ఎం మోహిత్ సొనాకియా, డీఎం ప్రశాంతకుమార్

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ద.మ.రైల్వే విజయవాడ డివిజన్‌లో చీఫ్ కమర్షియల్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న ఎస్.తిరుమలైకుమార్‌కు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ 'అతి విశిష్ట రైల్ సేవా పురస్కార్' అందజేశారని డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది. తిరుమలైకుమార్ 2001 నుంచి తన విధులతో పాటు ఏటా క్రీడల్లో అత్యుత్తమంగా రాణిస్తున్నారు. 22 అంతర్జాతీయ పారా ఈవెంట్లలో తలపడి 20 పతకాలు సొంతం చేసుకున్నారు. ఈ క్రమంలో జాతీయ రైల్వే అందించే ఈ అత్యుత్తమ పురస్కారానికి ఎంపిక చేశారు. ఈ నెల 9వ తేదీన దిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో రైల్వే మంత్రి చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకున్నారని వెల్లడించింది. డీఆర్ఎం మోహిత్ సొనాకియా, ఏడీఆర్ఎం పీఈ ఎడ్విన్ (ఇన్‌ఫ్రా), ఏడీఆర్ఎం (ఆపరేషన్స్)కొండా శ్రీనివాసరావు, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ బి.ప్రశాంత కుమార్, పలు శాఖాధికారులు తిరుమలైకుమార్‌ను అభినందించారు.

కీసరలో పొట్టేళ్ల పందేలు


తలపడుతున్న పొట్టేళ్లు

కంచికచర్ల: సంక్రాంతి సంబరాల్లో భాగంగా కీసర జాతీయ రహదారికి సమీపంలో మంగళవారం పొట్టేళ్ల పందేలు నిర్వహించారు. వీటిని చూసేందుకు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు భారీగా తరలి వచ్చారు. మరోపక్క, మండలంలో 14వ తేదీ నుంచి భారీ స్థాయిలో కోడి పందేలు నిర్వహించేందుకు రంగం సిద్ధమయ్యింది. ముఖ్యంగా గండేపల్లి వద్ద క్యాంపింగ్ తరహా బరి జాతా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడికి తరలి వచ్చే వారికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇదిలా ఉండగా పోలీసులు బరుల ధ్వంసం చేశామని ప్రకటించినప్పటికీ క్షేత్ర స్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి.

కృష్ణానదిలో యువకుడి గల్లంతు


చరవాణిలో ఉన్న తాడికారకు వివరాలు తెలియజేస్తున్న ఎస్సై ధర్మరాజు

చందర్లపాడు, న్యూస్‌టుడే: సంక్రాంతి సెలవుల కోసం ఇంటికి వచ్చిన ఓ యువకుడు కృష్ణానదిలో స్నానానికి దిగి గల్లంతైన ఘటన మండలంలోని ఏటూరు రేవు వద్ద మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన సమాచారం ప్రకారం.. ఏటూరు గ్రామానికి చెందిన పెద్ద కుమారుడు సద్దుత్ (23) బెంగళూరులో ఉద్యోగం చేస్తున్నాడు. సంక్రాంతి సెలవులకు స్వగ్రామం వచ్చాడు. మంగళవారం సాయంత్రం సద్దుత్, స్నేహితులు కామా విజయ్, ఆదూరి అభితో కలిసి గ్రామానికి సమీపంలో పల్నాడు జిల్లా దిడుగు రేవు వద్ద కృష్ణా నదిలో స్నానం చేస్తున్నారు. ఈ క్రమంలో లోతుకు వెళ్లి మునిగిపోయాడు. విజయ్, అభిలు ఒడ్డు అందుకుని వారు సురక్షితంగా బయటపడ్డారు. సద్దుత్ నీటిలో మునిగి గల్లంతయ్యాడు. స్నేహితులు ఇచ్చిన సమాచారంతో గ్రామస్థులు తెలియజేయగా ఈతగాళ్లను రప్పించి గాలించారు. చీకటి పడడంతో గాలింపు నిలిపివేశారు. ఎస్సై ధర్మరాజు సంఘటనా స్థలానికి చేరుకుని సమాచారాన్ని ఉన్నతాధికారులకు అందజేశారు.

☛ ఆందోళనలో తల్లిదండ్రులు: సద్దుత్ తల్లిదండ్రులు కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. పెద్దకొడుకు కూడా చేసుకుని కష్టపడి ఉద్యోగం సాధించిన కుమారుడు సంక్రాంతి సెలవులకు ఇంటికి వచ్చిన కుమారుడు కృష్ణానదిలో గల్లంతవ్వడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. చిన్న కుమారుడు కూడా డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు.

15 నుంచి జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు

విజయవాడ (క్రీడలు), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ కబడ్డీ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి నాలుగు రోజుల పాటు ఈడుపుగల్లులోని సీతారామ గార్డెన్స్‌లో 51వ జాతీయ జూనియర్ (అండర్-20) బాలుర కబడ్డీ ఛాంపియన్‌షిప్ నిర్వహిస్తున్నట్లు సంఘ ప్రధాన కార్యదర్శి వీరలంకయ్య తెలిపారు. 29 రాష్ట్రాలకు చెందిన జాతీయ అమెచ్యూర్ కబడ్డీ సమాఖ్య (ఏకేఎఫ్ఐ) అనుబంధ జట్లతో పాటు జాతీయ క్రీడాప్రాధికార సంస్థ (శాయ్) జట్లతో కలిపి మొత్తం 30 జట్లు తలపడనున్నాయి. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో నిర్వహించే పోటీల్లో అంతర్జాతీయ స్థాయి రిఫరీలు ప్రో-కబడ్డీలో పాల్గొన్న పలువురు క్రీడాకారులు తమ రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారని తెలిపారు. పోటీలో పాల్గొనే క్రీడాకారులకు ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జాతీయ జట్టుకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఏర్పాట్లను సంఘ ప్రతినిధులు ఎస్.శ్రీనివాసరావు, కేవీ నాంచారయ్య, సుబ్బరాజు పర్యవేక్షిస్తున్నారని ఆయన తెలిపారు.

వసుంధర

vasundhara@eenadu.in

సంక్రాంతి ముచ్చట్లు



గోడల కోసం పోటీపడేవాళ్లం!

మాది విజయనగరం జిల్లా పాచలవలస. మా ఊళ్లో సంక్రాంతి, కనుమ ఘనంగా చేస్తారు. తాతగారి ఊరు గజపతినగరం(రైల్వేస్టేషన్)లో మాత్రం భోగి బాగా చేసేవారు. నెలగంటు పట్టింది మొదలు ఆడపిల్లలం పిడకలు పెట్టడంలో బిజీ. అప్పుడు తాటాకు మిద్దె ఇళ్లు ఉండేవి. వాటి గోడలకు పిడకలు సరిగ్గా వచ్చేవి కాదు. దాంతో సిమెంట్ గోడలకోసం పోటీ ఉండేది. కుర్చీలు వేసుకుని మరీ కరెంటు స్తంభాలకూ పిడకలు కొట్టేవాళ్లం. భోగి ముందురోజు వీధుల్లో తిరిగి కర్రలు అడగడం అలవాటు. 'భోగి మంట పొయ్యిలో కర్ర ఇచ్చినోళ్ల పుణ్యం ఇవ్వనోళ్ల పాపం' అని పాడేవాళ్లం. ముందు రాత్రి ఎవరైనా బయట పాత మంచాలు, రోళ్లు, రోకళ్లు మర్చి పోతే అవి భోగిమంటలోకి వెళ్లిపోవడమే. దాంతో అందరూ జాగ్రత్తపడేవాళ్లు. భోగినాటికి పెద్ద వరమాలల్లా పిడకల దండలు సిద్ధమైపోయేవి. వేకువనే లేచి నలుగు పెట్టుకుని, స్నానాలుచేసి కొత్త బట్టల్లో మంట దగ్గరకు వెళ్లేవాళ్లం. ఎవరి భోగి మంట పెద్దగా వచ్చిందోనని పక్క వీధి వాళ్లతో పోల్చుకుంటూ చూసేవాళ్లం.



– పెంకి హేమలత, విజయనగరం

ప్రసాదం భక్తులూ... వచ్చేశారా?

చిన్నప్పుడు మేం గుంటూరు జిల్లా పాత మంగళగిరిలో ఉండేవాళ్లం. అక్కడ ఏళ్ల క్రితం నాటి రామాలయం ఉండేది. ధనుర్మాసంలో ఆ కోవెలకు వెళ్లేవాళ్లం. మమ్మల్ని చూడగానే పూజారి 'ప్రసాదం భక్తులూ వచ్చేశారా? స్వామివారూ నేనూ మీ కోసమే ఎదురు చూస్తున్నా'మంటూ పూజ ప్రారంభించేవారు. అదయ్యాక అరిటాకు దొన్నెల్లో వేడి వేడి ప్రసాదం పెట్టిచ్చేవారు. చలికి వేడిగా ప్రసాదం తింటూ కబుర్లు చెప్పుకోవడం బాగుండేది. గుడి ప్రాంగణంలో వంతులేసుకుని రంగుల ముగ్గులేసేవాళ్లం. వాటిమధ్య ఆవుపేడతో చేసిన గొబ్బెమ్మలు ఉంచి, గొబ్బి తట్టేవాళ్లం. రేగుపళ్లు, చెరకు ముక్కలు, శనగలు ప్రసాదంగా పెట్టి, పంచుకునేవాళ్లం. ఆటపాటలతో అలసి... ఆనందంగా ఇంటికి చేరేవాళ్లం.



– నందిరాజు కృష్ణకుమారి, హైదరాబాద్

భిన్న రుచుల సంబరమే!

మహబూబ్ నగర్ జిల్లాలో చిన్న గ్రామం మాది. కొండల మధ్య పచ్చదనానికీ, సీతాఫలాలకూ మా ఊరు పెట్టింది పేరు. సంక్రాంతి అంటే మాకు భిన్న రుచుల సంబరమే. భోగినాడు నువ్వుల రొట్టెలు, గుమ్మడి, చిక్కుడు కాయ కూరలు చేస్తారు. సంక్రాంతికి బెల్లం, కొత్తబియ్యంతో పులగం, నెయ్యి, గడ్డపెరుగు... ఆ రుచులే వేరు. కనుమ రోజు ఊరంతా పులావు, మాంసాహార ఘుమఘుమలే. అంతేకాదు, చాటుగా కోళ్ల పందేలు జరిగేవి. ఎంత దూరమైనా వెళ్లేవాళ్లం. పోలీసులు పట్టుకోవడానికి వస్తే మాత్రం భయంతో కాళ్లకు పని చెప్పేవాళ్లం. మరుసటి ఏడాది అయినా వెళ్లేవాళ్లం. ఏదైతేనేం సరదాగా గడిపేవాళ్లం.



– జి. యశోదా రెడ్డి, నాగర్ కర్నూల్

పండుగ ఎందుకు వచ్చింది...

మేం చిన్నప్పుడు కాకినాడలో పోలీసు క్వార్టర్స్‌లో ఉండేవాళ్లం. పిల్లలమంతా కలిసి 'పండుగ ఎందుకు వచ్చింది...' అంటూ పాటలు పాడుతూ అన్ని ఇళ్లకీ వెళ్లేవాళ్లం. భోగి మంట వేయడానికి అవసరమైన పాత కుర్చీలు, మంచాలు, నూనె వంటివన్నీ సేకరించేవాళ్లం. ఆవు పేడ తెచ్చి పిడకలు చేసి, దండ గుచ్చేవాళ్లం. ఎవరు ఎంత పెద్దది వేస్తే అంత గొప్ప అన్నట్టు ఆనందించేవాళ్లం. అమ్మల ముద్ద, అరటిపండు అంటూ పిడకలకీ పేర్లు ఉండేవి. మూడు రోజుల పాటు భోగి మంట ఆరకుండా చూసుకునేవాళ్లం. భోగినాడు మాకు అత్తెసరు అన్నం, పచ్చిపులుసు చేసేవారు. సున్నుండ, నెయ్యి తినిపించేవాళ్లు. సంక్రాంతినాడు పెద్దలకు పూజలు చేసి, వారి పేరు మీద బట్టలు, పండ్లు పంచేవాళ్లం.



– మైలవరపు భవాని, కాకినాడ

నెయ్యి చిక్కీలే గుర్తొస్తాయ్!

సంక్రాంతి అనగానే మాకు గుర్తొచ్చేది నెయ్యి చిక్కీలే! కొత్త ధాన్యాన్ని ఇసుకలో వేయించి నెయ్యిలు చేస్తారు. వాటిని కొత్తగా తయారుచేసిన బెల్లం పాకంలో వేసి, ఉండలు చేస్తారు. చాలామంది అమ్మడానికీ తెచ్చేవాళ్లు. కల్లాల్లో అమ్మేవాళ్లు వస్తే ధాన్యాన్ని ఇచ్చి, ఉండలు కొనేవాళ్లు. పండుగంటే అమ్మ పుట్టింటి నుంచి మురిపెంగా తెచ్చుకున్న... కంచు బిందెలు, మర చెంబులు, ఇత్తడి గరిటెలు అన్నీ బయటకు వచ్చేవి. పిండి వంటలకు కావాల్సిన మసాలాలు, పిండ్లు అన్నీ అమ్మే దంచి సిద్ధం చేసేది. మా పని ఒక్కటే. వేప చెట్టుకి ఊయల వేస్తే ఊగడం. తిన్నవన్నీ అరిగేదాకా ఆడటం.



– నెలిరోతు లక్ష్మి, విజయనగరం

ఇంటికి పిలిచి...



సంక్రాంతికి ఎక్కడెక్కడున్నా మేమంతా తప్పక కలుస్తాం. సంక్రాంతి పిలుపులు అంటూ అల్లుడిని అత్తారింటికి పిలుస్తారు. నాన్న మా మేనత్త ఇంటికెళ్లి మరీ ఆహ్వానిస్తారు. పండుగనాడు పెద్దలకు బోజీలు పెడతాం. అమ్మానాన్నలు మా ఇంటి పేరంటాలకు పూజలు చేస్తారు. వీధంతా కలిసి మేళతాళాలతో 'పేరంటాల తల్లి'ని దర్శించుకుని పూజలు చేస్తాం. ఇంటికొచ్చాక పెద్దలకు మడపళ్లు పెడతాం. పండగన్నాళ్లూ అంతా కలిసి భోజనం చేస్తాం. అమ్మమ్మ వాళ్లింటికి వెళతాం. కబుర్లు, ఆటపాటలతో భలే సందడిగా గడిపేస్తాం.

– పిల్లా సాత్విక ప్రియ, రాజాం



సంక్రాంతి కదా... సెలవు పెట్టిమరీ ఊరొచ్చింది స్వాతి. తను సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. ఇంట్లోకి అడుగు పెట్టగానే ఎప్పుడూ బాబాయి దగ్గరే ఉండే బామ్మ పండక్కి తమ ఇంటికొచ్చేసరికి తెగ సంబరపడిపోయింది. ఇంకేం... తన సంగతులన్నీ చెప్పుకొచ్చింది. ఆ సందర్భంలోనే 'వృత్తి, వ్యక్తిగత జీవితాల్ని సమన్వయం చేసుకోవడానికే కష్టపడుతున్నాం. ఇక పండుగలేం చేసుకుంటా'మంటూ ఉద్యోగినిగా తన కష్టాలు పంచుకుంది. అది విన్న బామ్మ నవ్వింది. సాంకేతిక కాలంలోనూ సంక్రాంతి ఎందుకు ముఖ్యమో వివరించింది...

ఆహ్వానిద్దామా... ఆ సంక్రాంతి కాంతుల్ని!

'స్వాతి... మీ ఉరుకుల పరుగుల జీవితాలు నాకు తెలియనివి కాదు. కానీ ఇలా పరుగెత్తుతూ పాలు తాగినా... అవి ఒంటపట్టవు. కాబట్టే, సంక్రాంతి లాంటి మన పండుగలు నిలబడి నీళ్లు తాగే అవకాశాన్ని కల్పిస్తాయి. ఆటవిడుపులా పనిచేసి మనసుకు ఆహ్లాదాన్నిస్తాయి. యాంత్రికమైపోతున్న మీ జీవితాల్లో కొత్త కాంతుల్ని తీసుకువచ్చేవే ఈ మూన్రోజుల సంక్రాంతి సంబరాలు. పండుగ నెపంతోనైనా ఆలోచనల్ని పల్లెటూళ్లు, ప్రకృతి, సంస్కృతీ సంప్రదాయాల వైపు మళ్లిస్తారు కదా! అయినా ఎప్పుడూ చుడీదార్లు, ప్యాంటూ షర్టులేనా? పండుగనాడైనా చీరలు, లంగా ఓణీలు కట్టి చూడండి! భారతీయ కట్టుబొట్టులోని సౌందర్యం తెలుస్తుంది. ఎంతసేపూ కంప్యూటర్ కీబోర్డులు నొక్కీ నొక్కీ బోర్ కొట్టట్లేదా? వేళ్లు నొప్పిపెట్టడం లేదా? అందుకే మీ అమ్మావాళ్లతో కలిసి గొబ్బెమ్మలు పెడుతూ 'కొలని దోపరికి గొబ్బిళ్లో, యదుకుల స్వామికి గొబ్బిళ్లో...' అని పాడుకోండి. మనసు మరో లోకంలో విహరిస్తుంది.

అదీ సృజనే!

మీరు తరచూ చెబుతుంటారే క్రియేటివిటీ అని! సంక్రాంతి సంబరాల్లో ఎంత సృజన ఉంటుందనీ? ఈ మాసంలో పల్లెల్లోని ప్రకృతి... గొప్ప చిత్రకారుడు గీసిన సప్తవర్ణాల చిత్రంలా ఉంటుంది. ముంగిట్లో వేసే ముగ్గులు ఎన్నెన్ని ఊసులు చెబుతాయని? ఒక్క చుక్క కూడా లెక్క తప్పకుండా వేసే ముగ్గు... జీవితాన్నీ అలా పొందికగా, నలుగురూ ఆశ్చర్యానికి లోనయ్యేలా తీర్చిదిద్దుకోవాలని చెబుతుంది. పండుగకి చేసే పిండివంటలు నాలుకకు కొత్త రుచుల్ని పరిచయం చేస్తాయి. పైగా ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వంటల వీడియోలకీ లక్షల వీక్షకులట కదా! వివేకానందుడు అంతటివాడే 'ధ్యానం తరవాత ఏకాగ్రతని పెంచే గొప్ప కళ వంట' అని చెప్పారు. సరదాగా గరిట తిప్పి చూడు. సృజనాత్మకతను పెంచుకోవడానికి సంక్రాంతిని మించిన వేదిక ఏముంది అనిపించట్లేదూ?

ప్రకృతిలో సరదాగా...

గాజు గదులు, ల్యాప్‌టాప్‌లు, బ్లూటూత్‌లు, కాఫీషాపుల మధ్య తలమునకలైపోతూ ఉంటారు. ప్రకృతికి దూరమైపోతున్నాం అనిపించట్లేదా? గొబ్బెమ్మలు, భోగి మంటలు, రేగుపళ్లు, చెరకుగడలు... ఇలాంటివన్నీ మిమ్మల్ని మేడల్ని వదిలి నేలపైకి దించుతాయి. పల్లెవాతావరణంతో మమేకం చేస్తాయి. మా చిన్నప్పుడు సంక్రాంతికి...

'పాడిచ్చే గోవులకు పసుపు కుంకం
పనిచేసే బసవనికీ పత్రీపుష్పం
గాదుల్లో ధాన్యం, సావిళ్ల భాగ్యం
కష్టించే కాపులకు కలకాలం సౌఖ్యం'

అని పాటలు పాడుకునేవాళ్లం. ఈ పాటల్లో కృతజ్ఞత సుగుణమని, కష్టపడేవారికి శాశ్వతమైన సుఖమని చెప్పే పాఠాలెన్నో ఉన్నాయి. సాయం చేసిన వాళ్లని మరచిపోవద్దు. కష్టపడితేనే ప్రమోషన్లని మీ తరాలకీ చెబుతున్నట్లు లేదూ? మా కాలంలో ఆధ్యాత్మిక ప్రవచనకారులు మకర సంక్రాంతి దానధర్మాల పండుగని చెప్పేవారు. మనకు ఉన్నదాంట్లో యథాశక్తి దానాలు చేయమంటూ 'కాలే దానం స్వశక్తితః...' అన్న శ్లోక పాదాన్ని గుర్తు చేసేవారు. ఈ పాఠాలు మీ తరాలకీ అవసరమే. కాబట్టి, మీ జీవితాల్ని నందనవనం చేసుకునేందుకు ఈ భోగి, సంక్రాంతి, కనుమ మూడు రోజుల వేడుక ఎంతో సాయపడుతుంది. ఆలోచించి చూడ'మన్న బామ్మ మాటలతో స్వాతి ముందుకు కదిలింది. భోగి కదా! ఉత్సాహంగా రంగవల్లులు తీర్చిదిద్దడంలో మునిగిపోయింది. ఈ పరమార్థం స్వాతి మాత్రమే కాదు... ప్రతి అమ్మాయీ అర్థం చేసుకోవాలి. అప్పుడే ఆనందాల్ని ఆహ్వానించడం తెలుస్తుంది.

– చైతన్య

సుబ్బీ గొబ్బెమ్మ సుఖములియ్యవే!



ధనుర్మాసం వచ్చిందంటే చాలు... మంచు తెరలు విడిపోక ముందే ఇంటి ముంగిట నెల ముగ్గుల్లో గొబ్బెమ్మలు ముచ్చటగా కొలువుదీరతాయి. సాయంత్రమైతే చాలు... పడుచు పిల్లలంతా ఒక్కచోట చేరతారు. గుమ్మడి, బంతి, చామంతి వంటి పూలతో అలంకరించి, పసుపూ, కుంకుమలతో గౌరమ్మని కొలుస్తారు. 'సుబ్బీ గొబ్బెమ్మ- సుఖములియ్యవే', 'గొబ్బీయళ్లో- గొబ్బీయళ్లో' అంటూ జానపదాలను పాడుతూ ఆడతారు. గొబ్బెమ్మలను కృష్ణుని భక్తురాళ్లైన గోపికలకు సంకేతంగానూ భావిస్తారు. గోవును లక్ష్మిగా, గౌరిగా కొలుస్తాం. ఆవుపేడనూ ఎంతో పవిత్రంగా భావిస్తాం. శాస్త్రీయ కోణంలో చూస్తే ఇందులో బోలెడన్ని ఔషధ గుణాలూ ఉన్నాయి మరి. ఇలా గొబ్బెమ్మ చుట్టూ తిరుగుతూ... చప్పట్లు కొడుతూ పాటలు పాడటం పిల్లలకు తోటివారితో సత్సంబంధాలనూ, నెట్‌వర్క్‌నూ ఏర్పరుస్తుంది. ఈ కాలంలో చలికి కాస్త బద్ధకించిన వారి శరీరాలకూ చురుకు పుట్టి ఉత్సాహంగానూ ఉంటారు. గౌరమ్మకు ప్రసాదంగా నానబెట్టిన అటుకులూ, బెల్లం, కొబ్బరి తురుము, యాలకుల పొడి కలిపి పెడతారు. ఇది పోషకాలను ఇస్తూనే వ్యాధినిరోధక శక్తినీ పెంచుతుంది.

కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ ఆయా రాష్ట్రాల హస్త కళలు, శాస్త్రీయ నృత్యాలు విదేశీ పర్యటకుల్ని మళ్లీ మళ్లీ చూసేలా ఆకర్షిస్తాయి. అలా ఇండియాని ఇప్పటి వరకూ 11సార్లు చూసిన వారిలో గిసెల్ బుసాన్ కూడా ఒకరు. ఝార్ఖండ్‌లోని ఛవూ నృత్యంపై తనకున్న ఇష్టాన్ని పంచుకున్నారు.

ఛవూ... చాలా ప్రత్యేకం!

సరాయికెలా ప్రాంగణమంతా ఛవూ నృత్యం(యుద్ధ కళల నేపథ్యంతో చేసేది) సందడితో నిండిపోయింది. ఝార్ఖండ్ రాజధాని అయిన సరాయికెలా సాంస్కృతిక కళలకు పెట్టింది పేరు. ఏడాది పొడవునా జరిగే ఈ నృత్యం, సంస్కృతీ సంప్రదాయాలు పర్యటకుల్నీ ఎక్కువ ఆకర్షిస్తుంటాయి. అందుకే ఈ ప్రాంతాన్ని మళ్లీ మళ్లీ చూసేందుకు వస్తుంటారు విదేశీ పర్యటకులు. ఫ్రాన్స్‌కు చెందిన గిసెల్ బుసాన్‌ని కూడా ఈ ఛవూ నృత్యం చాలా ఆకట్టుకుంది. ఈ డ్యాన్స్ ప్రత్యేకతను తెలుసుకోవడంతోపాటు మరికొంతమంది పర్యటకులకి దీని విశిష్టత చెప్పడం మరో విశేషం. 'దీన్ని ఇక్కడ ఎక్కువగా గిరిజనులే చేస్తుంటారు. నాట్యం చేసేవారు ముఖానికి వివిధ మాస్కులు పెట్టుకుని గిరిజనుల జీవితం, పురాణ గాథలు చెబుతుంటారు. ఈ నాట్యానికి ఏళ్ల చరిత్ర ఉంది. 'నన్ను ఆకర్షించింది వాళ్ల నాట్యం కాదు, రంగుల మాస్క్ వెనక దాగి ఉన్న వారి భావాలు. వారు వేసుకునే ఆ మాస్కులు భావోద్వేగాలను పలికించగలవు. ప్రతి కదలికలోనూ, చూపులోనూ శతాబ్దాల చరిత్ర దాగి ఉంది. తరతరాలుగా ఈ నాట్యానికీ, రాజవంశీయులకీ మధ్య ఉన్న అనుబంధాన్ని ఈ మాస్క్ తెలియజేస్తుంది. సహజ రంగులతో తయారయ్యే ఈ మాస్కులు కళాకారుల జీవితాలని ప్రతిబింబిస్తాయి. అందుకే ఛవూ చాలా ప్రత్యేకం. ఇప్పటికి 11సార్లు భారత్‌లో పర్యటించా. ఝార్ఖండ్ రావడం ఇది రెండోసారి. ఇక్కడి ఆహారపు అలవాట్లు, సంప్రదాయాలు, ముఖ్యంగా గిరిజనుల జీవన విధానం నన్ను చాలా ఆకర్షించాయి. అందుకే మళ్లీ ఇక్కడికి రావాలనిపిస్తోంది మనసుతో చూడాలే కానీ, మన చుట్టూ ఉన్న ప్రపంచం మొత్తం కళలతో నిండి ఉంటుంది' అంటారు గిసెల్.

ఈటీవీ భారత్ యాప్ స్టోర్ & గూగుల్ ప్లే ద్వారా డౌన్‌లోడ్ చేసుకోండి





భావన



ఆమె గాలిపటం దేశం దాటింది!

సంక్రాంతి వేళ... అమ్మాయిలు ముగ్గులేస్తారు. అబ్బాయిలు గాలిపటాలు ఎగరేస్తారు. భర్తలు గాలిపటాలెగరేస్తే, భార్యలు వెనకుండి వాళ్లని ఉత్సాహపరుస్తుంటారు. అంతటా కనిపించే దృశ్యమే. కానీ దీన్ని తిరగరాశారు భావనా శైలేష్ మెహతా. జాతీయ, అంతర్జాతీయ స్థాయుల్లో గాలిపటాల పోటీల్లో రాణిస్తూ దేశంలోనే తొలి మహిళా అంతర్జాతీయ కైట్ ఫ్లయర్ కమ్ డిజైనర్‌గా నిలిచారు!

గాలిపటాల ఆనందం దేశమంతా ఒకెత్తయితే, గుజరాతీయులది మరో కెత్తు. సంక్రాంతి సమయంలో ఏటా జరిగే అంతర్జాతీయ పోటీలతో అహ్మదాబాద్‌లో ఎటుచూసినా సందడే. ఆకాశం రంగుల గాలిపటాలతో కనువిందు చేస్తుంటుంది. ఆ వాతావరణంలోనే పుట్టి పెరిగారు భావన. కానీ ఈమెకు ఆసక్తి మాత్రం భర్త శైలేష్ నుంచే వచ్చింది. 'శైలేష్ గాలిపటాల ప్రియుడు. పెళ్లయిన కొత్తల్లో చర్కీని నేను సరిగ్గా పట్టుకోకపోవడంతో ఆయన ఎగరేసిన గాలిపటాన్ని వేరెవరో తెంచారని కోపంగా చూశారు. ఆరోజే వీటి సంగతేంటో చూడాలనుకున్నా. పైగా మా అబ్బాయి నన్నూ ఎగరేయమనేవాడు. అలా దీన్నో వృత్తిగా ఎంచుకున్నా. 2008లో అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్‌లో తొలిసారి పాల్గొన్నా. వరసగా ఏళ్లపాటు మొదటి బహుమతిని గెలుచుకున్నా. దాంతో భారత ప్రభుత్వం తొలి మహిళా కైట్ ఫ్లయర్ బిరుదునీ ప్రదానం చేసింది. అంతర్జాతీయ పోటీల్లోనూ పాల్గొన్నా. ఇండియా-ఇండోనేషియాల 70 ఏళ్ల స్నేహానికి గుర్తుగా రామాయణ-మహాభారత పేరుతో రెండు దేశాల సంస్కృతినీ ప్రతిబింబిస్తూ డిజైన్ చేసిన గాలిపటానికి లండన్‌లో 'ఉత్తమ కళాత్మక గాలిపటం' అవార్డునీ అందుకున్నా. ఇతిహాసాలు, జంతువులు, పక్షులు... ఇలా భిన్న థీమ్స్‌లో గాలిపటాల్ని డిజైన్ చేస్తుంటా. నేను చేసే ప్రతి గాలిపటం వెనక ఓ సందేశం ఉండేలా చూసుకుంటా' అంటారీమె.

'మనదేశంలో ఎంతోమంది గాలిపటాల వ్యాపారంలో ఉన్నారు. మరెంతోమంది వీటిని ఎగరేస్తూ గంటలకొద్దీ సమయాన్నీ వెచ్చిస్తారు. కానీ ఇది మన దగ్గర ఓ క్రీడగా అభివృద్ధి చెందలేదు. నేను ఎగరేసేప్పటికి మహిళా ఫ్లయర్లు తక్కువే. అందుకే 'డీస్ కైట్ ఫ్లయింగ్ క్లబ్' ద్వారా ఆసక్తి ఉన్నవాళ్లకు గాలిపటాల కళను నేర్పిస్తున్నా' అంటారు భావన. ఇవనే కాదు, జ్యువెలరీ, క్యాండిల్స్ తయారీ, పాకశాస్త్రంలోనూ ప్రావీణ్యం ఉందీమెకు. హస్తకళలపట్ల ఉన్న ఆసక్తితోనే దేశ విదేశాల్లో జరిగే ప్రదర్శనల్లో పాల్గొనడంతోపాటు కుకింగ్ క్లాసెస్, టెలివిజన్ షోలనీ నిర్వహిస్తున్నారీమె. 'తరుణి ప్రగతి ట్రస్ట్' అనే ఎన్జీవో నెలకొల్పి ఆసక్తి ఉన్న మహిళలకు విభిన్న కళల్లో నైపుణ్యాల్ని నేర్పిస్తూ ఆంత్రప్రెన్యూర్లుగానూ తీర్చిదిద్దుతోన్న భావన ప్రయాణం స్ఫూర్తిదాయకమే కదూ!



ఆయుష్షుని పెంచే భోగి పళ్లు...



హరిదాసు కీర్తనలు, ముంగిట ముగ్గులు, గొబ్బెమ్మలతో పాటు సంక్రాంతి పండుగలో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సింది భోగిపళ్ల వేడుక గురించే! నెలల పాపాయి నుంచి ఐదేళ్ల చిన్నారుల వరకూ భోగి రోజున ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. రేగుపండ్లలో పూల రేకులూ, చిల్లర నాణేలూ, చెరకు ముక్కలూ, బియ్యం వంటివన్నీ కలుపుతారు. తల్లి ఒళ్లో చిన్నారిని కూర్చోబెట్టి మహిళలంతా కలిసి వాటిని దోసిళ్లతో తీసి తలపై పోస్తారు. ఇక్కడ విశేషంగా చెప్పుకోవాల్సిన విషయం ఏంటంటే... రేగు పండ్లనే భోగి పళ్లుగా పిలుస్తారు. ఇది కేవలం కుటుంబ వేడుక కాదు... ఇరుగుపొరుగు, బంధువులు, స్నేహితులు... అంతా ఒక్క చోట చేరే సందర్భం కూడా. ఇది సామాజిక ఐక్యతను ఏర్పరుస్తుంది. పసిపిల్లల తొలి అడుగుల చుట్టూ పెద్దల ప్రేమ, ఆశీర్వాదాలు వారికి మానసిక బలాన్నీ, భద్రతా భావాన్నీ పంచుతాయి. వారిలో ధైర్యం, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయి. ఇంతకీ దీనివల్ల కలిగే ప్రయోజనం ఏంటంటారా? పిల్లలపై ఉండే దిష్టిపోతుందని కొందరంటే, తల పైభాగంలో ఉండే బ్రహ్మరంధ్రం ప్రేరేపితమై జ్ఞానం పెరుగుతుందని మరికొందరు చెబుతారు. పిల్లలకు ఆయురారోగ్యాలు కలుగుతాయనీ మేధస్సు, సిరిసంపదలు కలగాలనీ... ఇలా చాలానే చెబుతారు. ఏది ఏమైనా ఈ సంప్రదాయం సరదా, సంతోషం, సమైక్యతలకి ప్రతీక. అంతేకాదండోయ్... చుట్టూ పడిన రేగు పండ్లను పిల్లలు ఏరుకుని తినడంవల్ల వారిలో వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని భావిస్తారు.

రంగవల్లిక



28 చుక్కలు
4 వరుసలు
4 వచ్చేవరకూ

మల్ల సునీత
పలాస



25 చుక్కలు
3 వరుసలు
3 వచ్చేవరకూ

డి. గాయత్రి



21 చుక్కలు
11 వచ్చే వరకూ
మధ్య చుక్క

మద్దిగట్ల సుమలత, మహబూబ్‌నగర్

బంగారం - వెండి

13న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,42,530	1,31,050	2,92,458
విజయవాడ	1,41,040	1,30,650	2,70,500
ప్రొద్దుటూరు	1,42,200	1,30,820	2,63,000
రాజమహేంద్రవరం	1,42,530	1,30,650	2,92,000
విశాఖపట్నం	1,42,530	1,30,650	2,72,000
తమిళనాడు	-----	1,31,700	2,92,000


మఠాధిపతిగా బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకటాద్రిస్వామి

బ్రహ్మంగారిమఠం మఠాధిపతిగా వెంకటాద్రిస్వామి

బ్రహ్మంగారిమఠం, న్యూస్‌టుడే: వైఎస్సార్ కడప జిల్లా వీరబ్రహ్మేంద్రస్వామి మఠానికి 8వ తరం 12వ మఠాధిపతిగా వెంకటాద్రిస్వామిని నియమిస్తూ రాష్ట్ర దేవాదాయ శాఖ ఉత్తర్వులు ఇవ్వడంతో మంగళవారం వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో మేనేజర్ ఈశ్వరయ్యాచారి ఆధ్వర్యంలో వెంకటాద్రిస్వామి బాధ్యతలు స్వీకరించారు. పూర్వ మఠాధిపతి వసంత వెంకటేశ్వరస్వామి శివైక్యం చెంది అయిదేళ్లు అయింది. అప్పటి నుంచి మఠాధిపత్యంపై ఆయన కుటుంబ సభ్యులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ క్రమంలో వసంత వెంకటేశ్వరస్వామి మొదటి భార్య చంద్రావతమ్మ పెద్దకుమారుడు వెంకటాద్రిస్వామి మఠాధిపతిగా నియామకమయ్యారు.

వాహనాల జీవిత పన్నుపై 10 శాతం రహదారి భద్రత సెస్

ఈనాడు, అమరావతి: కొత్తగా కొనుగోలు చేసే వ్యక్తిగత వాహనాలపై రవాణాశాఖ వసూలు చేసే జీవిత పన్ను (లైఫ్ ట్యాక్స్)పై.. అదనంగా 10 శాతం మేర రహదారి భద్రత సెస్‌ను విధిస్తూ ప్రభుత్వం మంగళవారం ఆర్డినెన్స్ జారీ చేసింది. అంటే ప్రస్తుతం వసూలు చేస్తున్న జీవిత పన్ను ఎంత ఉందో? అందులో 10 శాతం అదనంగా సెస్ విధిస్తారు. ద్విచక్ర వాహనాలు, కార్లు వంటి వ్యక్తిగత వాహనాలకు వాటి ధరలు బట్టి ప్రస్తుతం 9 శాతం నుంచి గరిష్ఠంగా 18 శాతం వరకు రవాణాశాఖ జీవిత పన్ను ఉంది. ఉదాహరణకు రూ.లక్ష విలువైన ఓ ద్విచక్ర వాహనాన్ని కొనుగోలు చేస్తే.. దానికి రవాణాశాఖ రూ.12 వేలు (12 శాతం) జీవిత పన్నుగా వసూలు చేస్తోంది. ఇప్పుడు రోడ్ సేఫ్టీ సెస్‌గా.. మరో రూ.1,200 (10 శాతం) వసూలు చేయనున్నారు. ఈ మొత్తాన్ని రహదారి భద్రతా పనులు, రోడ్డు ప్రమాదాల నివారణకు, రహదారుల అభివృద్ధికి వినియోగించనున్నారు.

సచివాలయాల పేరు మార్పుపై ఆర్డినెన్స్

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని గ్రామ, వార్డు సచివాలయాల పేరు మార్పుపై న్యాయశాఖ మంగళవారం ఆర్డినెన్స్ జారీ చేసింది. దాంతో వీటిని ఇక నుంచి స్వర్ణ గ్రామ, వార్డు సచివాలయాలుగా పిలవనున్నారు. పేరు మార్పు కోసం చేసిన చట్ట సవరణను మంత్రివర్గం ఇటీవల ఆమోదించిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించి గవర్నర్ ఆమోదంతో ఆర్డినెన్స్ విడుదల చేసిన న్యాయశాఖ తదుపరి చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

తెలుగుకు మనసు ఫౌండేషన్ సేవలు ఎనలేనివి

- వైభవంగా మూడు కోట్ల పేజీల డిజిటలైజేషన్ సభ

ఈనాడు-నెల్లూరు, న్యూస్‌టుడే-వరికుంటపాడు: తెలుగు సాహిత్యం, సంస్కృతిని భవిష్యత్తు తరాలకు అందించాలనే మహోన్నత లక్ష్యంతో మూడు కోట్ల ప్రతుల డిజిటలీకరణను పూర్తిచేసిన మనసు ఫౌండేషన్ సేవలు ఎనలేనివని మాజీ మంత్రి, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కొనియాడారు. ఆ సంస్థ వ్యవస్థాపకుడు వెంకటరాయుడికి తెలుగుజాతి రుణపడి ఉంటుందన్నారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలం కనియంపాడులో మనసు (మన్నం నరసింహం, సుబ్బమ్మ) ఫౌండేషన్ మూడు కోట్ల తెలుగు పేజీల డిజిటలైజేషన్ సభ మంగళవారం నిర్వహించారు. అధ్యక్షత వహించిన మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ.. ప్రభుత్వం, విశ్వవిద్యాలయాలు చేయలేని పనిని వెంకటరాయుడు చేయడం గొప్ప విషయమని.. రాబోయే రోజుల్లో పరిశోధకులకు ఇక్కడ జరిగిన డిజిటలైజేషన్ ప్రక్రియ కల్పతరువుగా, తెలుగు జాతికి గొప్ప సంపదగా నిలుస్తుందని కొనియాడారు. సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు మాట్లాడుతూ.. డిజిటలైజేషన్ చిన్న విషయం కాదని, గతంలో సుందరయ్య లైబ్రరీలోని 3లక్షల పుస్తకాలను చేసేందుకు యత్నించి ఇబ్బందులు పడ్డామన్నారు.



సభలో మాట్లాడుతున్న మండలి బుద్ధప్రసాద్, చిత్రంలో సీపీఎం నేత రాఘవులు, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, చంద్రలత, ఎ.రజాహుస్సేన్ తదితరులు ★ బుద్ధప్రసాద్‌కు జ్ఞాపికను అందజేస్తున్న మన్నం వెంకటరాయుడు, మన్నం గోపీచంద్

తెలుగుభాష డిజిటలైజేషన్ కాకపోవడంతో భాషా వికాసానికి ఇబ్బంది కలుగుతోందన్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ.. తెలుగు భాష అంతరించిపోతోందన్న వాదనలో నిజం లేదన్నారు. రాయుడు లాంటి భాషాభిమానులు ఉన్నంత కాలం తెలుగుకు ఢోకా లేదన్నారు. రచయిత్రి చంద్రలత, సాహిత్య విమర్శకులు ఎ.రజాహుస్సేన్, మాజీ ఎమ్మెల్సీ బాలసుబ్రహ్మణ్యం, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, ముత్తేవి రవీంద్రనాథ్, వరికుంటపాడు మాజీ ఎంపీపీ సుంకర వెంకటాద్రి, పెద్ది సాంబశివరావు, డాక్టర్ జీవీ పూర్ణచందు తదితరులు మనసు ఫౌండేషన్ సేవలను కొనియాడారు. అనంతరం ఫౌండేషన్ వ్యవస్థాపకులు మన్నం వెంకటరాయుడు, డాక్టర్ మన్నం గోపీచంద్‌లు అతిథులకు జ్ఞాపికలు, సిబ్బందికి మెడల్స్ అందజేశారు.

త్వరలో ప్రజలకు అందుబాటులోకి

మనసు ఫౌండేషన్ 2008లో బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని సంస్థ వ్యవస్థాపకుడు మన్నం వెంకటరాయుడు తెలిపారు. త్వరలో వెబ్‌సైట్ ద్వారా అందరికీ వీటిని అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. 2008లో కార్యక్రమం ప్రారంభమైనా.. కోటి పేజీలను డిజిటలైజేషన్ చేయడానికి 2022 వరకు సమయం పట్టిందన్నారు. తర్వాత 2022 నుంచి 2026 ప్రారంభం నాటికి ఆ సంఖ్య మూడుకోట్ల పేజీలకు చేరిందన్నారు. ఈ కృషి ఇకముందూ కొనసాగుతుందని ఆయన తెలిపారు.

ఒక వ్యక్తి ఒక్క లైసెన్సుకే అర్హుడు

- ఆర్టీసీ ఖాళీ స్థలాల కేటాయింపు విషయంలో తేల్చిచెప్పిన హైకోర్టు
- 2024లో జారీచేసిన టెండర్ ప్రకటన రద్దు

ఈనాడు, అమరావతి: ఆర్టీసీ ఖాళీ స్థలాల కేటాయింపు విషయంలో ఒక వ్యక్తి ఒక్క లైసెన్సు పొందడానికే అర్హుడని హైకోర్టు తేల్చిచెప్పింది. ఒకటికి మించి ఎక్కువ బిడ్‌లు వేయడానికి వీల్లేదంది. ఒకే వ్యక్తికి ఎక్కువ లైసెన్సులు ఇవ్వడం గుత్తాధిపత్యానికి, స్వార్థ ప్రయోజనాలకు అవకాశం కల్పించినట్లవుతుందని పేర్కొంది. ఖాళీ స్థలాలను వేర్వేరు వ్యక్తులకు కేటాయించేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని తెలిపింది. అధికరణ 39(బీ) ప్రకారం సమాజంలోని వనరులు అందరికీ సమానంగా పంపిణీ కావాలని, అధికరణ 38(2) ప్రకారం ఆదాయ అసమానతలను తగ్గించాలని గుర్తుచేసింది. ఒకే వ్యక్తి బహుళ స్థలాల కోసం బిడ్డింగ్ వేయడం తగదని చెప్పింది. 2024 జనవరి 4న ఆర్టీసీ అధికారులు జారీచేసిన టెండర్ నోటిఫికేషన్‌ను రద్దుచేసింది. ఒకరికి ఒకే లైసెన్సు నిబంధనను తీసుకొచ్చి.. తర్వాతే కొత్తగా టెండర్ ప్రక్రియ నిర్వహించాలని తేల్చిచెప్పింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ ఇటీవల ఈ మేరకు తీర్పు ఇచ్చారు.

✦ వైఎస్సార్ కడప జిల్లా కలసపాడు నివాసి రబ్బానీ బాషా.. యర్రగుంట్ల బస్టాండ్‌లో పలు ఖాళీ స్థలాలకు లైసెన్సుదారుగా ఉండేవారు. సకాలంలో అద్దె చెల్లించకపోవడం, సబ్‌లీజుకు ఇవ్వడం, టెండర్ నిబంధనను ఉల్లంఘించడంతో ఆయన లైసెన్సులను రద్దుచేస్తూ 2023 డిసెంబరులో అధికారులు ఉత్తర్వులిచ్చారు. ఆ స్థలాలకు 2024 జనవరి 4న టెండర్ నోటిఫికేషన్ జారీ చేశారు. దీన్ని సవాలుచేస్తూ రబ్బానీ బాషా హైకోర్టులో నాలుగు వ్యాజ్యాలు వేశారు. ✦ ఏపీఎస్‌ఆర్టీసీ స్టాండింగ్ కౌన్సెల్ వాదనలు వినిపిస్తూ.. 'రబ్బాని బాషా టెండర్ నిబంధనలను ఉల్లంఘించారు. సకాలంలో అద్దె సొమ్ము చెల్లించడం లేదు' అన్నారు. ✦ ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. రబ్బానీ బాషా ఒక్కరే పలు లైసెన్సులు పొందడాన్ని తప్పుపట్టారు. ఆర్టీసీ అధికారుల తీరును ఆక్షేపించారు. ఒక వ్యక్తి ఒకటికి మించి ఓపెన్ స్థలానికి బిడ్డింగ్ వేయడాన్ని నిషేధిస్తూ టెండర్ నోటిఫికేషన్లో షరతు విధించలేదని గుర్తుచేశారు. ఈ వ్యవహారమంతా చూస్తుంటే దీనికి అధికారుల మెతకవైఖరే కారణమన్నారు. లైసెన్సుల రద్దును సమర్థించారు. రబ్బానీ బాషా పిటిషన్‌ను కొట్టేశారు.


తర్లువాడ రైతులతో సమావేశమైన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

గూగుల్ డేటా సెంటర్‌కు భూసేకరణ ప్రక్రియ వేగవంతం

విశాఖపట్నం (పీఎంపాలెం), న్యూస్‌టుడే: గూగుల్ డేటా సెంటర్ (తర్లువాడ)కు భూ సేకరణ పూర్తి చేసే దిశగా విశాఖ జిల్లా యంత్రాంగం అడుగులు వేస్తోందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఎంవీపీ కాలనీలోని నివాసంలో ఆయన రైతులతో సమావేశమయ్యారు. అక్కడ భూములు ఇస్తున్న రైతులకు ప్రస్తుత మార్కెట్ ధర కంటే పరిహారం ఎక్కువగా ఇవ్వడంతోపాటు, ఎకరాకు 20 సెంట్ల స్థలం, ఒప్పంద ఉద్యోగం, షాపింగ్ కాంప్లెక్స్‌లో దుకాణం, మూడు సెంట్ల ఇంటి స్థలం ఇచ్చేందుకు నిర్ణయించామన్నారు. ఈ ఏడాది మార్చిలోగా డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేయాలని భావిస్తున్న తరుణంలో భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి ఒప్పించడంలో కృషి చేసిన ఎమ్మెల్యేకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ భూముల్లో చెట్లు పెంచుకున్న 520 మందికి ఇళ్ల నిర్మాణం కోసం వీలైతే 5 సెంట్లకు పెంచి ఇవ్వాలని కోరారు. ఇంకా భూములు ఇవ్వని రైతులు ఈ సమావేశానికి హాజరై భూములు ఇస్తామని చెప్పడంతోపాటు రెవెన్యూ అధికారులకు సమ్మతి లేఖలు అందించారు.

తిరుమలలో లగేజీ తరహాలో చెప్పుల కౌంటర్లు


చెప్పులు భద్రపరచడాన్ని పరిశీలిస్తున్న అదనపు ఈవో వెంకయ్యచౌదరి

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో లగేజీ కౌంటర్ల తరహాలో క్యూఆర్ కోడ్ ఆధారిత పాదరక్షల కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు తితిదే అదనపు ఈవో వెంకయ్య చౌదరి తెలిపారు. తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద వితరణ కేంద్రం వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన కౌంటర్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తిరుమలలో భక్తులు ఎదుర్కొంటున్న చెప్పుల నిర్వహణ సమస్యకు శాశ్వత పరిష్కారంగా నూతన వ్యవస్థను ప్రవేశపెట్టినట్లు చెప్పారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్-2 వద్ద పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన ఈ విధానం సత్ఫలితాలు ఇవ్వడంతో తిరుమలవ్యాప్తంగా ఎనిమిది కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ వ్యవస్థ అమలుతో 99 శాతం భక్తులు తమ చెప్పులను తిరిగి పొందుతున్నట్లు చెప్పారు. గతంలో గుట్టలుగా పడిపోవడంతో 70-80 శాతం మంది ఇక్కడే వదిలేసి వెళ్లేవారని గుర్తుచేశారు. సీఎస్‌ఆర్‌లో భాగంగా కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ ఈ విధానం అమలు చేస్తోందని చెప్పారు. కోరమండల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ డా.కె.సత్యనారాయణ, తితిదే అధికారులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ గురుకులాల్లో 5వ తరగతి, జూనియర్ ఇంటర్‌లో ప్రవేశాలకు నోటిఫికేషన్

ఈ నెల 20 నుంచి దరఖాస్తుల స్వీకరణ

ఈనాడు, అమరావతి: డా.బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో 5వ తరగతి, జూనియర్ ఇంటర్‌లో నూతన ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ప్రసన్న వెంకటేశ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అదే విధంగా 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఉన్న ఖాళీల్లో అర్హులైన విద్యార్థులను ఎంపిక చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానించినట్లు తెలిపారు. ఈనెల 20 నుంచి ఫిబ్రవరి 19 వరకూ దరఖాస్తులు స్వీకరించనున్నట్లు వివరించారు. అర్హులైన విద్యార్థులు https://apgpcet.apcfss.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

తమిళనాడులో హోంగార్డులుగా 50 మంది ట్రాన్స్‌జెండర్లు


సీఎం స్టాలిన్, పోలీసు ఉన్నతాధికారులతో నియామక ఉత్తర్వులు అందుకున్న ట్రాన్స్‌జెండర్లు

చెన్నై, న్యూస్‌టుడే: తమిళనాడులో హోంగార్డులుగా 50 మంది ట్రాన్స్‌జెండర్లు నియమితులయ్యారు. ట్రాన్స్‌జెండర్ల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు, ఉద్యోగావకాశాల్లోనూ ప్రాధాన్యత కల్పించేలా వారికి తగిన శిక్షణ అందించి హోంగార్డులుగా నియమించనున్నట్లు 2025-26 ఏడాది బడ్జెట్ ప్రసంగంలో ఆర్థికశాఖ మంత్రి తంగం తెన్నరసు ప్రకటించారు. ఆ మేరకు పోలీసుశాఖ తరఫున హోంగార్డులో చేర్చుకునేందుకు తొలి విడతగా 50 మంది ట్రాన్స్‌జెండర్లను ఎంపిక చేసి శిక్షణ అందించారు. మంగళవారం అందులో కొందరికి సీఎం ఎం.కె.స్టాలిన్ నియామక ఉత్తర్వులు అందజేశారు.

ఎస్సీ విద్యార్థుల ఉపకారవేతనాలకు రూ.274 కోట్లు

ఈనాడు, అమరావతి: ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి ఎస్సీ విద్యార్థులకు పోస్ట్ మెట్రిక్ ఉపకారవేతనాల చెల్లింపునకు రూ.274.96 కోట్ల విడుదలకు ప్రభుత్వం పరిపాలన అనుమతినిచ్చింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రొద్దుటూరు డీఎస్పీపై బదిలీ వేటు

ఆ స్థానంలో విబు కృష్ణ నియామకం

ఈనాడు, అమరావతి: ప్రొద్దుటూరు డీఎస్పీ పి.భావనపై బదిలీ వేటు పడింది. ఆ స్థానంలో 2021 బ్యాచ్ ఐపీఎస్ అధికారి విబు కృష్ణను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఆయన ప్రస్తుతం గ్రేహౌండ్స్‌లో అసాల్ట్ కమాండర్‌గా పనిచేస్తున్నారు. భావనకు ఎక్కడా పోస్టింగు ఇవ్వలేదు. డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. ప్రొద్దుటూరులో ఓ బంగారం వ్యాపారిని మఫ్టీలో ఉన్న పోలీసులు రాత్రివేళ.. కిడ్నాప్ చేసిన తరహాలో అదుపులోకి తీసుకోవడం తీవ్ర విమర్శలకు తావిచ్చింది. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి ఇటీవల భావనపై ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకూ ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆమె బదిలీ అయినట్లు సమాచారం.

✦ నెల్లూరు టౌన్ ఎస్‌డీపీవోగా 2021 బ్యాచ్ ఐపీఎస్ అధికారిణి దీక్ష నియమితులయ్యారు. ప్రస్తుతం ఎస్‌డీపీవోగా ఉన్న సింధుప్రియను ప్రభుత్వం బదిలీ చేసి డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించింది.

ఈనాడు బిజినెస్

బడ్జెట్‌లో పాడిపరిశ్రమకు ప్రాధాన్యం ఇవ్వాలి

హెరిటేజ్ ఫుడ్స్ ఈడీ బ్రాహ్మణి నారా



ఈనాడు, హైదరాబాద్: వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) సంస్కరణలు సంఘటిత రంగంలోని పాడి పరిశ్రమకు ఎంతో అనుకూల పరిస్థితులను తీసుకొచ్చాయని హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) బ్రాహ్మణి నారా తెలిపారు. 'ప్రస్తుతం వినియోగదారులు పనీర్, చీజ్, నెయ్యి, వెన్న వంటి అధిక ప్రోటీన్లున్న ఉత్పత్తుల వైపు మొగ్గు చూపిస్తున్నారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్, నేషనల్ డిజిటల్ లైవ్‌స్టాక్ మిషన్ వంటి ప్రభుత్వ పథకాల ద్వారా ఎంతోమంది రైతులు వ్యవస్థీకృత డెయిరీ వ్యవస్థలో భాగస్వాములయ్యారు' అని పేర్కొన్నారు. '2026-27 కేంద్ర బడ్జెట్‌లో ప్రధానంగా పాడి పరిశ్రమ ఉత్పాదకతను పెంచడం కోసం నాణ్యమైన దాణాపై రైతులకు రాయితీలు కల్పించాలి. దేశంలో 1.2 లక్షల మంది పశువైద్యులు అవసరం ఉండగా, ప్రస్తుతం 68,000 మందే ఉన్నారని పేర్కొన్నారు. ఈ అంతరాన్ని తగ్గించేందుకు వెటర్నరీ కళాశాలల సామర్థ్యాన్ని పెంచాలని కోరారు. గ్రామీణ ఉపాధి కల్పనలో కీలకమైన మినీ డెయిరీ యూనిట్లకు మూలధన రాయితీలను పెంచాలి. మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి' అని బ్రాహ్మణి కోరారు.

అంకురాల కలలు చెదిరాయ్

భారత అంతరిక్ష పరిశోధనా కేంద్రం (ఇస్రో) నమ్మదగ్గ ప్రయోగ నౌకగా పేరుగాంచిన పీఎస్ఎల్‌వీ (పీఎస్ఎల్‌వీ- సీ62) ప్రయోగం విఫలం అవ్వడం దేశీయ అంతరిక్ష రంగాన్ని నిరాశపర్చింది. ఇందువల్ల 16 ఉపగ్రహాలు కక్ష్యలోకి చేరుకుండానే నింగిలో కలిసిపోయాయి. ఇది ఇస్రోకే కాకుండా, అంతరిక్ష రంగంలో వినూత్న ఆవిష్కరణలతో దూసుకుపోతున్న హైదరాబాద్ అంకురాలు అయిన ధ్రువ స్పేస్, టేక్‌మీ2స్పేస్, ఈయాన్ స్పేస్ ల్యాబ్స్ కలలనూ దెబ్బతీసింది.

ధ్రువస్పేస్: ఈ సంస్థకు చెందిన 5 డిస్ప్లాయర్లు పీఎస్ఎల్‌వీలో అమర్చారు. ఇవి 6 ఉపగ్రహాలను మోసుకెళ్లాయి. వీటిలో ధ్రువ స్పేస్ సొంతంగా రూపొందించిన థైబోల్ట్-3 క్యూబ్‌శాట్, సీజీయూశాట్-1, డీశాట్-1, లాచిత్-1తోపాటు నేపాల్‌కు చెందిన మునాల్ ఉపగ్రహం, సంస్కార్ శాట్ ఉన్నాయి. వీటితోపాటే టేక్‌మీ2స్పేస్ సంస్థకు చెందిన ఎంఓఐ-1 ఉపగ్రహం కూడా ఉంది.

టేక్‌మీ2స్పేస్: ఈ కంపెనీ రూపొందించిన ఎంఓఐ-1 ఉపగ్రహం ప్రపంచంలోనే తొలి అంతరిక్ష సైబర్ కేఫ్ లేదా డేటా సెంటర్‌గా రికార్డు సృష్టించాల్సి ఉంది. 14 కిలోల బరువు, 120వాట్ల సామర్థ్యం కలిగిన ఈ ఉపగ్రహంలో ఎన్విడియా జీపీయూ అమర్చారు. అంతరిక్షంలోనే కృత్రిమ మేధ ద్వారా చిత్రాలను విశ్లేషించడం, వినియోగదారులకు నిమిషానికి 2 డాలర్ల చొప్పున ప్రాసెసింగ్ సమయాన్ని అద్దెకు ఇవ్వడం దీని ప్రధాన ఉద్దేశం. 'గూగుల్ 2027లో ప్రారంభించనున్న ప్రాజెక్టు 'సన్ క్యాచర్' కంటే ముందే ఈ ఘనత సాధించాలన్నది' ఈ హైదరాబాద్ సంస్థ లక్ష్యం.

ఈయాన్ స్పేస్ ల్యాబ్స్: ఎంఓఐ-1 ఉపగ్రహంలోనే ఈయాన్ స్పేస్ ల్యాబ్స్ రూపొందించిన మీరా అనే చిన్నపాటి స్పేస్ టెలిస్కోపు అమర్చారు. కేవలం 500 గ్రాముల బరువుతో, దేశంలోనే అత్యంత తేలికైన, చిన్న టెలిస్కోపుగా ఇది గుర్తింపు పొందింది. ఈ ఉపగ్రహాలను పీఎస్ఎల్‌వీ రాకెట్ కక్ష్యలోకి చేర్చనందున, తమ అత్యాధునిక ఇమేజింగ్ టెక్నాలజీని ప్రపంచానికి నిరూపించేందుకు ఈ సంస్థ మరో 3 నెలలకుపైగానే వేచి చూడక తప్పని పరిస్థితి.

అవాంతరం మాత్రమే

ప్రస్తుతానికి అంకురాలకు ఇది అవాంతరం మాత్రమే. ఉపగ్రహాలు కక్ష్యలోకి చేరకపోయినా, వాటిని తయారు చేసే పరిజ్ఞానం కంపెనీల దగ్గరే ఉంది. మళ్లీ రాకెట్ స్లాట్ దొరకడమే ఇప్పుడు తమకు ప్రధాన సమస్య అని ఈ కంపెనీలు చెబుతున్నాయి. స్లాట్ దొరికితే.. 3-6 నెలల్లోనే ఈ కంపెనీలు తమ ఉపగ్రహాలను మళ్లీ ప్రయోగించే అవకాశం ఉంది.

కొన్ని వారాల్లోనే సిద్ధమవుతాం

– సంజయ్ నెక్కంటి, సీఈఓ, సహ వ్యవస్థాపకుడు, ధ్రువ స్పేస్

'అంతరిక్షం సహజంగానే అత్యంత సంక్లిష్టం. భారత్‌లోని పలు ప్రైవేటు అంతరిక్ష సంస్థలు మౌలిక వసతులను భారీ ఎత్తున, నిలకడగా నిర్మిస్తున్నాయి. ఇలాంటి సవాళ్లను ఎదుర్కొని, వేగంగా కోలుకునే సామర్థ్యం మాకుంది. ఇస్రో వ్యవస్థలను వినియోగించుకుంటూనే, ధ్రువ స్పేస్ సొంతంగా పూర్తిస్థాయి సాంకేతిక సామర్థ్యాలను సమకూర్చుకుంది. ఉపగ్రహాల తయారీ నుంచి గ్రౌండ్ స్టేషన్ సేవల వరకు మా వినియోగదారులకు అండగా నిలుస్తున్నాం. ప్రస్తుతం మా దృష్టి త్వరగా తిరిగి కోలుకోవడంపైనే ఉంది. మాకున్న అంతర్గత సామర్థ్యాలతో కొన్ని వారాల్లోనే తదుపరి ప్రయోగాలకు సిద్ధం కాగలం. భారత అంతరిక్ష కార్యక్రమాలపై మాకు పూర్తి నమ్మకం ఉంది.'

- ఈనాడు, హైదరాబాద్

సర్ రతన్ టాటా ట్రస్ట్ బోర్డులోకి

నోయల్ కుమారుడు!



సర్ రతన్ టాటా ట్రస్ట్ బోర్డులోకి టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ నోయల్ టాటా కుమారుడు నెవిల్ టాటా చేరనున్నారని ఒక ఆంగ్ల వార్తా పత్రిక తెలిపింది. ఈ వారంలో జరిగే బోర్డు సమావేశంలోనే ఈ నిర్ణయం జరగొచ్చునీ పేర్కొంది. 32 ఏళ్ల నెవిల్ ప్రస్థానంలో ఇది ఇంకో మైలురాయి కానుంది. టాటా ట్రస్ట్‌లు కేవలం దాతృత్వ సంస్థలే కాదు, గ్రూప్ ప్రధాన సంస్థ టాటా సన్స్‌లో 65.9% వాటా ఈ ట్రస్టులకు ఉంది. విడిగా చూస్తే సర్ దొరాబ్జీ టాటా ట్రస్ట్, సర్ రతన్ టాటా ట్రస్ట్‌లకు వరుసగా 27.98%, 23.56% వాటాలున్నాయి. ఈ బోర్డుల్లో సభ్యత్వం అంటే పరోక్షంగా టాటా సన్స్‌పైనా నియంత్రణ ఉన్నట్లే. ఈ నేపథ్యంలో నెవిల్ టాటాను ఈ ట్రస్టుల్లోకి తీసుకురావడం కీలక పరిణామంగా భావించొచ్చు.

లిక్విడ్‌నైట్రో గేమ్స్‌కు రూ.172 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్: హైదరాబాద్ కేంద్రంగా గేమ్‌లను రూపొందించే లిక్విడ్ నైట్రో గేమ్స్ సంస్థ, సుమారు రూ.172 కోట్ల (19.1 మిలియన్ డాలర్ల) పెట్టుబడిని సమీకరించింది. సిరీస్ ఏ ఫండింగ్ కింద నార్త్‌పాయింట్ క్యాపిటల్ సంస్థ, ప్రస్తుత పెట్టుబడిదారు నెక్సస్ వెంచర్ పార్ట్‌నర్స్ ఈ నిధులు అందచేశాయి. ఏఐ (కృత్రిమమేధ) ఆధారిత ప్రొడక్షన్ ప్లాట్‌ఫామ్‌లను మరింత విస్తృతం చేసేందుకు, అంతర్జాతీయంగా విస్తరించేందుకు ఈ పెట్టుబడులు ఉపకరిస్తాయని సంస్థ సీఈఓ సందీప్ తెలిపారు. 2024లోనూ లిక్విడ్‌నైట్రో గేమ్స్‌కు 5.25 మి.డా. (సుమారు రూ.47.25 కోట్ల) పెట్టుబడిని నెక్సస్ వెంచర్ పార్ట్‌నర్స్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఏంజెల్ ఇన్వెస్టర్లు అందచేశారు. 2023లో ఈ సంస్థను సందీప్, కృష్ణ ధనేకుల, అరుణ్ కుంచల, సురేశ్ మంతెన కలిసి ఏర్పాటు చేశారు.

కోడి గుడ్లు

14న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	540
వరంగల్	542
విజయవాడ	575
తూ/ప గోదావరి	550
విశాఖపట్నం	550
చిత్తూరు	583

10 నిమిషాల్లో డెలివరీ హామీలు వద్దు

- కార్మిక శాఖ జోక్యంతో వెనక్కి తగ్గిన బ్లింకిట్
- అదే బాటలో స్విగ్గీ, జెప్టో



'ఆర్డర్ ఇవ్వండి.. 10 నిమిషాల్లో డెలివరీ చేస్తామంటూ' ప్రకటనలు గుప్పిస్తున్న క్విక్-కామర్స్ సంస్థలు.. ఇందుకోసం తెస్తున్న ఒత్తిడి వల్ల, డెలివరీ కార్మికులు ప్రమాదాలకు గురవుతున్నారంటూ ఆందోళనలు రేగిన నేపథ్యంలో, కార్మిక శాఖ రంగంలోకి దిగింది. డెలివరీ కార్మికుల సంక్షేమం, భద్రతను దృష్టిలో ఉంచుకుని, ఇటువంటి హామీ ఇవ్వొద్దని మంత్రిత్వ శాఖ ఆయా సంస్థలకు స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. దీంతో '10 నిమిషాల డెలివరీ'పై ఎటర్నల్‌కు చెందిన క్విక్ కామర్స్ సంస్థ బ్లింకిట్ వెనక్కి తగ్గింది. స్విగ్గీ ఇన్‌స్టామార్ట్, జెప్టో వంటి సంస్థలూ ఇదే బాటలో నడవొచ్చని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ విషయంలో డెలివరీ అగ్రిగేటర్లను కార్మిక మంత్రి మన్‌సుఖ్ మాండవీయ ఒప్పించిన తర్వాత '10 నిమిషాల డెలివరీ' ప్రకటనను కంపెనీలు తొలగించినట్లు వెల్లడించాయి. డెలివరీ గడువుకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడానికి గత వారం బ్లింకిట్, జెప్టో, జొమాటో, స్విగ్గీ సహా అగ్రగామి ప్లాట్‌ఫామ్‌ల నిర్వాహకులతో మాండవీయ సమావేశమయ్యారు. ప్రభుత్వ ఆదేశాలతో బ్లింకిట్ ఇప్పటికే చర్యలు చేపట్టిందని, తమ బ్రాండింగ్ నుంచి 10 నిమిషాల డెలివరీ వాగ్దానాన్ని తొలగించినట్లు వివరించాయి. గిగ్ కార్మికుల భద్రత, రక్షణ, మెరుగైన పని పరిస్థితులను కల్పించే లక్ష్యంతో ఈ చర్యలు చేపట్టారు.

✦ బ్లింకిట్ తమ ప్రధాన ట్యాగ్‌లైన్ మార్చింది. ఇప్పటివరకు '10 నిమిషాల్లో 10000+ ఉత్పత్తులు డెలివరీ చేశాం' నుంచి '30,000+ ఉత్పత్తులు మీ ఇంటి వద్దకే డెలివరీ చేశాం' అని మార్పులు చేసింది.

✦ 10 నిమిషాల డెలివరీ వాగ్దానంపై నిరసన తెలియజేస్తూ, 2026 తొలిరోజున గిగ్ కార్మికులు దేశ వ్యాప్తంగా సమ్మె నిర్వహించారు. దీంతో కార్మికుల ఆరోగ్యం, భద్రత, ఆదాయాలపై ప్రజల దృష్టి పడింది.

✦ గిగ్‌కార్మికుల భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను ఆప్ రాజ్యసభ ఎంపీ రాఘవ్ చద్దా స్వాగతించారు. గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ సర్వీస్ వర్కర్స్ యూనియన్ కూడా ఈ నిర్ణయాన్ని స్వాగతించింది.

రూపాయి విలువను మార్కెట్లే నిర్ణయిస్తాయ్

ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా



దేశ ఆర్థిక వ్యవస్థ బలాన్ని కేవలం కరెన్సీ మారకపు విలువతోనే లెక్కించడం సరికాదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు. అమెరికా డాలర్ విలువ రూ.90ని మించడం కూడా, కరెన్సీ సాధారణ కదలికల్లో భాగమేనని పేర్కొన్నారు. భారత ఆర్థిక మూలాలు పటిష్ఠంగా ఉన్నాయని.. వృద్ధిరేటు అధికంగా ఉండటం, ద్రవ్యోల్బణం అదుపులో కొనసాగడం, ఆర్థిక స్థిరత్వం, పెట్టుబడులు-వినియోగం ఆరోగ్యకరంగా నమోదవ్వడాన్ని ఎన్‌డీటీవీ ఇంటర్వ్యూలో ఆయన ప్రస్తావించారు విదేశీ మారకపు నిల్వలు కూడా 690 బిలియన్ డాలర్లకు పైగా ఉన్నాయని గుర్తు చేశారు. రూపాయి విలువ నిర్ణయం అనేది మార్కెట్ల చేతిలో ఉందని, తీవ్ర హెచ్చుతగ్గులు నమోదవ్వకుండా చూడటం వరకే ఆర్‌బీఐ పాత్ర ఉంటుందని, దీర్ఘకాలంగా మన విధానం అదేనని వివరించారు. డాలర్ విలువ రూ.90ని మించినా కూడా, తమ పాత్ర మారదన్నారు. నవంబరులో రూపాయి విలువ ఎక్కువగా తగ్గేందుకు, అమెరికా మన ఉత్పత్తులపై విధించిన అధిక సుంకాలు కూడా కారణమయ్యాయని పేర్కొన్నారు. ఎగుమతుల ఆదాయ వృద్ధి తగ్గగా, బంగారం-వెండి సహా ఇతర దిగుమతుల బిల్లు భారం పెరిగి, డాలర్‌కు గిరాకీ అధికమైందని వివరించారు.

సరఫరాలు బాగున్నందునే ద్రవ్యోల్బణం అదుపులో: దేశీయంగా ద్రవ్యోల్బణం తక్కువగా ఉండేందుకు, సరఫరాలు మెరుగ్గా ఉండటమే కారణమని ఆర్‌బీఐ గవర్నర్ వివరించారు. ఆహార ధరలతో పాటు అంతర్జాతీయంగా కమొడిటీ ధరలు అదుపులోనే ఉన్నాయని తెలిపారు.

సరికొత్తగా పంచ్.. రూ.5.59 లక్షల నుంచి



కాంపాక్ట్ ఎస్‌యూవీ పంచ్‌లో కొత్త వెర్షన్‌ను టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ (టీఎంపీవీ) మంగళవారం ఆవిష్కరించింది. దీని ప్రారంభ ధర రూ.5.59 లక్షలు. 1.2 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజిన్, 360 డిగ్రీల కెమెరా, 6 ఎయిర్‌బ్యాగ్‌లు కలిగిన ఈ వాహనం 6 వేరియెంట్లలో లభించనుంది. ఈ శ్రేణిలోని హ్యుందాయ్ ఎక్స్‌టర్, స్కోడా కైలాక్ వంటి వాహనాలతో ఇది పోటీ పడనుంది. ఈ శ్రేణి వాహనాలన్నీ కలిపి నెలకు 40,000 వరకు విక్రయమవుతున్నాయని సమాచారం.

జేఎస్‌డబ్ల్యూ రూ.45 లక్షల విద్యుత్తు ఎస్‌యూవీ!

దేశీయ కార్ల విపణిలోకి సజ్జన్ జిందాల్ నేతృత్వంలోని జేఎస్‌డబ్ల్యూ మోటార్ అడుగుపెట్టబోతోంది. ప్లగ్-ఇన్ విద్యుత్తు హైబ్రిడ్ స్పోర్ట్స్ యుటిలిటీ వాహన (ఎస్‌యూవీ) మోడల్‌ను ఈ ఏడాది జూన్‌లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ వాహన ధర సుమారు రూ.45 లక్షలు ఉండొచ్చని తెలుస్తోంది. ఖరీదైన వాహన విభాగంలోనే తొలి మోడల్‌ను ఆవిష్కరించడం ద్వారా బీఎమ్‌డబ్ల్యూ, మెర్సిడెస్ బెంజ్ మోడళ్లకు నేరుగా పోటీ ఇవ్వాలని భావిస్తున్నట్లు సమాచారం. మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీ నగర్ (మునుపు ఔరంగాబాద్) వద్ద ఏర్పాటు చేస్తున్న ప్లాంటులో ఈ ఎస్‌యూవీల తయారీని కంపెనీ ప్రారంభించనుంది. కొన్ని అంతర్జాతీయ వాహన సంస్థలతో భాగస్వామ్యాన్ని కుదుర్చుకునేందుకూ జేఎస్‌డబ్ల్యూ చర్చలు జరుపుతోంది. రానున్న వారాల్లో ఒక ఒప్పందం కుదిరే అవకాశం ఉంది.

భారత్‌పై ఇరాన్ ప్రభావం ఎంత?



- పెద్దగా ఉండదంటున్న ఫియో
- బాస్మతీ బియ్యం ఎగుమతులు తగ్గొచ్చు
- వాణిజ్య భాగస్వాములపై ట్రంప్ ఒత్తిడి

ఇరాన్‌తో వ్యాపారం నిర్వహిస్తున్న దేశాల ఉత్పత్తులపై 25% సుంకం విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అంటే ఇరాన్‌తో వాణిజ్య సంబంధాలున్న దేశం నుంచి, వస్తువులను అమెరికాకు ఎగుమతి చేస్తే అదనంగా 25% టారిఫ్‌ను ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్రస్తుతం ఇరాన్‌కు భారత్, చైనా, యూఏఈ ప్రధాన వాణిజ్య భాగస్వాములుగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో మనదేశ ఎగుమతులపై 'ఇరాన్' వల్ల పడే ప్రభావం ఎంత ఉండొచ్చంటే..

ద్వైపాక్షిక వాణిజ్యం రూ.15,000 కోట్లే: గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఇరాన్‌తో భారత్ జరిపిన మొత్తం వాణిజ్యం విలువ 1.68 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.15,120 కోట్లు) మాత్రమే. అందులోనూ వ్యవసాయ ఉత్పత్తుల వాటాయే 1.24 బిలియన్ డాలర్లు (సుమారు రూ.11,160 కోట్లు). తృణ ధాన్యాలు, టీ, కాఫీ, సుగంధ ద్రవ్యాలు, పళ్లు, కూరగాయలు, మందులు, ఎలక్ట్రికల్ మెషినరీ, కృత్రిమ ఆభరణాలు వంటివి ఇరాన్‌కు భారత్ ఎక్కువగా ఎగుమతి చేస్తుంటుంది. డ్రైఫ్రూట్స్, ఇనార్గానిక్/ఆర్గానిక్ కెమికల్స్, గ్లాస్‌వేర్ వంటివి దిగుమతి చేసుకుంటున్నాం.

ఆంక్షలకు వెలుపలే ఎగుమతులు: ప్రస్తుతం ఇరాన్‌కు మనదేశం ఆహారం, ఔషధాలు మాత్రమే పంపుతోంది. ఇరాన్‌పై ఆఫీస్ ఆఫ్ ఫారెన్ అసెట్స్ కంట్రోల్ (ఓఎఫ్ఏసీ) ఆంక్షలకు సంబంధించిన నిబంధనలను భారతీయ కంపెనీలు, బ్యాంకులు పూర్తిగా పాటిస్తున్నాయని భారతీయ ఎగుమతి సంస్థల సమాఖ్య (ఫియో) తెలిపింది. మానవతా దృక్పథంతో చేస్తున్న ఆహారం, మందుల వంటి వస్తువుల వాణిజ్యమే చేస్తున్నట్లు తెలిపింది. కాబట్టి తాజా ఆంక్షల ప్రభావం భారత్‌పై ఉండబోదని ఫియో డైరెక్టర్ జనరల్ అజయ్ సహాయ్ అంటున్నారు.

ఇది కీలకం: సిస్టాన్-బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో ఉన్న చబహార్ పోర్టును భారత్-ఇరాన్ సంయుక్తంగా అభివృద్ధి చేస్తున్నాయి. ఇది ఇరు దేశాల వాణిజ్య సంబంధాలకు కీలకమైనది. ఇరాన్‌కు భారత వస్తువుల ఎగుమతులు 1.55% పెరిగి 1.24 బి. డాలర్లకు చేరగా, దిగుమతులు 29.32% తగ్గి 441.83 మి. డాలర్లకు పరిమితం అయ్యాయి.

దేశీయంగా బాస్మతీ ధరలు కిందకు: ఇరాన్‌లో ఆందోళనలు కాస్తా భారత బాస్మతీ బియ్యం ఎగుమతులపై ప్రభావం చూపుతున్నాయి. దీంతో దేశీయంగా వీటి ధర తగ్గుతోంది. అనిశ్చితుల కారణంగా ఎగుమతులకు సంబంధించిన చెల్లింపుల్లో ఆలస్యం ఇందుకు నేపథ్యమని భారతీయ బియ్యం ఎగుమతిదార్ల సమాఖ్య (ఐఆర్ఈఎఫ్) పేర్కొంటోంది. 2025-26 ఏప్రిల్-నవంబరులో 5.99 లక్షల టన్నుల బాస్మతీ బియ్యాన్ని ఇరాన్‌కు మనదేశం ఎగుమతి చేసింది. దేశీయంగా 1121 రకానికి చెందిన బియ్యం ధర గత వారంలోనే కిలోకు రూ.85 నుంచి రూ.80కి తగ్గింది. 1509, 1718 రకాల ధరలు రూ.70 నుంచి రూ.65కు దిగివచ్చాయి.

ఓలా ఎలక్ట్రిక్ నుంచి ముహూరత్ మహోత్సవ్



దిల్లీ: ముహూరత్ మహోత్సవ్ ప్రచార కార్యక్రమాన్ని ఓలా ఎలక్ట్రిక్ మళ్లీ ప్రారంభించనుంది. ఈనెల 14, 15 తేదీల్లో ఈ ఆఫర ఉంటుందని తెలిపింది. దేశీయంగా రూపొందించిన 4680 భారత్ సెల్‌తో నడిచే తమ విద్యుత్తు ద్విచక్ర వాహనాలను మునుపెన్నడూ లేని ఆకర్షణీయ ధరలకే ఇస్తామని వివరించింది. ఓలా శక్తి, ఎస్1 ప్రోప్లస్ 5.2 కిలోవాట్‌అవర్, రోడ్‌స్టర్ ఎక్స్‌ప్లస్ 9.1 లాంటి మోడళ్లకు ఆఫర్లు వర్తిస్తాయని పేర్కొంది. పై మోడళ్లలో పరిమిత సంఖ్యలో వాహనాలనే భారీ ఆఫర్లకు అందుబాటులో ఉంచనున్నట్లు కంపెనీ తెలిపింది. ఏరోజు కారోజు తమ సామాజిక మాధ్యమ హ్యాండిల్స్ ద్వారా ముహూరత్ ధరల టైమ్ స్లాట్స్ ప్రకటిస్తామని పేర్కొంది. తమ విక్రయ కేంద్రాల్లో జరిపే కొనుగోళ్లకే ఈ ప్రత్యేక ముహూరత్ మహోత్సవ్ ధరలు వర్తిస్తాయని వెల్లడించింది.

రష్యా ఇంధన దిగుమతుల్లో మూడో స్థానానికి భారత్

రిలయన్స్ కొనుగోళ్లు తగ్గడం నేపథ్యం



దిల్లీ: రష్యా నుంచి శిలాజ ఇంధనాల కొనుగోలుదార్లలో భారత్ మూడో స్థానానికి పరిమితమైంది. రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో పాటు ప్రభుత్వ చమురు రిఫైనరీలు, రష్యా నుంచి దిగుమతులు తగ్గించడం ఇందుకు నేపథ్యమని మేధో సంస్థ సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్(సీఆర్ఈఏ) పేర్కొంది. డిసెంబరులో భారత్ మొత్తం మీద 2.3 బిలియన్ యూరోల (సుమారు రూ.24,150 కోట్లు) విలువైన ముడిచమురు ఉత్పత్తులను దిగుమతి చేసుకుంది. నవంబరు దిగుమతులు 3.3 బి. యూరోలు కావడం గమనార్హం. 2.6 బి. యూరోల విలువైన రష్యా ముడిచమురు కొనుగోళ్లతో, తుర్కియే రెండో స్థానాన్ని భర్తీ చేసింది. రష్యా చమురు కొనుగోలులో చైనా అగ్రగామిగా కొనసాగుతోంది. రష్యా అగ్రగామి 5 సంస్థలకు వచ్చిన ఎగుమతి ఆదాయాల్లో, చైనా వాటా 48% (6 బిలియన్ యూరోలు) కావడం గమనార్హం.

2025లో ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు రూ.4 లక్షల కోట్ల పైనే

కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్



దిల్లీ: మన దేశం నుంచి 2025లో రూ.4 లక్షల కోట్లకు పైగా విలువైన ఎలక్ట్రానిక్స్ ఎగుమతి అయినట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఈ ఏడాది 4 సెమీ కండక్టర్ ప్లాంట్లు ఉత్పత్తి ప్రారంభించనుండటంతో, ఎగుమతి అయ్యే ఎలక్ట్రానిక్స్ విలువ మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపారు. అధికారిక అంచనాల ప్రకారం 2024-25లో దేశీయంగా ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి సుమారు రూ.11.3 లక్షల కోట్ల మేర జరిగింది. ఇందులో రూ.3.3 లక్షల కోట్ల విలువైనవి ఎగుమతి అయ్యాయి. 2025 క్యాలెండర్ ఏడాదిలో ఎగుమతి అయిన ఎలక్ట్రానిక్స్ విలువ రూ.4 లక్షల కోట్ల మైలురాయిని అధిగమించింది. ఈ ఏడాది 4 సెమీకండక్టర్ ప్లాంట్ల నుంచి వాణిజ్య ఉత్పత్తి ప్రారంభం కానుండటంతో 2026లో ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు మరింత పెరుగుతాయని సామాజిక మాధ్యమ పోస్టులో అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. పరిశ్రమ అంచనా ప్రకారం, ఎలక్ట్రానిక్స్ రంగంలో 25 లక్షల మందికి పైగా ఉపాధి పొందుతున్నారు.

✦ 2025లో మన దేశం నుంచి ఐఫోన్ ఎగుమతులు రూ.2.03 లక్షల కోట్లకు చేరాయని మంత్రి తెలిపారు. 2024లో ఎగుమతి చేసిన రూ.1.1 లక్షల కోట్లతో పోలిస్తే ఇవి రెట్టింపు కావడం గమనార్హం. మొబైల్ తయారీదార్ల పరిశ్రమ సమాఖ్య ఇండియా సెల్యులార్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ (ఐసీఈఏ) ప్రకారం, దేశంలో మొబైల్ ఫోన్ల ఉత్పత్తి ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే సరికి 75 బిలియన్ డాలర్ల (సుమారు రూ.6.76 లక్షల కోట్ల)కు చేరుతుంది. ఎగుమతులు 30 బి.డాలర్లు (రూ.2.7 లక్షల కోట్లు)గా ఉంటాయని అంచనా.

44.89 లక్షల పీవీల టోకు విక్రయాలు



వాహన కంపెనీల నుంచి డీలర్లకు ప్రయాణికుల వాహన (పీవీ-కార్లు, జీపులు, వ్యాన్లు) సరఫరాలు 2025లో 44,89,717కు చేరాయని తయారీదార్ల సమాఖ్య సియామ్ మంగళవారం వెల్లడించింది. 2024లో సరఫరా అయిన 42,74,793 వాహనాల కంటే ఇవి 5% ఎక్కువ. జీఎస్‌టీ రేట్లు తగ్గడం, పండగ సీజన్‌లో బలమైన అమ్మకాల వల్ల, ఒక క్యాలెండర్ ఏడాదిలో 2025 రికార్డు సృష్టించిందని పేర్కొంది. 'భారతీయ వాహన పరిశ్రమకు గత ఏడాది మైలురాయిగా నిలిచింది. తొలి అర్ధ భాగంలో స్తబ్దుగా కనిపించిన పరిశ్రమ, సరఫరా సవాళ్లను ఎదుర్కొంది. ఆదాయపు పన్ను ఉపశమనం, రెపో రేటు కోతలు, జీఎస్‌టీ 2.0 వంటి బహుళ నిర్మాణాత్మక సంస్కరణలతో .. వాహనాలకు సానుకూల గిరాకీ వాతావరణం ఏర్పడింద'ని సియామ్ ప్రెసిడెంట్ శైలేష్ చంద్ర వెల్లడించారు. స్థిరమైన స్థూల ఆర్థిక పరిస్థితులు, అందుబాటు ధరలు, విధాన మద్దతుతో 2026లో కూడా పరిశ్రమ సానుకూల ధోరణిలో పయనించే అవకాశం ఉందని అంచనా వేశారు.

వాహన విభాగం	2024	2025	వృద్ధి/క్షీణత(%)
ప్రయాణికుల	42,74,793	44,89,717	5
యుటిలిటీ	27,49,932	29,54,279	7
త్రిచక్ర	7,88,429	7,28,670	8
వాణిజ్య	9,54,051	10,27,877	8
ద్విచక్ర	1,95,43,093	2,05,00,639	5

బ్లూచిప్ షేర్లకు అమ్మకాల ఒత్తిడి

ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.1,500 కోట్లు

డీఐఐ కొనుగోళ్లు: రూ.1,182 కోట్లు

సెన్సెక్స్ ▼250 **83628**

నిఫ్టీ ▼58 **25732**



రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎల్ అండ్ టీ వంటి బ్లూచిప్ షేర్లలో అమ్మకాలతో మంగళవారం దేశీయ సూచీలు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ టారిఫ్ భయాలు, విదేశీ మదుపర్ల అమ్మకాలు ప్రతికూల ప్రభావం చూపాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి 6 పైసలు తగ్గి 90.23 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 1.86% లాభంతో 65.06 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.94,000 కోట్లు తగ్గి రూ.467.79 లక్షల కోట్ల (5.18 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.

✦ సెన్సెక్స్ ఉదయం 201 పాయింట్ల (క్రితం ముగింపు 83,878.17) లాభంతో 84,079.32 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. అనంతరం నష్టాల్లోకి జారుకున్న సూచీ, ఒకదశలో 83,262.79 పాయింట్ల వద్ద కనిష్ఠానికి పడిపోయింది. ఆఖర్లో కొంత నష్టాలు తగ్గించుకున్నప్పటికీ.. చివరకు 250.48 పాయింట్లు కోల్పోయి 83,627.69 వద్ద ముగిసింది. నిఫ్టీ 57.95 పాయింట్లు తగ్గి 25,732.30 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 25,603.30- 25,899.80 పాయింట్ల మధ్య కదలాడింది.

✦ సెన్సెక్స్ 30 షేర్లలో 19 నష్టపోయాయి. ట్రెంట్ 3.39%, ఎల్ అండ్ టీ 3.25%, రిలయన్స్ 2.14%, ఇండిగో 2.14%, ఐటీసీ 1.09%, అదానీ పోర్ట్స్ 1.05%, బీఈఎల్ 1.04%, మారుతీ 0.98% డీలాపడ్డాయి. ఎటర్నల్ 3.24%, టెక్ మహీంద్రా 1.74%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.66%, ఎస్‌బీఐ 1.32%, టీసీఎస్ 0.99% లాభపడ్డాయి. రంగాల వారీ సూచీల్లో.. టెలికాం 1.18%, పరిశ్రమలు 1.09%, యంత్ర పరికరాలు 0.67%, మన్నికైన వినిమయ వస్తువులు 0.63% తగ్గాయి. ఫోకస్డ్ ఐటీ, పీఎస్‌యూ బ్యాంక్, ఐటీ, లోహ, ఆర్థిక సేవలు రాణించాయి. బీఎస్ఈలో 1989 షేర్లు లాభపడగా, 2143 స్క్రిప్‌లు నష్టపోయాయి.

✦ త్రైమాసిక లాభం 11.2% తగ్గడంతో హెచ్‌సీఎల్ టెక్ షేర్లు నీరసపడ్డాయి. బీఎస్ఈలో ఇంట్రాడేలో 2.49% తగ్గిన షేరు రూ.1,626.40 వద్ద కనిష్ఠాన్ని తాకినా, చివరకు 0.19% నష్టపోయి రూ.1,665 దగ్గర ముగిసింది.

✦ **అమర రాజా** గ్రూపు ముఖ్య మానవ వనరుల విభాగాధిపతిగా శిల్పా కాబ్ర నియమితులయ్యారు. ఇప్పటివరకూ సీమెన్స్ లిమిటెడ్‌లో ఎగ్జిక్యూటివ్ వైస్‌ప్రెసిడెంట్, కంట్రీహెడ్‌గా ఆమె ఉన్నారు. మానవ వనరుల విభాగంలో 30 ఏళ్లకు పైగా అనుభవం ఉంది.

బీసీసీఎల్ ఇష్యూకు 147 రెట్ల స్పందన

రూ.1071 కోట్ల సమీకరణ లక్ష్యంతో వచ్చిన, కోల్ ఇండియా అనుబంధ సంస్థ భారత్ కోకింగ్ కోల్ (బీసీసీఎల్) ఐపీఓ ముగిసేసరికి 146.81 రెట్ల స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా 34,69,46,500 షేర్లను ఆఫర్ చేయగా, 50,93,44,51,200 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. క్యూఐబీ విభాగంలో 310.81 రెట్లు, ఎన్ఐఐ విభాగంలో 258.04 రెట్లు, రిటెయిల్ మదుపర్ల నుంచి 49.26 రెట్ల స్పందన వచ్చింది.

2025లో సిప్ పెట్టుబడులు రూ.3.34 లక్షల కోట్లు

క్రమానుగత పెట్టుబడుల ప్రణాళిక (సిప్) ద్వారా 2025లో మ్యూచువల్ ఫండ్ పథకాల్లోకి రూ.3.34 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఇది జీవనకాల గరిష్ఠం. ఆర్థిక క్రమశిక్షణ, దీర్ఘకాలిక సంపద సృష్టిపై మదుపర్లలో అవగాహన పెరుగుతుండటమే ఇందుకు కారణం. 2024లో సిప్‌ల ద్వారా రూ.2.68 లక్షల కోట్లు ఫండ్‌లలోకి వచ్చాయి. 2023లో ఈ మొత్తం రూ.1.84 లక్షల కోట్లు అని మ్యూచువల్‌ఫండ్ల సంఘం యాంఫీ గణాంకాల ద్వారా తెలుస్తోంది. స్టాక్‌మార్కెట్‌లో దిద్దుబాటు వచ్చిన ప్రతిసారి.. మరింత పెట్టుబడి పెట్టేందుకు అవకాశంగా మదుపర్లు భావిస్తున్నారని, 2025లో సిప్ ద్వారా పెట్టుబడులు పెరగడం ఇదే విషయాన్ని తెలియజేస్తోందని ఆనంద్ రాఠీ వెల్త్ సంయుక్త సీఈఓ ఫిరోజ్ అజీజ్ తెలిపారు. గతేడాది సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు నెలల్లో స్థిరంగా రూ.29,000 కోట్లకు పైగా సిప్ పెట్టుబడులు నెలవారీ వచ్చాయి. డిసెంబరులో జీవనకాల గరిష్ఠమైన రూ.31,000 కోట్లుగా ఇవి నమోదయ్యాయి.

అక్టోబరు-డిసెంబరు త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం)		మొత్తం ఆదాయం	
	2025-26	2024-25	2025-26	2024-25
ఐసీఐసీఐ లాంబార్డ్	659.00	724.00	6610.00	5883.00
ఐసీఐసీఐ ప్రుడెన్షియల్	390.00	326.00	11809.00	12261.00
బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర★	1779.00	1406.00	8277.00	7112.00

★ మధ్యంతర డివిడెండ్ రూ.10

మంట శాస్త్రం

అసలే చలికాలం. ఆపై శీతగాలుల ఉధృతి. ఇలాంటప్పుడు ఉదయం పూట చలి మంట వేసుకుంటే ఎంత బాగుంటుందో కదా. ఆ వెచ్చదనం ఎంత హాయిగా అనిపిస్తుందో. ఆది నుంచి ఇది మనిషిని ఆకర్షిస్తూనే ఉంది. చలి మంట చుట్టూ కూర్చొని కబుర్లు, కథలు చెప్పుకొంటూ సాంస్కృతిక విజ్ఞానాన్ని నిర్మించుకున్నాడు, పెంపొందించుకున్నాడు. నిజానికి మంట మానవ పరిణామక్రమం రూపుదిద్దుకోవటానికి తోడ్పడిన ఓ పురాతన పరిజ్ఞానం. దాన్ని ఎలా రాజేయాలో, ఎలా ఆర్పాలో తెలుసుకోవటమే కాదు.. వివిధ పనులకు వాడుకోవటాన్నీ నేర్చుకున్నాడు. మంట లేనిది వంట చేయటం సాధ్యమే కాదు. ఇది మానవ సంస్కృతి, సంప్రదాయాల్లో విడదీయలేని భాగంగానూ మారిపోయింది. మనం సంక్రాంతి ముందు రోజు భోగిమంటలు వేసుకుంటూనే ఉంటాం కదా. హోమాలు కాల్చటం, హారతులు ఇవ్వటం, దీపాలు వెలిగించటం నరేసరి. నిజానికి మంట అనేది విశ్వంలో కేవలం మన భూమికే ప్రత్యేకమనే విషయం తెలుసా? ఇంతకీ మంట అంటే ఏంటి?

మంట గురించి తెలియనివారుండరు. కానీ అదేంటో నిర్వచించమంటే మాత్రం కష్టమే. కోట్లాది ఏళ్లుగా ఇది చెట్లు, చేమలతో నిండిన మన భూమిని తీర్చిదిద్దుతూ వస్తోంది కూడా. కార్చిచ్చులతో వినాశనానికే కాదు, పర్యావరణ వ్యవస్థ మొత్తంగా పునరుద్ధరణ కావటానికీ దోహదం చేస్తుంది. మన పూర్వీకుల బతుకు, వంట చేయటం, ఆహారాన్ని భద్రపరచటం కోసం దీన్ని వాడుకున్న తీరు అద్భుతం. దీంతోనే ఆదిమానవులు వ్యవసాయ యోగ్యంగా మలచుకున్నారు. ఆ విధానాలే ఇప్పటికీ నిజ జీవితంలో ఉపయోగపడుతున్నాయి. నేడు మంట ఓ పారిశ్రామిక పనిముట్టు. రోజువారీ జీవితాలతో పెనవేసుకుపోయిన సాధనం. ఆహారం వండుకోవాలన్నా, నీళ్లు కాచుకోవాలన్నా మంట ఉండాల్సిందే.

మూడు కోణాల మేళనం

మంట ఏంటనేది తేలికగా అర్థం కావాలంటే అసలు దాన్ని ఎగదోసేవి ఏంటనే అనుబంధ ప్రశ్న వేసుకోవాలి. మంట పుట్టటానికి మూడు అంశాలు అవసరం. 1. ఇంధనం (మండటానికి ఏదో ఒకటి) 2. ఆక్సిజన్. 3. ప్రాథమిక రవ్వ లేదా వేడి వనరు. దీన్నే జ్వాల త్రికోణం (ఫైర్ ట్రయాంగిల్) అంటారు. ఇంధనం, ఆక్సిజన్‌లను 'ప్రతిచర్య కారకాలు' (రియాక్టెంట్స్) అనుకోవచ్చు. అలాగే ప్రాథమిక రవ్వ, వేడి వనరులను 'ప్రేరక శక్తి' (యాక్టివేషన్ ఎనర్జీ)గా చెప్పుకోవచ్చు. ఉదాహరణకు- చలి మంటను తీసుకుంటే పుల్లలు, కలప ముక్కల వంటి కర్బన పదార్థం ఇంధనంగా పనిచేస్తుంది. చుట్టూరా గాలిలో ఆక్సిజన్ ఉండనే ఉంది. అగ్గిపుల్లతోనో, నిప్పుతోనో అంటించటం ప్రాథమిక రవ్వగా తోడ్పడుతుంది. కార్చిచ్చుల విషయంలోనూ ఇలాగే జరుగుతుంది. పిడుగులు, కొమ్మలు రాసుకోవటం వల్ల పుట్టే ఘర్షణ లేదా మనుషులు పొరపాటుననో, కావాలనో అంటించటం వంటివి మంట రగులుకోవటాన్ని ప్రోత్సహిస్తాయి. ఈ ప్రతిచర్య కారకాల్లో ఏది లేకపోయినా మంట కొనసాగదు. మంట మీద నీటిని చల్లితే ఆరటానికిదే కారణం. మంట వేడికి నీరు ఆవిరై, గాలిని పక్కకు తప్పిస్తుంది. అప్పుడు ఆక్సిజన్ అందటం నిలిచి, మంట ఆరుతుంది. ఇంధనం పూర్తిగా కాలిపోయినప్పుడూ మంట దానంతటదే చల్లారుతుంది. ముందు జాగ్రత్తగా ఇంధనాన్ని తొలగించటం ద్వారానూ మంటలను ఆపొచ్చు. మనం వంట పూర్తయ్యాక పొయ్యిలోంచి కట్టెలను తీసేసినట్టు అన్నమాట.

శక్తి ఉత్పన్నం ప్రధానం

మంట నుంచి ప్రధానంగా 'ఉత్పత్తి' అయ్యేది శక్తే. దీంతో పాటు కార్బన్ డయాక్సైడ్, నీటి ఆవిరి కూడా పుట్టుకొస్తాయి. ఆక్సిజన్ కన్నా ఎక్కువగా ఇంధనం అందుబాటులో ఉన్నప్పుడు ఇతరత్రా ఉత్పత్తులూ పుడతాయి. వీటిల్లో ఒకటి మసి. ఇది సగం మండిన కార్బన్ రేణువుల సముదాయం. మనం ఎప్పుడైనా మంట పుడుతోందని తెలుసుకోవటానికి, అది మన అనుభవంలోకి రావటానికిది తోడ్పడుతుంది. చుట్టుపక్కల చల్లటి గాలి కన్నా తక్కువ సాంద్రత కలిగుండటం వల్ల వేడి వాయువులు పైకి ఎగుస్తాయి. ఇవి తమతో పాటు మసి రేణువులను మోసుకెళ్తాయి. అత్యధిక ఉష్ణోగ్రత కలిగుండటం వల్ల ఇవి పసుపు-నారింజ రంగుల్లో ఉంటాయి. మనకు జ్వాలల రూపంలో అనుభవంలోకి వచ్చేవి ఇవే. మసి ఎత్తుకు ఎగుస్తున్నకొద్దీ చల్లబడుతుంది. రంగుల రూపంలో కాంతిని వెలువరిస్తుంది. వీటిల్లో కంటికి కనిపించని పరారుణ కాంతి కూడా ఉంటుంది.

ద్రవమూ కాదు, ఘనమూ కాదు

అసలు మంట స్వరూపమేంటి? అది ద్రవమూ కాదు, ఘన పదార్థమూ కాదు. జ్వాలల్లో వేడి గాలులు పాలు పంచుకుంటున్నప్పటికీ, మండుతున్నప్పుడు మాత్రమే మంటలు ఉనికిలో ఉంటాయి. అవి తమకు తాము స్థిరమైన స్థితిలో ఉండవు. కార్బన్ డయాక్సైడ్, నీటి ఆవిరి మాదిరిగా వీటిని పెట్టెల్లో, సీసాల్లో ఒడిసి పట్టలేం. అందువల్ల మంటలు వాయువులూ కావు. పదార్థం నాలుగో స్థితి అయిన ప్లాస్మా కూడా కావు. ప్లాస్మాలో వేడితో కూడిన శక్తి ఉంటుంది. దీనిలోని అణువులు అయనీకృతమై ఉంటాయి. అది అన్ని ఎలక్ట్రాన్లను పట్టి ఉంచలేదు. తీవ్రమైన మంటల్లో అత్యంత వేడి భాగాల్లో బలహీనమైన ప్లాస్మా ఏర్పడటానికి తగిన అయనీకృత అణువులు ఉండే మాట నిజమే కావొచ్చు. కానీ, ఈ ప్లాస్మా తనకు తాను స్థిరంగా ఉండదు. అంటే మంట ప్లాస్మా మాదిరిగానూ వ్యవహరించదన్న మాట. పదార్థమూ కాదు. అసలేంటి? ఇది దహనం అనే ఒకరకం రసాయన ప్రక్రియ మాత్రమే.


భూమికే ప్రత్యేకం

విశ్వంలో వాయువులు, ప్లాస్మా అంతటా ఉంటాయి. కానీ ఆక్సిజన్‌తో ప్రేరేపితమయ్యే జ్వాలలు మన భూమికే ప్రత్యేకం. తొలినాటి సూర్యుడి చుట్టూ ఆవరించిన దుమ్ము, వాయువు నుంచే మన భూమి ఏర్పడింది. అప్పట్లో సూర్యుడు దాదాపు మొత్తం ప్లాస్మా రూపంలో చాలా వేడిగా ఉండేవాడు. ఈ విశ్వంలో లక్షలాది నక్షత్ర మండలాలున్నాయి. ప్రతి దాంట్లో కోట్లాది నక్షత్రాలు. కొన్నింటిలో గ్రహ వ్యవస్థలూ ఉండి ఉండొచ్చు. అంటే అక్కడ బోలెడంత వాయువు, ప్లాస్మా ఉన్నాయన్నమాట. అయినా గానీ మొత్తం విశ్వంలో మంటలు ఏర్పడటం మన భూమి మీదే సాధ్యం. దీనికి ప్రధాన కారణం ఆక్సిజన్ స్థిరంగా అందటం. ఈ ఆక్సిజన్ కూడా జీవుల నుంచే ఉత్పత్తి అవుతున్నదే! ప్రస్తుతానికి జీవం కేవలం మన భూమ్మీదే ఉంది. అంటే మంట కేవలం మన వద్దే ఉందన్నమాట.

జీమెయిల్‌కు ఏఐ సొబగులు

జీమెయిల్ కొత్త జనరేటివ్ ఏఐ ఫీచర్లతో ముస్తాబవుతోంది. ఏఐ సారాంశాలు, కొత్త ఏఐ ఇన్‌బాక్స్, పూర్తిస్థాయి మెయిళ్లను రాసిపెట్టే టూల్స్‌తో సరికొత్తగా అవతరిస్తోంది. గూగుల్ సెర్చ్‌లో మాదిరిగానే ఇకపై ఇన్‌బాక్స్‌లోనూ ఏఐ ఓవర్‌వ్యూస్ ప్రత్యక్షం కానుంది. ఇది పొడవైన కన్వర్జేషన్లను ముఖ్యమైన అంశాల రూపంలో క్రోడీకరిస్తుంది. అడిగిన ప్రశ్నలకు జవాబులిస్తుంది. ఏఐ ఓవర్‌వ్యూ కన్వర్జేషన్ సారాంశాలు అందరికీ అందుబాటులో ఉంటాయి. ఏఐ ఆధారిత హెల్ప్ మీ రైట్, సజెస్టెడ్ రిప్లయిస్ ఫీచర్లనూ అంతా ఉచితంగా వాడుకోవచ్చు. అయితే ఏఐ ఓవర్‌వ్యూతో ప్రశ్నలు అడిగే సదుపాయం, ప్రూఫ్‌రీడ్ ఫీచర్ మాత్రం గూగుల్ ఏఐ ప్రొ, అల్ట్రా సబ్‌స్క్రయిబర్లకే అందుబాటులో ఉంటాయి.

- టెక్స్ట్ ప్రాంప్ట్‌లతోనే మొత్తం మెయిళ్లను డ్రాఫ్ట్ చేయటానికి లేదా అప్పటికే రాసుకున్న ఈమెయిల్ డ్రాఫ్ట్‌లను మెరుగుపరచుకోవటానికి ఈ కొత్త ఫీచర్లు ఉపయోగపడతాయి. ఇవి గూగుల్‌కు చెందిన జెమినై 3 మోడల్ సాయంతో పనిచేస్తాయి.
- వినూత్న ఏఐ ఇన్‌బాక్స్ ఫీచర్‌ను కొందరు విశ్వసనీయ యూజర్లు ఇంకా పరీక్షిస్తున్నారని గూగుల్ పేర్కొంది. యూజర్ల ఈమెయిళ్లు, కాంటాక్ట్స్ ద్వారా సమాచారాన్ని తీసుకొని పనులను ప్రాధాన్య క్రమంలో తీర్చిదిద్దేలా దీన్ని రూపొందించారు. అంటే ఆయా రోజుల్లో చెల్లించాల్సిన బిల్లులు, డాక్టర్ అపాయింట్‌మెంట్ వంటి వాటిని గుర్తుచేస్తుందన్నమాట. వచ్చే కొద్దినెలల్లో ఇది మరింత ఎక్కువమందికి అందుబాటులోకి రానుంది.




- అమెరికాలోని జీమెయిల్ యూజర్లకు ఈ కొత్త ఫీచర్లను ఇంగ్లిష్‌లో వర్తింపజేయటం మొదలైంది. త్వరలోనే మిగతా దేశాలకు, ఇతర భాషలకు వీటిని విస్తరించనున్నారు.

ఎండతోనే మిథనాల్!

పెట్రోలియం వంటి శిలాజ ఇంధనాల దహనం పెద్ద కాలుష్య కారకంగా పరిణమించింది. దీంతో స్వచ్ఛ ఇంధనం, పర్యావరణ పరిరక్షణ నేటి తక్షణావసరంగా మారాయి. ఈ నేపథ్యంలో ఐఐటీ గువాహటి పరిశోధకులు రూపొందించిన వినూత్న కాంతి ఉత్ప్రేరక పదార్థం కొత్త ఆశలు రేపుతోంది. ఇది సూర్యరశ్మిని ఉపయోగించుకోవటం ద్వారా కార్బన్ డయాక్సైడ్ (సీవో2)ను మిథనాల్ ఇంధనంగా మారుస్తుంది మరి. దీనిపై ప్రొఫెసర్ మహుయా డీ నేతృత్వంలో సాగిన అధ్యయన ఫలితాలు ప్రఖ్యాత జర్నల్ ఆఫ్ మెటీరియల్ సైన్సెస్ పత్రికలో ప్రచురితమయ్యాయి. కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలను తగ్గించటానికి ప్రపంచవ్యాప్తంగా పరిశోధకులు చాలాకాలంగా కృషి చేస్తున్నారు. ఇందుకోసం గ్రాఫైట్‌తో కూడిన కార్బన్ నైట్రైడ్‌ను ఉపయోగించుకుంటున్నారు. ఇది చవకైంది, లోహ రహితమైంది. విషతుల్యం కాదు కూడా. అయితే త్వరగా శక్తిని కోల్పోవటం, తక్కువ ఇంధనాన్ని ఉత్పత్తి చేయటం వంటివి సవాళ్లుగా నిలుస్తున్నాయి. దీన్ని అధిగమించటానికే ఐఐటీ గువాహటి పరిశోధకులు కొత్తగా ఆలోచించారు. కార్బన్ నైట్రైడ్‌ను తక్కువ పొరల గ్రాఫేన్‌తో సమ్మిళితం చేశారు. దీంతో ఉత్ప్రేరకంలో శక్తి క్షీణతను తగ్గించటంలో విజయం సాధించారు. ఇది ఉత్ప్రేరకాన్ని ఎక్కువసేపు చురుకుగా ఉంచటం వల్ల కాంతిని ఎక్కువగా శోషించుకోవటానికి వీలు కల్పించింది. సౌరశక్తి సాయంతో కార్బన్ డయాక్సైడ్‌ను స్వచ్ఛ ఇంధనంగా మార్చే ఈ ప్రక్రియ పర్యావరణ పరిరక్షణకు ఉపయోగపడగలదని ప్రొఫెసర్ మహుయా డీ అభిప్రాయపడుతున్నారు. ఇప్పుడు దీన్ని ఆచరణీయంగా మలచటానికి పరిశోధకులు ప్రయత్నిస్తున్నారు. ఇది సాధ్యమైతే బొగ్గు విద్యుత్ కేంద్రాలు, సిమెంట్ కంపెనీలు, స్టీలు ఉత్పత్తి కేంద్రాలు, పెట్రోరసాయన శుద్ధి కేంద్రాల్లో దీన్ని వాడుకోవచ్చు.

కిండిల్‌లో పేజీలు తిప్పండి



కిండిల్‌ను నిజమైన పుస్తకం చదువుతున్న అనుభూతి కలిగించేలా మార్చుకోవాలని అనుకుంటున్నారా? అయితే **పేజ్ టర్న్ యానిమేషన్‌**ను ఎనేబుల్ చేసుకోండి. ఇది చేత్తో పేజీలను తిరగేస్తున్న అనుభూతిని కలిగిస్తుంది. ముందుగా కిండిల్‌లో పుస్తకాన్ని ఓపెన్ చేసి, తెర మీద తాకాలి. పైన Aa బటన్‌ను నొక్కి, **మోర్** ట్యాబ్‌ను సెలెక్ట్ చేసుకోవాలి. తర్వాత **పేజ్ టర్న్ యానిమేషన్స్** ఆప్షన్‌ను ఆన్ చేసుకోవాలి. దీన్ని ఎనేబుల్ చేసుకుంటే ఇలా తట్టగానే అలా పేజీ మారుతుంది. పేజీలను ముందుకు, వెనక్కు జరపటమూ తేలికవుతుంది. కాకపోతే ఇది కిండిల్ కొత్త మోడళ్లకు మాత్రమే వర్తిస్తుందని తెలుసుకోవాలి.

సరికొత్తగా ఒప్పో రెనో

ఒప్పో సంస్థ రెనో 15, రెనో 15సీ, రెనో 15 ప్రొ, రెనో 15 ప్రొ మినీ పేరిట తర్వాత తరం పరికరాలను పరిచయం చేసింది. అన్నింటి డిజైన్ దాదాపు ఒకేలా ఉన్నప్పటికీ సైజులు వేర్వేరుగా ఉన్నాయి. వాటి వివరాలు, ప్రత్యేకతల మీద ఓ కన్నేయండి.

- ప్రామాణిక రెనో 15 పరికరం గొరిల్లా గ్లాస్ 7ఐ రక్షణతో కూడిన 6.59 అంగుళాల ఎమోలెడ్ తెర కలిగుంటే.. రెనో 15 ప్రొ గొరిల్లా గ్లాస్ విక్టస్ 2 రక్షణతో కూడిన 6.78 అంగుళాల డిస్‌ప్లేతో అలరిస్తోంది. రెనో 15సీ తెర కాస్త చిన్నగా.. 6.57 అంగుళాలు ఉంటుంది.
- రెనో 15, 15 ప్రొ, 15 ప్రొ మినీ కూడా విమానాల స్థాయి అల్యూమినియం ఫ్రేమ్స్ కలిగున్నాయి.
- రెనో 15 ఫోన్ 50 ఎంపీ మెయిన్ సెన్సర్, 50 ఎంపీ 3.5ఎక్స్ టెలిఫొటో లెన్స్, 8 ఎంపీ అల్ట్రావైడ్ సెన్సర్‌తో ఆకర్షిస్తోంది. అదే రెనో 15సీ అయితే 50 ఎంపీ ప్రైమరీ కెమెరా, 8 ఎంపీ అల్ట్రావైడ్ సెన్సర్‌తో వస్తోంది.



- అన్ని ఫోన్లకూ ముందు భాగాన అల్ట్రావైడ్ ఫొటోలు తీయగల 50 ఎంపీ కెమెరా ఉంది. అయితే రెనో 15 ప్రొ, రెనో 15 ప్రొ మినీ మాత్రమే 4కే రికార్డింగును సపోర్టు చేస్తాయి.
- 15 ప్రొ, ప్రొ మినీ మోడళ్లు మీడియాటెక్ డైమెన్సిటీ 8450 చిప్‌సెట్‌తో పనిచేస్తాయి. రెనో 15 అయితే క్వాల్‌కామ్ స్నాప్‌డ్రాగన్ 7 జెన్ 4 ఎస్‌సీవోతో, రెనో 15సీ స్నాప్‌డ్రాగన్ 6 జెన్ 1 ప్రాసెసర్లతో పనిచేస్తాయి.
- రెనో 15సీ అన్నింటికన్నా పెద్ద బ్యాటరీ (7,000 ఎంఏహెచ్) కలిగుంది. రెనో 15కు 6,500 ఎంఏహెచ్.. అదే 15 ప్రొ, ప్రొ మినీ పరికరాలకు 6,200 ఎంఏహెచ్ బ్యాటరీలున్నాయి. అన్నీ 80డబ్ల్యూ ఫాస్ట్ ఛార్జింగ్‌ను సపోర్టు చేస్తాయి.
- **15 ప్రొ ధర రూ.67,999. ప్రొ మినీ ధర రూ.59,999. రెనో 15 ధర రూ.45,999. 15సీ ధర రూ.34,999.**

తొలి ప్రభుత్వ ఏఐ క్లినిక్



ప్రజారోగ్య వ్యవస్థలో అధునాతన టెక్నాలజీని సమ్మిళితం చేసే దిశగా మనదేశం గొప్ప ముందడుగు వేసింది. ఉత్తర ప్రదేశ్‌లో గ్రేటర్ నొయిడాలో గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో మొట్టమొదటిసారిగా కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత ప్రభుత్వ క్లినిక్‌ను ఆరంభించింది. ప్రాణాంతక జబ్బులను త్వరగా గుర్తించటం, మరింత కచ్చితంగా, మెరుగ్గా జబ్బులను నిర్ధారించటం, వీలైనంత త్వరగా చికిత్స అందేలా చూడటం దీని ఉద్దేశం. క్యాన్సర్, గుండె, కిడ్నీ, కాలేయ జబ్బుల వంటివి ఎంతోమందికి ప్రాణాంతకంగా పరిణమిస్తున్నాయి. వీటిని తొలిదశలో గుర్తిస్తే చికిత్స తేలికవుతుంది. ఇక్కడే ఏఐ క్లినిక్ సాయం చేస్తుంది. జబ్బుల లక్షణాలు తీవ్రం కావటానికి ముందే గుర్తించటానికి తోడ్పడుతుంది. ఇలా జబ్బు ముదరకముందే జాగ్రత్త పడేలా చేస్తుంది. ఇది ప్రజలకు, ముఖ్యంగా ప్రభుత్వాసుపత్రుల మీద ఆధారపడిన లక్షలాది మందికి ఎంతగానో ఉపయోగపడుతుంది.

ఎలా పనిచేస్తుంది?

ఇది కృత్రిమ మేధ, జన్యు విశ్లేషణను సమ్మిళితం చేసి రక్త పరీక్షలు, ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్, సీటీ స్కాన్, ఎంఆర్ఐ ఇమేజ్‌లు, రోగి చరిత్ర వంటి వాటిని విశ్లేషిస్తుంది. ఇలా సంక్లిష్ట డేటాను త్వరగా విశ్లేషించటానికి డాక్టర్లకు సహాయపడుతుంది. ముఖ్యంగా విషమ పరిస్థితిలో ఉన్న రోగుల విషయంలో సత్వరం జబ్బులను నిర్ధారించి, చికిత్స చేయటానికి వీలు కల్పిస్తుంది. రోగులు ఎలా కోలుకుంటున్నారు? జబ్బు ముదురుతోందా? అనేవి తెలుసుకోవటానికీ ఈ పరిజ్ఞానం ఉపయోగపడుతుంది. రోగులకు అనుగుణంగా చికిత్సలను నిర్ణయించటానికీ తోడ్పడుతుంది.

తక్షణ అవసరం

చిన్న వయసులోనే తీవ్ర జబ్బులు పెరుగుతున్న నేపథ్యంలో ఏఐ క్లినిక్‌ల అవసరం పెరుగుతోందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మనదగ్గర క్యాన్సర్, గుండె, కాలేయ జబ్బులు, అధిక రక్తపోటు వంటి సమస్యలు చాలావరకూ ఆలస్యంగా బయటపడుతుంటాయి. ప్రత్యేకమైన పరీక్షలు అంతగా అందుబాటులో లేకపోవటమే దీనికి మూలం. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఇలాంటి ఏఐ ఆధారిత డయాగ్నొస్టిక్ కేంద్రాలను నెలకొల్పినట్టయితే అధునాతన వైద్య సదుపాయాలు ఎక్కువమందికి చేరువయ్యే అవకాశముంది.

రియల్‌మీ ప్రీమియం స్మార్ట్‌ఫోన్లు

రియల్‌మీ సంస్థ మధ్య, ప్రీమియం శ్రేణి వినియోగదారులను దృష్టిలో పెట్టుకొని 16 ప్రొ+, 16 ప్రొ స్మార్ట్‌ఫోన్లను పరిచయం చేసింది.

16 ప్రొ+ ఫీచర్లు..

- స్నాప్‌డ్రాగన్ 7 జెన్ 4 ప్రాసెసర్, ఆండ్రాయిడ్ 16 ఆధారిత రియల్‌మీ యూఐ 7.0 ఓఎస్.
- 144 హెచ్‌జడ్ రిఫ్రెష్ వేగం, 6,500 నిట్స్ గరిష్ఠ ప్రకాశంతో కూడిన 6.8 అంగుళాల ఎమోలెడ్ డిస్‌ప్లే.
- వెనకాల 200 ఎంపీ మెయిన్ కెమెరా, 50 ఎంపీ టెలిఫొటో కెమెరా, 3.5ఎక్స్ ఆప్టికల్ జూమ్, 8ఎంపీ అల్ట్రావైడ్ కెమెరా. ముందుభాగాన 50 ఎంపీ సెల్ఫీ కెమెరా.
- 80డబ్ల్యూ సూపర్‌వూక్ ఛార్జర్‌తో కూడిన 7,000 ఎంఏహెచ్ బ్యాటరీ.
- మాస్టర్ గోల్డ్, కెమెలియా పింక్ రంగులు.
- 8జీబీ/12 జీబీ ర్యామ్.. 128జీబీ/256జీబీ స్టోరేజీల్లో లభించే దీని ప్రారంభ ధర రూ.39,999.

16 ప్రొ ఫీచర్లు..


- 120 హెచ్‌జడ్ రిఫ్రెష్ వేగం, 6,500 నిట్స్ గరిష్ఠ ప్రకాశం గల 6.78 అంగుళాల ఎమోలెడ్ తెర.
- మీడియాటెక్ డైమెన్సిటీ 7300 మ్యాక్స్ చిప్‌సెట్, ఆండ్రాయిడ్ 16 ఆధారిత రియల్‌మీ యూఐ 7.0 ఓఎస్.
- వెనకాల 200 ఎంపీ ప్రైమరీ కెమెరా, 8 ఎంపీ సెకండరీ కెమెరా. ముందు 50 ఎంపీ సెల్ఫీ కెమెరా.
- 80డబ్ల్యూ సూపర్‌వూక్ ఛార్జర్‌తో కూడిన 7,000 ఎంఏహెచ్ బ్యాటరీ.
- 8జీబీ/12 జీబీ ర్యామ్.. 128జీబీ/256జీబీ స్టోరేజీల్లో లభించే దీని ప్రారంభ ధర రూ.31,999.



అవేం ఫైళ్లబ్బా?

విండోస్‌లో డిఫాల్ట్‌గా ఫైలు పేరు చివర్లు.. అంటే .jpg, .pdf, .mp4 వంటివి అదృశ్యంగా ఉంటాయి. అవి ఎలాంటి ఫైళ్లో తెలియకపోతే కొన్నిసార్లు ప్రమాదకరంగానూ పరిణమించొచ్చు. అనుకోకుండా డౌన్‌లోడ్ చేసుకున్న హానికర ఫైలు ఫొటో మాదిరిగా కనిపించొచ్చు. నిజానికది .exe (మాల్వేర్) కావొచ్చు. కాబట్టి అప్రమత్తంగా ఉండటం అవసరం. ఫైల్ పేరు ఎక్స్‌టెన్షన్‌ను ఎనేబుల్ చేసుకుంటే ఏది ఎలాంటి రకమో ఇట్టే తెలుసుకోవచ్చు. ఇందుకోసం ఫైల్ ఎక్స్‌ప్లోరర్‌ను ఓపెన్ చేసి, పై వరుసలో వ్యూ మీద క్లిక్ చేయాలి. షో/హైడ్ విభాగంలో ఫైల్ నేమ్ ఎక్స్‌టెన్షన్ ఆప్షన్‌ను టిక్ చేసుకోవాలి. అప్పుడు ఫైల్ రకం ప్రత్యక్షమవుతుంది.

ఐఫోన్ కొత్తదా? పాతదా?



ఐఫోనంటే ఎవరికి ఇష్టముండదు? ఇప్పుడు బోలెడన్ని ఆఫర్లూ వెల్లువెత్తుతున్నాయి. అందుబాటు ధరలో ఉందనిపిస్తే కొనటానికే మొగ్గుచూపుతాం. ఫోన్ బాగా పనిచేస్తుందని విక్రేతలు చెబుతుంటే ఆగుతామా? అయితే డబ్బులు చెల్లించే ముందు అది కొత్తదా? పాతదా? రిప్లేస్‌మెంటు చేసిందా? అనేది చూసుకోవటం చాలా ముఖ్యం. దీన్ని మోడల్ నంబరుతో తేలికగా తెలుసుకోవచ్చు. ముందుగా ఐఫోన్‌లో సెటింగ్స్‌ను ఓపెన్ చేయాలి. జనరల్ విభాగంలోకి వెళ్లి అబౌట్‌ను పరిశీలించాలి. అబౌట్‌లో మోడల్ నంబరు (ఉదా: MG2V4HN/A) కనిపిస్తుంది. దీని మొదటి అక్షరంతోనే ఎలాంటి ఐఫోనో తెలుసుకోవచ్చు.

- ఎం: ఇది కొత్త ఐఫోన్‌కు సంకేతం. మీరు సరికొత్త పరికరాన్ని కొంటున్నట్టే. అది యాపిల్ టెక్నికల్ సర్వీస్ సెంటర్‌కు వెళ్లలేదనే అర్థం.
- ఎఫ్: మోడల్ నంబరు ఎఫ్‌తో మొదలైతే అది రిఫర్బిష్డ్ ఫోన్ అన్నమాట. యాపిల్ టెక్నికల్ సర్వీస్ దాన్ని మరమ్మతు చేసిందని, సెకండ్ హ్యాండ్ పరికరంగా అమ్ముతారని అర్థం.
- ఎన్: ఇది రిప్లేస్‌మెంట్ పరికరమని సూచిస్తుంది. అంటే ఒరిజినల్ ఫోన్ మరమ్మతుకు వెళ్లిందని, దాని స్థానంలో ఇది రిప్లేస్‌మెంట్‌గా వచ్చిందన్నమాట. రిప్లేస్‌మెంట్ ఫోన్లు కొత్తవి కావని, రిఫర్బిష్ చేసినవని తెలుసుకోవాలి.
- పి: ఫోన్‌ను కొనే సమయంలో దాని వెనకాల లేదా లోపల చిన్న టెక్స్ట్‌ను చెక్కినట్టయితే పి అక్షరం కనిపిస్తుంది.
- 3ఏ: స్టోర్ డెమో పరికరమైతే 3ఏ కోడ్ కనిపిస్తుంది.

మరికొన్ని సూచికలు

- కొత్త ఐఫోన్ బొమ్మలతో కూడిన సీల్డ్ బాక్స్‌తో వస్తుంది. అదే రిఫర్బిష్డ్ అయితే తెల్ల బాక్సుల్లో ఉంటుంది.
- సెటింగ్స్‌లోని అబౌట్‌లో పార్ట్స్ అండ్ సర్వీసెస్ హిస్టరీని చూస్తే ఫోన్ మరమ్మతు అయ్యిందో లేదో తెలుస్తుంది. జెన్యూన్ అని ఉన్నట్టయితే మరమ్మతు కోసం విశ్వసనీయమైన యాపిల్ భాగాలను వాడారని అర్థం.
- బ్యాటరీ హెల్త్‌ను చెక్ చేసినప్పుడు హై సైకిల్ కౌంట్ కనిపించినా, ఫస్ట్ యూజ్ తేదీ మీరు కొన్న తేదీకి సరిపోకపోయినా అది ఇంతకుముందు వాడిన ఫోన్ కావొచ్చు.

చెట్లూ సంగీతం వింటాయి

చెట్లు, వృక్షాలకు మెదళ్లు ఉండవు. కేంద్ర నాడీ వ్యవస్థలు లేవు. అయినా కూడా చుట్టుపక్కల పరిసరాలను గుర్తించగలవు. కాంతి, వాసన, స్పర్శ, గాలి, చివరికి గురుత్వాకర్షణనూ పసిగట్టగలవు. అంతేనా? శబ్దాలకూ స్పందిస్తాయి. చెట్లకు మనలాగా చెవులుండవు కదా. మరి అవెలా వింటాయి? సంగీతాన్ని ఎలా ఆస్వాదిస్తాయి? ఒకవేళ ఆస్వాదిస్తే వాటికి ఒనగూరే లాభాలేంటి? వీటి విషయంలో పరిశోధనలు ఏం చెబుతున్నాయో చూద్దాం.

జంతువుల మాదిరిగానే మొక్కలకూ నాడీ వ్యవస్థ ఉందని సర్ జగదీశ్ చంద్రబోస్ ఏనాడో నిరూపించారు. ఇవి ఒత్తిడి, గాయం, చప్పుళ్లకు ప్రతిస్పందిస్తాయని రుజువు చేశారు. అనంతర పరిశోధనలూ దీన్ని గట్టిగా బలపరుస్తున్నాయి. చెట్లు తమ చుట్టుపక్కల కంపనాలను గుర్తించటమే కాదు, తాము గ్రహించిన సమాచారాన్ని బట్టి ప్రవర్తననూ మార్చుకుంటాయి! ఆశ్చర్యంగా అనిపించినా ఇది నిజమేనని యూనివర్సిటీ ఆఫ్ మిస్సోరీ శాస్త్రవేత్తలు నిరూపించారు. ఆవాల జాతికి చెందిన ఒక మొక్కకు గొంగళిపురుగు ఆకులను నములుతున్న చప్పుడు వినిపించగా.. చేదుగా ఉండే నూనెలను మరింత ఎక్కువగా విడుదల చేసినట్టు తేలింది. గొంగళిపురుగు నుంచి తమను కాపాడుకోవటానికి ఇలా రక్షణ చర్యకు దిగాయి. మరింత గొప్ప విషయం ఏంటంటే- ఒకే పౌనఃపున్యం కలిగున్నప్పటికీ ఆకులను నమిలే కీటకాల కంపనాలకూ, గాలి లేదా కీటకాలు సంపర్కం సమయంలో చేసే చప్పుళ్లకూ మధ్య తేడాలను గుర్తించగలగటం. అంటే తమకు ముప్పు, ప్రమాదం పొంచి ఉన్నప్పుడు మాత్రమే రక్షించుకోవటానికి ప్రయత్నిస్తున్నాయన్నమాట. విత్తనం మొలకెత్తే ప్రక్రియను శబ్దం ప్రభావితం చేస్తున్నట్టు కాలిఫోర్నియా లెర్నింగ్ రిసోర్స్ నెట్‌వర్క్ పేర్కొంటోంది. ఆయా పౌనఃపున్యాల మూలంగా నీటిని తీసుకోవటం, విత్తనం జీవక్రియలు పుంజుకోవటం విచిత్రం. హాయిగా అనిపించే సహజ శబ్దాలు, మధురమైన శాస్త్రీయ సంగీతం జన్యు వ్యక్తీకరణ, హార్మోన్ల నియంత్రణ మీద ప్రభావం చూపుతున్నట్టు తేలింది. అదే పేలుళ్లు, బాణసంచా, బాంబుల మోతల వంటివి విత్తనం మొలకెత్తటాన్ని అణచివేస్తున్నట్టు వెల్లడైంది.



ఎదగటానికి, దిగుబడికి

చెట్లు ఎదగటానికి సంగీతం తోడ్పడుతున్నట్టు మనదేశంలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ స్టడీ అండ్ రిసెర్చ్ ఇన్ బయో టెక్నాలజీ అండ్ అలైడ్ సైన్సెస్‌కు చెందిన దేవేంద్ర వనోల్ గుర్తించారు. అంతేకాదు, ఇవి వేర్వేరు రకాల సంగీతాలు, సహజ శబ్దాలు, వాహనాల రణగొణధ్వనులకు మధ్య తేడాలను పసిగట్టగలవని తేల్చారు. పరిసరాల గురించి తెలుసుకోవటానికివి చెట్లకు ఉపయోగపడుతున్నాయని చెబుతున్నారు. శబ్ద తరంగాలు చెట్ల కణాలను కంపించేలా చేస్తాయి. ఇవి పోషకాలను తీసుకోవటాన్ని, తమ వ్యవస్థలను బలోపేతం చేసుకోవటాన్ని ప్రోత్సహిస్తాయి. చిలగడ దుంప, దోస, టొమాటో, పాలకూర, పత్తి, వరి, గోధుమ దిగుబడిని శబ్ద తరంగాలు గణనీయంగా పెంచుతున్నాయని బీజింగ్‌లోని చైనా అగ్రికల్చరల్ యూనివర్సిటీ పరిశోధకులు గుర్తించారు. హరిత పందిరి కింద సాగు చేసే టొమాటోలకు సంగీత చికిత్సతో చీడ పీడల బెడద తగ్గుతున్నట్టూ కనుగొన్నారు.

రోజురోజుకీ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆహార ఉత్పత్తిని పెంచటానికి కొత్త, హరిత పరిజ్ఞానాలను కనుక్కోవటం శాస్త్రవేత్తలకు పెద్ద సవాలుగా నిలుస్తోంది. శబ్ద తరంగ పరిజ్ఞానంతో మొక్కల నిరోధక వ్యవస్థ బలోపేతం చేయొచ్చని, పర్యావరణ కాలుష్యంతో ముడిపడిన చాలా సమస్యలను తప్పించుకోవచ్చని పరిశోధనల్లో తేలటం ఆసక్తి కలిగిస్తోంది. ఎరువులు, పురుగుమందుల అవసరం తగ్గితే సాగు ఖర్చూ తగ్గుతుంది కదా.

ఈనాడు సినిమా

అసలైన విజయం ఇదే


శ్రీలీల

మరీ ఎక్కువగా ఎదురు చూడాల్సిన అవసరం లేకుండా... నటిగా తొలి అడుగులు వేస్తున్న సమయంలోనే శ్రీలీల అగ్ర హీరోలతో కలిసి నటించే అవకాశాల్ని అందుకుంది. ఆ అవకాశాలకు తగ్గట్టుగానే ఆమె తన అందంతో ప్రేక్షకుల్ని ఆకర్షించింది. హుషారైన డ్యాన్స్‌తో కమర్షియల్ సినిమాలకు తగ్గ కథానాయిక అనిపించుకుంది. తెలుగు సినిమాల్లో ఆమెకు పాటలతోనే ఎక్కువగా పేరొచ్చింది. అయితే ఇప్పుడు తన నటనకీ గుర్తింపు లభించిందనే ఆనందంలో ఉంది ఈ అచ్చ తెలుగమ్మాయి. ఇటీవలే శ్రీలీల తమిళంలో 'పరాశక్తి' చిత్రంలో నటించింది. ఆ సినిమాకి అక్కడ మిశ్రమ స్పందన లభించినా, శ్రీలీల నటనకి మాత్రం మంచి పేరొచ్చింది. అదే విషయాన్నే ఆమె ఓ వేడుకలో ప్రస్తావిస్తూ... ఎప్పుడూ పాటలు, డ్యాన్సులతోనే తనని గుర్తించేవారని, అందుకు భిన్నంగా మొట్ట మొదటిసారి పూర్తిగా తన నటన గురించే మాట్లాడుతున్నారని అంది. ప్రేక్షకులు, పరిశ్రమ నుంచి ప్రశంసలు లభిస్తుండడం ప్రత్యేకమైన అనుభూతిని పంచుతోందని, అసలైన విజయం ఇప్పుడు దక్కిందనే భావనలో ఉన్నానని చెప్పుకొచ్చింది శ్రీలీల. తమిళంలో ఆమె చేసిన తొలి సినిమా ఇదే. త్వరలోనే హిందీలోకీ అడుగు పెట్టనుంది.

ఈ ఒక్క క్షణం ఆగిపోతే బాగుండు!


'బార్డర్ 2'.

బాలీవుడ్ కథానాయకుడు సన్నీ దేఓల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'బార్డర్ 2'. ఈ వార్ డ్రామాకు అనురాగ్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. వరుణ్ ధావన్, అహాన్ శెట్టి, దిల్జీత్ దోసాంజ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమా ఈ నెల 23న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ప్రచార కార్యక్రమాలను పరుగులు పెట్టిస్తోంది చిత్రబృందం. ఇందులో భాగంగానే తాజాగా ఈ సినిమా నుంచి సామాజిక మాధ్యమాల వేదికగా మరో పాటను విడుదల చేసింది. "కొన్నిసార్లు ఒక సైనికుడు ప్రపంచం ఈ ఒక్క క్షణం ఆగిపోతే బాగుండని కోరుకుంటాడు" అనే వ్యాఖ్యను జోడించింది. 'జాతే హ్యూ లామ్హోన్' అంటూ సాగుతున్న ఈ గీతం.. కుటుంబాలకు దూరంగా ఉంటున్న ఎంతో మంది సైనికుల జీవితాల్ని కళ్లకు కట్టినట్లు చూపించింది. హిందీ ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకున్న 'బార్డర్'కు సీక్వెల్‌గా దీన్ని తీర్చిదిద్దారు. జేపీ దత్తా, క్రిషన్ కుమార్, భూషణ్ కుమార్, నిధి దత్తా నిర్మిస్తున్నారు.

నా ప్రతి సినిమా రచనలోనూ భాగమయ్యా!

- నవీన్ పొలిశెట్టి


మీనాక్షి, నవీన్, రేవంత్, సూర్యదేవర నాగవంశీ, మారి

"అందమైన ప్రేమకథకు తోడు... పల్లెటూరి నేపథ్యం, హాస్యం, కుటుంబ భావోద్వేగాలు, డ్రామా... ఇలా అన్నీ కుదిరిన సినిమా 'అనగనగా ఒక రాజు'. పండగ అంశాలన్నీ ఉన్న ఇలాంటి సినిమా సంక్రాంతికి వస్తే చాలా బాగుంటుందని బలంగా నమ్మి అనుకున్నట్టుగానే విడుదల చేస్తున్నాం" అన్నారు నవీన్ పొలిశెట్టి. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రమిది. మీనాక్షి చౌదరి కథానాయిక. మారి దర్శకుడు. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య సంయుక్తంగా నిర్మించారు. బుధవారం ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో చిత్రబృందం విలేకర్ల సమావేశం నిర్వహించింది. కథానాయకుడు నవీన్ పొలిశెట్టి మాట్లాడుతూ "తెలుగువాళ్లకి సంక్రాంతి ప్రత్యేకమైన పండుగ. ఎన్ని బాధలున్నా అన్నింటినీ మరిచిపోయి మన వాళ్లని కలుసుకుని సంతోషంగా గడుపుతుంటాం. ఇంటిల్లిపాదీ కలుసుకుని సరదాగా గడిపితే వచ్చే ఉత్సాహమే వేరు. అలాంటి ఉత్సాహమే మా సినిమాలోనూ చూస్తారు. నాకు ఎంతో ఇష్టమైన 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' తరహా సినిమాల్ని గుర్తు చేసే ఆనందం, ఆహ్లాదం ఇందులో కనిపిస్తుంది. నేను చేసే ప్రతి సినిమాలోనూ కథ పరంగా నా ప్రమేయం ఉంటుంది. 'ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ' మొదలుకొని ప్రతి సినిమా రచనలోనూ నేను భాగమయ్యా. అందుకే మా సినిమాల్ని మేం సరిదిద్దుకుని పక్కాగా ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చి, వాళ్లని మెప్పించాం. ఈ సినిమా విషయంలోనూ అంతే" అన్నారు. కథానాయిక మీనాక్షి చౌదరి మాట్లాడుతూ "ఇంటిల్లిపాదీ హాయిగా నవ్వుకుంటూ ఈ సినిమాతో పండగని చేసుకోవాలని కోరుకుంటున్నా" అన్నారు. మా రాజుతో ఈ పండగ అందరికీ సరదాల్ని పంచుతుందన్నారు దర్శకుడు. నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ "ఈ సినిమా ఎంతగా నవ్విస్తుందో, అదే స్థాయిలో భావోద్వేగాల్నీ పంచుతుంది" అన్నారు. ఈ కార్యక్రమంలో బాల నటుడు రేవంత్‌తోపాటు చిత్రబృందం పాల్గొంది.

'బ్యాచిలర్ పార్టీ' మరోసారి


నస్లేన్

మోనికా.. మై డియర్ మోనికా..' అంటూ గతేడాది 'కూలీ' చిత్రంలో తన స్టెప్పులతో అలరించారు నటుడు సౌబిన్ షాహిర్. ఇప్పుడాయన యువ కథానాయకుడు 'ప్రేమలు' ఫేమ్ నస్లేన్‌తో కలిసి ఓ సినిమాలో నటిస్తున్నట్లు తెలుస్తోంది. 2012లో విడుదలైన మలయాళ చిత్రం 'బ్యాచిలర్ పార్టీ' ప్రేక్షకుల్ని విశేషంగా అలరించింది. 14ఏళ్ల తర్వాత తాజాగా దీనికి సీక్వెల్ రాబోతున్నట్లు ప్రకటించారు దర్శకుడు అమల్ నీరద్. ఈ కొనసాగింపు చిత్రానికి 'బ్యాచిలర్ పార్టీ డియుక్స్' అనే పేరు పెట్టినట్లు తెలుపుతూ.. ఇన్‌స్టా వేదికగా ఓ ఫొటోను పంచుకున్నారాయన. ఇందులో సౌబిన్, నస్లేన్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నట్లు తెలుస్తోంది. త్వరలో చిత్రీకరణ ప్రారంభం కానున్న ఈ చిత్రాన్ని అమల్ నీరద్ ప్రొడక్షన్స్‌తో కలిసి ఫహాద్ ఫాసిల్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. యాక్షన్ అడ్వెంచర్‌గా దీన్ని తీర్చిదిద్దుతున్నట్లు సమాచారం.


సాహు, సుస్మిత, అనిల్ రావిపూడి

మా అందరినీ నడిపించిన శంకరుడు చిరంజీవి

- దర్శకుడు అనిల్ రావిపూడి

"నటనలోని నవరసాల్ని అందంగా, అద్భుతంగా తనదైన ప్రత్యేకతతో ఆవిష్కరించిన కథానాయకుడు చిరంజీవి. దశాబ్దాలుగా ఆయన ప్రదర్శిస్తున్న శైలి, డ్యాన్సుల్లో హుషారు, పంచే భావోద్వేగాలే నాకు 'మన శంకరవరప్రసాద్‌గారు' కథ రచనలో స్ఫూర్తినిచ్చాయి. నా కెరీర్‌లో వేగంగా... కేవలం 25 రోజుల్లోనే పూర్తయిన స్క్రిప్ట్ ఇది. ఈ సినిమా విజయం ఆయనకే చెందుతుంది" అన్నారు దర్శకుడు అనిల్ రావిపూడి. చిరంజీవి కథానాయకుడిగా, అనిల్ దర్శకత్వంలో తెరకెక్కిన సినిమానే ఇది. నయనతార కథానాయిక. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల సంయుక్తంగా నిర్మించారు. సంక్రాంతి సందర్భంగా సోమవారం విడుదలైన ఈ సినిమా విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ సందర్భంగా ఆనందం వ్యక్తం చేస్తూ చిత్ర బృందం మంగళవారం విలేకర్ల సమావేశం నిర్వహించింది. దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ "ప్రపంచవ్యాప్తంగా చిరంజీవి అభిమానులంతా ఈ సినిమా విజయాన్ని ఓ పండగలా భావిస్తూ సంబరాలు చేసుకొంటున్నారు. 150 సినిమాలు చేసిన ఓ అగ్ర హీరో అయినా, మా అందరితో కలిసిపోయి మమ్మల్ని నడిపించిన శంకరుడు చిరంజీవి. ఆయనతో పనిచేసిన 85 రోజులు ఓ అందమైన జ్ఞాపకం. తన తండ్రి నటించే ఒక అద్భుతమైన సినిమాలో తన పేరు ఉండాలని కలలు కంటూ ఈ సినిమాని నిర్మించారు సుస్మిత కొణిదెల. మరో నిర్మాత సాహు నా స్నేహితుడు. ప్రేక్షకులు ఎంతగా సంతోషపడుతున్నారో నిర్మాతలు, పంపిణీదారులు, ప్రదర్శనకారులు కూడా అంతే సంతోషించే సినిమా అవుతుంది. ఈ విజయంలో మరో కథానాయకుడు వెంకటేశ్‌కు పెద్ద భాగం ఉంది. ఆ పాత్రని ఒప్పుకున్నందుకు ఆయనకు కృతజ్ఞతలు. చిరంజీవి, నయనతార జోడీ చాలా బాగుంది. ఈ సినిమాతో దొరికిపోతాడా లేదా? అని సామాజిక మాధ్యమాల్లో ఎంతోమంది నా గురించి మాట్లాడుకున్నారు. చిరంజీవిని ఇలా చూడాలనుకున్నామనే ప్రేక్షకులకి దొరికాను. మరో గుర్తుండిపోయే సంక్రాంతి ఇచ్చినందుకు ఆనందంగా ఉంది" అన్నారు. సినిమాని చూసి దర్శకుడు రాజమౌళి తనకు సందేశాన్ని, కథానాయకుడు మహేశ్ బాబు ఫోన్ చేసి అభినందనలు తెలిపారన్నారు అనిల్ రావిపూడి. నిర్మాత సాహు గారపాటి మాట్లాడుతూ "దర్శకుడు ఎప్పుడూ నవ్వుతూనే ఉంటాడు, అందుకే అందరినీ నవ్విస్తున్నాడు. ఈ సినిమాతో బాక్సాఫీస్ కాస్త బాస్ ఆఫీస్ అయ్యింది" అన్నారు. సుస్మిత కొణిదెల మాట్లాడుతూ "సినిమా ప్రారంభం సమయంలో నాన్న చెప్పినట్టుగానే ఈ విజయంతో నా పేరుని నిలబెట్టుకున్నా" అన్నారు. చిత్ర పరిశ్రమలో నా ప్రయాణం మొదలైన పాతికేళ్ల సందర్భంగా దక్కిన ఓ గొప్ప విజయమిదన్నారు సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో. ఈ కార్యక్రమంలో చిత్రబృందం పాల్గొంది.

నలుగురు మాట్లాడుతుంటే... నలభైమంది చూస్తున్నారు!


మారుతి

"పాన్ ఇండియా స్టార్ అయిన ప్రభాస్‌తో ఓ సాదాసీదా హారర్ కామెడీ చేయకూడదనే... ఫాంటసీ, సైకలాజికల్ అంశాల్ని జోడించి ఓ భారీ స్థాయి చిత్రం చేశాం. మా ప్రయత్నం ప్రేక్షకులకు నచ్చడంతోనే భారీస్థాయిలో వసూళ్లు వస్తున్నాయి. సెలవుల్లో ఈ సినిమాకి మరింత ఆదరణ దక్కుతుందని ఆశిస్తున్నాం" అన్నారు మారుతి. ఆయన దర్శకత్వంలో ప్రభాస్ కథానాయకుడిగా నటించిన చిత్రమే... 'ది రాజాసాబ్'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టి.జి.విశ్వప్రసాద్ నిర్మించారు. పాన్ ఇండియా స్థాయిలో ఇటీవలే విడుదలైన ఈ చిత్రం రూ.200 కోట్ల వసూళ్ల మైలురాయిని అధిగమించింది. ఈ సందర్భంగా దర్శకుడు మారుతి మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు.

'సంక్రాంతి సెలవులు ప్రారంభానికి ముందే ఈ చిత్రం భారీ వసూళ్లు సొంతం చేసుకుంది. ఈ పండగ సెలవుల్లో ఇంకా భారీ వసూళ్లు సాధిస్తుందని ఆశిస్తున్నాం. సైకలాజికల్ అంశాలతో ఓ కొత్త అంశాన్ని తెరపై చూపించాం. మేం అనుకున్న కాన్సెప్ట్ తొలిసారి చూసినప్పుడు కొంతమందికి సులువుగా అర్థం కాకపోవచ్చు. కానీ ఇప్పుడు వాళ్లే సినిమా చాలా బాగుందని సందేశాలు పంపిస్తున్నారు. 'మనం ఓ కొత్త ప్రయత్నం చేశాం, ప్రేక్షకులకు చేరువ కావడానికి కొంత సమయం పడుతుంది. నువ్వు ప్రశాంతంగా ఉండు' అని ప్రభాస్ ముందుగానే నాతో అన్నారు. ఆయన చెప్పినట్టే జరిగింది. ప్రభాస్ కొత్త గెటప్‌కి సంబంధించిన సన్నివేశాల్ని జోడించాక సన్నివేశాలన్నీ పక్కాగా కుదిరాయని అంటున్నారంతా. ప్రభాస్‌కి సందేశం పంపితే ఆయన కూడా అదే మాట చెప్పారు. ప్రభాస్‌ని కలర్‌ఫుల్ పాటలు, డ్యాన్సులతో తెరపై చూపించారని చాలామంది అభిమానులు చెప్పారు. పరిశ్రమ నుంచి కూడా నాకు చాలా మంది వ్యక్తిగతంగా ఫోన్ చేసి చెప్పారు".

● "ఫాంటసీతో కూడిన 'ది రాజాసాబ్' తరహా సినిమా చేయడం అంత సులువు కాదు. హిప్నాటిజం నేపథ్యాన్ని విజువల్‌గా చూపించడం చాలా కష్టం. ప్రభాస్ వృద్ధుడిగా కనిపిస్తూ, రివర్స్‌లో సాగే సన్నివేశాల కోసం చాలా కష్టపడ్డాం. కొన్ని సన్నివేశాల్ని ఎలా చేద్దామని ప్రభాస్ ఎంతగానో ఆలోచించి తన ఆలోచనల్నీ పంచుకుంటూ సినిమాలో నటించారు. ఇంత భారీగా వసూళ్లు వస్తున్నాయంటే ప్రభాస్‌ని ఓ కొత్త జానర్‌లో ప్రేక్షకులు స్వీకరించినట్టే కదా! అనుకున్న సమయానికి సినిమాని విడుదల చేయాలనే ఒత్తిడిలో, రాత్రింబవళ్లూ పనిచేయడంతో విడుదలకు ముందు కొంచెం అలిసిపోయినట్టు కనిపించా. కానీ సినిమా విడుదలైన రెండోరోజే మీడియా ముందుకొచ్చి మాట్లాడాను. ప్రతి సినిమాకీ సామాజిక మాధ్యమాల్లో ట్రోల్స్ వస్తుంటాయి. కానీ నేను మొదట్నుంచీ నమ్మకంగానే ఉన్నా. 'ది రాజాసాబ్' గురించి నలుగురు చెడుగా మాట్లాడితే, నలభై మంది థియేటర్‌కి వెళ్లి సినిమాని చూస్తున్నారు. ఆ తర్వాత సినిమా బాగుంది కదా అంటున్నారు. చిన్న చిన్న పట్టణాల్లో కూడా థియేటర్లు నిండిపోతున్నాయి".

● "ఒక పెద్ద స్టార్‌తో కూడా సినిమాని బాగా చేయగలనని 'ది రాజాసాబ్'తో నిరూపించుకున్నా. 'ప్రతి రోజూ పండగే' సినిమాని 40 రోజుల్లో రాసిన నేను, ఈ చిత్రంలో కొన్ని సన్నివేశాల కోసం రెండు నెలల సమయం తీసుకున్నా. విజువల్ ఎఫెక్ట్స్ విషయంలోనూ చాలా నేర్చుకున్నా. నాకు అన్ని రకాలుగా 'ది రాజాసాబ్' ఓ గొప్ప అనుభవాన్నిచ్చింది. ప్రస్తుతం నా ఆలోచనలనిండా ఈ సినిమానే ఉంది. అందుకే తదుపరి సినిమాపై ఇంకా ఎలాంటి నిర్ణయానికి రాలేదు. చిరంజీవికి అభిమానిని నేను. ఆయనతో సినిమా చేసే అవకాశం వస్తే మాత్రం అదెంతో ప్రత్యేకం అవుతుంది".

అప్పటి నుంచే నా అంతరాత్మ చెప్పిన దారిలో ప్రయాణం


తాప్సీ

తను చిత్రపరిశ్రమకు మరొకరికి స్ఫూర్తిగా ఉండటానికి రాలేదని అంటోంది బాలీవుడ్ కథానాయిక తాప్సీ. వైవిధ్యమైన పాత్రలతో ఆకట్టుకునే ఈ భామ తెరపై కనిపించక ఏడాది కావొస్తుంది. ఆ లోటును భర్తీ చేయడానికే ఈ సంవత్సరం వరుస సినిమాలతో అలరించడానికి సన్నద్ధమవుతోంది. ప్రస్తుతం 'గాంధారి', 'ఓ లడ్కీ హై కహాఁ' లాంటి చిత్రాలతో బిజీగా ఉన్న తాప్సీ.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొని కెరీర్ ఆరంభంలో ఎదురైన సవాళ్లు, రాబోయే ప్రాజెక్టుల గురించి ఆసక్తికర సంగతులను పంచుకొంది.

"ఎలాంటి సినీ నేపథ్యం లేకుండా చిత్రసీమలోకి వచ్చాను. బయటి వ్యక్తిగా అడుగుపెట్టిన నాకు ఈ వృత్తిలో ఎప్పుడూ సులభమైన దారి ఉండదని తెలుసు. కానీ ఎవరూ సాధించనిది మీరు కోరుకుంటే.. ఎవరూ చేయని పనిని చేయాల్సి ఉంటుంది. నా పని భవిష్యత్తు తరాల కోసమని నేను గుర్తుంచుకోవాలి. కాబట్టి నేను ఏది చేసినా.. నా జీవితంలోని ప్రతి దశలోనూ దానికి నేనే బాధ్యత వహించగలగాలి. చిత్రసీమలో ప్రతి ఒక్కరికీ ఒక ప్రత్యేక స్వరం, వ్యక్తిత్వం ఉంటుంది. అందుకే నేను నా ప్రత్యేకతను కనుగొనాలి. అదే శాశ్వతమైన ముద్ర వేయడానికి ఉత్తమ మార్గం".

నాలోని స్త్రీకి నచ్చితేనే...!

"పరాజయాలు.. మనోవేదనలు ఎదురైన తర్వాతే ఏ దారిలో నడవాలో తెలుసుకున్నా. నా మనసు పూర్తిగా ఏకీభవించిన చిత్రాల్లోనే నేను ఉత్తమంగా రాణించగలనని, ఆ కథలే ప్రేక్షకులకు బలంగా కనెక్ట్ అవుతాయని గ్రహించా. అందుకే నా అంతరాత్మ చెప్పినట్లుగా వింటాను. బ్యాంక్ బ్యాలెన్స్‌ను పెంచే ప్రాజెక్టులపై కాదు.. నాలోని నటనా సామర్థ్యాన్ని పెంచే వాటిపై దృష్టి పెడతాను. ఎవరూ నడవని కొత్త మార్గాల్లో అడుగులు వేయాలనుకుంటున్నా. నాలో ఉన్న స్త్రీకి నచ్చే చిత్రాలనే ఎంచుకుంటా. జీవితం పట్ల నా దృక్పథం చాలా వరకు ఒక మహిళా కోణం నుంచే ఉంటుంది".

ట్రెండ్ నాకు సెట్ కాదు

"కెరీర్ తొలినాళ్లలో 'మీరు ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే నువ్వు ఎంచుకున్న ప్రాజెక్టులే సరైనవ'ని చెప్పారు. కానీ వాటిలో చాలా వరకు వర్కవుట్ అవ్వలేదు. ఆ తర్వాత వేరే వాళ్ల మాటలు వినకుండా నేను ఓ చిత్రాన్ని అంగీకరించా. కొంతమంది ప్రకారం నాలాంటి నటీనటులు ఎంచుకునే ప్రాజెక్ట్ కాదు అది. కానీ ఆ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని, నా పాత్ర కూడా మంచి ప్రభావం చూపుతుందని నా మనసు చెప్పింది. అనుకున్నట్లే అది విజయవంతమైంది. నేను ట్రెండ్ గురించి పట్టించుకోకుండా కేవలం నా అంతరాత్మ చెప్పిన దానిపైనే ఆధారపడాలని అప్పుడే తెలుసుకున్నా. ఎందుకంటే ఈ ట్రెండ్ లాంటి పదాలు నాలాంటి వారికి సరిపోవనిపించింది".

వైఫల్యమే కోచ్

'నేను పరిశ్రమకు వచ్చి దాదాపు రెండు దశాబ్దాలు కావొస్తుంది. ఇక నాకు ఎలాంటి సవాళ్లు ఎదురుకావు అనుకుంటున్నారేమో! కానీ కెరీర్‌లోని ప్రతి దశ.. అధిగమించాల్సిన కొత్త అడ్డంకులను తీసుకొస్తూనే ఉంటుంది.. ప్రారంభంలో ఎవరి మద్దతు లేకుండా ఒక రంగంలోకి అడుగుపెట్టడమే ఓ సవాలు. ఇక్కడ కిందపడతారు.. తప్పులు చేస్తారు.. అయినా మీరే మిమ్మల్ని పైకి లేపుకోవాలి. వైఫల్యాన్ని మీ కోచ్‌గా భావించాలి. ఇదంతా చాలా కాలం పాటు సాగే ప్రక్రియ. దీనిని పరిమిత పదాలతో ఎప్పటికీ నిర్వచించలేము".

నిర్భయ ఘటన నేపథ్యంతో


డాన్ వోల్మన్

నిర్భయ అత్యాచార ఘటన నేపథ్యంతో 'మర్డర్స్ టూ క్లోజ్, లవ్ టూ ఫార్' అనే సినిమా రూపొందింది. దీన్ని ఇజ్రాయెల్ దర్శకుడు డాన్ వోల్మన్ తెరకెక్కించారు. భారత్- ఇజ్రాయెల్ నిర్మాణ సంస్థలు సంయుక్తంగా నిర్మించి ఈ తొలి చిత్రమిది. దీన్ని పుణె ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శించనున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు డాన్ వోల్మన్ మాట్లాడుతూ.. "2012 డిసెంబరు 28న జరిగిన 'దిల్లీ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్'కు నేను హాజరయ్యా. అంతకముందు దిల్లీలో నిర్భయ ఘటన చోటుచేసుకుంది. ఆ తర్వాత మహిళలు చేపట్టిన నిరసనలను నేను ప్రత్యక్షంగా చూశా. అప్పుడే 'మర్డర్ టూ క్లోజ్, లవ్ టూ ఫార్' ఆలోచన వచ్చింది. నా స్నేహితురాలు మంజు బోరాతో నా మనసులోని మాటను పంచుకున్నా. ఈ సినిమా నిర్మించడంతో పాటు నాతో కలిసి దర్శకత్వం వహించేందుకు ఆమె అంగీకరించారు" అని తెలిపారు. సిద్ధార్థ్ నిపోన్ గోస్వామి, షామిన్ మన్నన్ తదితరులు ఈ సినిమాలో నటించారు.

వేసవికి అమ్మాయి.. అబ్బాయి వస్తున్నారు


రషా థడానీ

నటి రవీనా టాండన్ కుమార్తెగా గతేడాది 'ఆజాద్' సినిమాతో వెండితెరకు పరిచయమయ్యింది యువకథానాయిక రషా థడానీ. త్వరలో 'శ్రీనివాస మంగాపురం' సినిమాతో తెలుగు ప్రేక్షకుల్ని పలకరించడానికి ముస్తాబవుతోన్న ఈ భామ ఖాతాలో 'లైకే లైకా' అనే సినిమా ఉన్న సంగతి తెలిసిందే. భోజ్‌పురిలో లైకే అంటే అమ్మాయి.. లైకా అంటే అబ్బాయని అర్థం. ఆమె.. 'ముంజ్యా' ఫేమ్ అభయ్ వర్మ జంటగా నటిస్తున్న చిత్రమిది. సౌరభ్ గుప్తా దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమాను వేసవిలో థియేటర్లలోకి తీసుకొస్తున్నట్లు తెలుపుతూ.. సామాజిక మాధ్యమాల వేదికగా ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది చిత్ర బృందం. "ప్రేమను సంపాదించుకోండి" అనే వ్యాఖ్యను జోడించింది. దీన్ని కొత్తతరం యాక్షన్ రొమాంటిక్ కామెడీ చిత్రంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలుస్తోంది. మరి ఈ అమ్మాయి, అబ్బాయిల ప్రేమ కబుర్లేంటో తెలుసుకోవాలంటే ఇంకొన్ని రోజులు వేచి చూడాల్సిందే.

భారతదేశానికి ఏదీ అసాధ్యం కాదు


'స్పేస్ జెన్: చంద్రయాన్'

భారతీయులందరూ తలెత్తుకునేలా చేసిన ఇస్రో ప్రయోగాల వెనుక ఉన్న కృషిని, శాస్త్రవేత్తల పట్టుదలను చూపించేందుకు సిద్ధమైన సిరీస్ 'స్పేస్ జెన్: చంద్రయాన్'. అనంత్ సింగ్ దర్శకత్వం వహించారు. టీవీఎఫ్ నిర్మాణ సంస్థ రూపొందించిన ఈ సిరీస్‌లో నకుల్ మెహతా, శ్రియా శరణ్ ప్రధాన పాత్రలు పోషించారు. ఈ సిరీస్ ఈ నెల 23న జియోహాట్‌స్టార్ వేదికగా ప్రేక్షకుల్ని అలరించడానికి సిద్ధమైంది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఈ సిరీస్ ట్రైలర్‌ను ఇన్‌స్టా వేదికగా విడుదల చేసింది ఓటీటీ సంస్థ. "చంద్రునిపైకి ప్రయాణం అంత సులభం కాదు.. కానీ భారతదేశానికి ఏదీ అసాధ్యం కాదు" అనే వ్యాఖ్యను జోడించింది. చంద్రయాన్ మిషన్‌పై తెరవెనుక జరిగిన విషయాల్ని కళ్లకు కట్టినట్లు చూపిస్తూ సాగుతున్న ఈ ట్రైలర్ సినీప్రియుల్ని ఆకట్టుకుంటోంది. డానిష్ సైత్, గోపాల్ దత్ తదితరులు కీలక పాత్రలు పోషించారు.



క్రమం తప్పని అభ్యాసంతో జవాబు సాధన తేలిక

వర్ణమాల పరీక్ష

పోటీపరీక్షల్లో రీజనింగ్ విభాగంలో ముఖ్యమైన వాటిలో వర్ణమాల పరీక్ష ఒక అంశం. ఇందులో ఆంగ్ల అక్షరమాల క్రమంపై ప్రశ్నలు అడుగుతుంటారు. ఒక పదం ఇచ్చి దాని నుంచి ఏర్పడే, ఏర్పడని పదాలు, శ్రేణిలో అక్షర సముదాయాలు, అక్షర జతలు తదితరాలపై ప్రశ్నలు సంధిస్తుంటారు. ఆంగ్ల వర్ణమాలలోని అక్షరాల సంఖ్య, ముందు నుంచి వెనక్కి, వెనక నుంచి ముందుకు వాటి సంఖ్యలు తెలిసి ఉండాలి. కొన్నిసార్లు పదాల్లోని అక్షరాలను గజిబిజి క్రమంలో ఇచ్చి వాటిని సరైన క్రమంలో అమర్చమంటారు. దీనికోసం అభ్యర్థికి పదసంపదపై పట్టు ఉండాలి. నిత్య విద్యార్థులు ఈ రకమైన ప్రశ్నలకు సులువుగా సమాధానాలు కనుక్కోగలరు.

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
రీజనింగ్

మాదిరి ప్రశ్నలు

1. DEMOCRACY అనే పదంలోని అక్షరాలను ఉపయోగించి ఐచ్ఛికాల్లోని ఏ పదాన్ని ఏర్పర్చవచ్చు?

1) MICRO 2) DEMON
3) SECRECY 4) MARCY

సాధన: DEMOCRACY పదంలోని అక్షరాలను ఉపయోగించి MARCY అనే పదాన్ని ఏర్పర్చవచ్చు.

సమాధానం: 4

2. కింది శ్రేణిలో G మధ్యలో ఉంటూ K, N లేదా N, K దానికి రెండు వైపులా పక్కనే ఉండేలా ఎన్ని అక్షర సముదాయాలు వస్తాయి?

AKGLMNDQKGCSNGKTGKGNDZPUXGKE

1) 1 2) 3 3) 2 4) 5

సాధన: AKGLMNDQKGCS**NGK**TG**KGN**DZPUXGKE

NGK, KGN అనే రెండు అక్షర సముదాయాలు ఉన్నాయి

సమాధానం: 3

3. SPARKLE అనే పదంలో, ఆంగ్ల వర్ణమాల శ్రేణిలో ఉన్నట్లుగా ఎన్ని అక్షర జతలు అదే సంఖ్యలో అక్షరాలను కలిగి ఉన్నాయి? (ముందుకు, వెనక్కి రెండు దిశలను పరిగణనలోకి తీసుకోగా)

1) 2 2) 3
3) 1 4) మూడు కంటే ఎక్కువ

సాధన: S P A R K L E నాలుగు జతల అక్షరాలు PR, AE, KL, LP

సమాధానం: 4

4. PRODUCE అనే పదంలో, ఆంగ్ల వర్ణమాల శ్రేణిలో ఉన్నట్లుగా ఎన్ని అక్షర జతలు అదే సంఖ్యలో అక్షరాలను కలిగి ఉన్నాయి? (ముందుకు, వెనక్కి రెండు దిశలను పరిగణనలోకి తీసుకోగా)

1) 1 2) 2 3) 4 4) 3

సాధన: P R O D U C E

ఒకే ఒక అక్షర జత RU ఉంది.

సమాధానం: 1

5. STREAMING అనే పదంలో, ఆంగ్ల వర్ణమాల శ్రేణిలో ఉన్నట్లుగా ఎన్ని అక్షర జతలు అదే సంఖ్యలో అక్షరాలను కలిగి ఉన్నాయి? (ముందుకు, వెనక్కి రెండు దిశలను పరిగణనలోకి తీసుకోగా)

1) 2 2) 3 3) 1 4) ఏదీకాదు

సాధన: S T R E A M I N G వచ్చే జతలు: ST, NT, GI

సమాధానం: 2

సూచన (ప్ర.6 – 7): దిగువ ఇచ్చిన పదాల్లోని అక్షరాలను ఉపయోగించి ఏర్పర్చలేని పదాన్ని గుర్తించండి.

6. INCARCERATION

1) TERRAN 2) INACTION
3) CREATION 4) RELATION

సాధన: మొదటి మూడు ఐచ్ఛికాల్లోని పదాలు ఏర్పర్చవచ్చు. కానీ RELATION పదం ఏర్పడదు, కారణం దీనిలోని L అనే అక్షరం ప్రశ్నలో ఇచ్చిన పదంలో లేదు.

సమాధానం: 4

7. DISTRIBUTION

1) SITUATION 2) DISTURB
3) TUTION 4) TRUST

సాధన: ఇచ్చిన పదంలో అక్షరం A లేదు. కాబట్టి ఐచ్ఛికాల్లోని SITUATION అనే పదం ఏర్పడదు

సమాధానం: 1

సూచన (ప్ర.8 – 9): దిగువ ఇచ్చిన పదాలను, నిఘంటువులో వాటి క్రమం ప్రకారం అమర్చండి.

8. i. Consume ii. Consciousness
iii. Conscience iv. Conservation
v. Consequence

1) iii, i, ii, v, iv 2) iii, ii, v, iv, i
3) iii, ii, i, v, iv 4) iii, v, ii, iv, i

సాధన: పదాలను నిఘంటువులో వాటి క్రమం ప్రకారం అమర్చితే వచ్చే క్రమం

Conscience → Consciousness → Consequence - Conservation → Consume

సమాధానం: 2

9. i. Convince ii. Converge
iii. Convenience iv. Convalesce
v. Converse

1) i, iv, iii, ii, v 2) iv, iii, ii, v, i
3) iv, ii, v, iii, i 4) iv, iii, ii, i, v

సాధన: పదాలను నిఘంటువులో వాటి క్రమం ప్రకారం అమర్చితే వచ్చే క్రమం

Convalesce → Convenience → Converge → Converse → Convince

సమాధానం: 2

10. దిగువ ఐచ్ఛికాల్లోని అక్షరాలను సరిగ్గా అమర్చితే అర్థవంతమైన పదాలు వస్తాయి. వాటిని గమనించి అందులో భిన్నమైనదాన్ని కనుక్కోండి.

1) UMRSME 2) RIWNTE
3) LCUOD 4) PIGRSN

సాధన: అక్షరాలను సరైన క్రమంలో అమర్చితే వచ్చే అర్థవంతమైన పదాలు వరుసగా

SUMMER, WINTER, CLOUD, SPRING

ఇందులో CLOUD తప్ప మిగతావన్నీ కాలాల పేర్లు.

సమాధానం: 3

11. REASONING అనే పదంలోని మొదటి, రెండు, నాలుగు, అయిదు, ఆరో అక్షరాలను ఎంచుకొని మరో పదాన్ని రాయండి. ఆపై ఏర్పడిన పదంలోని మొదటి, చివరి అక్షరాలు ఏవి?

1) ES 2) SE 3) NE 4) OR

సాధన: REASONING అనే పదంలో 1, 2, 4, 5, 6 అక్షరాలు వరుసగా R, E, S, O, N.

ఈ అక్షరాలను ఉపయోగించి ఏర్పర్చగల పదం SNORE.

దీనిలో చివరి అక్షరాలు = SE

సమాధానం: 2

12. ఒక్కో పదంలో ఒక్కో అక్షరాన్ని ఒకసారి మాత్రమే ఉపయోగిస్తూ TRADEMARK అనే పదంలోని 1, 3, 5, 6 అక్షరాలను వినియోగిస్తూ ఎన్ని అర్థవంతమైన పదాలను ఏర్పర్చవచ్చు?

1) 3 2) 2 3) 1 4) 4

సాధన: TRADEMARK ⇒ T, A, E, M ⇒ TEAM, TAME, MEAT, MATE

నాలుగు పదాలను ఏర్పర్చవచ్చు.

సమాధానం: 4



రచయిత
బూసర గణేష్,
విషయ నిపుణులు

891 Word of the Day

Overshadow

Telugu meaning: కప్పివేయు, మరుగుపరచు

English meaning: The word overshadow (ఓవర్‌షాడో) is a verb that means to appear more important or powerful than something else, thereby reducing its significance.

Synonyms: Dominate, Eclipse ; ***Antonyms:*** Emphasize, Enhance

Usage: 1. The success of the final product overshadowed the numerous challenges faced during its development.

2. Personal conflicts should not overshadow professional responsibilities in a disciplined workplace.

కరెంట్ అఫైర్స్



భారత్‌లో రెండు రోజుల పర్యటన కోసం వచ్చిన జర్మనీ ఛాన్స్‌లర్ ఫ్రెడ్రిక్ మెర్జ్ 2026, జనవరి 12న ప్రధాని నరేంద్ర మోదీతో అహ్మదాబాద్‌లో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఇద్దరూ సబర్మతి ఆశ్రమాన్ని సందర్శించి, మహాత్ముడికి నివాళులర్పించారు. అనంతరం అంతర్జాతీయ పతంగుల పండగ-2026ను మోదీ ప్రారంభించారు.

☛ రక్షణ, భద్రత, వాణిజ్యం, విలువైన ఖనిజాలు, సెమీ కండక్టర్లు, శాస్త్ర-సాంకేతిక రంగాలు, విద్య, నైపుణ్యం, పరిశోధన రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకోవాలని ఇద్దరు నేతలూ నిర్ణయించుకున్నారు. ఈ మేరకు రెండు దేశాల మధ్య 19 ఒప్పందాలపై సంతకాలు జరిగాయి.



సైనికులు మోసుకెళ్లగల ట్యాంకు విధ్వంసక క్షిపణికి సంబంధించిన కొత్త వెర్షన్‌ను రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) విజయవంతంగా పరీక్షించింది. మహారాష్ట్రలోని అహల్యానగర్‌లో ఉన్న ఫైరింగ్ రేంజ్‌లో ఈ పరీక్ష జరిగింది. కదులుతున్న ఒక లక్ష్యంపైకి దీన్ని ప్రయోగించి చూసినట్లు రక్షణశాఖ తెలిపింది. అలాగే ట్యాంకు పైభాగాన్ని లక్ష్యంగా చేసుకోగల సామర్థ్యాన్నీ పరీక్షించినట్లు వివరించింది.



ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో జీడీపీ వృద్ధి 7.4%, వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27)లో 7 శాతంగా నమోదుకావొచ్చని ఫిచ్ గ్రూప్ కంపెనీ బీఎంఐ అంచనా వేసింది. సానుకూల విధాన నిర్ణయాలు భారత్‌కు అండగా నిలవచ్చని పేర్కొంది. ద్రవ్య పరపతి నిర్ణయాలు, నియంత్రణపరమైన చర్యలు పెట్టుబడులకు, వినియోగం పెంచేందుకు దోహదపడతాయని తెలిపింది.

భారత సంతతికి చెందిన అమెరికన్ ఖగోళ శాస్త్రవేత్త శ్రీనివాస్ కులకర్ణికి బ్రిటిష్ రాయల్ ఆస్ట్రనామికల్ సొసైటీ (ఆర్ఏఎస్) స్వర్ణ పతకాన్ని ప్రదానం చేసింది. ఆర్ఏఎస్ 1824 నుంచి ఏటా బహూకరిస్తున్న స్వర్ణ పతకాలను పొందినవారిలో ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, ఎడ్విన్ హబుల్, స్టీఫెన్ హాకింగ్ లాంటి జగద్విఖ్యాత శాస్త్రవేత్తలు ఉన్నారు. కులకర్ణి మహారాష్ట్రలో జన్మించారు. ఐఐటీ-దిల్లీలో చదువుకున్నారు. అమెరికాలోని కాలిఫోర్నియా-బెర్కిలీ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ చేశారు.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - ఇండియన్ జాగ్రఫీ

పట్టణీకరణ

ప్రజలు గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వలస వెళ్లడాన్ని పట్టణీకరణ అంటారు. ప్రతిసారీ గ్రామీణ ప్రాంతాల నుంచి వలస వచ్చిన ప్రజల వల్లే పట్టణం అనేది ఏర్పడకపోవచ్చు. కొన్నిసార్లు ఉద్దేశపూర్వకంగా లేదా సహజంగా మానవ నివాసాల సాంద్రత పెరగడం వల్ల కూడా ఇవి ఏర్పడతాయి.

పట్టణీకరణ


నగరీకరణ లేదా పట్టణీకరణ అనే పదాన్ని స్పానిష్ దేశానికి చెందిన సివిల్ ఇంజినీర్ ఇల్‌డెఫాన్స్ సెర్డా (Ildefons Cerda) 1867లో తాను రచించిన General Theory of Urbanizationలో ఉపయోగించారు.

పట్టణీకరణ – కారణాలు

అన్ని రకాల భౌగోళిక ప్రాంతాల మాదిరిగా కాకుండా పట్టణ కేంద్రం అనేది సహజంగానో లేదా ఉద్దేశపూర్వకంగానో అభివృద్ధి చెందుతుంది.

▌ పట్టణ ప్రక్రియ అనేది ఆధునికీకరణ, వాణిజ్యీకరణ, పారిశ్రామికీకరణ, గ్రామీణ పట్టణ పరివర్తన లాంటి అనేక సామాజిక, ఆర్థిక కారకాలపై ఆధారపడి ఉంటుంది. పట్టణీకరణకు ఈ కారకాల వెనక చోదకశక్తులుగా పనిచేసే అనేక పుష్- పుల్ కారకాలు ఉంటాయి.

▌ రాజకీయ, పరిపాలన, సైనిక ప్రధాన కార్యాలయాలైన నగరాలను 'రాజధాని' అని పిలుస్తారు. ఒక మిలియన్ కంటే ఎక్కువ జనాభా ఉంటే వాటిని మెట్రోపాలిస్ లేదా మెట్రోపాలిటన్ నగరాలుగా పిలుస్తారు.



పట్టణీకరణ - సానుకూల, ప్రతికూల ప్రభావాలు; పట్టణీకరణ - విధానం, లక్ష్యాలు; స్మార్ట్ సిటీస్ మిషన్‌లోని మౌలికాంశాలు; స్మార్ట్ అనువర్తనాలు - ఉదాహరణలు మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్ 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..

స్టడీ జోన్

భారత వాతావరణ శాఖ (ఐఎండీ)

సువిశాల భూభాగం ఉన్న భారతదేశం విభిన్న వాతావరణ పరిస్థితులతోపాటు వేర్వేరు శీతోష్ణస్థితి ప్రాంతాలను కలిగి ఉంది. తీవ్రమైన ఎండలు, అధిక చలి, కుండపోత వర్షాలు, కరవు ఛాయలు లాంటివన్నీ దేశంలో కనిపిస్తుంటాయి. ఇక్కడి ప్రజలకు వ్యవసాయమే మూలాధారం కాగా, అది వాతావరణ పరిస్థితులపై ఆధారపడి సాగుతుంది. భారతదేశ వాతావరణ సమాచారాన్ని భారత వాతావరణ శాఖ (ఇండియన్ మెటియోరాలాజికల్ డిపార్ట్‌మెంట్ - ఐఎండీ) అధ్యయనం చేస్తుంది. భారత్‌లో వాతావరణం, శీతోష్ణస్థితిని అధ్యయనం చేసేందుకు బ్రిటిష్‌వారు కోల్‌కత్తా (1785), మద్రాస్ (1796), బొంబాయి (1804)లో కేంద్రాలు నెలకొల్పారు. ఇది మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ అధీనంలో పనిచేస్తుంది. పోటీపరీక్షల నేపథ్యంలో దీని గురించి ముఖ్య విషయాలు తెలుసుకుందాం..!



చారిత్రక నేపథ్యం

☛ భారతదేశంలో ప్రాచీన కాలం నుంచే వాతావరణశాస్త్రంపై అధ్యయనం జరిగింది. మన పురాణాలు, ఉపనిషత్తుల్లో మేఘాల ఏర్పడటం, వర్షం కురవడం, సూర్యుడి చుట్టూ భూమి తిరగడం వల్ల వచ్చే కాలానుగుణ చక్రాలు మొదలైన సమాచారం ఉంది. క్రీ.శ.500 కాలంలో వరాహమిహిరుడు రచించిన 'బృహత్ సంహిత' గ్రంథంలో నాటి వాతావరణ ప్రక్రియల గురించి ఉంది.

☛ కౌటిల్యుడి అర్థశాస్త్రంలోనూ వర్షపాతం శాస్త్రీయ కొలతల గురించి పేర్కొన్నారు. క్రీ.శ. అయిదో శతాబ్దంలో కాళిదాసు రచించిన 'మేఘదూత' కావ్యంలో మధ్య భారతదేశంలోకి రుతుపవనాలు ప్రవేశించే తేదీని ప్రస్తావించారు. రుతుపవన మేఘాల మార్గాన్ని వివరించారు.

☛ 1636లో బ్రిటిష్ శాస్త్రవేత్త ఎడ్మండ్ హేలీ భారతదేశ రుతుపవనాలపై ఒక గ్రంథాన్ని ప్రచురించారు.

ఐఎండీ ఏర్పాటు, ఈ అంశంపై గతంలో అడిగిన ప్రశ్నలు - జవాబుల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Senior Resident Posts

The Employees' State Insurance Corporation (ESIC), Guwahati, is conducting interviews to fill Senior Resident posts in various departments on a contract basis. The total no. of posts is 49. Eligible candidates can appear for the interview on 20 January 2026.

Microwave Rigger Posts

Telecommunications Consultants India Limited (TCIL) is inviting applications for the Microwave Rigger and Translator posts on a contract basis. Total number of posts is 34. The last date for submission of online applications is 23 January 2026.

Graduate Engineer Trainee Posts

National Aluminium Company Limited (NALCO) has released a recruitment notification for the engagement of Graduate Engineer Trainees (GETs) through GATE-2025. The total no. of posts is 110. The application fee is Rs.500. Eligible candidates can apply online before 22 January 2026.

Did You Apply..?

Today (January 14) is the last date for the following Jobs

☛ 28 Sports Officer jobs at IIT Jammu. ***Eligibility:*** Diploma/Degree/PG.

☛ Project Staff posts in CSIR-CEERI. ***Eligibility:*** Diploma, BE/B.Tech, or M.Sc.

☛ Associate Jobs at IIIT Pune. ***Eligibility:*** BE/B.Tech/ME/M.Tech/PhD.

For more information and other notifications - scan QR code

Bank Exams

English

Fillers

Directions (Qs. 1 - 17): *Here, a sentence is given with one or two blank spaces, indicating that those words have been omitted from it. Select the word/words that fit in the blank(s), thereby making the sentence meaningful and grammatically correct.*

1. The recent policy announcement was aimed at .... investor confidence amid global economic uncertainty.
A) restoring B) shaking
C) ignoring D) weakening
E) disturbing

2. Banks are increasingly focusing on digital platforms to improve customer .... and operational efficiency.
A) confusion B) engagement
C) resistance D) hesitation
E) negligence

3. The auditor highlighted several .... in the internal control system of the organization.
A) strengths B) merits
C) loopholes D) benefits
E) advantages

4. Rising inflation continues to .... the purchasing power of salaried individuals.
A) enhance B) stabilize
C) strengthen D) erode
E) expand

5. The bank's decision to lower lending rates was widely .... by small business owners.
A) criticized B) ignored
C) opposed D) rejected
E) welcomed

6. Strict compliance with regulatory norms is essential to maintain the .... of the financial system.
A) fragility B) instability
C) uncertainty D) credibility
E) imbalance

7. The sudden resignation of the CEO came as a .... to both employees and investors.
A) shock B) relief
C) routine D) formality
E) advantage

8. The committee emphasized the need for .... lending practices to prevent future financial crises.
A) reckless B) unethical
C) arbitrary D) careless
E) prudent

9. The government's initiative seeks to .... financial inclusion in remote and underserved regions.
A) restrict B) undermine
C) promote D) delay
E) discourage

10. The rise of non-performing assets has become a major .... for the banking sector.
A) achievement B) concern
C) reward D) incentive
E) advantage

11. The customer grievance was addressed promptly to avoid further .... of the issue.
A) escalation B) simplification
C) resolution D) reduction
E) clarity

12. The merger is expected to .... the bank's market presence and capital base.
A) dilute B) weaken
C) diminish D) strengthen
E) shrink

13. Transparent communication plays a vital role in .... trust between banks and customers.
A) damaging B) eroding
C) questioning D) breaking
E) building

14. The financial literacy campaign aims to make customers more .... of banking products and risks.
A) ignorant B) conscious
C) unaware D) careless
E) doubtful

15. The regulator issued fresh guidelines to .... misuse of digital payment platforms.
A) encourage B) permit C) prevent
D) support E) justify

16. To improve asset quality, banks are required to ...... credit appraisal mechanisms and ...... risky lending practices.
A) strengthen, curb
B) weaken, promote
C) ignore, expand
D) delay, encourage
E) dilute, support

17. The central bank intervened to .... market volatility and .... liquidity in the financial system.
A) increase, withdraw
B) stabilize, inject
C) worsen, restrict
D) ignore, remove
E) magnify, reduce

Scan the QR code for Key

Writer: P. Manoj Kumar, Subject Expert

కరెంట్ అఫైర్స్



✦ బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) నూతన డైరెక్టర్ జనరల్‌గా ఇటీవల ఎవరు బాధ్యతలు స్వీకరించారు? **జ:** సంజయ్ గార్గ్

✦ 'ఇంటర్నేషనల్ డే ఫర్ ప్రివెంటింగ్ ది ఎక్స్‌ప్లాయిటేషన్ ఆఫ్ ది ఎన్విరాన్‌మెంట్ ఇన్ వార్ అండ్ ఆర్మ్‌డ్ కాన్‌ఫ్లిక్ట్' (యుద్ధం, సాయుధ సంఘర్షణలో పర్యావరణ దోపిడీని నిరోధించే అంతర్జాతీయ దినోత్సవం)ను ఏ రోజున నిర్వహిస్తారు? **జ:** నవంబరు 6

మాదిరి ప్రశ్నలు

✦ భారత్‌లోని ఏ విమానాశ్రయం ప్రపంచంలోనే పూర్తిగా సౌరశక్తితో నడిచే మొదటి విమానాశ్రయంగా ఘనత సాధించింది? **జ:** కొచ్చిన్ అంతర్జాతీయ విమానాశ్రయం (46,000 సౌరఫలకాలను కలిగి ఉన్న 12 మెగావాట్ల భారీ సౌరవిద్యుత్తు ప్లాంట్‌ను విమానాశ్రయంలో ఏర్పాటు చేశారు.)

✦ 2025లో ఆసియాలో అత్యంత సంతోషకరమైన నగరాల్లో ఏ భారత నగరం అగ్రస్థానంలో నిలిచింది? (రెండు, మూడు స్థానాల్లో వరుసగా బీజింగ్, షాంఘైలు నిలిచాయి.) **జ:** ముంబయి

✦ 100 బిలియన్ డాలర్ల మార్కెట్ క్యాపిటలైజేషన్‌ను దాటిన మొదటి ప్రభుత్వరంగ బ్యాంకుగా ఇటీవల ఏ బ్యాంకు ఘనత సాధించింది? (దీంతో పాటు రూ.100 ట్రిలియన్‌ల మొత్తం వ్యాపారాన్ని దాటిన మొదటి భారతీయ బ్యాంక్‌గా కూడా వార్తల్లో నిలిచింది.) **జ:** స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా

మరింత సమాచారం

SENIOR INTER Zoology

Breathing And Exchange Of Gases



1. What is the effect of pCO_2 on oxygen transport?

A: The effect of pCO_2 And H^+ concentration on the oxygen affinity of haemoglobin is called Bohr effect. (A rise in pCO, and fall in pH decreases the affinity of haemoglobin for oxygen).

2. What is Tidal volume? Find out the Tidal volume (approximate value) in a healthy human in an hour? **2 Marks**

A: Volume of air inspired or expired during normal inspiration or expiration. It is approximately 500 ml. A healthy man can inhale or exhale approximately per hour is 3,60,000-4,80,000 ml.

Final Exams-2026 IMPORTANT Q & A

3. What are conchae?

A: Conchae are three thin, twisted bony plates present in the respiratory part of nasal chambers. There are a pair also called Turbinals.

1. Explain the process of inspiration and expiration under normal conditions. **4 Marks**

A: Inspiration: Intake of atmospheric air into the lungs is called inspiration. It is an active process, as it takes place by the contraction of the muscles of the diaphragm and the external intercostal muscles, which extend in between the ribs. The contraction of the diaphragm (phrenic muscles) increases the volume of the thoracic chamber in the anteroposterior axis. The contraction of external intercostal muscles lifts up the ribs and sternum, causing an increase in the volume of the thoracic chamber in the dorso-ventral axis. The overall increase in the thoracic volume causes a similar increase in the 'pulmonary volume'. An increase in the pulmonary volume decreases the intra - pulmonary pressure to less than that of the atmosphere, which forces the air from the outside to move into the lungs, i.e., inspiration.

Expiration: Release of alveolar air to the exterior is called expiration. It is a passive process. Relaxation of the diaphragm and the external intercostal muscles returns the diaphragm and sternum to their normal positions, and reduces the thoracic volume and thereby the pulmonary volume. This leads to an increase in the intra - pulmonary pressure to slightly above that of the atmospheric pressure, causing the expulsion of air from the lungs, i.e., expiration.

For more IMP Q & A



Writer: Ravi Charan Kanti

6 తలాలు.. 12 అంచులు!



ఇంట్లోని గదులు, చదువుకునే పుస్తకాలు, అగ్గిపెట్టెలు, సబ్బులు తదితరాలన్నీ పొడవు, వెడల్పు, ఎత్తు అనే మూడు రకాల కొలతలను కలిగి ఉంటాయి. కొంత స్థల పరిమాణాన్ని ఆక్రమించి ఉంటాయి. వీటిని గణితంలో ఘనరూపాలుగా పేర్కొంటారు. ఘనాల ఉపరితల వైశాల్యం, ఘనపరిమాణాలను అర్థం చేసుకుంటే వాస్తవ ప్రపంచంలో వస్తువుల సామర్థ్యాలను గుర్తించవచ్చు. అంటే ఒక పెట్టెలో ఎన్ని వస్తువులు పడతాయో, గదికి రంగులు వేయాలంటే ఎంత రంగు అవసరమవుతుందో లెక్కించవచ్చు. ఘనం, దీర్ఘఘనం అనేవి ప్రాథమిక త్రిమితీయ ఆకారాలు. ఆరు దీర్ఘచతురస్రాకార తలాలతో నిర్మితమైంది దీర్ఘఘనం. పొడవు, వెడల్పు, ఎత్తులు సమానంగా ఉంటే దానిని ఘనం అంటారు. ఇందులో ఆరు తలాలు చతురస్రాకారంలో ఉంటాయి. ఈ అధ్యాయంపై పట్టు పెంచుకోవాలంటే శీర్షాలు, అంచులు, తలాలపై స్పష్టమైన అవగాహన పెంపొందించుకోవాలి. సంబంధిత సూత్రాలను కంఠస్థం చేయాలి.


క్షేత్రగణితం 3D

(ఘనం – దీర్ఘఘనం)

ఘనం, దీర్ఘఘనం అనేవి రోజువారీ జీవితంలో కనిపించే త్రిపరిమాణ (త్రీడీ) ఘనాకృతులు. ఒక గది పొడవు, వెడల్పు, ఎత్తులు ఆధారంగా నేల వైశాల్యాలు, నాలుగు గోడల వైశాల్యాలు, గది ఘనపరి మాణం కనుక్కోవాలంటే ఈ 3D ఆకారాలు, వాటి లక్షణాలు, వైశాల్యాల ఘన పరిమాణ సూత్రాల గురించి తెలుసుకోవాలి.

ఉదా: గది నాలుగు గోడలు, పాచికలు త్రిమితీయ ఆకారాల కిందకే వస్తాయి.

ఘనం



తలాలు = 6

శీర్షాలు = 8, అంచులు = 12

అన్ని తలాలు చతురస్రాలుగా ఉన్న త్రిమితీయ ఆకారాన్ని 'ఘనం (పట్టకం)' అంటారు.


⇒ ఘనం యొక్క భుజం 'a' అయితే....

1) పక్కతల వైశాల్యం = $4a^2$

2) సంపూర్ణతల వైశాల్యం = $6a^2$

3) ఘనపరిమాణం = a^3 4) కర్ణం = $a\sqrt{3}$

దీర్ఘఘనం



శీర్షాలు = 8

తలాలు = 6

అంచులు = 12

అన్ని తలాలు దీర్ఘచతురస్రాలుగా ఉన్న త్రిమితీయ ఆకారాన్ని (పట్టకం) 'దీర్ఘఘనం' అంటారు.

జనరల్ స్టడీస్ అరిథ్‌మెటిక్

⇒ దీర్ఘఘనం పొడవు l, వెడల్పు b, ఎత్తు h అయితే

1) పక్కతల వైశాల్యం = $2(l + b)h$

2) సంపూర్ణతల వైశాల్యం = $2(lb + bh + hl)$

3) ఘనపరిమాణం = lbh

4) కర్ణం = $\sqrt{l^2 + b^2 + h^2}$

5) ఆసన్న తలాల వైశాల్యాల లబ్ధం = $(lbh)^2 = v^2$



నోట్: పైతలం, భూతలం వైశాల్యాలు = lb, lb

ఎడమ, కుడి తలాల వైశాల్యాలు = bh, bh

ముందు, వెనుక తలాల వైశాల్యాలు = hl, hl

మాదిరి ప్రశ్నలు

1. ఒక ఘనం యొక్క పక్కతల వైశాల్యం 64 మీ.^{2} అయితే దాని ఘనపరిమాణం ఎంత?

1) 96 మీ.^{3} 2) 64 మీ.^{3}

3) 48 మీ.^{3} 4) 216 మీ.^{3}

వివరణ: ఘనం పక్కతల వైశాల్యం = 64 మీ.^{2}

$4a^2 = 64 \Rightarrow a^2 = 16 \Rightarrow a = 4$

ఘనం ఘనపరిమాణం (V) = a^3

$V = 4^3 = 64$ మీ.^{3} **జ: 2**

2. ఒక ఘనం కర్ణం $8\sqrt{3}$ సెం.మీ. అయితే దాని అంచుల మొత్తం పొడవు ఎంత?


1) 96 సెం.మీ. 2) 64 సెం.మీ.

3) 164 సెం.మీ. 4) 196 సెం.మీ.

వివరణ: ఘనం కర్ణం $a\sqrt{3} = 8\sqrt{3}$ సెం.మీ.

అంచు a = 8 సెం.మీ.

ఘనం యొక్క అంచుల మొత్తం పొడవు = 12a = 12 × 8 = 96 సెం.మీ. **జ: 1**




3. ఒక ఘనం భుజం పొడవును 30% పెంచితే, దాని ఘనపరిమాణంలో మార్పు శాతం ఎంత?

1) 190.8%

2) 119.7%

3) 120.7%

4) 121.9%



వివరణ:

పెంచిన భుజం పొడవు = 30%

$100 \times \frac{130}{100} \times \frac{130}{100} \times \frac{130}{100} = 219.7\%$


ఘనపరిమాణంలో పెరుగుదల = 119.7% **జ: 2**

4. 10 సెం.మీ. భుజంగా ఉన్న రెండు ఘనాలను కలిపితే ఇక దీర్ఘఘనం ఏర్పడుతుంది. అయితే ఆ దీర్ఘఘనం సంపూర్ణతల వైశాల్యం ఎంత?

1) 600 సెం.మీ.^{2} 2) 1000 సెం.మీ.^{2}

3) 1200 సెం.మీ.^{2} 4) 1600 సెం.మీ.^{2}

వివరణ:



పై విధంగా రెండు ఘనాలను కలిపితే ఒక దీర్ఘఘనం ఏర్పడుతుంది. దాని సంపూర్ణతల వైశాల్యం = $10a^2$


$= 10 \times 10^2 = 10 \times 100 = 1000$ సెం.మీ.^{2} **జ: 2**

5. 3 సెం.మీ., 4 సెం.మీ., 5 సెం.మీ. కొలతలుగా ఉన్న మూడు ఘనాలను కరిగించి ఒక పెద్ద ఘనంగా తయారు చేస్తే, ఆ పెద్ద ఘనం యొక్క భుజం పొడవు ఎంత?

1) 6 సెం.మీ. 2) 8 సెం.మీ.

3) 10 సెం.మీ. 4) 12 సెం.మీ.

వివరణ:



భుజాలు (a): 3 4 5

ఘనపరిమాణం ($V = a^3$): 27 64 125

నూతన ఘనం ఘనపరిమాణం = 27 + 64 + 125

$A^3 = 216 = 6^3 \Rightarrow A = 6$

నూతన ఘనం భుజం = 6 సెం.మీ. **జ: 1**

6. ఒక దీర్ఘ ఘనం మూడు ఆసన్న ముఖాల వైశాల్యాలు వరుసగా 132 సెం.మీ., 108 సెం.మీ., 99 సెం.మీ. అయితే ఆ దీర్ఘ ఘనాకారం యొక్క ఘనపరిమాణం ఎంత?

1) 594 సెం.మీ.^{3}

2) 1188 సెం.మీ.^{3}

3) 1782 సెం.మీ.^{3}

4) 891 సెం.మీ.^{3}



వివరణ: ఆసన్న తలాల వైశాల్యాల లబ్ధం = $(lbh)^2 = V^2$

$V = \sqrt{\text{ఆసన్న తలాల వైశాల్యాల లబ్ధం}}$

$V = \sqrt{132 \times 108 \times 99}$

$= \sqrt{11 \times 4 \times 3 \times 4 \times 9 \times 3 \times 9 \times 11}$

$= 11 \times 4 \times 3 \times 9 = 1188$ సెం.మీ.^{3} **జ: 2**



రచయిత: పిరాది నరేష్


ఆ ఖాతాలకు వడ్డీల చెల్లింపు ఉండదు!


భారతదేశంలో ప్రభుత్వరంగ బ్యాంకులు - ప్రగతి



దేశ ఆర్థిక వ్యవస్థకు బ్యాంకింగ్ మూలస్తంభం లాంటిది. ఈ సంస్థలు ప్రజల నుంచి పొదుపులను సమీకరించి పెట్టుబడులకు మళ్లిస్తాయి. వనరులను ఉత్పాదకంగా ఉపయోగించడానికి, మూలధన కల్పనకు సమర్థ మాధ్యమాలుగా పని చేస్తున్నాయి. అందులోనూ ప్రత్యేకంగా ప్రభుత్వ రంగ బ్యాంకులు దేశంలో సాంఘిక, ఆర్థిక అభివృద్ధిని సాధించడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. డిపాజిట్ల సేకరణ, రుణాల మంజూరులో నేటికీ వాటిదే మెజారిటీ వాటా. ఈ బ్యాంకుల ఏర్పాటు క్రమం, విధులు, విధానాలు, విస్తరించిన తీరు, వ్యాపార పరిధి, అనుబంధ విభాగాల గురించి పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. బ్యాంకింగ్ కార్యకలాపాల నియంత్రణకు ఉన్న చట్టాలు, ఏర్పాటైన వ్యవస్థలు, కాలానుగుణ మార్పులు, సంబంధిత కమిటీలతో పాటు దేశంలోని ప్రైవేటు, విదేశీ బ్యాంకుల గురించి తెలుసుకోవాలి.

జనరల్ స్టడీస్ - ఇండియన్ ఎకానమీ



1. దేశంలో విత్తరంగాన్ని క్రమబద్ధీకరించడానికి 'ఫైనాన్షియల్ స్టెబిలిటీ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్' (ఎఫ్ఎస్‌డీసీ) ఏర్పాటు చేయాలని ఏ కమిటీ సూచించింది?
   1) ఉర్జిత్ పటేల్ కమిటీ
   2) రఘురామ్ రాజన్ కమిటీ
   3) మోహన్ కందా 4) వైద్యనాథన్ కమిటీ
2. భారతదేశంలో వాణిజ్య బ్యాంకుల ఏర్పాటును ప్రోత్సహించిన ఉద్యమం?
   1) క్విట్ ఇండియా ఉద్యమం 2) స్వదేశీ ఉద్యమం
   3) సహాయ నిరాకరణోద్యమం
   4) హోం రూల్ ఉద్యమం
3. పంజాబ్ నేషనల్ బ్యాంకు (1894) ఏర్పాటులో ముఖ్యపాత్ర పోషించిన జాతీయ నాయకుడు?
   
   1) సుభాష్ చంద్రబోస్
   2) సర్దార్ వల్లభాయ్ పటేల్
   3) లాలాలజపతి రాయ్ 4) జవహర్‌లాల్ నెహ్రూ
4. కిందివాటిలో భారతీయ యాజమాన్యంలో ఏర్పాటైన మొదటి వాణిజ్య బ్యాంకు?
   1) బ్యాంక్ ఆఫ్ హిందుస్థాన్
   2) ఔద్ కమర్షియల్ బ్యాంకు
   3) పంజాబ్ నేషనల్ బ్యాంకు 4) ఆంధ్రా బ్యాంకు
5. ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్)ని కింది వాటిలో వేటిని ఉద్దేశించి ఏర్పాటు చేశారు?
   1) వడ్డీ రేట్ల నియంత్రణ
   2) మనీలాండరింగ్, ఉగ్రవాద నిధులను ఎదుర్కోవడం
   3) విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించడం
   4) బ్యాంకు లాభాలను పర్యవేక్షించడం
6. భారతదేశంలో 'డిజిటల్ బ్యాంకింగ్' పరిచయం ప్రధానంగా ఏ లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకొని రూపొందించారు?
   
   1) వినియోగదారుల సౌలభ్యాన్ని మెరుగుపరచడం
   2) బ్యాంకు శాఖలు తగ్గించడం
   3) నగదు లావాదేవీలను ప్రోత్సహించడం
   4) బ్యాంకు శాఖలను పెంచడం
7. కిందివాటిలో భారత బ్యాంకింగ్ వ్యవస్థ ఎదుర్కొంటున్న ప్రధాన సవాలు ఏది?
   1) ప్రభుత్వ ఖాతాల నిర్వహణ
   2) ద్రవ్య స్థిరత్వాన్ని కాపాడటం
   3) అందరికీ బ్యాంకు ఖాతాల నిర్వహణ
   4) విదేశీ పెట్టుబడులు నియంత్రించడం
8. భారతదేశంలో బ్యాంకుల పనితీరును ఏ చట్టం నియంత్రిస్తుంది?
   1) బ్యాంకింగ్ నియంత్రణ చట్టం
   2) ఆర్‌బీఐ చట్టం
   3) సెక్యూరిటీస్ కాంట్రాక్ట్ నియంత్రణ చట్టం
   4) కంపెనీల చట్టం
9. బ్యాంకింగ్ అంబుడ్స్‌మెన్ ప్రాథమిక ఉద్దేశం ఏమిటి?
   1) రుణ ఆమోదాన్ని సులభతరం చేయడం
   2) బ్యాంకుల లాభదాయకతను పెంచడం
   3) కొత్త బ్యాంకులను ప్రోత్సహించడం
   4) వినియోగదారుల ఫిర్యాదులను పరిష్కరించడం
10. ప్రధానమంత్రి ముద్రా యోజన (పీఎంఎంవై) ప్రధాన ఉద్దేశం?
    1) విదేశీ పెట్టుబడులకు మద్దతు ఇవ్వడం
    2) కార్పొరేషన్లకు రుణాల మంజూరు
    3) మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు రుణాలు
    4) సూక్ష్మ, చిన్న సంస్థలకు రుణాలు అందించడం
11. బ్యాంకింగ్ కోడ్స్ అండ్ స్టాండర్డ్స్ బోర్డ్ ఆఫ్ ఇండియా (బీసీఎస్‌బీఐ) ప్రాథమిక విధి?
    1) బ్యాంకుల కోసం వినియోగదారుల సేవా ప్రమాణాలను అభివృద్ధి చేయడం
    2) ప్రభుత్వ రంగ బ్యాంకులను నిర్వహించడం
    3) వడ్డీ రేట్లు నియంత్రించడం
    4) బ్యాంకుల్లో సాంకేతికతను ప్రోత్సహించడం
12. ఇంపీరియల్ బ్యాంకును జాతీయం చేసి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏర్పాటు చేయాలని ఏ కమిటీ సిఫార్సు చేసింది?
    1) హజారీ కమిటీ 2) గోర్వాలా కమిటీ
    3) ఖాన్ వర్కింగ్ గ్రూప్ 4) పద్మనాభన్ కమిటీ
13. బంధన్ జీవన్ బ్యాంకు ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?
    1) ముంబయి 2) దిల్లీ
    3) లఖ్‌నవూ 4) కోల్‌కతా
14. 'ఏక్ పరివార్ ఏక్ బ్యాంక్' అనే ట్యాగ్‌లైన్ ఉన్న ప్రభుత్వరంగ బ్యాంకును గుర్తించండి.
    1) సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
    2) బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర
    3) పంజాబ్ సింధ్ బ్యాంకు
    4) ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు
15. కింది ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రధాన కార్యాలయానికి సంబంధించి సరికానిది గుర్తించండి.
    1) ఇండియన్ బ్యాంకు - చెన్నై
    2) కెనరా బ్యాంకు - కొచ్చి
    3) బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర - పుణె
    4) సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా - ముంబయి
16. ఇటీవల చల్లా శ్రీనివాస శెట్టి ఏ ప్రభుత్వరంగ బ్యాంకు ఛైర్మన్‌గా నియమితులయ్యారు?
    1) పంజాబ్ సింధ్ బ్యాంకు
    2) పంజాబ్ నేషనల్ బ్యాంకు
    3) స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
    4) యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
17. 2025, అక్టోబరు 1 నాటికి భారతదేశంలో ఉన్న ప్రభుత్వరంగ బ్యాంకుల సంఖ్య?
    1) 21 2) 12 3) 16 4) 18
18. హాంకాంగ్, షాంఘై బ్యాంకింగ్ కార్పొరేషన్ (హెచ్ఎస్‌బీసీ) ప్రధాన కార్యాలయం ఉన్న ప్రదేశం?
    1) బీజింగ్ 2) మాస్కో
    3) న్యూదిల్లీ 4) లండన్
19. బ్యాంక్ ఆఫ్ భూటాన్‌లో సుమారు 20% వాటా ఉన్న భారతీయ ప్రభుత్వరంగ బ్యాంకు ఏది?
    
    1) బ్యాంక్ ఆఫ్ బరోడా
    2) కెనరా బ్యాంకు
    3) స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
    4) యాక్సిస్ బ్యాంకు
20. భారతదేశంలో ప్రభుత్వరంగ బ్యాంకుల విలీన విధానం ఎప్పుడు ప్రారంభమైంది?
    1) 2019 2) 2021 3) 2016 4) 2020
21. 2020, ఏప్రిల్ 1న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో కింది ఏ బ్యాంకులు విలీనమయ్యాయి?
    1) ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ - సిండికేట్ బ్యాంకు
    2) ఆంధ్రా బ్యాంకు - కార్పొరేషన్ బ్యాంకు
    3) కార్పొరేషన్ బ్యాంకు - అలహాబాద్ బ్యాంకు
    4) ఆంధ్రా బ్యాంకు - బ్యాంకు ఆఫ్ ఇండియా
22. 1969, జులై 19న 14 వాణిజ్య బ్యాంకుల జాతీయీకరణ జరిగినప్పుడు బ్యాంకుల అధీకృత మూలధనం (డిపాజిట్లు) ఎంత?
    1) రూ.200 కోట్లు 2) రూ.75 కోట్లు
    3) రూ.100 కోట్లు 4) రూ.50 కోట్లు
23. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులకు సంబంధించిన నిధులను కేంద్రం, స్పాన్సర్ బ్యాంకు, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి వరుసగా ఏ నిష్పత్తిలో సమకూరుస్తాయి?
    1) 60 : 30 : 10 2) 50 : 35 : 15
    3) 50 : 15 : 35 4) 15 : 35 : 50
24. వాణిజ్య బ్యాంకులు కిందివాటిలో ఏ ఖాతాకు సంబంధించి ఎలాంటి వడ్డీ చెల్లించవు?
    1) సేవింగ్స్ ఖాతా 2) స్థిర ఖాతా
    3) కరెంట్ ఖాతా 4) రికరింగ్ ఖాతా
25. కిందివాటిలో వాణిజ్య బ్యాంకుల ప్రాథమిక విధిని గుర్తించండి.
    1) లాకర్ సదుపాయాల కల్పన
    2) రుణాలు, అడ్వాన్సులు 3) డిపాజిట్ల సేకరణ
    4) ఎక్స్ఛేంజ్ బిల్లుల డిస్కౌంట్
26. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రాథమిక లక్ష్యం?
    
    1) ప్రభుత్వ ఖాతాల నిర్వహణ
    2) ద్రవ్య స్థిరత్వం కాపాడటం
    3) విదేశీ పెట్టుబడుల నియంత్రణ
    4) అందరికీ బ్యాంకు ఖాతాల నిర్వహణ
27. కిందివాటిలో భారతదేశంలో విదేశీ మారకద్రవ్య మార్కెట్‌ను నియంత్రించేది?
    1) సెబీ 2) ఆర్‌బీఐ
    3) ఆర్థిక మంత్రి
    4) ఇండియన్ బ్యాంక్ అసోసియేషన్
28. 'మీ కస్టమర్‌ను తెలుసుకోండి' (కేవైసీ) నిబంధన ఏ అంశాన్ని వివరిస్తుంది?
    1) రైతులకు రుణాలు అందించడం
    2) బ్యాంకు లాభాలను అంచనా వేయడం
    3) వినియోగదారులను సులభంగా గుర్తించడం, ధ్రువీకరించడం
    4) బ్యాంకు ఉద్యోగులను పర్యవేక్షించడం
29. భారతదేశంలో ఆధునిక బ్యాంకింగ్‌కు మూలాధారమైన బ్యాంకు?
    1) పంజాబ్ నేషనల్ బ్యాంకు
    2) బ్యాంక్ ఆఫ్ హిందుస్థాన్
    3) బ్యాంక్ ఆఫ్ కోల్‌కతా
    4) బ్యాంక్ ఆఫ్ మద్రాస్
30. భారతదేశంలో అవస్థాపనా సౌకర్యాల కల్పనకు రుణాలందించేందుకు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐడీఎఫ్‌సీ)ని ఎప్పుడు ప్రారంభించారు?
    1) 2019 2) 2015 3) 2018 4) 2017
31. విదేశాల్లో అత్యధిక శాఖలున్న మూడు భారతీయ ప్రభుత్వరంగ బ్యాంకులు వరుసగా...
    1) బ్యాంక్ ఆఫ్ బరోడా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ ఇండియా
    2) బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంకు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
    3) స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియా
    4) బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంకు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
32. 2025లో భారతదేశంలో అతిపెద్ద ప్రైవేట్ రంగ బ్యాంకు?
    1) ఇండస్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
    2) హౌసింగ్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ (హెచ్‌డీఎఫ్‌సీ)
    3) భారత పారిశ్రామిక పరపతి పెట్టుబడి బ్యాంకు (ఐడీబీఐ)
    4) యెస్ బ్యాంకు
33. భారత పారిశ్రామికాభివృద్ధి బ్యాంకు (ఐడీబీఐ) ప్రస్తుతం దేని ఆధ్వర్యంలో పనిచేస్తుంది?
    1) కేంద్ర ఆర్థిక శాఖ
    2) జీవిత బీమా కార్పొరేషన్
    3) స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
    4) పంజాబ్ నేషనల్ బ్యాంకు

సమాధానాలు

1-2, 2-2, 3-3, 4-2, 5-2, 6-1, 7-2, 8-1, 9-4, 10-4, 11-1, 12-2, 13-4, 14-2, 15-2, 16-3, 17-2, 18-4, 19-3, 20-1, 21-2, 22-4, 23-2, 24-3, 25-3, 26-2, 27-2, 28-3, 29-2, 30-2, 31-3, 32-2, 33-2.

నాల్కోలో మేనేజర్లు

నేషనల్ అల్యూమినియం కంపెనీ లిమిటెడ్(నాల్కో), భువనేశ్వర్.. మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

● మేనేజర్: 48 పోస్టులు

విభాగాలు: సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, కెమికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్.

అర్హత: సంబంధిత విభాగంలో ఇంజినీరింగ్ డిగ్రీతో పాటు అనుభవం ఉండాలి.

వేతన శ్రేణి: నెలకు రూ.70,000 నుంచి 2,00,000 వరకు.

వయసు: 38 ఏళ్లు మించకూడదు.

దరఖాస్తు ఫీజు: రూ.1000, ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు రూ.500.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 02.02.2026.

ఎంపిక: పరీక్ష, ఇంటర్వ్యూలతో. **వెబ్‌సైట్:** https://nalcoindia.com/

ఎన్ఎస్ఐఎల్‌లో కన్సల్టెంట్లు

న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎస్ఐఎల్), బెంగళూరు.. ఒప్పంద ప్రాతిపదికన కన్సల్టెంట్ పోస్టులకు దరఖాస్తులు కోరుతోంది.

● కన్సల్టెంట్(ఫైనాన్స్): 02
● యంగ్ కన్సల్టెంట్- గ్రౌండ్ సెగ్మెంట్: 02
● కన్సల్టెంట్(హెచ్ఆర్): 02
● కన్సల్టెంట్(పర్చేజ్, స్టోర్): 02
● యంగ్ కన్సల్టెంట్- ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్: 01
● యంగ్ కన్సల్టెంట్- మెకానికల్: 01
● కన్సల్టెంట్(ఇతర విభాగాలు): 05

అర్హత: పోస్టు ప్రకారం సంబంధిత విభాగంలో సీఏ, డిప్లొమా, డిగ్రీ, బీఈ/బీటెక్, ఎంబీఏతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.

వేతన శ్రేణి: నెలకు యంగ్ కన్సల్టెంట్‌కు రూ.40,000-1,40,000; కన్సల్టెంట్‌కు రూ.50,000-1,60,000; సీనియర్ కన్సల్టెంట్‌కు రూ.80,000-2,20,000.

వయసు: కన్సల్టెంట్‌కు 35 ఏళ్లు, సీనియర్ కన్సల్టెంట్‌కు 45 ఏళ్లు, యంగ్ కన్సల్టెంట్‌కు 30 ఏళ్లు మించకూడదు.

ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూలతో.

దరఖాస్తు ఫీజు: రూ.590. మహిళలు/ ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు ఫీజు లేదు.

ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 31.01.2026.

వెబ్‌సైట్: https://www.nsilindia.co.in/career

వైమానిక రంగం
అవకాశాలు అపారం

వృద్ధిలోకి వచ్చే రంగాన్ని ముందుగానే ఒడిసి పట్టుకున్నవారు విజేతలవుతారు. మన కళ్లెదుటే కనిపిస్తూ శరవేగంగా ఆకాశయాన రంగం విస్తరిస్తోంది. పదేళ్ల ముందు తక్కువ మందే విమానం ఎక్కేవారు. కానీ 2015 తర్వాత కొత్త తరం, పాతతరం అంతా కలిసి తీర్థయాత్రలు, విహార యాత్రలు ఎక్కువగా చేస్తున్నారు. రైల్వేస్టేషన్లు, ఆర్టీసీ కాంప్లెక్స్‌ల మాదిరి ఇటీవలి కాలంలో విమానాశ్రయాలూ ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి.



పదేళ్లలో జిగేల్!

2014 ముందు వరకూ నిద్రాణంగా ఉన్న భారత విమానయాన రంగం 2015 నుంచి లేచి జూలు విదిల్చింది. సరళీకృత ఆర్థిక విధానాల కారణంగా దేశంలో ఐటీ, కార్పొరేట్ రంగం విస్తరిస్తుండటంతో ఈ రంగానికి రెక్కలు వచ్చాయి. ఆదాయ మార్గాలు పెరగడంతో విమానం ఎక్కేవారి సంఖ్యా ఎక్కువవుతోంది. పర్యాటకం, ఉద్యోగం, వర్తకం నిమిత్తం ఎక్కువ మంది విమానం ఎక్కడానికే ప్రాధాన్యమిస్తున్నారు. ఇలా ఎన్నో పరిణామాలతో ఈ పదేళ్లలో ప్రపంచంలోనే మూడో అతిపెద్ద మార్కెట్‌గా భారత విమానయాన రంగం అవతరించింది. 2030 నాటికి గ్లోబల్ ఏవియేషన్ పవర్ హౌస్‌గా ఆవిర్భవించనున్నదని పౌరవిమానయాన మంత్రిత్వశాఖ అంచనా వేస్తోంది.

ప్రభుత్వ చేయూత

ప్రైవేట్ రంగానికి ప్రభుత్వ సహకారం ఉంటేనే ముందుకెళ్ల గలుగుతుంది. కేంద్ర ప్రభుత్వం ఈ రంగంలో వైమానిక రంగంలో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టింది. ఎయిర్‌పోర్టుల నిర్మాణంపై భారీ పెట్టుబడులు పెడుతోంది. ఇందులోనూ ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడంతో 2014 వరకు దేశంలో 74 ఎయిర్‌పోర్టులు మాత్రమే ఉండగా 2025 నాటికి వాటి సంఖ్య 175కి పెరిగింది. వీటిని 2047 నాటికి 350 నుంచి 400 వరకు విస్తరించే లక్ష్యంగా పౌర విమానయాన రంగం పనిచేస్తోంది.

మనకేంటి?

ఉపాధి పథం
నైపుణ్య సాధనం

యువ ఉద్యోగ ఆశావహులు వైమానిక రంగంలో కెరియర్ అవకాశాలనూ పరిశీలించాలి. ఎయిర్‌పోర్టులు పెరుగుతుండటం, విమానయాన సంస్థలు, విమానాల సంఖ్య రెట్టింపు అవుతుండటం, విమాన ప్రయాణికుల సంఖ్య చాలా ఎక్కువ కావడం.. ఈ పరిణామాల ఆధారంగా ఈ రంగంలో అవకాశాలపై దృష్టి పెట్టాలి. కొద్ది రోజుల కింద ఈ రంగంలో అత్యధిక మార్కెట్ వాటాతో దూసుకెళుతున్న విమానయాన సంస్థపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ అథారిటీ (డీజీసీఏ) ఆంక్షలు విధించడంతో ఆ కంపెనీ అతలాకుతలమైంది. ప్రభుత్వ నిబంధనలను వెంటనే అమలు చేయాలంటే 500 మంది పైలట్లు అవసరమని అంచనా వేసింది. కానీ ఇంత మందిని ఒకేసారి సమకూర్చడం కష్టం. కనీసం రెండేళ్లైనా సమయం పడుతుంది. ఈ రంగాన్ని పైలట్ల కొరత తీవ్రంగా వెన్నాడుతోంది. ఒక్క పైలట్లే కాదు.. సుశిక్షితులైన సిబ్బంది కోసం ఈ రంగం ఎదురుచూస్తోంది. వివిధ విభాగాలలో విమానయాన సంస్థలకు సిబ్బంది అవసరం ఉంది.

విమాన సర్వీసుల నిర్వహణ: ఒక విమానం ఎయిర్‌పోర్టు నుంచి కదలడానికి ముఖ్యమైన సిబ్బంది ఉండాలి. విమానాన్ని నడిపేందుకు పైలట్, కో-పైలట్, ప్రయాణికుల అవసరాలను పర్యవేక్షించే కేబిన్ క్రూ, ఫ్లయిట్ ఎయిర్‌పోర్టును వదిలేందుకు కావలసిన ఏర్పాట్లను పర్యవేక్షించే ఫ్లయిట్ డిస్పాచర్, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ విభాగం సిబ్బంది అవసరం.

టెక్నికల్ పోస్టులు: ఎయిర్‌పోర్టులో మనకు ప్రత్యక్షంగా కనిపించని కొన్ని టెక్నికల్ పోస్టులున్నాయి. ఎయిర్ క్రాఫ్ట్ సాంకేతిక నిర్వహణను పరిశీలించే ఇంజినీర్, నిబంధనల ప్రకారం ఉన్నాయో లేదో తెలుసుకోవడానికి ఎయిర్ క్రాఫ్ట్స్ డిజైన్ ఇంజినీర్లు, విమాన సర్వీసుల విషయంలో నాణ్యతా ప్రమాణాలు పర్యవేక్షించే క్వాలిటీ కంట్రోల్ ఇంజినీర్లు ప్రతి విమానయాన సంస్థకూ అవసరం.

ఎయిర్‌పోర్టు, ఎయిర్‌లైన్ నిర్వహణ: మనం విమానంలోకి ప్రవేశించే ముందు వివిధ హోదాల్లో సిబ్బంది సేవలందిస్తుంటారు. ప్రతి ఎయిర్‌లైన్ సంస్థకూ ఎయిర్‌పోర్ట్ మేనేజర్లూ, సహాయకులూ ఉంటారు. కస్టమర్ సర్వీస్, క్షేత్రస్థాయి సిబ్బంది (గ్రౌండ్ స్టాఫ్), టికెటింగ్ ఎగ్జిక్యూటివ్, ఆపరేషన్స్ మేనేజర్లు ప్రతి ఎయిర్‌లైన్ సంస్థకూ అవసరం.

ఇతర సిబ్బంది: కొన్ని విమానయాన సంస్థలు కొన్ని విధుల కోసం కన్సల్టెంట్లను నియమించుకుంటాయి. ఉదాహరణకు విమానంలో నింపే ఇంధనం ప్రభుత్వ ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలి. దీన్ని చూసేందుకు సిబ్బంది ఉన్నప్పటికీ ఉన్నత స్థాయి పర్యవేక్షణకు కన్సల్టెంట్లను ఎయిర్‌లైన్ సంస్థలు తీసుకుంటాయి. భద్రతా ప్రమాణాలను పర్యవేక్షించే ఎయిర్ క్రాఫ్ట్ సేఫ్టీ అధికారులు, డీజీసీఏ ఆంక్షలను అమలు చేసేలా ఎయిర్ క్రాఫ్ట్ నిర్వహణ కార్యకలాపాలను పర్యవేక్షించే రెగ్యులేటర్ అధికారులుంటారు.

ఏఐకి దూరంగా..

ఉద్యోగాలను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కబళిస్తున్న వేళ ఆ ప్రభావం నామమాత్రంగా పరిమితమైన రంగం విమానయానం. నాణ్యతా ప్రమాణాల అమలు, ఎయిర్‌లైన్స్ ఆపరేషన్లలో ఇప్పటికీ ఏఐని పరిమితంగానే వినియోగిస్తున్నారు. రాబోయే రోజుల్లో కూడా ఈ రంగంలో ఏఐ ప్రభావం కొన్ని సాంకేతిక విభాగాలకే పరిమితమవుతుంది. కాబట్టి రాబోయే ఐదేళ్ల తర్వాత విమానయానంలోకి ప్రవేశించాలని ఇప్పుడు నిర్ణయించుకున్నా.. భేషుగ్గా ముందుకు వెళ్లవచ్చు. అయితే స్వీయ ఆసక్తి, సాధించాల్సిన నైపుణ్యాలు అందుబాటులో ఉన్న కోర్సులపై అవగాహన ఏర్పర్చుకోవాలి. సుశిక్షితులైన సిబ్బంది కొరతతో ఇబ్బందిపడుతోన్న ఈ రంగంలో ప్రవేశానికి నిర్ణయం తీసుకోవడం మేలు చేసే అంశమే.



యస్.వి. సురేష్
సంపాదకుడు, ఉద్యోగ సోపానం



సీఈసీ గ్రూపుతో ఇంటర్మీడియట్ చదువుతున్నాను. సీఐఎంఏ, సీఎఫ్ఏల్లో ఏ కోర్సు చేస్తే భవిష్యత్తు బాగుంటుంది?

- కవిత

సీఐఎంఏ, సీఎఫ్ఏల్లో ఏది తీసుకోవాలి?

■ సీఈసీ (కామర్స్, ఎకనామిక్స్, సివిక్స్) గ్రూపుతో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు భవిష్యత్తు కెరియర్ ఎంపిక చాలా కీలకం. ఈ దశలో సరైన ప్రొఫెషనల్ కోర్సును ఎంచుకుంటే, చదువు, ఉద్యోగం రెండిటిలోనూ మెరుగైన అవకాశాలు అందుకోవచ్చు. ప్రస్తుతం కామర్స్, ఫైనాన్స్ రంగాల్లో అత్యంత గుర్తింపు పొందిన కోర్సులుగా చార్టర్డ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్స్ (సీఐఎంఏ), చార్టర్డ్ ఫైనాన్షియల్ అనలిస్ట్ (సీఎఫ్ఏ)లు నిలుస్తున్నాయి. ఈ రెండూ భిన్నమైన కెరియర్ మార్గాలు అందిస్తాయి. కాబట్టి ముందుగా వీటిని సమగ్రంగా అర్థం చేసుకోవాలి.



■ సీఐఎంఏ మేనేజ్‌మెంట్ అకౌంటింగ్ ఆధారిత ప్రొఫెషనల్ కోర్సు. ఇది ఒక సంస్థలో ఖర్చుల నియంత్రణ, బడ్జెటింగ్, వ్యూహాత్మక నిర్ణయాలు, వ్యాపార విశ్లేషణ లాంటి అంశాలపై దృష్టి సారిస్తుంది. సీఈసీ నేపథ్యం ఉన్నవారికి ఈ కోర్సు సహజంగా అనుకూలం. ఇందులో ప్రాథమిక అకౌంటింగ్, బిజినెస్ కాన్సెప్ట్‌లు ప్రధానంగా ఉండటమే దీనికి కారణం. ఈ కోర్సును ఇంటర్మీడియట్ తర్వాతే ఫౌండేషన్ స్థాయి నుంచి ప్రారంభించవచ్చు. చదువుతూనే ఉద్యోగ అనుభవాన్ని పొందే అవకాశం ఉండటం దీని ప్రత్యేకత. సీఐఎంఏ అర్హతతో భవిష్యత్తులో కార్పొరేట్ సంస్థల్లో ఫైనాన్స్ మేనేజర్, కాస్ట్ కంట్రోలర్, బిజినెస్ అనలిస్ట్ లాంటి బాధ్యతాయుతమైన ఉద్యోగాలు పొందవచ్చు. భారత్‌తో పాటు విదేశాల్లోనూ సీఐఎంఏకు మంచి గుర్తింపు ఉంది.

■ సీఎఫ్ఏ పూర్తిగా ఇన్వెస్ట్‌మెంట్, ఫైనాన్షియల్ మార్కెట్లపై కేంద్రీకృతమైన కోర్సు. షేర్ మార్కెట్లు, బాండ్ మార్కెట్లు, పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్, రిస్క్ అనాలిసిస్ లాంటి అంశాలు ఇందులో విస్తృతంగా ఉంటాయి. ఇది అకడమిక్‌గా చాలా కఠినమైన కోర్సుగా పేరు పొందింది. బలమైన గణిత నైపుణ్యాలు, విశ్లేషణాత్మక ఆలోచన అవసరం. సాధారణంగా డిగ్రీ చివరి దశలో లేదా డిగ్రీ తర్వాత ఈ కోర్సును ప్రారంభించడం ఉత్తమం. సీఎఫ్ఏ పూర్తిచేసిన వారికి ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్, అసెట్ మేనేజ్‌మెంట్, ఫైనాన్షియల్ రిసెర్చ్ లాంటి ఉన్నతోద్యోగాలు లభిస్తాయి. అయితే దీని కోసం ఎక్కువ సమయం, నిరంతర శ్రమ అవసరం.

■ ఈ రెండు కోర్సులనూ పోలిస్తే సీఈసీ వాళ్లకు ప్రారంభ దశలో సీఐఎంఏ కొంత సులభంగా, ఆచరణాత్మకంగా ఉంటుంది. ఇది ఒక స్థిరమైన కెరియర్ మార్గాన్ని తొలి దశలోనే అందిస్తుంది. సీఎఫ్ఏ మాత్రం ఎక్కువ లోతైన జ్ఞానం, దీర్ఘకాలిక లక్ష్యాన్ని కోరుతుంది. కాబట్టి ఫైనాన్స్ మార్కెట్లపై ప్రత్యేక ఆసక్తి ఉన్నవారు, కఠినమైన చదువుకు సిద్ధంగా ఉన్నవారు సీఎఫ్ఏ వైపు వెళ్లవచ్చు. చివరిగా సీఈసీ గ్రూపు వాళ్లు ముందు సీఐఎంఏ పూర్తి చేసుకోవడం మంచిది. అనుభవం పెరిగిన తర్వాత సీఎఫ్ఏ వైపు అడుగులు వేస్తే ప్రయోజనం. ఆసక్తి, సామర్థ్యం, దీర్ఘకాల లక్ష్యాలను స్పష్టంగా నిర్ధారించుకుని నిర్ణయం తీసుకుంటే, ఈ రెండు కోర్సుల్లో ఏదైనా మీ భవిష్యత్తును విజయవంతంగా మలచగలదు.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్,
కెరియర్ కౌన్సెలర్

ఇంటర్న్‌షిప్స్

వర్క్ ఫ్రమ్ హోమ్

ఎస్ఈఓ అండ్ ఎస్ఈఎం

సంస్థ: గ్లోబిక్ ఏఐ ప్రై.లి.
నైపుణ్యాలు: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఏఐ మార్క్అప్ లాంగ్వేజ్, అటెన్షన్ టు డిటెయిల్, బిజినెస్ రిసెర్చ్, డిజిటల్ మార్కెటింగ్, డిజిటల్ మార్కెటింగ్ టూల్స్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, గూగుల్ అనలిటిక్స్, గూగుల్ కీవర్డ్ ప్లానర్, ఇంటర్‌పర్సనల్ స్కిల్స్, ఆప్టిమైజేషన్, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్, సెల్ఫ్-లెర్నింగ్, టెక్నికల్ అనాలిసిస్
స్టైపెండ్: రూ.4,000-10,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 5
☛ https://tinyurl.com/5n8h4a58

ఔట్‌బౌండ్ మార్కెటింగ్

సంస్థ: ఎల్‌డీ టెక్నాలజీస్
నైపుణ్యాలు: డిజిటల్ అడ్వర్‌టైజింగ్, డిజిటల్, ఈమెయిల్, మార్కెటింగ్, డిజిటల్ మార్కెటింగ్ టూల్, మార్కెటింగ్, మార్కెటింగ్ ఆటోమేషన్, మార్కెటింగ్ స్ట్రాటజీ **స్టైపెండ్:** రూ.12,000-20,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 5
☛ https://tinyurl.com/yc792ucp

వీడియో కంటెంట్ క్రియేటర్ (ఇన్‌స్టాగ్రామ్)

సంస్థ: క్లౌడ్‌బర్డ్ డిజిటల్ ప్రై.లి.
నైపుణ్యాలు: కంటెంట్ మేనేజ్‌మెంట్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, సోషల్‌మీడియా మార్కెటింగ్, వీడియో ఎడిటింగ్
స్టైపెండ్: రూ.10,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 5
☛ https://tinyurl.com/bdhbu5ta

క్రియేటివ్ డిజైనర్

సంస్థ: కోడ్‌మేటిక్స్ సొల్యూషన్ ఎల్ఎల్‌పీ
నైపుణ్యాలు: అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, క్రియేటివ్ సూట్, ఎక్స్‌డీ, కోరల్‌డ్రా, క్రియేటివ్ రైటింగ్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఫిగ్మా, ప్రాబ్లమ్ సాల్వింగ్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, స్కెచ్, టైమ్ మేనేజ్‌మెంట్, యూఐ అండ్ యూఎక్స్ డిజైన్
స్టైపెండ్: రూ.8,000-12,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 5
☛ https://tinyurl.com/y74tzuwc

డేటా అనలిటిక్స్

సంస్థ: ఎ బాక్స్ ఆఫ్ స్టోరీస్
నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-వర్డ్
స్టైపెండ్: రూ.7,500
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 6
☛ https://tinyurl.com/y5ncy58h

ఇంటర్‌తోనే మేటి యూనివర్సిటీల బాట!

యూనివర్సిటీల గడప తొక్కడానికి డిగ్రీ పూర్తయ్యే వరకూ ఆగాల్సిన పనిలేదిప్పుడు. ఇంటర్మీడియట్ పూర్తికాగానే దేశంలోని మేటి సంస్థల్లో చదువుకోవచ్చు. ఇందుకోసం సెంట్రల్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్టు(సీయూఈటీ) యూజీ దారి చూపుతుంది. ఈ సంస్థల్లో బీఏ, బీకాం, బీఎస్సీ, ఇంటిగ్రేటెడ్ ఎంఏ, ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ, ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ, బీబీఏ, బీటెక్.. ఇలా ఎన్నో కోర్సులు ఇంటర్ విద్యార్హతతో అందిస్తున్నారు. వీటిలో ప్రవేశానికి సీయూఈటీ స్కోరు ప్రామాణికం. ఇటీవలే ఆ ప్రకటన వెలువడింది.

కేంద్రీయ విశ్వవిద్యాలయాలతోపాటు స్టేట్ యూనివర్సిటీలు, డీమ్డ్ సంస్థలు, ప్రైవేటు యూనివర్సిటీలు, మరికొన్ని ప్రభుత్వ సంస్థలు అందించే.. యూజీ, ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సుల్లో ప్రవేశాలు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నిర్వహించే సీయూఈటీ స్కోరుతో ఉంటాయి. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, ఈఎఫ్ఎల్ యూనివర్సిటీ, జేఎన్‌యూ, దిల్లీ యూనివర్సిటీ.. ఇలా దేశ వ్యాప్తంగా 48 సెంట్రల్ యూనివర్సిటీల్లో ప్రవేశాలకు ఈ స్కోరే ప్రామాణికం. ఈ సంస్థల్లో మేటి బోధన, వసతి, ఇతర సౌకర్యాలు మెరుగ్గా ఉంటాయి. దేశవ్యాప్తంగా దాదాపు అన్ని ప్రైవేటు విశ్వవిద్యాలయాలూ, డీమ్డ్ సంస్థలూ సీయూఈటీ స్కోరుతో సీట్లు కేటాయిస్తున్నాయి. ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సుల్లో చేరినవారు ఐదేళ్ల పాటు ఒకే సంస్థలో యూజీ, పీజీ పూర్తిచేసుకోవచ్చు. చేరిన కోర్సులో మెరుగైన నైపుణ్యాన్నీ పొందవచ్చు.



పరీక్ష ఇలా

కంప్యూటర్ బేస్డ్ విధానంలో నిర్వహిస్తారు. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ తరహాలో వస్తాయి. తెలుగుతో సహా 13 భాషల్లో కోరిన మాధ్యమాన్ని ఎంచుకోవచ్చు. 37 సబ్జెక్టుల్లో పరీక్ష నిర్వహిస్తున్నారు. ఇందులో 13 లాంగ్వేజ్‌లు, 23 డొమైన్ స్పెసిఫిక్, ఒకటి జనరల్ ఆప్టిట్యూడ్ టెస్టు. వీటిలో అభ్యర్థులు గరిష్ఠంగా 5 టెస్టు పేపర్లు ఎంచుకోవచ్చు. ఏ కోర్సుల్లో చేరాలో నిర్ణయించుకుని, వాటికి సంబంధించిన సబ్జెక్టుల్లో పరీక్ష రాయడమే బాగు. సంస్థలు, కోర్సుల వారీ అర్హతలు, రాయాల్సిన పేపర్లు వెబ్‌సైట్‌లో ఉంచారు. ఇంటిగ్రేటెడ్ పీజీ ముఖ్యంగా సైన్స్ కోర్సుల కోసం నిర్దేశిత సబ్జెక్టుల నుంచి ఏవైనా 3 ఎంచుకోవాలి. ఏదో ఒక లాంగ్వేజ్ తప్పనిసరి. బీబీఏ, బీబీఎం లాంటి జనరల్ కోర్సులకు జనరల్ ఆప్టిట్యూడ్ టెస్టు రాస్తే సరిపోతుంది. ఇంగ్లిష్ లాంగ్వేజీలోనూ అర్హత పొందాలి. ఒక్కో టెస్టు పేపరూ 250 మార్కులకు ఉంటుంది. ప్రతి టెస్టు పేపర్‌లోనూ 50 ప్రశ్నలు వస్తాయి. ప్రతి సరైన జవాబుకూ 5 మార్కులు. తప్పు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు. ఒక్కో టెస్టు పేపర్ వ్యవధి గంట.

ఈ అంశాల్లో ప్రశ్నలు

లాంగ్వేజ్‌లు: ఇందులో రీడింగ్ కాంప్రహెన్షన్, లిటరరీ ఆప్టిట్యూడ్, ఒకాబ్యులరీ ప్రశ్నలు ఉంటాయి.

డొమైన్ సబ్జెక్టులు: ప్లస్2/ ఇంటర్‌లోని సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు వస్తాయి. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, సైకాలజీ.. ఇలా 23 సబ్జెక్టులు ఉన్నాయి. వీటిలో అవసరమైనవి ఎంపిక చేసుకుని పరీక్ష రాసుకోవాలి. సబ్జెక్టు ప్రశ్నలన్నీ ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్ నుంచే వస్తాయి.

జనరల్ ఆప్టిట్యూడ్: జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, జనరల్ మెంటల్ ఎబిలిటీ, న్యూమరికల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ రీజనింగ్ (గణితంలోని ప్రాథమికాంశాల అనువర్తనంపై ప్రశ్నలు అరిథ్‌మెటిక్/ ఆల్జీబ్రా జామెట్రీ/ మెన్సురేషన్/ స్టాటిస్టిక్స్ విభాగాల్లో), లాజికల్ అండ్ అనలిటికల్ రీజనింగ్ నుంచి అడుగుతారు.

సన్నద్ధత

✦ సబ్జెక్టుల వారీ సిలబస్ వివరాలు వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. వాటిని గమనించాలి.

✦ సిలబస్‌లో పేర్కొన్న అంశాల ప్రకారం ఇంటర్మీడియట్/ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాలు పూర్తి స్థాయిలో చదవాలి. ప్రాథమికాంశాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. పాఠాల వారీ చివరలో ఉన్న ముఖ్యాంశాలను మరవకూడదు.

✦ గతంలో నిర్వహించిన సీయూఈటీ-యూజీ ప్రశ్నపత్రాలన్నీ గమనించాలి. ప్రశ్నల తీరు, స్థాయి పరిశీలించాలి. ఏ అంశాలకు అధిక ప్రాధాన్యమిస్తున్నారో గ్రహించి, వాటిని ప్రత్యేక ప్రాధాన్యంతో బాగా చదవాలి.

✦ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ వెబ్‌సైట్‌లో ఆ సంస్థ గతంలో నిర్వహించిన ప్రశ్నపత్రాలు ఉన్నాయి. అధ్యయనంలో అవీ ఉపయోగమే.

✦ ప్రతి సబ్జెక్టులోనూ చాప్టర్ల వారీ వీలైనన్ని మాదిరి ప్రశ్నలు సాధన చేయాలి.

✦ పరీక్షకు ముందు మాక్ టెస్టులు రాయాలి. ఫలితాలను విశ్లేషించుకుని, వెనకబడిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలి. తప్పులు పునరావృతం కాకుండా చూసుకోవాలి.

✦ రుణాత్మక మార్కులు ఉన్నందున, తెలియని ప్రశ్నలు వదిలేస్తేనే ప్రయోజనం.

తెలుగు రాష్ట్రాల్లో

✦ ఇంటిగ్రేటెడ్ విధానంలో ఐదేళ్ల ఎంఏ, ఎమ్మెస్సీ కోర్సులను పలు విభాగాల్లో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో అందిస్తున్నారు. ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కోర్సులు: మ్యాథమెటికల్ సైన్సెస్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, అప్లయిడ్ జియాలజీ, సైకాలజీ. ఇంటిగ్రేటెడ్ ఎంఏ కోర్సులు (హ్యూమానిటీస్, సోషల్ సైన్సెస్): తెలుగు, హిందీ, లాంగ్వేజ్ సైన్సెస్, ఉర్దూ, ఫిలాసఫీ, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, సోషియాలజీ, ఆంత్రపాలజీ ఉన్నాయి.

✦ సమ్మక్క సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీలో బీఏ ఇంగ్లిష్, బీఏ ఎకనామిక్స్, బీబీఏ, బీఎస్ కోర్సులు ఆనర్స్ విధానంలో నాలుగేళ్ల వ్యవధితో అందిస్తున్నారు. ఇక్కడ బీటెక్ (సీఎస్ఈ అండ్ ఏఐ) కోర్సూ ఉంది.

✦ ఏపీ ట్రైబల్ యూనివర్సిటీలో బీఎస్సీ, బీబీఏ, బీకాం కోర్సులు అందిస్తున్నారు.

✦ ఏపీ సెంట్రల్ యూనివర్సిటీలో బీఏ, బీఎస్సీ, బీబీఏ, బీకాంతో పాటు బీటెక్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ కోర్సూ ఉంది.

✦ ఈఎఫ్ఎల్ యూనివర్సిటీలో బీఏ: ఇంగ్లిష్, డిజిటల్ కమ్యూనికేషన్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, హిందీ, అరబిక్, చైనీస్, ఫ్రెంచ్, జర్మన్, ఇటాలియన్, జపనీస్, కొరియన్, పర్షియన్, రష్యన్, స్పానిష్ కోర్సులు అందిస్తున్నారు.

వివరాలు

అర్హత: ఇంటర్మీడియట్/ ప్లస్ 2. (సంస్థలు, కోర్సుల ప్రకారం.. ఇంటర్ గ్రూపు, మార్కులు శాతంలో కొద్దిగా వ్యత్యాసాలు ఉంటాయి)

ఆన్‌లైన్ దరఖాస్తులు: జనవరి 31 వరకు స్వీకరిస్తారు.

పరీక్షలు: మే 11 నుంచి 31 వరకు నిర్వహిస్తారు.

దరఖాస్తు ఫీజు: జనరల్(యూఆర్) 3 సబ్జెక్టులకు రూ.1000, అదనంగా ఒక్కో పేపర్‌కూ రూ.400. ఓబీసీ-ఎన్‌సీఎల్, ఈడబ్ల్యూఎస్ 3 సబ్జెక్టులకు రూ.900, ఒక్కో అదనపు పేపర్‌కూ రూ.375. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, థర్డ్ జండర్ 3 సబ్జెక్టులకు రూ.800. అదనంగా ఒక్కో పేపర్‌కూ రూ.350.

వెబ్‌సైట్: https://cuet.nta.nic.in/

రిలేషన్‌షిప్ మేనేజర్లు

ఇండియన్ బ్యాంక్ అనుబంధ సంస్థ ఇండ్ బ్యాంక్ మర్చెంట్ బ్యాంకింగ్ సర్వీసెస్ లిమిటెడ్ రిలేషన్‌షిప్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

● రిలేషన్‌షిప్ మేనేజర్- 10 పోస్టులు ● డిజిటల్ మార్కెటింగ్ స్పెషలిస్ట్: 01 పోస్టు ● సెక్రటేరియల్ ఆఫీసర్-ట్రెయినీ: 01 పోస్టు ● డీలర్- స్టాక్ బ్రోకింగ్ టర్మినల్స్- 08 పోస్టులు

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, ఎంబీఏతో పాటు ఉద్యోగానుభవం, ఎన్ఐఎస్ఎం సర్టిఫికేషన్ ఉండాలి.

వయసు: డిజిటల్ మార్కెటింగ్ స్పెషలిస్టుకు 26-40 ఏళ్లు, ఇతర పోస్టులకు 21-35 ఏళ్ల మధ్య ఉండాలి. **వేతనం:** ఏడాదికి రిలేషన్‌షిప్ మేనేజర్‌కు రూ.4 లక్షల నుంచి 5 లక్షలు, డిజిటల్ మార్కెటింగ్ స్పెషలిస్టుకు రూ.5 లక్షల నుంచి 8 లక్షలు, సెక్రటేరియల్ ఆఫీసర్-ట్రెయినీకి రూ.3.50 లక్షలు; డీలర్‌కు రూ.4.20 లక్షలు. **ఎంపిక:** ఇంటర్వ్యూతో.

దరఖాస్తు: హెడ్ అడ్మినిస్ట్రేషన్ నం.480, మొదటి అంతస్తు, కివ్‌రాజ్ కాంప్లెక్స్, అన్నా సలై, నందనం, చెన్నై చిరునామాకు పోస్టులో పంపాలి.

దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ: 25.01.2026.

వెబ్‌సైట్: https://www.indbankonline.com/

ఈసీఐఎల్‌లో టెక్నీషియన్లు

ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఈఎస్ఐఎల్), హైదరాబాద్.. ఒప్పంద ప్రాతిపదికన పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

● టెక్నీషియన్: 13 ● సూపర్‌వైజర్: 05 ● డ్రాఫ్ట్స్‌మెన్: 02

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమాతో పాటు పని అనుభవం ఉండాలి.

వయసు: 35 ఏళ్లలోపు ఉండాలి. **వేతనం:** నెలకు రూ.30,000-41,000. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 20. **ఎంపిక:** ఇంటర్వ్యూతో

వెబ్‌సైట్: https://www.ecil.co.in/jobs.html

ఐఆర్ఈడీఏలో

ఇండియన్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఐఆర్ఈడీఏ) లిమిటెడ్ అప్రెంటిస్‌ల కోసం దరఖాస్తులు కోరుతోంది.

● ఫైనాన్స్ అండ్ అకౌంట్స్: 05
● ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ: 05

అర్హత: బీకాం, బీబీఏ, డిప్లొమా (సీఎస్/ఐటీ)

స్టైపెండ్: నెలకు గ్రాడ్యుయేట్లకు రూ.18,000; డిప్లొమాతో రూ.16,000.

వయసు: 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎంపిక: షార్ట్‌లిస్ట్, విద్యార్హతల ప్రతిభతో.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 20-01-2026.

వెబ్‌సైట్: https://nats.education.gov.in/

17 లీటర్ల పాలిస్తున్న దేశీయ హైబ్రిడ్ ఆవు



దేశీయ హైబ్రిడ్ ఆవు రోజుకు 17 లీటర్ల పాలిస్తోంది. ఇది హరియాణాలోని కర్ణాల్‌లో జరిగిన 'డెయిరీ బ్యూటీ' పోటీల్లో పాల్గొని విజేతగా నిలిచింది. 5.5 ఏళ్ల వయసున్న ఈ ఆవు ధర రూ.15 లక్షలు. అయితే దానిని విక్రయించడానికి జింద్‌కు చెందిన దాని యజమాని సంజీత్ మోర్ నిరాకరించారు. 'నేను బీఎస్సీ నర్సింగ్ చదువుతున్నా. దీంతో పాటు కుటుంబ వృత్తి అయిన వ్యవసాయాన్ని కొనసాగిస్తున్నా. ఈ ఆవు పేరు గోరన్. అది శివరాత్రినాడు జన్మించింది. ఈ హరియాణీ బ్రీడ్ ఆవు కోసం పదేళ్లపాటు పని చేశా. ఇది అత్యధికంగా 17.5 లీటర్ల పాలిచ్చింది. ఇటువంటి ఆవులు నా దగ్గర 8 ఉన్నాయి' అని సంజీత్ తెలిపారు.

స్కేటింగులో రుద్రాంశ్ ప్రతిభ పద్నాలుగేళ్లకే 37 పతకాలు



ఝార్ఖండ్‌లోని ధన్‌బాద్‌కు చెందిన రుద్రాంశ్ వయసు పద్నాలుగేళ్లు కాగా, స్కేటింగులో ఇప్పటికే 37 పతకాలను సాధించాడు. ఇందులో 10 బంగారు, 17 వెండి, మిగతా కాంస్య పతకాలు. డిసెంబరు నెలాఖరున గ్వాలియర్‌లో జరిగిన జాతీయ స్కేటింగు పోటీల్లో స్వర్ణం గెలిచాడు. భారత ప్రభుత్వ క్రీడలు, విద్యాశాఖ నిర్వహించిన ఈ పోటీల్లో రుద్రాంశ్ 500 మీటర్ల రింక్ రేసులో కాంస్యం, ల్యాప్ రేసులో బంగారు పతకం సాధించాడు. నాలుగేళ్ల వయసులో రుద్రాంశ్ మొదటి పతకం గెలుచుకున్నట్లు తండ్రి రజనీశ్ కుమార్ తెలిపారు. గుర్గావ్‌లో జరిగిన మరో పోటీలో భారత్‌తోపాటు ఒమన్, సింగపూర్, దుబాయ్, మారిషస్ వంటి దేశాల విద్యార్థులు పాల్గొన్నారు.. ఈ పోటీల్లోనూ రుద్రాంశ్ బంగారు, వెండి పతకాలు గెలుచుకున్నాడు. ఝార్ఖండ్‌లో స్కేటింగు కోసం వసతులు పెద్దగా లేవు. మంచి వేగంతో స్కేటింగు చేసే ఈ విద్యార్థికి సదుపాయాలు కల్పిస్తే అంతర్జాతీయ స్థాయిలోనూ రాణిస్తాడని కోచ్ అభిషేక్ కుమార్ తెలిపారు. ఒలింపిక్స్‌లో భారత్‌కు స్వర్ణం సాధించడం తన కలగా చెబుతున్న రుద్రాంశ్ ఆ దిశగా తీవ్రంగా శ్రమిస్తున్నాడు.

దిల్లీలో మూడేళ్ల కనిష్ఠానికి ఉష్ణోగ్రతలు

దిల్లీ: దేశ రాజధాని దిల్లీని చలి గజగజ వణికిస్తోంది. మంగళవారం ఉదయం కనిష్ఠ ఉష్ణోగ్రత 3 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైనట్లు భారత వాతావరణ విభాగం(ఐఎండీ) వెల్లడించింది. సఫ్దర్‌జంగ్‌లో ఉష్ణోగ్రత సాధారణం కన్నా 4.4 డిగ్రీలు తక్కువగా 3 డిగ్రీలుగా నమోదైంది. పాలంలో 3.3 డిగ్రీలు, లోధిలో 3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మూడేళ్ల క్రితం 2023 జనవరి 16న కనిష్ఠ ఉష్ణోగ్రత రికార్డు స్థాయిలో 1.4 డిగ్రీలుగా నమోదైంది. ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా 4.5 నుంచి 6.4 డిగ్రీలు తక్కువగా నమోదైతే దానిని అతిశీతల గాలుల పరిస్థితులుగా ప్రకటిస్తారు. బుధవారం కూడా చలి గాలులు కొనసాగే అవకాశమున్నదని ఐఎండీ తెలిపింది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రకారం.. దిల్లీలో వాయు కాలుష్య నాణ్యత సూచీ(ఏక్యూఐ) 337గా ఉంది. 29 కేంద్రాల్లో గాలి నాణ్యత పేలవంగా, ఒక కేంద్రంలో ప్రమాదకర స్థాయిలో, తొమ్మిది కేంద్రాల్లో తక్కువ నాణ్యత నమోదైంది. ఆనంద్ విహార్ వద్ద ప్రమాదకర స్థాయిలో ఏక్యూఐ 411 పాయింట్లుగా నమోదైంది.

ప్రపంచ బాధ్యతాయుత దేశాల సూచిక త్వరలో..

దిల్లీ: 'బాధ్యతాయుత దేశాల సూచిక (ఆర్ఎన్ఐ)'ను మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఈనెల 19న ప్రారంభిస్తారని అధికారులు ప్రకటించారు. వివిధ దేశాలు తమ పౌరులు, ప్రపంచ దేశాలు, భూమండల అభ్యున్నతికి సంబంధించి అధికారాలను ఏ విధంగా ఉపయోగిస్తున్నాయన్నది తెలిపేందుకు ఈ సూచికను రూపొందించారు. జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్-ముంబయిలతో కలిసి ప్రపంచ మేధావుల ఫౌండేషన్ (డబ్ల్యూఐఎఫ్) ఈ సూచికను రూపొందించింది. వివిధ దేశాల ప్రభుత్వాలు ఎంత బలంగా ఉన్నాయనేకాక ఎంత బాధ్యతగా ప్రవర్తిస్తున్నాయన్న విషయంపై చర్చకు ఈ సూచీ దారితీస్తుందని డబ్ల్యూఐఎఫ్ కార్యదర్శి సుధాంశు మిత్తల్ అన్నారు. విలువలకు, సమగ్రతకు, సహకారానికి పెద్దపీట వేయడం ద్వారా 21వ శతాబ్దంలో ప్రగతికి, నాయకత్వానికి కొత్త నిర్వచనాన్ని ఆర్ఎన్ఐ ఇవ్వబోతోందని ఆయన విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. అంతర్గతంగా, పర్యావరణ కోణంలో, విదేశీ వ్యవహారాల పరంగా వివిధ దేశాలు ఏమేరకు బాధ్యతాయుతంగా ఉన్నాయో ఈ సూచీ తెలియజేస్తుందన్నారు. పూర్తి పారదర్శకత ప్రాతిపదికన ప్రపంచస్థాయి గణాంకాల ఆధారంగా ఈ సూచికలో 154 దేశాలకు స్థానం కల్పించామని తెలిపారు.

54 లక్షల మంది అర్హులైన ఓటర్ల పేర్లు తొలగింపు

- వారికి ఒక్క అవకాశమూ ఇవ్వలేదు
- పశ్చిమ బెంగాల్ సీఎం మమత వెల్లడి



కోల్‌కతాలో మీడియాతో మాట్లాడుతున్న పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో 54 లక్షల మంది అర్హులైనవారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి ఎన్నికల సంఘం (ఈసీ) తొలగించిందని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) సందర్భంగా ఏకపక్షంగా ఈ తొలగింపులు చోటుచేసుకున్నాయని, తమ స్థానికతను నిరూపించుకోవడానికి వారికి ఒక్క అవకాశమూ ఇవ్వలేదని విమర్శించారు. ఇందుకోసం ఓటర్ల నమోదు అధికారుల (ఈఆర్‌వోల) అధికారాలను ఈసీ దుర్వినియోగం చేసిందని ధ్వజమెత్తారు. మంగళవారం కోల్‌కతాలోని సెక్రటేరియట్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. 'దిల్లీలో కూర్చుని ఈసీ అధికారులు.. భాజపా సహకారంతో ఏఐ టూల్స్‌ను ఉపయోగించి పేర్లను తొలగించారు. వివాహం చేసుకున్న తర్వాత ఇంటి పేరు మార్చుకున్న మహిళల పేర్లనూ ఓటర్ల జాబితా నుంచి తొలగించారు. బతికున్న ఎంతో మంది ఓటర్లనూ చంపేశారు. 54 లక్షల మంది పేర్లను తొలగించాలని ఈఆర్‌వోలకు బాధ్యతలను అప్పగించారు. అయితే చాలా ఘటనల్లో ఓటర్ల పేర్లను తాము తొలగించినట్లు ఈఆర్‌వోలకే తెలియదు' అని మమత ఆరోపించారు. తుది జాబితా నుంచి మరో కోటి మంది ఓటర్ల పేర్లను తొలగించడానికి భాజపా-ఈసీ కలిసి కుట్ర పన్నాయని విమర్శించారు. 'ఇంకా 1.36 కోట్ల మంది ఓటర్ల పేర్లను పరిశీలిస్తామని ఈసీ చెబుతోంది. ఇది అసంబద్ధం. నోబెల్ బహుమతి గ్రహీత అమర్త్య సేన్, కవి జాయ్ గోస్వామి, క్రికెటర్లు మహమ్మద్ షమి, లక్ష్మీ రతన్ శుక్లాలకూ నోటీసులు పంపింది. రెండోసారి పరిశీలనకు బీఎల్ఏలను అనుమతించడం లేదు. మరో కోటి మంది పేర్లను తొలగించే కుట్ర జరుగుతోంది' అని మమత ఆరోపించారు.

ఈపీఎస్ పెన్షనర్ల ఇంటివద్దే డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్

ఇంటర్నెట్ డెస్క్: ఉద్యోగుల పెన్షన్ పథక (ఈపీఎస్) పింఛన్‌దారుల కోసం ఉద్యోగ భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) ఓ వెసులుబాటు కల్పించింది. ఇంట్లో నుంచే డిజిటల్ రూపంలో జీవన ప్రమాణ ధ్రువీకరణ పత్రం (లైఫ్ సర్టిఫికేట్)ను సమర్పించే సదుపాయం తీసుకొచ్చింది. దీనికోసం 'ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్' (ఐపీపీబీ)తో జట్టుకట్టింది. ముఖ్యంగా బ్యాంకులు, ఈపీఎఫ్ కార్యాలయాలకు వెళ్లలేని వృద్ధులు, లైఫ్ సర్టిఫికేట్‌ను సమర్పించేందుకు మొబైల్ ఫోన్‌ను వినియోగించలేనివారి కోసం ఈ సదుపాయాన్ని తీసుకొచ్చింది. ఈ మేరకు ఓ ఉత్తర్వు జారీ చేసింది. పోస్ట్‌మ్యాన్ లేదా డాక్ సేవకులు ఇంటికొచ్చి డిజిటల్ పత్రం ప్రక్రియను పూర్తి చేస్తారు. దీనిని పొందేందుకు ఐపీపీబీ కస్టమర్ కేర్ నంబరుకు కాల్ చేయాల్సి ఉంటుంది. ఎలాంటి రుసుం అవసరం లేదు. పోస్ట్‌మ్యాన్/డాక్‌సేవక్‌లు ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ ధ్రువీకరణతో డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ పూర్తిచేస్తారు. ఇతర పింఛన్‌దారుల మాదిరిగా కాకుండా.. ఈపీఎస్ పెన్షనర్లు ఎప్పుడైనా లైఫ్ సర్టిఫికేట్ సమర్పించొచ్చు. ఒకసారి సమర్పించిన పత్రం ఏడాదిపాటు చెల్లుతుంది.

కెనడాలో 400 కిలోల బంగారం చోరీ!

- మూడేళ్లుగా ఆచూకీలేని సొత్తు
- నిందితుడు భారత్‌కు పరారయ్యాడని అనుమానం

ఇంటర్నెట్‌డెస్క్: కెనడాలోని టొరంటో విమానాశ్రయంలో మూడేళ్ల క్రితం చోరీ అయిన 400 కిలోల బంగారం ఆచూకీ ఇప్పటికీ లభించలేదు. తాజాగా ఓ నిందితుడిని అరెస్టు చేసినట్లు అక్కడి పోలీసులు వెల్లడించారు. ఓ కంటైనర్‌లోని 400 కిలోల బరువైన బంగారం, 2.5 మిలియన్ కెనడియన్ డాలర్ల నగదును కొందరు దుండగులు అప్పట్లో మాయం చేశారు. ఈ కేసులో కీలక నిందితుడైన సిమ్రన్‌ప్రీత్ పనేసర్ అనే వ్యక్తి భారత్‌లోనే ఉన్నట్లు కెనడా పోలీసులు వెల్లడించారు. మరో నిందితుడైన అర్సలాన్ చౌధరీని తాజాగా అరెస్టు చేశారు. దుబాయ్ నుంచి వస్తూ టొరంటో పియర్సన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో దిగగానే అర్సలాన్‌ను అరెస్టు చేసినట్లు చెప్పారు. టొరంటోలోని ఓ బ్యాంక్‌లో భద్రపర్చేందుకు 400 కిలోల బంగారాన్ని తీసుకొచ్చారు. విమానం నుంచి దించిన కంటైనర్‌ను ఎయిర్‌పోర్ట్‌లోని గోదాములో భద్రపర్చారు. మరుసటి రోజు పోలీసులు వెళ్లి చూడగా.. కంటైనర్‌లోని బంగారం, నగదు మాయమైంది. కెనడా చరిత్రలోనే అతిపెద్ద దోపిడీగా అప్పట్లో ఈ ఘటన పెను సంచలనం సృష్టించింది. నకిలీ పత్రాలతో గోదాములోని సిబ్బందే దాన్ని మాయం చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తెలిసింది. ఆ సమయంలో గోదాములో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు భారతీయులతో సహా 9 మందిపై కేసు నమోదైంది. ఇప్పటివరకు ఆ బంగారాన్ని పోలీసులు గుర్తించలేదు. కొంత మొత్తం నగదు మాత్రం స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.



రొమేనియా రాజధాని బుకారెస్ట్‌లో అతి శీతల వాతావరణం కారణంగా గడ్డకట్టిన ఓ సరస్సు వద్ద ఆహారం కోసం అన్వేషిస్తున్న బాతులు

నిరుపేదల బడి ప్రవేశం జాతీయ లక్ష్యం కావాలి



- సుప్రీంకోర్టు పిలుపు

దిల్లీ: నిరుపేద పిల్లలకు విద్యా సంస్థల్లో ప్రవేశం కల్పించడం మన జాతీయ లక్ష్యం కావాలని సుప్రీంకోర్టు మంగళవారం పిలుపునిచ్చింది. ప్రైవేటు అన్‌ఎయిడెడ్ మైనారిటీయేతర పాఠశాలల్లో 25 శాతం ప్రవేశాలు సామాజికంగా, ఆర్థికంగా వెనకబడిన వర్గాల పిల్లలకు కల్పించడానికి నిబంధనలు రూపొందించాలని కోర్టు సంబంధిత సంస్థలను ఆదేశించింది. ఈడబ్ల్యూఎస్ కేటగిరీకి చెందిన పిల్లలకు ప్రవేశం కల్పించడం ప్రభుత్వాల, స్థానిక అధికారుల బాధ్యత అని జస్టిస్ పి.ఎం.నరసింహ, జస్టిస్ అతుల్ ఎస్ చందూర్కర్‌ల ధర్మాసనం పేర్కొంది. అలా ప్రవేశం పొందే హక్కు తమ పిల్లలకు దక్కలేదని ఫిర్యాదు చేసే తల్లిదండ్రుల సమస్య పరిష్కరించేందుకు కోర్టులు చొరవ చూపాలంది. విద్యాహక్కు చట్టం కింద పాఠశాల ప్రవేశం పొందడంలో ఈడబ్ల్యూఎస్ కేటగిరీ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై దాఖలైన వ్యాజ్యంపై విచారణ జరుపుతూ కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. సమీప పాఠశాలలో సీట్లున్నప్పటికీ 2016లో తన పిల్లలకు ప్రవేశం లభించక పోవడంతో ఒకవ్యక్తి బాంబే హైకోర్టు తలుపు తట్టాడు. ఆ వ్యక్తి ఆన్‌లైన్ పద్ధతిలో ప్రవేశ దరఖాస్తు చేసుకోవడంలో విఫలమయ్యాడంటూ పిటిషన్‌ను కోర్టు తిరస్కరించడంతో సుప్రీంకోర్టులో అప్పీలు చేసుకున్నారు. హైకోర్టు ఆదేశానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్ ఎక్కువ కాలం పెండింగులో ఉండటం దురదృష్టకరమని న్యాయమూర్తులు అన్నారు. అమలు చేయడానికి వీలున్న నిబంధనలేవీ లేకుంటే రాజ్యాంగంలోని 21ఏ అధికరణం, విద్యాహక్కు చట్టంలోని సెక్షన్ 12(1)(సి)లు నిరర్థకమవుతాయని కోర్టు పేర్కొంది. సంబంధిత అధికారులు జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, రాష్ట్రస్థాయి బాలల హక్కుల పరిరక్షణ కమిషన్లతో సంప్రదించి ఈడబ్ల్యూఎస్ విద్యార్థుల ప్రవేశానికి నిబంధనలు రూపొందించాలని ఆదేశించింది.

దివ్యాంగులను చేర్చుకోవడాన్ని వ్యూహాత్మక ప్రయోజనంగా భావించండి

- కంపెనీలకు సుప్రీంకోర్టు సూచన

దిల్లీ: వ్యాపారాల పురోగతి, బలోపేతంతో పాటు సామాజిక ప్రభావం కోసం దివ్యాంగులను సంస్థలలోకి చేర్చుకోవాలని కంపెనీలు, పెట్టుబడిదారులకు సుప్రీంకోర్టు సూచించింది. ప్రభుత్వ నిబంధనలను పాటించాలనే ఉద్దేశంతోనే కాకుండా దీనివల్ల కలిగే వ్యూహాత్మకమైన ప్రయోజనాలనూ గుర్తించాలని జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ కె.వి.విశ్వనాథన్ ధర్మాసనం పేర్కొంది. దివ్యాంగుల హక్కుల పరిరక్షణ కోణంలోనూ, కార్పొరేట్ సామాజిక బాధ్యత నెరవేర్చే సంకల్పంలో భాగంగానూ చూడాలని తెలిపింది. పర్యావరణం, పాలనాచట్రంతో ముడిపడిన సామాజిక కోణం దృష్టిలోనూ దివ్యాంగులను కలుపుకుని పోవడం ప్రాధాన్యం కలిగిన అంశమేనని ధర్మాసనం అభిప్రాయపడింది. పలు శారీరక సమస్యలతో దివ్యాంగురాలైన సుజాత బోరా అనే మహిళ కోసం అస్సాంలోని కోల్ ఇండియా లిమిటెడ్‌కు చెందిన నార్త్ ఈస్ట్రన్ కోల్‌ఫీల్డ్స్ కార్యాలయంలో అదనపు ఉద్యోగాన్ని సృష్టించాలని ఆ సంస్థ ఛైర్మన్‌ను ధర్మాసనం ఆదేశించింది. మేనేజ్‌మెంట్ ట్రైనీగా ఇంటర్వ్యూలో ఎంపిక అయినప్పటికీ శారీరకమైన లోపాలను చూపుతూ ఉద్యోగాన్ని నిరాకరించడంతో ధర్మాసనం ఈ నిర్ణయం వెలువరించింది.

మామగారి ఆస్తి నుంచి వితంతువుకు పోషణ వ్యయం ఇవ్వాలి: సుప్రీంకోర్టు

దిల్లీ: భర్తను కోల్పోయిన వితంతువు కూడా మామగారి మరణం తర్వాత మెట్టినింటి కుటుంబ ఆస్తి నుంచి నిర్వహణ ఖర్చులు పొందవచ్చని సుప్రీంకోర్టు మంగళవారం తీర్పు చెప్పింది. మామగారు తన భర్తకన్నా ముందు మరణించారా, తర్వాత మరణించారా అన్నది అప్రస్తుతమని జస్టిస్ పంకజ్ మిథల్, జస్టిస్ ఎస్.వి.ఎన్.భట్‌ల ధర్మాసనం పేర్కొంది. హిందూ దత్తత, జీవిక చట్టం (హెచ్ఏఎంఏ)- 1956 ప్రకారం అలాంటి వితంతువుకు 'మెట్టినింటి కుటుంబంపై ఆధారపడిన వ్యక్తి'గా హోదా లభిస్తుందని స్పష్టం చేసింది. మరణించిన వ్యక్తి వారసులందరూ అతని ఆస్తి నుంచి.. కుటుంబంపై ఆధారపడినవారికి నిర్వహణ వ్యయం చెల్లించాల్సిందేనని తెలిపింది. కుటుంబంపై ఆధారపడిన వ్యక్తిగా మృతుని కోడలికి గుర్తింపు లభిస్తుందని, నిర్వహణ వ్యయం పొందే హక్కు ఆమెకు ఉంటుందని న్యాయమూర్తులు అభిప్రాయపడ్డారు. వితంతు కోడలు తన కాళ్లపై తాను నిలవలేని స్థితిలో ఉన్నప్పుడు ఆమె నిర్వహణ భారం మోసే బాధ్యత మామగారిపై ఉంటుందని కోర్టు పేర్కొంది. మామగారు మరణించి ఉంటే ఆయన వదిలి వెళ్లిన ఆస్తి నుంచి ఆమెకు నిర్వహణ వ్యయం చెల్లించాలని తెలిపింది. 2021లో మృతిచెందిన మహేంద్ర ప్రసాద్ అనే వ్యక్తి ఆస్తికి సంబంధించి తలెత్తిన వివాదంపై విచారణ సందర్భంగా కోర్టు ఈ స్పష్టత ఇచ్చింది.

ప్రధాని మోదీ విద్యార్హతల కేసులో.. కేజ్రీవాల్‌కు హైకోర్టులో దక్కని ఊరట

అహ్మదాబాద్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విద్యార్హతల మీద చేసిన వ్యాఖ్యలను పురస్కరించుకుని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నేతలు అరవింద్ కేజ్రీవాల్, సంజయ్ సింగ్‌ల మీద దాఖలైన పరువు నష్టం దావా కేసుల్లో తమపై విడివిడిగా విచారణ జరపాలని వారు చేసిన విజ్ఞప్తిని దిగువ కోర్టులు కొట్టేసిన సంగతి తెలిసిందే. దీన్ని ఉభయులూ గుజరాత్ హైకోర్టులో సవాలుచేయగా అక్కడ కూడా ఊరట లభించలేదు. వారి పిటిషన్లను మంగళవారం హైకోర్టు కొట్టేసింది. ప్రధాని మోదీ విద్యార్హతలపై కేజ్రీవాల్, సంజయ్ సింగ్ చేసిన వ్యంగ్య వ్యాఖ్యలు తమకు అప్రతిష్ఠ తెచ్చిపెట్టాయని గుజరాత్ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ పియూష్ పటేల్ పరువు నష్టం దావా వేశారు. తాము వేర్వేరు సందర్భాల్లో, వేర్వేరు సమయాల్లో, వేర్వేరు వ్యాఖ్యలు చేశామని రిజిస్ట్రార్ ఆరోపించారు కాబట్టి తమపై విడివిడిగా విచారణ జరపాలని కేజ్రీవాల్, సంజయ్‌లు సెషన్స్ కోర్టుకు అర్జీ పెట్టుకున్నారు. వాటిని సెషన్స్ కోర్టుతో పాటు హైకోర్టూ కొట్టివేసింది.

యూపీ గ్యాంగ్‌స్టర్ అబ్బాస్ అన్సారీకి మధ్యంతర బెయిలు ఖరారు

దిల్లీ: గ్యాంగ్‌స్టర్ చట్టం కింద అరెస్టయిన ఉత్తర్‌ప్రదేశ్ శాసనసభ్యుడు అబ్బాస్ అన్సారీకి మధ్యంతర బెయిలు మంజూరు చేస్తూ గతంలో తాను ఇచ్చిన ఆదేశాలను సుప్రీంకోర్టు మంగళవారం ఖరారు చేసింది. అబ్బాస్ అన్సారీ గ్యాంగ్‌స్టర్‌గా పేరుమోసి 2024 మార్చిలో మృతిచెందిన ముఖ్తార్ అన్సారీ కుమారుడు. అబ్బాస్ అన్సారీ తదితరులపై 2024 ఆగస్టు 31న ఉత్తర్‌ప్రదేశ్ గ్యాంగ్‌స్టర్లు, అసాంఘిక కార్యకలాపాల నిరోధక చట్టం 1986 కింద కేసు నమోదుచేశారు. బలవంతపు వసూళ్లకు, దాడికి పాల్పడ్డారన్నది వారిపై అభియోగం. ఈ కేసులో గత మార్చి 7న, అత్యున్నత న్యాయస్థానం అన్సారీకి ఆరు వారాల మధ్యంతర బెయిలు మంజూరు చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం. పంచోలీలతో కూడుకున్న ధర్మాసనం సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్, న్యాయవాది నిజాం పాషాల వాదనలు విన్న అనంతరం బెయిలు ఖరారు చేసింది. అబ్బాస్ అన్సారీని 2024 సెప్టెంబరు 6న గ్యాంగ్‌స్టర్ చట్టం కింద అరెస్టు చేశారు. సుప్రీం తీర్పుతో అతని విడుదలకు మార్గం సుగమమైంది.

అబూ సలీం పెరోల్‌పై హైకోర్టు విచారణ

ముంబయి: సోదరుడి కర్మకాండలకు హాజరు కావడానికి 14 రోజులపాటు పెరోల్ ఇవ్వాలని మాఫియా డాన్ అబూ సలీం చేసిన విజ్ఞప్తిపై వచ్చే వారం విచారణ జరుపుతామని బాంబే హైకోర్టు మంగళవారం ప్రకటించింది. సలీం అంతర్జాతీయ నేరస్థుడు కాబట్టి అతడికి 2 రోజుల ఎమర్జెన్సీ పెరోల్ మాత్రమే ఇవ్వాలని అంతకుముందు మహారాష్ట్ర ప్రభుత్వం కోరింది. దీనిపై అఫిడవిట్ సమర్పించాలని హైకోర్టు సూచించింది. 1993లో ముంబయి వరుస బాంబు పేలుళ్ల కేసులో సలీం దోషిగా తేలాడు. నిరుడు నవంబరులో అతడి అన్న అబూ హకీం అన్సారి కన్నుమూయడంతో కర్మకాండలకు హాజరుకావడానికి 14 రోజుల పెరోల్ ఇవ్వాలని సలీం డిసెంబరులో అర్జీ పెట్టుకున్నారు. క్రిస్మస్ సెలవుల వల్ల సలీం అర్జీపై కోర్టు విచారణ చేపట్టలేకపోయింది.

ఝార్ఖండ్‌లో 'గజ'గజ

- ఏనుగు దాడిలో 11 రోజుల్లో 22 మంది మృతి

రాంచీ: ఝార్ఖండ్‌లోని పశ్చిమ సింహ్‌భూమ్ జిల్లాలో ఓ అడవి ఏనుగు బీభత్సం సృష్టిస్తోంది. దాదాపు 30 గ్రామాలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఎక్కడి నుంచి ఏనుగు వచ్చి దాడి చేస్తుందోనని స్థానిక ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.



ఏనుగు దాడిలో 11 రోజుల్లో 22 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు తెలిపారు. దీంతో గజరాజును పట్టుకునేందుకు ఝార్ఖండ్, ఒడిశా రాష్ట్రాల అటవీ బృందాలు సంయుక్తంగా గాలింపు చర్యలు చేపట్టాయి. డ్రోన్ల సాయంతో అటవీ, సరిహద్దు ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నాయి. అయినా ఏనుగు ఆచూకీ లభించడం లేదు. వరుస దాడులతో ప్రజలు ఒంటరిగా నిద్రపోవడానికి భయపడుతున్నారు. బేనీసాగర్, ఖడ్పోస్ ప్రాంతాల్లోని చాలా గ్రామాల్లో 15-20 మంది ఒకే ఇంట్లో నిద్రపోతున్నారు. ప్రస్తుతం ఒడిశా సరిహద్దుకు దగ్గర్లో ఉన్న దాదాపు 30 గ్రామాలను హైఅలర్ట్‌లో ఉంచామని అటవీశాఖ వెల్లడించింది. రాత్రిపూట ఒంటరిగా బయటకు వెళ్లొద్దని, అడవి వైపు వెళ్లడం మానుకోవాలని గ్రామస్థులకు సూచనలు జారీ చేసింది.

భూపెన్ హజారికా సోదరుడు సమర్ మృతి

గువాహటి: ప్రముఖ అస్సామీ స్వరకర్త, బహుముఖ ప్రజ్ఞాశాలి భూపెన్ హజారికా సోదరుడు, గాయకుడు సమర్ హజారికా (75) మృతిచెందారు. కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మంగళవారం అస్సాంలోని నిజారాపూర్‌లో తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. 10మంది తోబుట్టువుల్లో ఆయన చిన్నవాడు. రేడియోలు, పలు సినిమాలు, ఆల్బమ్‌లకు సంగీత స్వరకర్తగా పనిచేశారు. గాయకుడిగా మంచిపేరు సంపాదించుకున్నారు. సమర్ మృతిపట్ల అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ, కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఉన్నత విద్యాసంస్థల్లో వివక్ష నిర్మూలనకు చర్యలు

- ప్రతి విద్యాసంస్థ 'సమాన అవకాశాల కేంద్రం' ఏర్పాటు చేయాలని యూజీసీ నిర్దేశం
- పాటించకపోతే డిబార్‌కు అవకాశం

ఈనాడు, దిల్లీ: ఉన్నత విద్యాసంస్థల్లో వివక్ష నిర్మూలనకు యూజీసీ నడుం కట్టింది. ప్రాంత, జాతి, కుల, లింగ, జన్మ స్థల, వైకల్యపరంగా విద్యార్థులు, సిబ్బంది పట్ల చూపుతున్న వివక్ష నిర్మూలన కోసం నిబంధనలు జారీ చేసింది. ఇకపై ప్రతి ఉన్నత విద్యాసంస్థ వెంటనే తమ పరిధిలో సమాన అవకాశాల కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్దేశించింది. యూజీసీ (ప్రమోషన్ ఆఫ్ ఈక్విటీ ఇన్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూటషన్స్) రెగ్యులేషన్స్-2026 పేరుతో మంగళవారం రాత్రి ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేసింది. 2012 నాటి నిబంధనల స్థానంలో ఈ కొత్త నిబంధనలు అమల్లోకి వస్తాయని ప్రకటించింది. జాతీయ విద్యా విధానం-2020ని అనుసరించి ఉన్నత విద్యా సంస్థల్లో పూర్తి స్థాయిలో సమానత్వాన్ని ప్రోత్సహించడానికి ఈ నిబంధనలను జారీ చేసినట్లు పేర్కొంది. విద్యార్థులు, బోధనా సిబ్బంది, ఇతర సిబ్బందితోపాటు అన్ని భాగస్వామ్య పక్షాలకు సమానావకాశాలు కల్పించి వివక్షను రూపుమాపడమే ఈ నిబంధనల ముఖ్య లక్ష్యమని యూజీసీ ప్రకటించింది. వీటిని అమలుచేయాల్సిన బాధ్యత ఆయా విద్యా సంస్థల అధిపతులదే. ఏ విద్యా సంస్థలోనూ ఎలాంటి వివక్షకూ తావివ్వకూడదు. 24 గంటలూ సమానత్వ సహాయ కేంద్రం పని చేయాలి. అన్ని చోట్లా నిఘా కోసం సమానత్వ స్క్వాడ్లను ఏర్పాటు చేయాలి. ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో ప్రచురించాలి. ఉన్నత విద్యా సంస్థ ప్రాంగణాల్లో వివక్షకు గురైనట్లు ఎవరైనా భావిస్తే ఆన్‌లైన్ పోర్టల్, ఈమెయిల్, హెల్ప్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చు. సమాన అవకాశాల కమిటీ దానిపై 24 గంటల్లోపు దర్యాప్తు జరిపి.. 15 రోజుల్లోపు నివేదిక సమర్పించాల్సి ఉంటుంది. దానిపై అంబుడ్స్‌మెన్‌కు అప్పీల్ చేసుకోవడానికి వీలుంటుంది. శిక్షార్హమైన సీరియస్ కేసులుంటే ఆ విషయాన్ని పోలీసులకు కమిటీ పంపుతుంది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో రోహిత్ వేముల ఘటన, ఇటీవల దేహ్రాదూన్‌లో ఈశాన్య రాష్ట్రాలకు సంబంధించిన విద్యార్థిపై జరిగిన దాడులతోపాటు, ఉన్నత విద్యా సంస్థల్లో కుల, లింగ, వైకల్యం పేరుతో వివక్ష చూపకుండా, ర్యాగింగ్‌లు జరగకుండా నిబంధనలను కఠినతరం చేయాలని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం గత ఏడాది సెప్టెంబరు 15వ తేదీన జారీ చేసిన ఆదేశాలను దృష్టిలో ఉంచుకుని యూజీసీ ఈ నిబంధనలను జారీ చేసింది.

ఎప్‌స్టీన్ కేసులో సాక్ష్యం చెప్పేందుకు క్లింటన్‌ల నిరాకరణ

వాషింగ్టన్: జెఫ్రీ ఎప్‌స్టీన్ కేసుకు సంబంధించిన విచారణలో పాల్గొనాల్సిందిగా అమెరికా చట్టసభ జారీచేసిన ఆదేశానికి కట్టుబడి వాంగ్మూలం ఇచ్చేందుకు మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్, ఆయన సతీమణి హిల్లరీ క్లింటన్‌లు నిరాకరించారు. తమను జైలుపాలు చేసే ప్రక్రియలో భాగంగానే హౌస్ ఆఫ్ ఓవర్‌సైట్ కమిటీ ఛైర్మన్ జేమ్స్ కామర్ విచారణకు పిలిపించారని క్లింటన్‌లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో క్లింటన్ దంపతులపై వచ్చేవారం చట్టసభ ధిక్కార విచారణ ప్రక్రియను ప్రారంభిస్తానని కామర్ హెచ్చరించారు. ఓ బాలికను పడుపు రొంపిలోకి దింపిన కేసులో నేర నిర్ధారణకు గురై శిక్షపడిన ఎప్‌స్టీన్ తదనంతరం బడా బాబులకు మైనర్ బాలికల్ని ఎరగా వేసే విస్తృత నెట్‌వర్క్ నడుపుతూ దొరికిపోయాడు. 2019లో ఈ కేసులో కోర్టు విచారణ ఎదుర్కొంటూ జైలు గదిలో ఆత్మహత్య చేసుకున్నాడు. వృత్తిరీత్యా ఫైనాన్షియర్ అయిన ఎప్‌స్టీన్‌కు బిల్ క్లింటన్‌తో సహా కీలక స్థానాల్లో ఉన్న పలువురు ప్రముఖులతో సత్సంబంధాలున్నట్టు విచారణలో తేలింది.



మహారాష్ట్రలోని కొల్హాపుర్‌లో మంగళవారం నిర్వహించిన గ్రామదైవత సిద్ధేశ్వర్ యాత్రకు భారీ సంఖ్యలో హాజరైన భక్తులు

కజకస్థాన్‌లో రోడ్డుప్రమాదం.. భారత విద్యార్థి మృతి

ఇంటర్నెట్ డెస్క్: కజకస్థాన్‌లో విషాదం చోటుచేసుకుంది. రోడ్డు ప్రమాద ఘటనలో ఓ భారతీయ విద్యార్థి మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఘటనపై కజకస్థాన్‌లోని భారత రాయబార కార్యాలయం స్పందించింది. సెమెయ్ వైద్య విశ్వవిద్యాలయానికి చెందిన 11 మంది భారతీయ విద్యార్థులు విహార యాత్రకు వెళ్లి వస్తుండగా ప్రమాదం చోటుచేసుకున్నట్లు తెలిపింది. ప్రాణాలు కోల్పోయిన 25 ఏళ్ల విద్యార్థిని మిలి మోహన్‌గా గుర్తించారు. ఆషికా శీజా మిని సంతోష్, జసీనాకు గాయాలయ్యాయి.

9 అమృత్ భారత్ రైళ్లు.. ఏడు పశ్చిమబెంగాల్ నుంచే

ఇంటర్నెట్ డెస్క్: దేశంలో పలు మార్గాల్లో అమృత్ భారత్ రైళ్ల ప్రవేశపెట్టేందుకు రైల్వేశాఖ రంగం సిద్ధం చేస్తోంది. ఇవి ఏయే స్టేషన్ల మధ్య నడుస్తాయనే విషయాన్ని అధికారులు వెల్లడించారు. మొత్తం తొమ్మిది రైళ్లలో ఏడింటిని పశ్చిమ బెంగాల్ నుంచి వివిధ రాష్ట్రాలకు నడపనుండటం గమనార్హం. గువాహటి (కామాఖ్యా)-రోహ్‌తక్ (హరియాణా), డిబ్రూగఢ్ (అస్సాం)-గోమతీనగర్ (యూపీ); న్యూ జల్పాయిగుడి (పశ్చిమ బెంగాల్)- తిరుచిరాపల్లి (తమిళనాడు), నాగర్‌కోయిల్ (తమిళనాడు); అలీపుర్‌ద్వార్ (పశ్చిమ బెంగాల్) - బెంగళూరు, పన్వేల్ (మహారాష్ట్ర); సంత్రాగచ్చి (పశ్చిమ బెంగాల్) - తాంబరం (తమిళనాడు); హౌడా -ఆనంద్‌విహార్ టెర్మినల్ (దిల్లీ); సియాల్దా (పశ్చిమ బెంగాల్)-బెనారస్ (యూపీ) మధ్య ఈ రైళ్లు నడుస్తాయి.

రైలు టికెట్ ధరల నిర్ణయం వ్యాపార రహస్యమే

- స.హ.చట్టం కింద వెల్లడించాల్సిన అవసరం లేదు: రైల్వేశాఖ

దిల్లీ: ప్రయాణికుల రైళ్లలో టికెట్ ధరలను నిర్ణయించే పద్ధతి వ్యాపార రహస్యం కాబట్టి దాన్ని వెల్లడించనక్కర్లేదని సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ)లోని సెక్షన్ 8 నిర్దేశిస్తోందని కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ)కి రైల్వే బోర్డు తెలిపింది. రైలు టికెట్ ధరలను నిర్ణయించే పద్ధతినీ, గిరాకీని బట్టి టికెట్ ధరలు పెంచడం, తగ్గించడం గురించీ, తత్కాల్ టికెట్ల ప్రభావం గురించీ తెలపాలంటూ వచ్చిన దరఖాస్తుపై రైల్వే బోర్డు ఈ వివరణ ఇచ్చింది. రైల్వే సమాధానాన్ని సీఐసీ ఆమోదిస్తూ దరఖాస్తును కొట్టివేసింది. అప్పీలుదారుడు విచారణకు హాజరు కాలేదనీ, ఇకపై ఈ సమస్యలో ఎటువంటి జోక్యం చేసుకోనక్కర్లేదని తీర్మానించింది. రైళ్లలో వివిధ తరగతులు, వాటిలోని సౌకర్యాల ప్రాతిపదికగా టికెట్ ధరలను నిర్ణయిస్తామని సీఐసీకి రైల్వే బోర్డు వివరించింది. రైల్వే శాఖ వ్యాపార ప్రాతిపదికన రైళ్లను నడుపుతున్నప్పటికీ వచ్చే లాభాలను ప్రైవేటు కంపెనీల మాదిరిగా తన వద్దే అట్టిపెట్టుకోదనీ, ఆ లాభాలను సామాన్యుడికి ప్రయోజనం కలిగించడానికే తిరిగి వెచ్చిస్తామని రైల్వేబోర్డు వివరించింది. రైలు టికెట్ ధరలను నిర్ణయించే పద్ధతిని వెల్లడించనక్కర్లేదని సీఐసీ కూడా గతంలో తీర్మానించిందని గుర్తుచేసింది.

మాజీ మంత్రి సూర్యనారాయణ మృతిపై గవర్నర్ విచారం

ఈనాడు, అమరావతి: మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ మృతి పట్ల గవర్నర్ అబ్దుల్ నజీర్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు మంత్రిగా సూర్యనారాయణ పని చేశారంటూ ఆయన సేవలను గుర్తుచేశారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

తెదేపా నేతల నివాళి

తెదేపా నేత, మాజీ మంత్రి గుండ అప్పల సూర్యనారాయణ మృతి పట్ల ఆ పార్టీ నేతలు సంతాపం వ్యక్తం చేశారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం సూర్యనారాయణ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పర్చూరి అశోక్‌బాబు, ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చి రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పిండమార్పిడి చేసిన ఆరు ఆవులకు గర్భం

ఈనాడు, అమరావతి: ప్రకాశం జిల్లా గుడ్లూరు మండలంలోని రాళ్లపాడులో గత అక్టోబరులో పది ఆవులకు పిండమార్పిడి చేయగా వాటిలో ఆరు గర్భం దాల్చాయని ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ సీఈఓ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఐవీఎఫ్-ఈటీ సాంకేతికతతో ఇది సాధ్యమైందన్నారు. ఈ ప్రయోగంలో 60% ఫలితాలు సాధించినట్లయిందని వెల్లడించారు.

రోశయ్య కుమారుడిని ఫోన్‌లో పరామర్శించిన జగన్

ఈనాడు, అమరావతి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత కొణిజేటి రోశయ్య భార్య శివలక్ష్మి మృతి పట్ల మాజీ ముఖ్యమంత్రి జగన్ సంతాపం తెలిపారు. వారి కుమారుడు కొణిజేటి శివసుబ్బారావుతో జగన్ ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ మేరకు సంబంధిత వివరాలను జగన్ కార్యాలయం వెల్లడించింది.

రూ.లక్ష చొప్పున నష్టపరిహారం ఇవ్వాలి: జగన్

ఈనాడు, అమరావతి: కాకినాడ జిల్లా సార్లంకపల్లె అగ్ని ప్రమాదం పట్ల మాజీ ముఖ్యమంత్రి జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రతీ బాధిత కుటుంబానికి తక్షణ సాయం కింద రూ.లక్ష చొప్పున అందజేయాలన్నారు. ఇళ్లు కోల్పోయిన కుటుంబాలకు కొత్త ఇళ్లు మంజూరు చేయాలని, ఆ ఇళ్లు నిర్మించి ఇచ్చేంతవరకూ వారికి వసతి, ఇతర సహాయాన్ని ప్రభుత్వం అందించాలని కోరారు.

మాజీ సీఎం జగన్ సంక్రాంతి శుభాకాంక్షలు

ఈనాడు, అమరావతి: భోగి మంటలు, రంగవల్లులు, హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల ఆటలు, గాలిపటాల సందళ్లు, పచ్చని పైరుల కళకళలు గ్రామాల్లో ఎనలేని సంక్రాంతి శోభను తీసుకొచ్చాయని మాజీ ముఖ్యమంత్రి జగన్ తెలిపారు. మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, సొంత గ్రామాల మీద మమకారానికి మనమంతా ఇచ్చే గౌరవానికి సంక్రాంతి పండగ ఒక ప్రతీక అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబం పండగను సంతోషంగా నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు.

ఏరో స్పేస్.. స్పేస్ పాలసీ అమలు మార్గదర్శకాలు ఖరారు

ఈనాడు, అమరావతి: ఏరో స్పేస్, డిఫెన్స్ పాలసీ, ఏపీ స్పేస్ పాలసీల అమలు మార్గదర్శకాలను ఖరారు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పాలసీల కింద ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలు పొందేందుకు నిబంధనలు నిర్దేశించింది. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని పరిశ్రమల శాఖ డైరెక్టర్‌ను ప్రభుత్వం ఆదేశించింది.

ఈ-ఆఫీస్ విధానంలో విధులు నిర్వహించకపోతే శాఖపరమైన చర్యలు

ఈనాడు, అమరావతి: ఈ-ఆఫీస్ విధానంలో అధికారిక విధులు నిర్వహించని వైద్యులు, అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ వీరపాండియన్ హెచ్చరించారు. ఈ-ఆఫీస్‌లో కాకుండా భిన్నంగా జరిగే వాటిని అనధికారికమైనవిగా గుర్తిస్తామని పేర్కొన్నారు. వైద్య ఆరోగ్యశాఖాధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంగళవారం ఆయన మాట్లాడారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఫార్మాసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు, స్టాఫ్ నర్సుల ఖాళీల భర్తీకి అధిక ప్రాధాన్యమివ్వాలని ఆదేశించారు. అర్హులైన ఉద్యోగులకు పదోన్నతులు ఇవ్వాలని, కారణాలు లేకుండా జాప్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఏపీఎంఎస్ఐడీసీ ఎండీగా వీరపాండ్యన్‌కు అదనపు బాధ్యతలు

డ్రగ్ కంట్రోల్ డీజీగా సౌరభ్‌గౌర్

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి (ఏపీఎంఎస్ఐడీసీ) వీసీ, ఎండీగా వైద్యారోగ్యశాఖ కమిషనర్ జి.వీరపాండ్యన్‌కు, డ్రగ్ కంట్రోల్ డైరెక్టర్ జనరల్‌గా వైద్యారోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్‌కు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది.

ఆడపిల్లను అమ్మేశారు

షాద్‌నగర్, న్యూస్‌టుడే: మూడో సంతానం కూడా ఆడపిల్ల కావడంతో తల్లిదండ్రులు.. ఆ బిడ్డను అమ్మకానికి పెట్టారు. రూ.3 లక్షలు ఖరీదు కట్టి ఓ వ్యక్తి కొనుగోలు చేశాడు. ఈ ఘటన తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా ఫరూక్‌నగర్ మండలం లాల్‌సింగ్ తండాలో వెలుగు చూసింది. తండాకు చెందిన రేణుక, వినోద్ దంపతులకు గత ఏడాది నవంబరు 9న ఆడపిల్ల పుట్టింది. ఇద్దరు ఆడపిల్లలు ఉండగా.. మళ్లీ అమ్మాయి పుట్టిందనే కారణంతో డిసెంబరు 31న షాద్‌నగర్ బస్టాండులో పసికందును అమ్మేశారు. కేశంపేట మండలానికి చెందిన గోవిందు అనే వ్యక్తి ఈ పాపను రూ.3లక్షలకు కొన్నాడు. హైదరాబాద్‌లోని అత్తాపూర్‌లో ఉండే ఓ కుటుంబానికి ఈ శిశువును విక్రయించాడు. తల్లి దగ్గర కొద్ది రోజులుగా పాప కనిపించకపోవడంతో అనుమానం వచ్చిన తండా వాసులు.. ఐసీడీఎస్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు పోలీసులను సంప్రదించి విచారణ చేపట్టడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు.. నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. పట్టణ సీఐ విజయ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. శిశువును స్వాధీనం చేసుకున్న షాద్‌నగర్ ఐసీడీఎస్ అధికారులు.. హైదరాబాద్‌లోని శిశువిహార్‌కు పంపించారు.

జాతికి అంకితం చేసేసినా...చేయాల్సిన పనులెన్నో!

- వెలిగొండ తొలి దశకే రూ.3,000 కోట్లు అవసరం
- గాడినపెట్టిన ఎన్డీయే సర్కార్
- 2026 జులైకి నీటి విడుదల లక్ష్యం




వెలిగొండ రెండో టన్నెల్‌లో జరుగుతున్న పనులు ◆ తూర్పు ప్రధాన కాలువ రెగ్యులేటర్ నిర్మాణ పనులు

ఈనాడు, అమరావతి: జగన్ జాతికి అంకితం చేసిన వెలిగొండ ప్రాజెక్టులో తొలిదశ పనులే మరో రూ.3,000 కోట్ల విలువైనవి మిగిలి ఉన్నాయి. ఇవి చేస్తే తప్ప సాగు, తాగు నీరిచ్చే పరిస్థితుల్లేవు. దీంతో ప్రాజెక్టులోని సమస్యలను పరిష్కరిస్తూ కూటమి ప్రభుత్వం మళ్లీ పనులను పట్టాలు ఎక్కించింది. ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లో 4,47,000 ఎకరాల ఆయకట్టుకు నీళ్లందించేందుకు వీలుగా శ్రీశైలం వరద జలాలు మళ్లింపునకు ఈ ప్రాజెక్టు నిర్మించతలపెట్టింది. 2026 జులై నాటికి ప్రాజెక్టు నుంచి తొలిదశలో 1,19,000 ఎకరాలకు నీళ్లు ఇవ్వాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఇందుకు మిగిలిన పనులు పూర్తి చేసేందుకు రూ.2,088 కోట్లు, పునరావాసం కోసం రూ.1,000 కోట్ల వరకు ఖర్చు చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు త్వరలో ప్రాజెక్టును సందర్శించి, పనుల పురోగతిని సమీక్షిస్తారు.

శ్రీశైలం వరద జలాలను 2 టన్నెళ్ల ద్వారా మళ్లించి ఫీడర్ కాలువ నుంచి నల్లమలసాగర్ జలాశయానికి మళ్లించాలనేది ప్రణాళిక. ఇందులో భాగంగా 53.85 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో నల్లమలసాగర్‌ను నిర్మిస్తున్నారు. అక్కడి నుంచి 3 కాలువల ద్వారా మరో 3 జలాశయాలకు, 2 చెరువులకు నీళ్లు మళ్లించి 4,47,300 ఎకరాల ఆయకట్టుకు నీళ్లు ఇవ్వాల్సి ఉంది. ఈ పనులు రెండు దశల్లో పూర్తి చేయాలని ప్రభుత్వం ఇటీవల ప్రణాళిక రూపొందించి, అమలు చేస్తోంది. తొలిదశలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 1,19,000 ఎకరాలకు నీరందుతుంది.



ఫీడర్ కాలువల రిటైనింగ్ గోడ నిర్మాణానికి కాంక్రీటు ఫౌండేషన్ కోసం చేపట్టిన పనులు

ఈ లక్ష్యం నెరవేరాలంటే ఏం చేయాలి?

1. 2 టన్నెళ్లు తవ్వాలి. లైనింగు పూర్తి చేయాలి.
2. నల్లమలసాగర్‌కు నీళ్లు మళ్లించే ఫీడర్ కాలువ పూర్తి చేయాలి.
3. నల్లమలసాగర్ నుంచి నీళ్లు మళ్లించేలా 3 కాలువలకు హెడ్ రెగ్యులేటర్లు నిర్మించాలి.
4. నల్లమలసాగర్ వల్ల ముంపునకు గురయ్యే గ్రామాల నిర్వాసితులను తరలించాలి.

టన్నెళ్లు, వాటి హెడ్ రెగ్యులేటర్లు ఇలా...

◆ టన్నెళ్ల వద్ద హెడ్ రెగ్యులేటర్లు, రిటైనింగ్ వాల్, వింగ్‌లు, రిటర్నుల నిర్మాణం పూర్తి చేయాలి. ఈ ప్రభుత్వం వచ్చాక 4,300 క్యూబిక్ మీటర్ల పనికి 2,200 క్యూ.మీ. చేసింది. శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం +262.20 మీటర్లకు చేరడంతో పనులు ఆగిపోయాయి. నీటిమట్టం +256కు వస్తే పనులకు వీలవుతుంది.

◆ మొదటి టన్నెల్‌లో మిగిలి ఉన్న 15 మీటర్ల మేర లైనింగ్ పనులు 2026 మార్చి నాటికి పూర్తి చేయాలనేది ప్రణాళిక. ◆ రెండో టన్నెల్‌లో 2024 మే నాటికి 6,940 మీటర్ల బెంచింగు పని మిగిలి ఉంటే 6,579 మీటర్లు పూర్తి చేశారు. 6,940 మీటర్ల లైనింగ్ చేయాల్సి ఉంటే ఇప్పటికి 3,254 మీటర్లు పూర్తి చేశారు. ఈ ఏడాది జూన్ నాటికి ఇవీ పూర్తి చేయాలనేది లక్ష్యం.

◆ టన్నెల్ బోరింగ్ మిషన్(టీబీఎం)కు స్వస్తి చెప్పి బ్లాస్టింగ్‌తో పాటు మనుషుల సాయంతో టన్నెల్ తవ్వకాలు చేపట్టడంతో ఆ మట్టి బయటకు తీసుకువచ్చేందుకు మొదటి టన్నెల్‌లో రోడ్డు నిర్మించారు. రెండు టన్నెళ్ల మధ్య మార్గం ఏర్పాటు చేశారు. శ్రీశైలం జలాశయం వద్ద పోసిన మట్టి కూడా బయటకు తీసుకొచ్చాక తొలి టన్నెల్‌లో రోడ్డు తొలగించేందుకు ఆస్కారం ఉంటుంది. ◆ రెండో టన్నెల్‌లో ఉన్న టీబీఎంను ధ్వంసం చేయాల్సి ఉంది. ఈ అంశం న్యాయస్థానం పరిధిలో ఉంది.

ఫీడర్ కాలువ...ఎలా?

వెలిగొండ టన్నెళ్ల నుంచి నల్లమలసాగర్ జలాశయానికి నీళ్లు తీసుకెళ్లేది ఫీడర్ కాలువ. ఇందులో 500 మీటర్ల మేర హార్డ్ రాక్ ఉంది. తవ్వకం పనులు జరుగుతున్నాయి. దీనిపై అండర్ టన్నెల్ నిర్మాణం, ఎస్కేప్ రెగ్యులేటర్, టెయిల్ ఎండ్ రెగ్యులేటర్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఫీడర్ కాలువకు లైనింగ్, 5.3 కి.మీ. మేర రిటైనింగ్ వాల్ పనులు గుత్తేదారుకు అప్పచెప్పారు. ఆ పనులు జరుగుతున్నాయి.

రిజర్వాయర్ నుంచి నీళ్ల మళ్లింపునకు...

రిజర్వాయర్ నుంచి తీగలేరు కాలువ, తూర్పు ప్రధాన కాలువకు నీళ్లు మళ్లించేందుకు హెడ్ రెగ్యులేటర్ పనులూ జరుగుతున్నాయి. తీగలేరు కాలువ హెడ్‌రెగ్యులేటర్ కాంక్రీటు పనులు పూర్తయ్యాయి. గేట్ల తయారీ, తూర్పు ప్రధాన కాలువ హెడ్ రెగ్యులేటర్ స్లాబ్ పనులు జరుగుతున్నాయి. నల్లమలసాగర్‌లో నీళ్లు నిలిపితే 11 గ్రామాల్లో 7,321 కుటుంబాల వారు నిర్వాసితులవుతున్నారు. పునరావాస కాలనీల పనులు జరుగుతున్నాయి. ఇందుకు సంబంధించి దాదాపు రూ.600 కోట్ల బిల్లులు పెండింగులో ఉన్నాయి. రెగ్యులర్ నిర్మాణ పనులకు సంబంధించి రూ.29 కోట్ల బిల్లులు పెండింగులో ఉన్నాయి.

పౌరహక్కుల పరిరక్షకులు దేశద్రోహులా: ప్రొ.హరగోపాల్

హైదరాబాద్, న్యూస్‌టుడే: పౌరహక్కుల పరిరక్షకులు దేశద్రోహులు ఎలా అవుతారని ప్రొఫెసర్ హరగోపాల్ ప్రశ్నించారు. ప్రజల కోసం, వారి హక్కుల పరిరక్షణకు పనిచేసే పౌరహక్కుల సంఘ ప్రతినిధులకు రక్షణ, గౌరవం కల్పించాల్సిందిపోయి వారిపై దేశద్రోహం కేసులు నమోదు చేయడం అప్రజాస్వామికమని ధ్వజమెత్తారు. మతోన్మాదం నశించాలని, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ జరగాలని కోరడం దేశద్రోహమెలా అవుతుందన్నారు. మంగళవారం హైదర్‌గూడలోని న్యూస్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రొ.హరగోపాల్ మాట్లాడారు. పౌరహక్కుల సంఘం ఆంధ్రప్రదేశ్ శాఖ 20వ రాష్ట్ర మహాసభల సందర్భంగా తిరుపతిలో ఏర్పాటు చేసిన బ్యానర్లలో దేశ చిహ్న గౌరవానికి భంగం కలిగించారంటూ సంఘం ఏపీ ఉపాధ్యక్షుడు క్రాంతి చైతన్యపై, ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకుడిపై దేశద్రోహం కేసులు నమోదు చేసి అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. వారిని వెంటనే విడుదల చేయాలని కోరారు. సాక్ష్యాలు లేకుండానే గాదె ఇన్నయ్యను అరెస్టు చేశారని... ఇప్పుడు సాక్ష్యాల కోసం ఆయన ఇంటిపై, అనాథాశ్రమంపై ఎన్ఐఏ దాడులు నిర్వహించి భయానక వాతావరణం కల్పించడం దారుణమన్నారు. పౌరహక్కుల సంఘం(సీఎల్‌సీ) రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ మాట్లాడుతూ.. పౌరహక్కుల సంఘం కార్యకర్తలపై ఉపా కేసులు పెట్టి జైళ్లకు పంపినా తమ పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కవులు, కళాకారులు, మేధావులు, ప్రజాసంఘాల నేతలతో కలిసి ఉద్యమం చేపడతామని చెప్పారు. సమావేశంలో సీఎల్‌సీ ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణరావు, ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ గుంటి రవి, సహాయ కార్యదర్శులు మదనకుమారస్వామి, తిరుమలయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రొ.గుంటి రవి, ప్రొ.హరగోపాల్, ఎన్.నారాయణరావు, ప్రొ.గడ్డం లక్ష్మణ్ తదితరులు

రెవెన్యూ క్లినిక్.. అక్కడికక్కడే పరిష్కారం 3.84శాతమే

ఈనాడు, అమరావతి: సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం రెవెన్యూ సంస్కరణలు చేపట్టింది. అందులో భాగంగా రెవెన్యూ క్లినిక్‌లను ప్రకటించింది. ఇవి మొదలై మూడు వారాలు గడచినా వ్యవస్థ కొన్నిచోట్ల ఇంకా గాడిన పడలేదు. అక్కడికక్కడే పరిష్కరించే అర్జీలు 3.84% మాత్రమే. మిగిలిన వాటికి రకరకాల కారణాలు చెబుతున్నారు. వీటిని కొన్ని జిల్లా కేంద్రాల్లో నిర్వహిస్తుంటే.. మరి కొన్ని చోట్ల రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో జరుగుతున్నాయి. కొన్ని జిల్లాల్లో అయితే ఇంకా ప్రారంభించనే లేదు. మండల రెవెన్యూ కార్యాలయాల్లోనూ 'రెవెన్యూ క్లినిక్' అనే బోర్డులు ఏర్పాటు చేశారు.

పరిష్కారమైనవి 3.84 శాతమే: రాష్ట్రవ్యాప్తంగా గతేడాది డిసెంబరు 29, ఈ ఏడాది జనవరి 5న రెవెన్యూ క్లినిక్‌లకు వచ్చిన అర్జీలను పరిశీలిస్తే.. అక్కడికక్కడ పరిష్కారమైనవి 3.84% మాత్రమే. వీటిలో సివిల్ వివాదాలకు సంబంధించినవి 7.35% ఉన్నాయి. 22ఎ జాబితాకు సంబంధించినవి 10.63% ఉన్నాయి. ◆ రెండు వారాల్లో వచ్చిన అర్జీలను పరిశీలిస్తే.. ఆర్ఓఆర్ సవరణలు 1,561, మ్యుటేషన్లు 565, వెబ్‌లాండ్ సమస్యలు 272, ఆక్రమణలు 538, ఆర్ఓఎఫ్ఆర్‌కు సంబంధించినవి 31, రీసర్వే సమస్యలు 861, నిషేధిత 22ఎ జాబితాలోనివి 672, ఇతరాలు 1,821 వచ్చాయి.

అక్కడికక్కడే పరిష్కారం చూపాలనే ఆలోచనే: రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా అధికశాతం అర్జీలకు అక్కడికక్కడే పరిష్కారం చూపాలనేది రెవెన్యూశాఖ ఆలోచన. జిల్లా, డివిజన్, మండలస్థాయి అధికారులంతా రికార్డులతో రావాలి. సోమవారం కలెక్టరేట్‌లో కూర్చుని వీలైతే అక్కడికక్కడ.. లేదంటే నిర్దిష్ట సమయంలో ఈ సమస్యలు పరిష్కరించాలి. పరిష్కారం చేయకపోతే ఎందుకు చేయడం లేదో చెప్పాలి. రెవెన్యూ అధికారులు సంబంధిత అర్జీదారుతో మాట్లాడి వాటన్నిటినీ వివరించాలి. పరిష్కారానికి తీసుకున్న చర్యల్ని అర్జీదారులకు లిఖితపూర్వకంగా ఇవ్వాలని ప్రభుత్వం సూచించింది.

2025 డిసెంబరు 29, ఈ ఏడాది జనవరి 5న నిర్వహించిన రెవెన్యూ క్లినిక్‌లకు వచ్చిన అర్జీల వివరాలు

మొత్తం అర్జీలు	6,321
అక్కడికక్కడే పరిష్కరించినవి	243
ఏటీటీ జారీ(నిర్దేశిత సమయంలో)	5,095
జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీకి పంపినవి	24
గ్రామ/వార్డు సచివాలయం ద్వారా అర్జీలు పెట్టించినవి	436
సివిల్ వివాదాలు	465
ఆన్‌లైన్ రెవెన్యూ కోర్టు మేనేజ్‌మెంట్ సిస్టంలో నమోదైనవి	58

మెదడులోని 'శ్వాస ప్రాంతాని'కి అధిక బీపీతో సంబంధం!

దిల్లీ: శ్వాసను నియంత్రించడంలో మెదడులోని లేటరల్ పారాఫేషియల్ (పీఎఫ్ఎల్) ప్రాంతం కీలక పాత్ర పోషిస్తుంది. రక్త నాళాలను గట్టిగా బిగుసుకుపోయేలా చేసే నాడులతోనూ ఇది అనుసంధానమయ్యే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ఇలా బిగుసుకుపోవడం వల్ల రక్తపోటు పెరుగుతుందని చెప్పారు. హై బీపీకి కొత్త చికిత్సలను రూపొందించడానికి ఈ పరిశోధన వీలు కల్పిస్తుందని వివరించారు. న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు ఈ పరిశోధన చేశారు. మెదడులోని సెరిబ్రమ్‌ను వెన్నుపూసతో అనుసంధానించే బ్రెయిన్ స్టెమ్‌లో పీఎఫ్ఎల్ ఉంటుంది. అది జీర్ణం, శ్వాస, గుండె కొట్టుకునే రేటు వంటి ఆటోమేటిక్ విధులను నియంత్రిస్తుంది. నవ్వు, వ్యాయామం, దగ్గు సమయాల్లో గట్టిగా శ్వాస వదులుతుంటాం. ఉదర భాగంలోని శక్తిమంతమైన కండరాలు దీనికి ఆసరాగా ఉంటాయి. సాధారణ నిశ్వాస సమయంలో ఇలాంటి అవసరం ఉండదు. లేటరల్ పారాఫేషియల్ ప్రాంతాన్ని ఉపయోగించుకుంటూ శరీరం.. నవ్వు, వ్యాయామం, దగ్గు సమయంలో గట్టి నిశ్వాసను కలిగిస్తున్నట్లు పరిశోధనకు నాయకత్వం వహించిన జూలియన్ పాటన్ పేర్కొన్నారు. పరిశోధనలో భాగంగా శాస్త్రవేత్తలు.. కొన్ని ఎలుకలకు ఉద్దేశపూర్వకంగా అధిక రక్తపోటును కలిగించారు. రక్తనాళాలు బిగుసుకుపోయేలా చేసే నాడులు కూడా పీఎఫ్ఎల్‌తో సంధానమై ఉన్నట్లు ఈ సందర్భంగా వారు గుర్తించారు. అధికరక్తపోటు పరిస్థితుల్లో లేటరల్ పారాఫేషియల్ ప్రాంతం క్రియాశీలమైనట్లు తేల్చారు. ఆ ప్రాంతాన్ని క్రియారహితం చేసినప్పుడు బీపీ తగ్గిపోయినట్లు వెల్లడైంది. శ్వాస పోకడల్లో మార్పులు.. ముఖ్యంగా ఉదర భాగ కండరాల వ్యాకోచాలతో ముడిపడిన వాటివల్ల అధిక రక్తపోటు తలెత్తవచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ నేపథ్యంలో పీఎఫ్ఎల్ నాడులను లక్ష్యంగా చేసుకొని హై బీపీ ఔషధాలను తయారు చేయవచ్చని వివరించారు.

వీబీ-జీ రామ్ జీ అద్భుత పథకం

బండి సంజయ్

తెలంగాణచౌక్ (కరీంనగర్), న్యూస్‌టుడే: గ్రామీణ పేదలకు ప్రతి ఒక్కరికి 125 రోజులపాటు పని కల్పించడంతోపాటు పల్లెలకు దీర్ఘకాలిక ఆస్తులను సృష్టించేందుకు కేంద్రం తీసుకొచ్చిన వీబీ-జీ రామ్ జీ చట్టం అద్భుతమైందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రశంసించారు. మంగళవారం తెలంగాణలోని కరీంనగర్‌లోని ఓ హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. "ఉపాధి హామీ పథకం పేరు మార్చడంపై కాంగ్రెస్ నీచ రాజకీయాలకు పాల్పడటం సిగ్గుచేటు. భాజపా అధికారంలోకి వస్తే మతపరమైన రిజర్వేషన్లను తొలగించి బీసీలకు 42% రిజర్వేషన్లు అమలు చేస్తాం" అని తెలిపారు.

ఇనుప కడ్డీలే యమపాశమయ్యాయి!

ఆర్టీసీ బస్సు, ట్రాలీ ఆటో ఢీ.. విద్యార్థిని మృతి

- ఏడుగురికి గాయాలు

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: ట్రాలీ ఆటో డ్రైవర్ నిర్లక్ష్యం ఒక చదువుల తల్లిని పొట్టన పెట్టుకుంది. మరో ఏడుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన తెలంగాణలోని సంగారెడ్డి జిల్లాలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు ఆటో డ్రైవర్‌ని అదుపులోకి తీసుకున్నారు. సీఐ అనిల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణఖేడ్ డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సు 72 మంది ప్రయాణికులతో సంగారెడ్డి నుంచి నారాయణఖేడ్ వెళ్తోంది. పట్టణ శివారులోని చేరగానే.. ఫ్లెక్సీలు, ఇనుపకడ్డీలతో ఎదురుగా వస్తున్న ట్రాలీ ఆటో ఒక్కసారిగా బస్సును ఢీ కొట్టింది. దాంతో ఆటోలోని ఇనుప కడ్డీలు ఎగిరి బస్సు అద్దాల్లోంచి లోపలికి చొచ్చుకెళ్లాయి. అవి బలంగా తాకడంతో డ్రైవర్ వెనకసీట్లో కూర్చున్న నారాయణఖేడ్ మండలం ర్యాకల్‌కు చెందిన తిమ్మాపురం పూజ(18) తలకు తీవ్ర గాయాలయ్యాయి. 108లో ఆసుపత్రికి తరలిస్తుండగానే ఆమె మృతి చెందింది. బస్సు డ్రైవర్ సుభాష్‌తో పాటు ఏడుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులకు స్థానిక ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. మృతురాలు పూజ బాసర ఐఐఐటీలో మొదటి సంవత్సరం చదువుతోంది. సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోశ్ పంకజ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ ప్రమాదంలో విద్యార్థిని మృతి చెందడం పట్ల వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ విచారం వ్యక్తం చేశారు. కలెక్టర్, వైద్యాధికారితో మాట్లాడారు.



ప్రమాద స్థలంలో ఆర్టీసీ బస్సు



మృతురాలు పూజ

వేలం పారదర్శకంగా ఉండాలి

యూనియన్ బ్యాంక్‌ను తప్పుబట్టిన తెలంగాణ హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: రుణం వసూలులో భాగంగా తాకట్టులోని ఆస్తులను బ్యాంకు వేలం వేసుకోవచ్చని, అయితే అది చట్టప్రకారం పారదర్శకంగా ఉండాలని తెలంగాణ హైకోర్టు తేల్చి చెప్పింది. రుణాలు చెల్లించలేక అధికారిక లిక్విడేటర్ పరిధిలో ఉన్న కంపెనీకి చెందిన ఆస్తిని లిక్విడేటర్ ప్రమేయం లేకుండా చట్టవిరుద్ధంగా వేలం నిర్వహించిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను తప్పుబట్టింది. బీఆర్‌జీ ఎనర్జీ లిమిటెడ్‌కు చెందిన ఆస్తి వేలం రద్దు చేస్తూ కంపెనీ కోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ బ్యాంకు అప్పీలును కొట్టివేసింది. బీఆర్‌జీ ఎనర్జీ లిమిటెడ్‌కు చెందిన స్థిరాస్తిని కోర్టు అనుమతి లేకుండా వేలం వేయడాన్ని రద్దు చేస్తూ కంపెనీ కోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ యూబీఐ అప్పీలు దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ వాకిటి రామకృష్ణారెడ్డిల ధర్మాసనం విచారణ చేపట్టింది. లిక్విడేటర్‌కు నోటీసు ఇవ్వకుండా వేలం నిర్వహించడం, వాల్యుయేషన్ మొత్తం కంటే తక్కువ రిజర్వు ధరను నిర్ణయించడాన్ని తప్పుబట్టింది. వేలంలో ఆస్తిని పొంది రూ.6.45 కోట్లు చెల్లించిన కేజేఎస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు ఆ సొమ్మును 6% వడ్డీతో వాపసు చేయాలని ఆదేశించింది.

ప్రభుత్వ విభాగాల్లో...ఇంధన సంరక్షణ కీలకం

- పొదుపు చర్యలు చేపట్టాలి
- సీఎస్ విజయానంద్

ఈనాడు, అమరావతి: ఇంధన సామర్థ్యం, సంరక్షణ కీలమని రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ విభాగాలూ గుర్తించాలని సీఎస్ విజయానంద్ అన్నారు. రాష్ట్ర ఇంధన సంరక్షణ మిషన్ 15వ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశాన్ని సీఎస్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. సచివాలయం నుంచి వర్చువల్‌గా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 'అన్ని ప్రభుత్వ విభాగాలు, హెచ్‌ఓడీలు, స్వయంప్రతిపత్తి సంస్థలు... ఇంధన పొదుపు సెల్‌ను ఏర్పాటు చేయాలి. పరిశ్రమలు, పట్టణ స్థానిక సంస్థలు, ఎంఎస్ఎంఈలకు ఇంధన సామర్థ్యంపై అవగాహన కల్పించాలి. పట్టణ స్థానిక సంస్థల్లో విద్యుత్ ఖర్చులు తగ్గించేందుకు ఎనర్జీ ఆడిట్‌లు నిర్వహించాలి. అన్ని ప్రభుత్వ శాఖలూ తమ సాధారణ ప్రణాళికలో ఇంధన పొదుపు సామర్థ్య చర్యలను భాగంగా చేర్చాలి. ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్ అమలు, ప్యాట్ పథకం, మార్కెట్ సర్వైలెన్స్, ఎలక్ట్రికల్ పరికరాల టెస్టింగ్ వంటి అంశాలను పరిశీలించారు. విశాఖపట్నం సాగర్‌నగర్‌లో నిర్మించిన సూపర్ ఈసీబీసీ భవనాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి. అది ఇంధన సామర్థ్య భవనాల నిర్మాణానికి మార్గదర్శకంగా నిలిచింది. విద్యార్థులకు చిన్నప్పటి నుంచే ఇంధన పొదుపు అలవాటు చేయాలి. విద్యాసంస్థల్లో ఎనర్జీ క్లబ్‌ల నిర్వహణకు చర్యలు తీసుకోవాలి. ఇంధన సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించాలి' అని సూచించారు. పరిశ్రమల్లో ఫ్యూయల్ స్విచింగ్, హీట్ ఎలక్ట్రిఫికేషన్‌లను సీఎస్ స్వాగతించారు. ఇవి పోటీ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు.. కర్బన ఉద్గారాలను తగ్గించేందుకు దోహదపడతాయన్నారు.

మెట్రోపాలిటన్ ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రాభివృద్ధికి.. ముంబయిలో అధికారుల అధ్యయనం

ఈనాడు, అమరావతి: దేశంలో ప్రముఖ మెట్రోపాలిటన్ ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్‌కుమార్ ఆధ్వర్యంలో అధికారుల బృందం సోమ, మంగళవారాల్లో ముంబయిలో పర్యటించి పలు అంశాలపై అధ్యయనం చేసింది. ప్రాంతీయ పాలన, భూ ఆధారిత నిధుల సమీకరణ, అభివృద్ధి, మురికివాడల పునరాభివృద్ధి, విస్తృతస్థాయిలో నగరాల నిర్మాణం తదితర అంశాలపై వీరు అధ్యయనం చేశారు. విశాఖలో మెట్రోరైలు, భోగాపురం ఏరోసిటీ లాంటి కార్యక్రమాల నేపథ్యంలో బడ్జెట్, గ్రాంట్లపై ఆధారపడకుండా ముంబయి మోడల్‌లో ఆర్థికనగరంగా విశాఖను అభివృద్ధి చేయడంపైనా మహారాష్ట్ర ప్రభుత్వాధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా సురేశ్‌కుమార్ మాట్లాడుతూ బడ్జెట్‌పై ఆధారపడకుండా భూమి, ప్రణాళికలు, సంస్థల ద్వారా నగరాలను నిర్మించేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రానికి స్పష్టమైన బ్లూప్రింట్ అందించిందని తెలిపారు. రాష్ట్ర పట్టణ ప్రణాళిక విభాగం సంచాలకులు విద్యుల్లత, విశాఖ మెట్రో ప్రాంతీయ అభివృద్ధి సంస్థ కమిషనర్ తేజ్ భరత్, జాయింట్ కమిషనర్ రమేశ్, చీఫ్ ఇంజినీర్ భవానీప్రసాద్ తదితరులు అధ్యయనం చేసినవారిలో ఉన్నారు.

ద్వారకానాథ్‌రెడ్డి అనుచరులకు అక్రమంగా ఇళ్ల స్థలాలు మంజూరు

తెదేపా గ్రీవెన్స్‌లో ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే ద్వారకానాథ్‌రెడ్డి అనుచరులకు అన్నమయ్య జిల్లా ములకలచెరువు మండలం గూడుపల్లిలో అక్రమంగా ఇళ్ల స్థలాలు మంజూరు చేశారని అదే గ్రామానికి చెందిన నిజాముద్దీన్ ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపి సదరు పట్టాలు రద్దు చేసి అర్హులకు మంజూరు చేయాలని కోరారు. ఈ మేరకు మంగళగిరిలోని తెదేపా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఆయన వినతి ఇచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి మాజీ ఎమ్మెల్సీ పర్చూరి అశోక్‌బాబు వినతులు స్వీకరించారు. తమ 3.40 ఎకరాలకు కొందరు వ్యక్తులు నకిలీ రిజిస్ట్రేషన్ పత్రాలు పుట్టించి అక్రమంగా సాగుచేస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని పల్నాడు జిల్లా రాజుపాలెం గణపవరానికి చెందిన చల్లగిరి అంకమ్మ ఫిర్యాదు చేశారు. తమ గ్రామానికి చెందిన కొందరు ఇంట్లోకి చొరబడి కర్రలతో దాడి చేసి ఖాళీ పత్రాలపై బలవంతంగా సంతకాలు తీసుకుని పూర్వీకుల ఆస్తిని స్వాధీనం చేసుకున్నారని కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు మండలం కవుతారం గ్రామానికి చెందిన రోజా ఫిర్యాదు చేశారు. కొందరు పోలీసులు కూడా వారికి సహకరిస్తున్నారని వాపోయారు.

బాలల సంరక్షణ కమిటీ ఛైర్‌పర్సన్ల నియామక విధి విధానాల ఖరారుకు ప్రత్యేక కమిటీ

ఈనాడు, అమరావతి: జువైనల్ జస్టిస్ బోర్డుల్లో సామాజిక కార్యకర్తల సభ్యులు, బాలల సంరక్షణ కమిటీల ఛైర్‌పర్సన్, సభ్యుల ఎంపికకు సంబంధించిన విధి విధానాల ఖరారుకు రాష్ట్ర హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ వీఆర్ కృపా సాగర్ ఛైర్‌పర్సన్‌గా ప్రభుత్వం కమిటీని నియమించింది. ఇందులో మరో ఆరుగురు నిపుణులు సభ్యులుగా ఉంటారు. ఎంపిక కమిటీ సమావేశ నిర్వహణకు ఛైర్‌పర్సన్, సభ్య కార్యదర్శి సహా కనీసం నలుగురు సభ్యుల కోరమ్ ఉండాలి. ఈ కమిటీ పదవీకాలం మూడేళ్లపాటు ఉండనుంది. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

విధి రాసిన మృత్యురాత

హైవే గస్తీలో.. కానిస్టేబుల్ దుర్మరణం



నరేశ్‌కుమార్

చౌటుప్పల్ గ్రామీణం, న్యూస్‌టుడే: అసలే విజయవాడ హైవే.. అందులోనూ సంక్రాంతి పండగ రద్దీ.. అర్ధరాత్రి సైతం ట్రాఫిక్ జామ్ కాకుండా చూసేందుకు ఆయన గస్తీ నిర్వహిస్తున్నారు. అలా విధులు నిర్వహిస్తుండగానే గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో రోడ్డు మీదే ప్రాణాలు విడిచారు. రోడ్డు ప్రమాదంలో పోలీస్ కానిస్టేబుల్ మృతి చెందిన ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ధర్మోజీగూడెం వద్ద మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. చౌటుప్పల్ పోలీస్‌స్టేషన్‌లో నాలుగేళ్లుగా కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కోల నరేశ్‌కుమార్ (38) విధుల్లో భాగంగా మరో కానిస్టేబుల్ భరద్వాజ్‌తో కలిసి సోమవారం రాత్రి నుంచి బైక్‌పై హైవే పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. తెల్లవారుజామున 3 గంటల సమయంలో ధర్మోజీగూడెంలోని భారత్ పెట్రోల్ బంకు ఎదురుగా విజయవాడ మార్గంలో వాహనాలు నిలిపినట్లు గుర్తించారు. వాటిని తీయాలని డ్రైవర్లకు చెప్పేందుకు నరేశ్‌కుమార్ జాతీయ రహదారిని దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయనకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

గాదె ఇన్నయ్య ఆశ్రమంలో ఎన్ఐఏ సోదాలు



ఇన్నయ్య ఇంటి వద్ద మోహరించిన పోలీసులు

జఫర్‌గఢ్, న్యూస్‌టుడే: తెలంగాణలోని జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం సాగరం గ్రామానికి చెందిన పీపుల్స్‌వార్ మాజీ నేత గాదె ఇన్నయ్య ఇల్లు, ఆయన నిర్వహిస్తున్న 'మా ఇల్లు ప్రజాదరణ అనాథాశ్రమం'లో జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) పోలీసులు మంగళవారం పది గంటలపాటు సోదాలు నిర్వహించారు. నిషేధిత మావోయిస్టులకు అనుకూలంగా వ్యాఖ్యలు చేశారనే కారణంగా గతనెల 21వ తేదీన ఆయన్ను ఎన్ఐఏ పోలీసులు ఉపాచట్టం కింద అరెస్టు చేశారు. ఆయన ప్రస్తుతం చంచల్‌గూడ జైలులో ఉన్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం తెల్లవారుజామున 30 మంది పోలీసులు రెండు బృందాలుగా విడిపోయి ఆయన స్వగ్రామంలోని ఇంట్లో, ఆశ్రమంలో తనిఖీలు చేపట్టారు. ఆయన సొంత ఇంటిలో రూ.లక్ష నగదును సీజ్ చేశారు. ఆశ్రమంలోని ఇన్నయ్య కార్యాలయాన్ని తనిఖీ చేసి..కొన్ని పుస్తకాలు, ల్యాప్‌టాప్, ఐప్యాడ్‌లను సీజ్ చేసి నేరపూరిత పత్రాలను స్వాధీనం చేసుకొని తీసుకెళ్తున్నామని ఆశ్రమ నిర్వాహకురాలికి పత్రం అందించి వెళ్లారు. ఎన్ఐఏ సీఐ మహేశ్‌కుమార్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు.